శ్రీరామచంద్రాయనమః

# శ్రీకృష్ణలీలామృతము


వావిలికొలను సుబ్బారాయ

విరచితము.

## మధురలీల

యను

## ప్రథమ చుళుకము




ప్రకాశకులు :

**శ్రీ కోదండరామ సేవక ధర్మ సమాజము**

వానకుటి :: అంగలకుదురు

కాపీరైట్ ] 1954 [ మూల్యం 4-0-0

వెల : స్వేచ్ఛము

శ్రీ అజంతా ఆర్ట్ ప్రింటర్స్, కొల్లూరు. (గుంటూరు జిల్లా)

శ్రీ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత

శ్రీ రామచంద్రపరబ్రహ్మణే నమః.

శ్రీ గోపాలకృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ శారదాయై నమః

# శ్రీకృష్ణలీలామృతము

## —: ఇష్టదేవతాది నమస్కారము :—

రమణీమణీ రమణుండును, శ్రీను ముభయవిభూతి నాయకుండును, భక్తరక్షా ధురంధరుండును, దుష్టశిక్షాదక్షుండును, జానకీ లక్ష్మణ సమేతుండును, ప్రణవ వాచ్యుండును, దివ్యశర శరాసనధరుండును, నాశ్రితతాపహరుండును, శరణీకృతైకశిలా నగరుండును, నగు శ్రీకోదండరామమూర్తి నా హృదయకమలమున నిలిచి భవభయంబు దులిచి సర్వకాల సర్వావస్థల నన్ను రక్షించుఁ గాక.

ఏకాక్షరంబున నక్షరత్రయంబుంబోలె నేకశిలను మూర్తిత్రయంబుగ నుద్భవించి, యంగాంగిభావంబునఁ దత్త్వత్రయం బేకం బని తెలుపు శ్రీరామనామము వహించి వెలుంగు జగదభిరాముఁడు మదీయాత్మారాముఁడై భవహరణసమర్థంబులగు నర్థంబు

లోనర్పఁ బ్రేరించి సాంతంబుగఁ జేయించుచు వానిని స్వీకరించుచు నుండుఁ గాక.

త్రిజగన్మాతయుఁ, గరుణాసమేతయు, దయాపూతయు, ధూతాశ్రితతాపవ్రాతయు నగు శ్రీ సీత నా చేతమున నిలిచి పరిభూతభవపాశజాతుఁగా నొనర్చుం గాత.

ఏ మహాదేవి నిజకరుణాకటాక్షవీక్షణంబులు నాపైఁ బరపి యాత్మలోకోపకారకకృతులం గావింపఁ జేసి నన్ను సుకృతిం జేయ బద్ధదీక్షయయ్యె నట్టి శ్రీభారతి నా రసనారంగంబున నింకను నిలిచి సుమన ఆమోదంబుగ నర్తించుఁ గాక.

సార్థక * హానుమదభిఖ్య వహించి యాత్మావలోకనవిధంబును భగవత్ప్రాప్త్యుపాయంబును నిజచర్య నుపదేశించిన హానుమదాచార్యుండు నా మహాప్రయత్నంబునఁ దోడై తీరంబుఁ జేర్చి స్వకీయునిగ నన్నుఁ బరిగ్రహించుఁ గాక.

శ్రీరామావతారంబున మార్గదర్శియై కృష్ణావతారంబున గీతాచార్యుండై లోకంబు శిక్షించిన పరమపురుషుండు సాధు స్త్రీపురుషులను, బాదైకశిష్టయగు ధర్మనైచికిని § గలిసి కల్కియై యుద్ధరించుం గాక.
ఏతత్కృత్యారంభంబున మదీయేష్టదైవంబగు సీతారాముం ధ్యానింప వేణుగోపాలమూర్తియై గోచరించిన శ్రీమన్నారాయణుండు నాకు ముక్తిదాయకుండై యలరారుం గాక.

నిజ సాధు వాక్యంబుల యథాక్రమంబుగ నుచ్చరింప నేరక వికృతంబులు గావించు శిశువులం గని నవ్వు పెద్దల పోలికఁ దమ కృతుల వికృతిని ఘటించు నాయెడ నిజమతానుసారంబైన నా శుద్ధభావంబు గ్రహించియైనఁ గనికరించి తమ మార్గంబునకై యుద్యమించు నన్ను మహాజనవాక్యంబు లాదరించియైన వాల్మీకి వ్యాస మహర్షులు కృతకృత్యుం జేయుదురు గాక.

---

* హానుమదభిఖ్య = జ్ఞాని యను పేరు. § నైచికి = ఆవు.

సార్థకజన్ములఁ దను లోకుల మంగళాశాసనంబు లన్వర్థకంబులుగా దేవత లెల్ల ననుగ్రహింతురు గాక.

సుకృతిరూపంబున భగవత్సేవయు భాగవత కైంకర్యంబును గావించు నన్ను నిజచరణ రజోలంకృతశిరస్కుఁ బుణ్యసాధ్వీసాధుజన వ్రాతంబులు తమ కృపాలేశంబునకు బాత్రునిఁగ నొనరింతురు గాక.

బాలవాక్యంబుల భక్తవాక్యంబుల దోషంబుల నెన్నరా దను నుడి గ్రహించియైన విద్వత్కవితాగ్రేసరులు భగవదేకసహాయుండును దుర్బలుండును నల్పజ్ఞుండును నగు నా వాచాదోషంబుల సహించి కృతిని బరిగ్రహింతురు గాక.

అని యిష్టదైవంబులకును వాల్మీకి వ్యాసమహర్షులకును సకల దేవతలకును, బుణ్యసాధ్వులకును, సాధుజనంబులకును, విద్వత్కవులకును బునః పునారచితప్రణాముఁడనై శ్రీకృష్ణలీలామృత మ్మను నేతన్మహావచనకావ్యంబు కరణంబునకుఁ గారణంబు విన్నవించెద.

## —: గ్రంథనిర్మాణ కారణము :—

శ్రీరామానుగ్రహంబున శ్రీమదాంధ్ర వాల్మీకిరామాయణ కావ్య కరణంబున నుత్తీర్ణుండనై యేకశిలానగరధామ శ్రీ రఘురామునకు నర్పించిన పదపడి యొక్కనాఁడు మామకీన జనకుం బోలె శ్రీకృష్ణభక్తుండగు మదీయానుజుండు రంగరాయండు నన్నుంజూచి సవినయంబుగ నిట్లనియె. అన్నా! మన జననీజనకు లత్యంత కృష్ణభక్తులగుటయుఁ గృష్ణజయంతి మహోత్సవంబులు విశేషవైభవంబుగ జరపుటయు నీ యెఱుంగనివి కావు. మన యిలువేల్పు శ్రీ వేంకటేశ్వరుఁ డగుటయు నీకుఁ దెలియనిది గాదు. అట్లుండియు భవత్పూర్వజన్మవాసనా బలంబున బమ్మెరపోతనామాత్యుం బోలి నీవు శ్రీ రామ భక్తుండవై నీకృతులన్నియు శ్రీరామునకే యర్పించితివి. కాని శ్రీ కృష్ణకథ వ్రాసినవాఁడవును గావు .అట్టు లని నీవు కృష్ణుని

యెడ విముఖుఁడవని నా యభిప్రాయంబు గాదు. నీవు శ్రీకృష్ణచరిత్రంబు వ్రాయుట మన తల్లిదండ్రులకును నాకును నిలువేల్పులకును శ్రీకృష్ణభక్తులకును నత్యంత ప్రీతికరంబు. లోకంబున రామభక్తులవలె శ్రీకృష్ణభక్తులు పెక్కురు గలరు. వారి, కందఱకు నీ గ్రంథము పరమార్థదాయకంబు. అంతియగాక మాయామానుష చరిత్రంబు సామాన్యమానవులకు దుర్బోధం బగుటఁ జేసి యథార్థ మెఱుంగఁ జాలక విపరీత జ్ఞాను లవాచ్య దోషంబులు కృష్ణునకుం దగులఁ గట్టుచుందురు. మూలగ్రంథంబులు చదువని భక్తుల కవి కర్ణకఠోరంబులై యుండు. కావునఁ దత్త్వంబు వెల్లడించుటచే భక్తుల కుత్సాహంబును దుష్టులకు వాగ్బంధనంబును గలుగు. మఱియు శ్రీరామచరిత్ర మంతయు నొక్క రామాయణమునని యెఱుంగ నగునట్లు శ్రీకృష్ణ చరిత్ర మంతయుఁ దెలుపు సమగ్రగ్రంథం బొండైనఁ దెలుంగున లేదు. కావున నాయభిలాషగనుగ శ్రీకృష్ణ విభవము సర్వ మొక్కచోఁ దెలియ నగు భంగి కృతి రచియించిన లోకోపకారకంబుగ నుండు నని బోధించె.

ఇప్పుడు కీర్తిశేషుండైన నామిత్రుండు కొత్తపల్లి వేంకట పద్మనాభ శాస్త్రి దాని కనుగుణంబుగ నిట్లనియె. "మిత్రమా! నీవు నూతన కావ్యంబులను, లక్షణ గ్రంథములను, నాటకములను, బరివర్తనంబులను గావించితివి. ఆర్యచరిత్రమాలికా గ్రంథంబు లను పేర బాలురకు బాలికలకు నుపయోగకరంబుగఁ గృతులు రచియించి యనార్యమార్గగాములకు నార్యమార్గ ప్రదర్శకుండవైతివి కాని నవనవకావ్యంబు వ్రాయ నైతివి. నీ చిత్తవృత్తి నెఱుంగుదును గానఁ గర్తవును బాలకులకును నాయు ద్ద్రవ్యయ మాత్ర ప్రయోజకంబులగు కల్పితకథలు రచింపు మని కోరను గాని నీ తమ్ముఁడు గోరినట్లు శ్రీకృష్ణ చరిత్రమును గద్యమున వ్రాయుమని వచియించి మఱియు నిట్లనియె.

అయ్యా! శ్రీకృష్ణచరిత్రరచన సుసాధంబు గాకుండు టెఱుం

గుదు, నైనను నీకు భగవంతుఁడు తోడు గలడు. శ్రీ రామాయణ మహార్ణవంబును నసహాయుండగు నిన్ను దాఁటించి జగద్విఖ్యాతంబుగ నంకితంబు గొన్న నాఁటి శ్రీరామమూర్తి నేఁడు నీపాల లేకుండునా? లేకయేమి? తప్పక నీకుఁ దోడు నీడై యున్నవాఁడు. అసంకల్పుని నేకాకిని నిన్ను బదరికాశ్రమంబునకుఁ దోడ్కొని పోవుచు మార్గమధ్యంబున దుస్సహ వ్యాధిపీడితుఁడ వై నిశ్చేష్టితుఁడ వై దిక్కుమాలి పడియుండిన నిన్ను క్షణమాత్రంబునఁ దేర్చి కుదిర్చి నరనారాయణాశ్రమంబునకుఁ బో శాసించిన ఋషివేషధరులు నిన్ననయముఁ బ్రోవకుందురా? ఇట్టి నిదర్శనంబులు నీకుఁ బెక్కులు కలిగియు జంకెద వేల? కావున నిస్సందేహముగ నీ యేకృతికి దొరఁకొని సుకృతివై యాస్తికులగు లోకుల సుకృతులఁ జేయఁగడఁగుము. నూరనామాత్యుఁడు తన జ్యేష్ఠభ్రాత గయాశ్రాద్ధమున నిజ జననీ జనకులఁ దరింపఁజేసి కృతకృత్యుఁ డయ్యెననియుఁ దాను గృతిముఖంబున వారిని వర్ణించి ధన్యుఁడ నయ్యె దననియు వచించెఁ గాని రెండొక్కండసేయ నెట్టివానికి దుస్సాధం బయ్యె. నీవు కృతిముఖంబున వర్ణించియు బ్రహ్మకపాలంబునఁ బిండ ప్రదానాదు లొనరించియు నీ పితరుల నెల్లఁ దరింపఁ జేసితివి. నీతమ్ముండు వంశప్రతిష్ఠాపకుం డయ్యె. కృతినిర్వాహణభారంబు శ్రీయఃపతిపై వైచి విశ్వజనీనం బగు నిమ్మహాపుణ్యచరిత్రంబునకుఁ బ్రయత్నింపు మనియె.

అంత నేనిట్లు వితర్కించితి. 'తండ్రి! హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి' యన్నట్లు హరికథాలాపంబునఁ గాలయాపనంబు సేయు నియమించు వీరెపో నిక్కపు మిత్రులు బంధువులు. ఇంతకంటె నుత్తమ కార్యంబు వేఱొండు నాకును గానరాదు. ఎట్టులున్నను గాల ప్రవాహంబు క్రమించుచుండును గాని యూరక నిలువదు. ఆ ప్రవాహిక క్షణక్షణంబునకు జనుల యాయువును క్షీణింపఁ జేయును గాని మానదు. ఇది యెఱుంగువాఁ డవు వ్యర్థమొనర్పక సంసార

సాగరంబుతీరంబుఁ జేర నిరపాయంబైన సదుపాయంబు రోయ వలయు. సంసారపారావారంబుఁ దరింపఁజేయ నీశ్వరుఁడు జీవులకు దేహంబులను నావల నొసంగి తాన కర్ణధారుండై హృదయ కర్ణిక మధ్యంబున వెలుంగుచున్నవాఁడు. జీవుల కత్యంతాప్తుం డత్యంత సన్నికృష్టుండు కృష్ణుండుగాక యన్యుండు లేఁడు. ఆయనయెడ మనము దృఢవిశ్వాసము జన్మాంతరమందైన నించుక యుంచియుండితి మేని మన మనశులమై యున్నను గొల్లెతలకుఁ బ్రియంబులైన దధి ఘృత నవనీతంబుల హరించి వారి మనంబులు తనవంకకు నాకర్షించి నట్లు మనకుఁ బ్రియంబులైన పదార్థంబుల హరించి మన మనస్సులు తనవంకకుఁ ద్రిప్పుకొనును. భగవత్కైంకర్యమునకైన దేహయాత్ర యం దాపాదిల్లు విషయములనెల్లఁ దాన హరించుఁ గావున నట్టి వాత్సల్య పరిపూర్ణు నాచార్యకైంకర్యంబున సేవించుటకన్న నిశ్రేయసంబునకు వేఱు సులభోపాయం బెద్ది గలదు? ఎవ్వరెవ్వ రెట్టెట్టిభావంబులఁ దన్నాశ్రయించినవారిని వారిని దానాభావంబుల హరియె తరింపఁ జేయు. కుమారునిఁగ భావించి దేవకీవసుదేవులు, మిత్రుఁడని భావించి కుచేలాదులు శత్రుఁడని భావించి శిశుపాలాదులు తరించిరి. భర్తగఁ గోరి రాజకన్యక లుత్తీర్ణలైరి. స్నేహభావంబులందెల్ల జారిణీస్నేహం బుత్తమోత్తమం బతితీవ్రం బేకాంతంబు నగుటఁ దద్భావభావితలై కాంతుఁడని వలచి గోపికలు వరభక్తియుక్తలై యనన్యలబ్ధంబైన యనుత్తమ పదంబుఁ బ్రాపించిరి. ఇంతయేల? ద్వాపరబుద్ధులైన ద్వాపర జనులఁ జక్కఁజేయ జన్మప్రభృతి నిజప్రభావప్రత్యక్ష ప్రదర్శనంబు కృష్ణావతారంబునంగాక మఱియెందుఁ గాననగు. శిష్టరక్షణార్థంబు దుష్టశిక్ష గావింప జన్మించుచుందు నను నియమంబు జన్మప్రభృతి చెల్లించుకొనుట వాసుదేవమూర్తియందుఁ గాక మఱి యెందుఁ గననగు. మదాశ్రితులకు మదాభిముఖ్యంబు నేన కలిగింతు నను నియతి హాసవేష భాషా చేష్టాదుల గోపికాహృదయాకర్షణంబు

గావించి స్థాపించుట బాల గోపాలు నందుఁ దప్ప మఱి యెందుఁ దోఁచు. అవ్యక్తోపాసనంబు దేహధారులకు దుఃఖకరంబు మూర్తిమ దర్చనంబు సర్వశ్రేయస్కరంబనుట గోవర్ధనోద్ధరణంబునఁ దెలుపుట నందనందనునందుఁ దప్ప మఱి యెందు గోచరించు. భక్తి శూన్యకర్మ ఠుల శ్రమంబు జ్ఞానంబు వ్యర్థంబు. దానికంటెఁ బామరభక్తి నిశ్రేయస కరంబనుట బ్రాహ్మణ స్త్రీ పూజా పరిగ్రహణంబున నెఱింగించుట గోపాల మూర్తియందుఁ దప్ప మఱియెందు లక్షితంబగు. దేహాభి మానంబు సర్వంబు నిర్మూలించి యాత్మ రక్షాధరంబు నిర్వంచనంబున భగవంతునం దుంచినఁ గాని భగవంతుండు ప్రసన్నుండు గాఁడనుట గోపికా వస్త్రాపహరణ లోలుండైన పూర్ణ బాలు చరితంబునందు దప్ప మఱి యెందు విననగు. అచ్యుతుండు శివుండునై యాత్మేశ్వరుం డగు తాను శాశ్వతంబుగ హృదయపద్మ సపద్మంబున నాత్మారాముఁడై యుండుటను మహా తత్వంబు రాసలీలా విలాసంబున భాసింపఁ జేసిన శ్రీనివాసుండు గోపికా విటుండుగాక మఱి యెవ్వరు? యశోదకు విశ్వాధార కత్వంబును, గౌరవసభ విశ్వమయత్వంబును, నరునకు విశ్వసంహార కత్వంబును గోచరించు విశ్వరూపంబు చూపినవాఁడు కృష్ణుఁడు గాక మఱి యెవఁడు? గోపాలుండై యెద్ది లక్ష్యంబులుగఁ బ్రదర్శించె వానినే లక్ష్యంబులుగ గీతాచార్యుండై నరునకు రణ రంగమున బోధించె. ఆ యోగంబునే బృహస్పతి శిష్యునకు దేశికుండై యుపదేశించె. అమానుషంబవాఙ్మనస గోచరంబు నగు లీలా మానవ వేషధారి చరిత్రంబులు యథాశక్తి నోరారఁ బలుకుట కంటె నవ వర్గ కాముకులకుఁ గర్తవ్యం బొం డెద్ది గలదు? "మాఘే మేఘే గతం వయః" యనుటకన్న "రామే కృష్ణే గతం వయః" యనుట యాత్మతృప్తి హేతువు కదా! భారతంబు నంత గ్రంథంబు రచియించియు భగవంతు డగు బాదరాయణుండు శ్రీ కృష్ణ చరిత్ర ప్రాణితంబైన శ్రీ భాగవత రచనంబు నంగాని సంతుష్టి పడఁడయ్యె. నేనును నా

మాయుశ్శేషంబు రామకృష్ణ కథా మననధ్యానాదులఁ గడపి పుచ్చెద అంతియకాదు. పితృ పితృవ్య మాతృ మిత్రాదుల ఋణంబు పూర్వ కృతుల మూలమునఁ దీర్చికొంటి. ద్వితీయ కల్పంబున మదీయ జీవిక కాధారంబు గల్పించి దేహ పోషణంబున కన్న మిన్నగు యశః కాయంబు శాశ్వత పఱిచి యాంధ్ర భోజుఁడన వెలసిన పిఠాపుర ప్రభుఋణంబు మదీయాంధ్ర జయంబు మూలమునఁ దీర్చికొనఁ దలఁచితి. భగవత్కృప యెట్లున్నదో? సప్త పంచాశద్వర్షంబులు గడచెనే. ఆయుశ్శేషంబున నది సాగదేని భగవంతుఁడు నన్నుఁ దదృణ విముక్తుం గావించి జన్మజన్మాంతరముల నాయన కితోధికాష్టైశ్వర్యము లొసంగుఁ గాక

అనియిట్లు నిశ్చయించుకొని సర్వభక్తజన రక్షా దీక్షుండును, సకల కలుష విశకల కరణ దక్షుండును. పుండరీకాక్షుండును, సమస్త విఘ్న కరి హర్యక్షుండును, గరుణా రసేక్షణుండును నగు శ్రీరాముని తోడుపాటునఁ బురాణ నిచయ సుధా నిధి మథించి శ్రీకృష్ణలీలామృతంబు సర్వవిబుధులకు సులభంబుఁ గావించి యమృతత్వంబు నొందెద. మధుభ్రాంతి నేరండ తైలంబునఁ జిక్కి యుక్కిరి బిక్కిరిగొను మక్షికంబువలె సంసార పంకంబునుండి కాలూడఁ దీసికొను మార్గం బెఱుంగని నన్నుఁ గేలూఁతయిచ్చి వెలికిఁ దీసి కన్నులువిప్పి లోకంబును యథార్థరీతిం గనంజేసి యాత్మ మహాపథంబున నిల్పి ఋజుమార్గంబుఁ జూపిన మహాయోగియోగేశ్వరుండు శ్రీరాముఁడు నిజాపరమూర్తి వర్ణనంబు గావింపజేసి రాసకేళీ గోపాలికలకుం బోలె నాకేల సామీప్యమొసంగకుండు. విదేహప్రాతిలయుల కైనను భగవత్కైంకర్యంబునం గాని జన్మముక్తి లేమిం జేసి యెట్టిసపర్యకు ననర్హుఁడ నైన నన్ను నీవిధసేవ నియోగించి తద్వ్యాజంబున నన్నుఁ గడ దేర్ప భగవంతుఁ డిచ్ఛగించె ననుట నిక్కంబు. అట్లు కాదేని భరతవర్షంబున, నందు నాంధ్రవిషయంబున, నందు వేంకటనాయక పాలిత దేహాలీ మండలంబున, నందు

బ్రాహ్మణవర్ణంబున, నందు దీక్షితవంశంబున, నందు శుచిశ్రీమంతు లైన పుణ్యాత్ముల యుదరంబున, నేల సంభవంబు సంభవించు? సంభవించెఁబో, జన్మప్రభృతి శ్రీరామభక్తి యెట్లు గలుగు? కలిగెఁబో, శక్త్యతిక్రమించిన కార్యంబులు చేయ నెట్లు చొప్పడు? చొప్పడెఁబో, హరి కథాభిముఖ్యంబును నెట్టు లలవడు? కావున నివన్నియు నతుల శుభోదర్కంబులకు మార్గంబు లనుట నిర్వివాదంబు. కావున నేత ద్గ్రంథంబు నంగీకృతాంధ్ర భాగవతాంధ్ర వాల్మీకిరామాయణాదికుండును, మదిష్ట దైవంబును, బరమ భాగవతోత్తమ కవివర్య పోతనామాత్య వరగుండును, నేక శిలా నగర వాసియు నగు శ్రీమదొంటిమిట్ట కోదండ దీక్షా గురునకు గురుభిక్షగ నొసంగి పున ర్జన్మంబు లేకుండఁ జేసికొనెద నని నిశ్చయించి శ్రీభాగవత పురాణంబు ముఖ్యాధారంబుగఁ గొని దానికి మహాభారత, విష్ణుపురాణ, హరివంశాది నానా పురాణములఁ గల శ్రీకృష్ణ చరిత్రంబులు గూడఁగఁ జేర్చి కృష్ణ చరిత్రం బంతయును శ్రీకృష్ణ లీలామృత మ్మను పేర భగవత్ప్రసాదంబుగ భక్తుల కాప్యాయనంబుగ యథాశక్తి నిటఁ దలఁచితి.

రుక్మిణి—అప్పా! భరత వర్షంబున నందు భరత ఖండంబున జన్మించుట గొప్పగాఁ జెప్పితివే యేల?

తండ్రి — చెప్పెద వినుము. చందన మందారాది నానా సుందర తరు బృందకుంతలవిరాజితంబై, సర్వపితృముక్తిదాయకంబై బ్రహ్మకపాలంబనఁ బరఁగు బ్రహ్మరంధ్రంబు గల హిమాలయ పర్వతంబు శిరంబుగనై, సింధు బ్రహ్మపుత్రానదులు హస్తంబులుగను, బాంచాల వంగ దేశంబులు గనుదోయిగను, గంగా యమునా నదులు ముక్కురంబులుగను, మహాకాల నికేతనంబగు నుజ్జయిని నాభిగను, వింధ్యపర్వతం బొడ్డాణంబుగను, నర్మదాతపతీ నదంబులు మొలనూళ్లుగను, బ్రాక్పశ్చిమ పర్వతశ్రేణు లూరువులుగను, దండకారణ్యం బాకుపచ్చ పట్టు చీరగను, గావేరీ

తామ్రపర్ణులు చరణాభరణములుగను శోభిల్ల వారాశిజన్మించి
లోకంబు సుశ్రీమంతంబుఁ జేసిన శ్రీ మహాలక్ష్మి వలె భాసురం
బగు మన భరతఖండంబునకు సరిసాటి యీడుజోడు చెప్పఁ
గల దేశంబు లోకంబున నెందుఁ గలదు? ఇందే కదా యపౌరు
షేయములని జగత్ప్రసిద్ధి వహించిన వేదంబులు సుస్థిరంబుగ
నెల కొనియున్నవి. ఇందే కదా వేదాధ్యయన పారీణులయిన
బ్రాహ్మణుల శ్రుతి మనోహర మంగళరవంబు వీతెంచు నగ్ర
హారంబు లున్నయవి. ఇందే కదా ముక్తి కన్యా మణికి నుంకువ
లగు రామాయణ భారత భాగవతాది మహాపురాణముల
నిర్మాతలగు వాల్మీకి వ్యాస పరాశరాది మహర్షులున్నవారు.
ఇదియేకదా రామకృష్ణా ద్యవతార మూర్తుల పాదధూళిచేఁ బవి
త్రత మయ్యె. మృగమదంబు మెదపిన చందనం బలఁది కొనిన
వెలఁదులు దనయందుఁ గ్రుంక నా కస్తురి నొసంగిన జింకలను
స్వర్గలోక సుఖంబులకుఁ బాత్రములఁ జేయుచు శ్రీ హరిపాద
కమలముల నుండి స్రవించు తేనెవాకయై లోకపావనియై
తన్నుఁ దలఁచువారి స్పృశించువారి దర్శించువారి లోతాప
ముల వెలితాపముల నపహరించుచు నిజ స్మరణంబున
లోకుల యజ్ఞానంబు హరించి సందర్శనంబున సుజ్ఞానంఁ
బొసంగి యవగాహంబున ముక్తి కన్యాకాంతులఁ జేయుచు
పావన పావనియై దేవతా నదియై రత్నాకర వల్లభయై సమస్త
నదీ శిరోమణియై సమస్తలోకజన శ్లాఘ్యయైన గంగాభవాని
కిదియే కదా జన్మభూమి విహార రంగము. అభిసారంబు.

సత్యము చెప్పుము. ధర్మమునఁ జరింపుము. తల్లి దండ్రులను
నాచార్యుని నతిథిని దేవతలవలె నర్చింపుమను నియమం బిందేకదా
పాటింపఁబడెడి. సత్యము చెప్పుమని యన్యదేశజులు పలికినఁ బలు
కుదురుగాక హరిశ్చంద్రాదుల వంటివా రేదేశంబునఁ గలరు? ధర్మ

మున వర్తింప వలయునని విదేశీయులు లిఖింతురుగాక ధర్మరాజాదుల వంటి వారెందుఁ గలరు? తల్లిదండ్రులపట్లఁ గృతజ్ఞత గలిగి మెలఁగ వలయునని వాచాకైంకర్య మొనర్చుచు భార్యాముఖావలోకనంబ గుడుఁ దల్లిదండ్రులఁ బూఁటకూలి యిండ్లనుంచు పుత్రులు గలుగు దురు గాని రామాదులవంటి తనయు లెందుఁగలరు? అతిథులఁ గని తలుపులుమూయు దేశంబులు గలవు గాని వారిని దేవతలవలె నర్చించు రంతిదేవ సక్తుప్రస్థులవంటివా రెందుఁ గలరు? శుకుని యట్టి జ్ఞానయోగులును, భీష్మజనకుల వంటి కర్మయోగులును, బ్రహ్లాదాదుల వంటి భక్తియోగులును, నెందుఁ గలరు? వివాహంబునకుఁ గామసంత ర్పణంబె ఫలంబను వారు గలరుగాని దాని పరమార్థం బెఱింగి బోధిం చిన వా రెందుఁ గలరు? కామ దాసులై స్త్రీల గౌరవించు వారు గలరుగాని దేహమునందు సగము పత్నీభాగమని యంగీకరించిన భర్త లెందుఁ గలరు? జారత్వము మానుటే పాతివ్రత్య మనువారు గలరు గాని పతి దేవతలైన సీతా దమయంతీ సావిత్రీ చంద్రమతీ త్యాదులఁ బోలు సాధ్వు లెందుఁగలరు? రాజశిరచ్ఛేదంబుచేయు ప్రజలు గలరు గాని 'నావిష్ణుః పృథివీపతి' యను వా రెందుఁ గలరు? మారంబుననుండి వేఁటకానివలె వధించి క్రూరత్వంబు నెఱపువారే కాని రామభీష్మాభి మన్యు లట్టివా రెందుఁ గలరు? బాల్య మాది పురుషులకు ధనార్జ నోపాయంబుల నేర్పు విద్యలున్నవి గాని తల్లివలె జీవలోకంబును ధర్మ జ్ఞానపథంబుల ననుశాసించు శ్రుతు లెందున్నవి? నాగరకులమని యిప్పుడు విఱ్ఱవీఁగు దేశంబులవారు మృగంబులవలె గుహల నగ్న కల్పులై వసించుచున్న కాలంబున నీ దేశంబె కదా సమస్త విద్యై శ్వర్య భోగాదుల నతులితంబై యుండినయది. మనపూర్వులు నేర్చిన విద్య లిప్పటివారి కింకను దలంపునకైన రాకున్నవి. మతాంతరం బులఁ బ్రవర్తింపఁ జేసినవారు భారతీయులో వారి శిష్యులో యయి యున్నవారు గదా. మన పెద్దలు పచించిన జ్ఞానమార్గము నిప్పటివా

చెప్పెడిప్పుడు క్రొంచెముక్రొంచెము గ్రహింపఁ గలుగుటచే మన భరత వర్షాతిశాయిత వెల్లడి గాదె. శంకర రామానుజ మధ్వాచార్యాది మహాత్ములిందుఁగాక యెందు ముక్తికాంతాసౌధంబునకు జగజ్జన సుగమంబులగు సోపానంబులు గట్టిరి. కవితా చక్రవర్తులగు కాళిదాసాదులును, వైద్యశిఖామణు లగు ధన్వంతరి సుశ్రుత చరకాదులును, జ్యోతిషికాగ్రగణ్యు లగు భాస్కరాచార్యాదులును, కపిల పతంజలి గౌతమ కణాదాది శాస్త్రకారులును, పాణిని లోనగు వైయాకరణులును, నిందుఁ గాక యెందు జన్మించిరి. జ్ఞానులగు నన్య దేశీయులు జన్మాంతరమునను, స్వర్గఫల భోగానంతరము దివ్యులును నేల భారత వర్షంబున జన్మింపఁ గోరుదురు. మన భారతవర్షమహిమ పొగడ వేనోళ్లున్నఁ జాలవు. అంతేయుఁ జెప్ప నే నెంతవాఁడ. ఇట్టి స్వదేశమందభిమానము లేనివాఁడు నరపశువు. మాతృగర్భంబున జనించిన క్రిమి. అట్టివాఁడు తన గర్భంబులఁ జొరకుండ నీభారత మాతలు దైవంబును బ్రార్థింపవలయు. అట్టి మాతృభక్తిశూన్యుని గృతఘ్నుని స్మరించినఁ బాపము దర్శించిన మహాపాతకము. సంభాషించిన రౌరవాది నరకము నగు. అట్టివానితోఁ గలసిమెలసి యుండిన నగు ఫలము వాగగోచరము.

రుక్మిణి—అప్పా! నీ విప్పుడు చెప్పెదు శ్రీకృష్ణ చరిత్రము వినుటకుఁ బెద్దవారందఱు వచ్చియున్నారు.

తండ్రి—శుభము.

అమ్మణ్ణి—మాకుఁ దెలియనిది ఏదు మున్ముందుగ నిత్తునో యడలింతునో?

తండ్రి—ఆ భయము మీ కక్కఱలేదు. మీకుఁ దెలియనిది మీరడుగవచ్చును. శ్రీకృష్ణలీలామృతంబు బాలురు, తరుణులు, వృద్ధులు, భోగులు, యోగులు, రాజతంత్రజ్ఞులు, నీతివిదులు, బ్రహ్మచారులు, గృహస్థులు, సన్న్యాసులు, భక్తులు, పతివ్రతలు లోనగువారి కందఱకు భోగ్యంబు. నాకుఁ దెలిసినం

తలో మీకుఁ దెలియఁ దగినంత చెప్పెదను, సావధానులరై
వినుఁడు. మనకుఁ దెలియనివి యీ పెద్దలవలన గ్రహింతము
మనదోషంబులను వారే సంస్కరింతురు. ఇక వినుఁడు.

—: శ్రీ కృష్ణ జన్మ లీల :—

ప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రుండు యోగిజన చంద్రుం
డగు శుకునిం జూచి యిట్లనియె. మహానుభావా! నీవు సూర్య చంద్ర
వంశ విస్తారంబునుఁ నందుఁ బుట్టిన రాజుల పరమాద్భుత చరి
తంబులను వివరింప వింటిమి. అందు ధర్మ శీలుండైనఁ యదుని
కులంబున దేవకీ వసుదేవులకు శ్రీవిష్ణుమూర్తి నిజాంశంబున దనయుండై
యవతరించె నని చెప్పితివి. అయ్యా యదు వంశంబున భగవంతుఁ
డేల పుట్టెను? పుట్టి విశ్వాత్ముండును, భూత భావనుండగు భగవంతుఁ
డొనర్చిన కార్యము లెయ్యవి? ఏ దే దేమే కార్యము లొనర్చె
నివి యెల్ల నాకు విశదీకరింపుము. మహాత్మా! భగవన్నామ స్మరణంబు
కంటెను, భగవత్కథా శ్రవణమననంబుల కంటెను, మోక్షోపాయంబుఁ
వేరొండు గాన రాదు. ఐహిక వాంఛలు మానినవారికిఁ గీర్తనీయంబై,
వీనుల విందై, జనన మరణవ్యాధికి మందై దేహంబున నానం
దంబు గలిగించు భగవంతు నుత్తమ చరిత్రంబులు వినుటయందుఁ
గటికవాఁడు తప్ప మఱి యెవ్వఁడు తృప్తిఁజెంది యుండఁ జాలఁ డనుము.

అంతియగాక యీ కరుణాభరణుని చెప్పఁగాఁ గానికాదె దేవ
తలకు నజయ్యులైన భీష్మాదులను మకరంబులుగల దారుణ భారత
రణ మకరాలయంబును నా పితామహులు లేమాడ యడుగునవలెఁ
దరించిరి. ఆ చక్రహస్తుండు గదా శరణంబు నొందిన నా తల్లియం
దలి యనుకంపచే మజ్జనని యుదరంబున నేనున్నతఱిఁ గఠిన చిత్తుం
డైన ద్రౌణి కఠోరబాణాగ్నివాతంబడకుండఁ గౌరవపాండవ వంశాం
కురంబైన నన్ను బ్రతికించెను. సమస్త దేహధారులలో లోచూపు

గలవారల కంతర్యామియై యమృతంబును, వెలిచూపుగలవారలకుఁ గాలరూపంబున మృత్యువును గలిగించు మాయామనుష్యుఁడైన కృష్ణుని పరచరిత్రంబుల వర్ణింపుము. అంతియకాక సంకర్షణుండైన బలరాముండు రోహిణీతనయుఁడనియు దేవకీ గర్భసంబంధముగల వాఁడనియుఁ జెప్పితివి. ఒకఁడె యిరువురు తల్లులకుఁ గుమారుఁ డయ్యె? మఱియు ముకుందుండు తండ్రి గృహంబు విడిచి మంద కేల పోయెను? అందెందు జ్ఞాతులతో వసించెను? మందయందును మథురా పురమందును దేవకీనందనుం డొనర్చిన కార్యము లెయ్యవి? మేన మామ తండ్రితో సముఁడు గదా? అట్టి మేనమామ నేల వధించె? మానుషవేషంబు ధరించి భగవంతుఁ డెన్నిదినంబులు యదుపురం బున నుండె? ఆయన కెందఱు భార్యలైరి? మునీంద్రా! సర్వజ్ఞుఁడ వైన నీవే తక్కిన చరిత్రంబులతోడ సమస్తప్రశస్త కృష్ణచరిత్రంబు, జెప్పఁ జాలినవాఁడవు. జలంబైనను పానంబు సేయక ప్రాయోప వేశంబు గావించి భవదీయ వదనారవిందంబు నుండి వెలువడు హరికథా మృతంబుఁ గ్రోలు న న్నాఁకలియు బాధింపఁ జాలకున్నది. అనిన భాగవత శిరోమణియైన శుకయోగీంద్రుండు కలికల్మష హరంబైన కృష్ణచరిత్రంబును బరీక్షిత్తున కిట్లు చెప్పం దొడంగె.

—: శ్రీ శుకమహర్షి పరీక్షిత్తునకు శ్రీకృష్ణచరిత్రంబుఁ జెప్పుట :—

రాజేంద్రా! విష్ణుకథాశ్రవణ నిరతుండవగు నీ జన్మంబు సార్థకంబు. విష్ణుపాదకమలంబున జనించిన గంగ తన్నుఁ జూచినవారిని స్నానమాడినవారిని, గ్రోలినవారిని, పావనులఁ జేయు రీతి విష్ణుచరిత్రము వినువారిని, వినుపించువారిని, ప్రశ్నించువారిని బునీతులఁ జేయును. కావున శ్రీకృష్ణోదంతం బంతయు సాంతంబుగా వినుతు వినుమని కరకమలంబులు ముకుళించి యర్ధమీలిత లోచనుండై భగవంతుఁ దలఁచి—

ఉ. ఎవ్వఁడు సర్వభూతవిభుఁ డెవ్వఁడు సర్వఫలప్రదాత దా
నెవ్వఁడు నాదిమధ్యలయుఁ డెవ్వఁడు కర్తయు భర్త హర్తయున్
ఎవ్వఁడు భూతహృచ్ఛయ గుహేశయుఁ డెవ్వఁడు పూరుషోత్తముం
డవ్విభు నాశ్రయించెద మహాఘ విదారణు మోక్షకారణున్.

ఉ. ఏ విభు నామసంస్మరణ మే విభు దివ్యగుణాను కీర్తనం
బే విభు పాదవందనము లేవిభు చిత్ర చరిత్ర భాషణం
బే విభు ధ్యానముం జనుల కిచ్చు నిరంతర సౌఖ్యపాళి నే
నా విభు నాశ్రయించెద మహాఘ విదారణు మోక్షకారణున్.

కం. తెలిదీవిని మల మీఁదను
జలములలో గుహాలయందు సాధువ్రాతం
బులయందు నిలుచు దైవము
నిలుచుతఁ గృప నాదుహృదయ నీరేజమునన్.

కం. జ్ఞానులకును ధ్యానులకును
మానులకును దెలియరాని మహిమాఢ్యుం డ
న్యాన కృపాలోకనమున
మానక వీక్షించుఁ దన్ను మఱగిన నన్నున్.

కం మెచ్చఁడు క్రతు జపతపముల
మెచ్చఁడు దానముల శ్రుతుల స్మృతులన్ నిష్ఠన్
మెచ్చుం దేవిభుఁ డాతఁడు
మెచ్చుత మద్వాక్యసేవ మిగులం బ్రీతిన్.

అని ధ్యానించి నమస్కరించి యా మునిసత్తముఁ డిట్లనియె.

నరేంద్రా! తొల్లి వేలకొలఁది దైత్యపతులు రాజులను నెపంబున నుత్పత్తిఁ గని మత్తులై ధర్మంబుఁ బోమొత్తి యత్యనయహంకారంబునఁ దామె సర్వంబునుమ నఖర్వగర్వంబున నుర్వీచక్రంబుఁ బీడించుచుండఁ దా పాపభారంబున కోపక ధాత్రీకాంత గోరూపధారిణియై వాణీకాంతు సంతికంబునకుం జని వినయంబున తన మనఃఖేదం

బెట్టగించి కన్నీరు మున్నీరుగా విలపించి యిట్లనియె. దేవా! సువర్ణంబున కగ్నియుఁ గిరణంబులకు సూర్యుండును నెట్లు గురువులో యట్లు నాకును సఖిల లోకంబులకును నారాయణుండే గురువు. ప్రజాపతియు బ్రహ్మయుఁ గలా కాష్ఠా నిమేషాత్మకంబై యవ్యక్త మూర్తి యగు కాలంబును మీరును వార్యంశభూతులే కదా? ఆదిత్యులు వసువులు సాధ్యులు రుద్రులు మనువులు నశ్వులు వహ్నులుఁ బితరులు లోకస్రష్టలు యక్షులు రాక్షసులు దైతేయులుఁ బిశాచోరగ దానవ గంధర్వులు నప్సరసలు గ్రహ నక్షత్ర తారకా చిత్ర గగ నాగ్ని జలానిలంబులు, నేను, విషయంబులు, విష్ణురూపంబులము. సర్వజగము విష్ణుమయము. ఇట్లనేకరూపంబులు వహించిన యమ్మహాత్ము రూపంబులు సముద్రమునందలి కల్లోలంబులవలెఁ బరస్పరము బాధించునవియు బాధింపఁబడునవియు నగుచుండును. ఇప్పుడు విష్ణువుచే నిహతుండైన కాలనేమి యను మహాసురుం డుగ్రసేను సుతుఁడై జన్మించినాఁడు. అరిష్టుఁడు, ధేనుకుఁడుఁ, గేశి, ప్రలంబుఁడు, నరకుఁడు, సుందుఁడు, నుగ్రుఁడు, బాణుఁడు లోనగు దురాత్ములు రాజభవనంబులఁ బుట్టి భువనంబుల నేఁచుచున్నారు. ఈ పాపాత్ముల నాకు మోవ రాకున్నది. నే నీ భారంబున రసాతలంబునకుఁ బోకముంద రక్షించునది యని విలపించిన బ్రహ్మయు నామెను వోడుకొని శంకరాది దేవతాపరివృతుండై పాలకడలితీరంబున విష్ణు డాయ నేగి యద్దేవదేవు జగన్నాథుఁ బురుషసూక్తంబున స్తుతించిన సమాధి యందుండు నాయనకు నొక శబ్దంబు వినవచ్చె. దాని యర్థం బిట్లు దేవతలకు విరించి వివరించి వచించె.

దేవతలారా! వసుదేవునకు దేవకీగర్భంబున సాక్షాద్భగవంతుండు జనించు. మీరును మీ యశంబుల ధరణిపై యాదవకులంబునఁ బుట్టుఁడు. భక్తియుక్తులై నిర్మలాంతఃకరణలగు సురతరుణులును

దత్యూవ్వజార్థము సుందరులై తమ యంశంబుల జనింతురు. ఋషులును దదాజ్ఞచేఁ బహురూపంబులు వహించి క్షీరదానంబున విష్ణుఁ దృప్తుంజేయుదురు. సహస్రశిరుండగు నాదిశేషుండు హరి కగ్రజుఁడై హరికళతో సంభవించును. ఏ మాయచే ప్రపంచ మంతయు మోహితంబగు నట్టి మాయయుఁ గమలాక్షు నాజ్ఞఁ గార్యార్థమై ధరణి జనింపఁ గలదు. ఇఁక నిర్భయులై మీమీనిలయంబులకుఁ బొండని వేల్పుల నొడంబఱిచి పుడమిపడఁతి నూరార్చి కమలసంభవుండు తన నెలవున కరిగెను.

ఆ సమయంబున యదువిభుండైన శూరసేనుఁ డనువాఁడు భగవంతుం డెందు నిత్యంబు సన్నిహితుండైయుండు నట్టి మధురాపురంబు తనకు రాజధానిగా మాథురంబులు శూరసేనంబు లను దేశంబులనుభవించుచుండెను. ఆ శూరసేను సూనుఁడు వసుదేవుండు. అతండాపురంబున దేవకుసుతను దేవకీదేవిఁ బెండ్లియాడి సకలవిభవంబులతో భార్యాయుతుఁడై రథంబెక్కి మెఱవడి చను నప్పుడు మహానందంబుతో దేవకికిఁ బిన్నతండ్రి కొడు కగు కంసుం డుత్సాహాభరితుండై తానె వారల యరదంబుఁ గడపు చుండె. ఇట్లు మహావైభవంబున నూతన వధూవరులు పరివారసమేతులై మంగళవాద్యంబులు బోరుకొనఁ జనుచుండ నృశంసుండైన కంసుని గుండెలు దిగ్గన గగనవాణి కంసా!

కం. చెల్లెలి కుల్లాసంబును
బల్లవితముఁ జేయ రథము వడిఁ దోలెద వే
పల్లవపద యష్టమ శిశు
వెల్లలను మీద నిన్ను హింసించుఁ జుమీ.

యని యెల్లరు వినుచుండ నిట్లు ఘోషించెను.

కర్ణశూలంబులగు నవ్వాక్యజాలంబులు వినినంతన భోజకుల నాశకుం డయిన యా పాపుండు కోపంబు రూపంబుగొనిన కోపున

నేవురేఁగి యొఱనున్న బెడిదంపు టకీడంబు దిగిచి జళిపించి చెల్లెలి కొప్పుపట్టి తెప్పున నీడ్చి శిరంబుఁ దెగవ్రేయ నుంకింప వసుదేవుండు సిగ్గుమాలిన యాంబావ కేలు పట్టుకొని మధురవచనంబుల నా దుష్ట స్వాంతుఁ గొంత శాంతుఁ జేయుచు నిట్లనియె.

అయ్యా భోజకులదీపకా! నీవు శూరుండవు. శ్లాఘనీయ చరిత్రుండవు. అయ్యో యిట్టినీవు పెండ్లికాలంబునఁ బెండ్లికూఁతును జెల్లెలిని బాలికను సన్నముఁ బున్నమెఱుఁగని కన్నను గొప్పుపట్టి యీడ్చి చంపుట కెట్లుత్సహించితివి? ఇది నీ యట్టివాఁడు చేయుందగు కార్యమా? నీవే యన్నలమిన్నకు నన్నవు కావా? అన్నలు చెల్లెండ్రకు మాడలు మేడలు చీరెలు సారెలు మేరలు మీఱ నిత్తురు గాని కత్తుకఁ గత్తిరింపఁ గత్తి నెత్తుదురా? రూప నామ క్రియలు లేని బయలి పలుకుల నీవు నిక్కమని యెట్లు నమ్మితివి? గాలి మాటలకై గారాము చెల్లెలికిఁ బోరాములు కూర్పఁ దగునా? ఇంతకు నిది బాలిక. నీ చెలియలు. కన్నియలకుఁ బుట్టినింటియాస మెండు గావున మాయన్న మాయన్న యని నీ క్షేమంబే కోరుచుండు. ఇట్టి నీవు కులమర్యాదయు శూరధర్మముఁ దలఁపక స్త్రీవధంబు హేయంబని రోయక కన్నియను మన్నిగొన నెన్నుట న్యాయ్యమా? నీవు ధర్మవర్తనుండవు కావున యోచింపుము. అయ్యా దీనిగర్భంబున నెన్నఁడో జనించు నర్భకు వలన నీకు మృత్యు వగునని భయపడెదవేని దాని తత్త్వంబు వినుము.

జనులకు మృత్యు వేనాఁడో యెచ్చోటి నుండియో వచ్చునని తలంచుట వెఱ్ఱితనంబు. దేహంబు తోడన మృత్యువును బుట్టి తోడునీడ వలె నెడఁ బాయక యెప్పుడును వెంట నంటియే యుండు. నేఁడైన రేపైన నిఁక నూఱేండ్లకైనఁ బుట్టినవాఁడు మృత్యువు వాతఁ బడకుండఁ దప్పించుకొన జాలఁడు. మరణించునది శరీరంబె కాని యాత్మ కాదు. జీవుండు దేహంబు నందుండి యజ్ఞానంబున దేహంబె

తానను భ్రాంతి వహించి కర్మంబు లొనరించి యా కర్మ ఫలము లనుభ
వింప యోగ్యంబైన శరీరంబు మఱియొండు చొచ్చి యీ దేహంబు
విడుచు. ఎట్లన: మెట్టజలగ తాను నడచు నప్పుడొక కాల నొక
తృణమును ద్రొక్కి మఱియొక కాలిచేఁ దనకు ముందున్న తృణంబుఁ
బట్టుకొని వెనుకటి తృణమును విడుచును గదా. అట్టులే దేహియుఁ
గర్మవశంబున వేఱొండు దేహంబు గ్రహించి యీ దేహంబును విడుచు
చుండు. జలగ యీ దేహమును విడువకయే కదా యట్లు నడచు?
వేఱొండు దేహంబునఁ బ్రవర్తించు దాని కయ్యుపమానం బెట్లు సరిఁ
బడునని సందేహింపవలదు. మనుష్యుఁడు తాను బగలు విన్నదానిని
గన్నదానిని మనసున ధ్యానించుచు దానియందే కోరిక గలవాఁడై
నిద్రయందు దానినే యనుభవించునుగదా. అట్టి స్వప్న దశయందుఁ
దాను మేల్కొని యున్నపుడు కోరినదియే యిప్పుడు ప్రాప్తించెననుట
మఱచును. అటైన మఱుజన్మంబున జీవున కెట్టి దేహంబు ప్రాప్తించు
నని యడిగెదవేని వినుము. పూర్వవాసనాత్మకమై ఫలాభిముఖంబైన
కర్మముచేఁ బ్రేరింపఁబడి సంకల్ప వికల్పంబు లనువికారంబులకు
బాలుపడి మరణ కాలంబున మనస్సు దేహాత్మ రూపంబుల ఘటింపఁ
బడిన పంచభూతంబులందు భగవత్సంకల్పముచే నేయేదాని నభిల
షించునో యట్టి దేహంబుతోడ మరల జనించు. అద్దము నందును
నీటనిండిన కొలఁకు లందును బ్రతిఫలించిన సూర్య చంద్రుల బింబంబు
లద్దము నీరు గాలి మొదలగు కారణంబులఁ గదలిన నవియుఁ గదలు
చున్నట్లు తోఁచు విధమున దనకై మాయా కల్పితంబులై గుణమ
యంబులైన దేహంబులందు రాగవశంబున బ్రవేశించి యా
యనాత్మభూతమైన దేహమును దానే యనుకొని యవిచేయు కార్య
ములు దాను జేయు చున్నట్లు దేహ భ్రాంతి నొందు చున్నాఁడు.
కావున వాస్తవమిట్టి దని యెరిగి యాత్మ క్షేమముఁ గోరువాడు పర

ద్రోహంబు సేయరాదు. ద్రోహికిఁ బరభయంబు తప్పదు. భోజ రాజేంద్రా! చెడునది దేహమేకాని కర్మములు చెడవు. వానిఫలంబుల నను భవింపకయుఁ దప్పదు.

కం. తనచేసిన కర్మంబులె
తనకు శుభాశుభము లొసఁగు దప్పక వనజా
సను కైనఁ గాన నితరులఁ
గనలంగా నేల వారు కర్త లటంచున్.

అయ్యా యిది నీకు వావికిఁ జెల్లెలేకాని నీ కూఁతురు వంటిది గాదా. బాల యేమి యెఱుంగని బేల. క్రొత్త పెండ్లికూఁతురు. సాధు గుణసంభావనీయ, దయనీయ. గడగడ వడఁకుచుఁ బదములు తడఁబడ నిలువఁజాలకయున్నది. తండ్రీ! యిట్టిదానిని గంసభూపాలా! యిట్టి మానినిఁ జంపకుము. చంపకుము. నీకు నమస్కరించెదను. అని యెంతయొ త్రిచెప్పినను మెత్తఁబాటులేక తత్తఱంబున నమ్మత్తకాశిని కుత్తుక తెగ వ్రేయఁ గరవాలంబెత్తిన సాధు స్వభావుండగు వసుదేవుండు తనలోనఁ "కాలం బనివార్యంబు మన బుద్ధిబలంబున దాని నివర్తింపఁజేయుదుమనుట బాలిశత్వం బని యప్రయత్నుండై యూరకుండఁ దగవు కాదు. బుద్ధిబలంబుగల యంతవట్టు పురుషకారంబు మానరాదు. ప్రాణాపాయంబు దప్పింపఁ బ్రతిమనుష్యుండు యథాశక్తి యూపిరియుండువఱకు యత్నింపవలయు. ఎంతకుఁ దప్పకున్న నది యతనిదోషము గాదు. ప్రయత్నింపకుండిన దోష మొదవు. కావున నిరపాయంబైన సదుపాయంబున నాపన్నయైనబ్లుయీ పిన్నదాని రక్షింతుఁగాక. ఈ సతీసుతుచే నీతనికి మృతి నిక్కమేని యది యేల తప్పు? దైవంబు నతిక్రమింప నెవ్వారు సమర్థులు? అడవిదహించు కారుచిచ్చొక్కొక్కపరి సమీపవృక్షముల విడిచి యెగసిపోయి దూరమున నుండు చెట్టుల దహించునట్లు ప్రాణులకుఁ గూడికలు వేఱుపాటు

లదృష్టవశంబునఁ గలుగుఁగాని యది యట్లు జరుగునని యుక్తివాదంబులచే నిర్ధారింప శక్యంబుగాదు. కావునఁ బ్రకృతమునకుం దగిన యుక్తి వెదకెద. ఇప్పటి ముప్పుతప్పింప నిప్పుడఁతికిం జనించు కొడుకుల వరుసగ నీకె యర్పించెదనని వచించెద. మీఁ దెవ్వఁ డెఱుఁగును? అప్పటి కొకయుపాయము గలుగదా? కార్యము తడఁబడదా? నాఁటి కొక్క-దైవము లేదా? చూత" మని యాలోచించి లేనినవ్వు ముఖమునకుం దెచ్చుకొని కంసునిఁ జూచి మెత్తని పలుకుల నతని చిత్తంబు స్వాయత్తంబుఁ గావించికొని యిట్లనియె.

అయ్యా! యీ వనిత యెనిమిదవ నూలు నీకు శత్రు వనికదా తలంచెదవు. దానికి నీవు భయపడనలదు. ఈ తలోదరి యుదరంబున జనించు శిశువుల నెల్ల వెంటవెంటన నీ కొసంగుచుండెద. పురుటింటి బిడ్డండు నీకు సులభవధ్యుం డగు. నీకును బ్రాణభయంబు పాయు. స్త్రీహత్య గావించితివను నిందయుఁ దొలఁగు. అనిన నమ్మందుండు దానికి సమ్మతించి యా మందగమనను మందల విడిచి తన మందిరంబున కరిగె. దేవకీ వసుదేవులును బులివాత విడివడినట్లులె తమ గృహంబునకు నరుదెంచిరి. దేవకియు సంవత్సరమున కొక పుత్రునివంతున నెనిమిదుగురు సుతులను నొక కొమార్తనుఁ బ్రసవించె. వసుదేవుండును దొలుతఁ బుట్టిన బిడ్డను బుట్టినట్లు కొనిపోయి యసత్యమునకు వెఱచి కంసున కర్పించె. తన కన్నబిడ్డను తాను గొనిపోయి చంపుమని తనచేతులారఁ బరునిచేతుల నెట్లొసంగెనని సందేహింపవలదు. ఏలన, సాధువులకు సహింపరాని దెయ్యది? ఆత్మజ్ఞానులగు పండితుల కపేక్షితం బెద్ది? క్షుద్రులకుఁ జేయరానిపని యేది? స్వవశీకృత చిత్తులకుఁ ద్యజింపరాని దెద్ది?

ఇట్లు దన కొడుకుఁ గీర్తిమంతు నర్పింపవచ్చిన వసుదేవుం జూచి యతని సత్యసంధతకు మెచ్చి చిఱునవ్వునఁ గంసుం డాయన

కిట్లను. వసుదేవా! నీ సత్యసంధతకు మెచ్చితిని. ఏని వలన నాకు భయము లేదు. అష్టమగర్భము నా కనిష్టకారి కావున దానిఁ దెచ్చి పొమ్మని నతం డప్పటికి సంతసించియు నింద్రియ దాసుండైన యా కుటిలచిత్తుం డెప్పటికేమి తలంచునో యని బిడ్డలయెడ నిరాశుండై యుండె.

రుక్మిణి—అప్పా! యాకాశవాణి ముందుగాఁ గంసునకీ సమాచారము చెప్పకుండిన దేవకీ వసుదేవులకీ కష్టము రాకుండును గదా. ముందుగాఁ జెప్పి వారిని బాధింపఁ జేసిన నేమి లాభము?

తండ్రి—ఆకాశవాణి యనఁగా నేదియో కాదు. దేవతా వాక్యమే. భగవ ద్వాక్యమే. శ్రీరాముఁడు రావణాసురునకు సీత నిచ్చి బ్రతుకుమని ముందుగఁజెప్పి పంపలేదా? ఏల?

రుక్మిణి—బుద్ధి తెచ్చుకొని బ్రతుకు మని.

తండ్రి—ఇక్కడ నదే కారణము. మనము దుష్టుల మగుటచేఁ గదా మనలను భగవంతుఁడు శిక్షింప దలఁచినాఁడు. దౌష్ట్యము మాని సన్మార్గమందుఁ జరించిన భగవంతుఁడు రక్షించునని బుద్ధి తెచ్చుకొనును గాక యని చెప్పెను. భారతమందలి యక్ష ప్రశ్న విషయము స్మరింపుము. ఆకాశవాణి చెప్పినమాటలు వినక భీమార్జున నకుల సహదేవులు మరణించిరి. ధర్మరాజది చెప్పినట్లు చేసి సుఖపడెను. మరణవార్త ముందుగాఁ దెలిసిన పిఱికివాఁడు భయపడి దురవస్థల పాలుపడును. పరీక్షిత్తు ఖట్వాంగుఁ డేమి చేసిరి? తరువాత విను.

ఇటులుండ నొకనాఁడు నారదుఁడు కంసునియింటికి వచ్చి యత నిచే సత్కృతుండై సంభాషించు సమయంబున నీవును నీ మిత్రు లం డఱు రాక్షసాంశంబులఁ బుట్టినవారు. తొల్లి నారాయణ నిహ

తుండవైన కాలనేమివి నీవు. దేవకీ వసువులు లోనగు యాదవులు నందాదులును వారి స్త్రీలును దేవాంశములఁ బుట్టినవారు. కావున రాక్షసులై దుష్ట ప్రవర్తన ముందున్న మిమ్మెల్ల వధింప శ్రీవిష్ణువే దేవకీదేవి గర్భంబున నెనిమిదవ చూలై జనింపఁ గలఁడు. అని చెప్పి యదేచ్ఛ మరిగినఁ గంసుం డులికిపడి యలుకఁ గలఁక గదిరిన మనంబుతోఁ జివ్వనవచ్చి క్రుద్ధుండై యసంబద్ధ ప్రలాపంబుల గదరుచు దేవకీ వసుదేవుల నినుపసంకెలల బద్ధులఁ జేసి కారాగృహంబునఁ ద్రోచి పుట్టిన బిడ్డలనెల్ల నప్పుడప్పుడ ప్రాణభయంబున వధించి తన తండ్రి నుగ్రసేను సింహాసన భ్రష్టుఁ గావించి తాన రాజ్యంబుఁ గైకొని శూరసేనంబులు లోనుగాఁగల రాజ్యం బంతయు నేలుచుండెను.

కం. నరపతులు క్రూరమతులై
ధరణీరాజ్యంబుఁ గోరి దల్లిని దండ్రిన్
గురువుల మిత్రుల హిత సో
దరులను వధియించుచుంద్రు తమజీవికకై.

ఇట్లు బలవంతుఁడై నృశంసుండైన కంసుం డహంకార బలంబున బాణనరక జరాసంధ మహాశన కేశి ధేనుక బక ప్రలంబ తృణావర్త చాణూర ముష్టి కారిష్ట ద్వివిద పూతనాది సహాయుండై గండమీఱి యుద్దండుండై దుండగంబున యదు వృష్టి భోజాంధకుల పీఁచమణచిన వారు గర్వంబులు ఖర్వంబులు గాఁగ నితరదేశముల తెరువులు పట్టిపోయిరి. పోవలేనివారు వానికి వశులై యుండిరి.

ఈవిధమునఁ గంసుండు దేవకీపుత్రుల నార్వుర వధించె. పదపడి యమ్ముద్దియకు హర్షశోక వర్ధనంబై యేడవ గర్భంబు ప్రాప్తించె. ఆ గర్భంబున నాదిశేషుండు నిలిచె. అప్పుడు శ్రీహరి తన కారణంబుగఁ దన్ను నమ్మిన యాదవులకుఁ గంసుని వ్యాపాదంబున నాపాదిల్లు మహాపదం బాపఁ దలఁచి యోగమాయాదేవి కిట్లనియె.

కిట్లను. వసుదేవా! నీ సత్యసంధతకు మెచ్చితిని. వీని వలన నాకు భయము లేదు. అష్టమగర్భము నా కనిష్టకారి కావున దాని( దెమ్ము పొమ్మనిన నతం డప్పటికి సంతసించియు నింద్రియ దాసుండైన యీ కుటిలచిత్తుం డెప్పటికేమి తలంచునో యని బిడ్డలయెడ నిరాశుండై యుండె.

రుక్మిణి — అప్పా! యీ కాశవాణి ముందుగా( గంసున కీ సమాచారము చెప్పకుండిన దేవకీ వసుదేవుల కీ కష్టము రాకుండును గదా. ముందుగా( జెప్పి వారిని బాధింప( జేసిన నేమి లాభము?

తండ్రి — ఆకాశవాణి యన(గా నేదియో కాదు. దేవతా వాక్యమే. భగవ ద్వాక్యమే. శ్రీరాముడు రావణాసురునకు సీత నిచ్చి బ్రతుకుమని ముందుగ( జెప్పి పంపలేదా? ఏల?

రుక్మిణి — బుద్ధి తెచ్చుకొని బ్రతుకు నని.

తండ్రి — ఇక్కడ నదే కారణము. మనము దుష్టుల మగుటచే( గదా మనలను భగవంతుడు శిక్షింప దలచినాడు. దౌష్ట్యము మాని సన్మార్గమందు( జరించిన భగవంతుడు రక్షించునని బుద్ధి తెచ్చుకొనును గాక యని చెప్పెను. భారతమందలి యక్ష ప్రశ్న విషయము స్మరింపుము. ఆకాశవాణి చెప్పినమాటలు వినక భీమార్జున నకుల సహదేవులు మరణించిరి. ధర్మరాజది చెప్పినట్లు చేసి సుఖపడెను. మరణవార్త ముందుగా( దెలిసిన పిరికివాడు భయపడి దుర్వస్థల పాలుపడును. పరీక్షిత్తు ఖట్వాంగు( డేమి చేసిరి? తెరువాత విను.

ఇట్లుండ నొకనాడు నారదుడు కంసునియింటికి వచ్చి యత నిచే సత్కృతుండై సంభాషించు సమయంబున నీవును నీ మిత్రు లం డఱు రాక్షసాంశంబుల( బుట్టినవారు. తొల్లి నారాయణ నిహ

తుండవైన కాలనేమివి నీవు. దేవకీ వసువులు లోనగు యాదవులు నందాదులును వారి స్త్రీలును దేవాంశములఁ బుట్టినవారు. కావున రాక్షసులై దుష్ట ప్రవర్తన నుండున్న మిమ్మెల్ల వధింప శ్రీవిష్ణువే దేవకీ దేవి గర్భంబున నెనిమిదవ వాడై జనింపఁ గలఁడు. అని చెప్పి యదృశ్య మయినఁ గంసుం డులికిపడి యలుకఁ గలఁక గదిరిన మనం బుతోఁ జివ్వనవచ్చి క్రుద్ధుండై యసంబద్ధ ప్రలాపంబుల గదరుచు దేవకీ వసుదేవుల నినుపసంకెలల బద్ధులఁ జేసి కారాగృహంబునఁ ద్రోచి పుట్టిన బిడ్డలనెల్ల నప్పు డప్పుడ ప్రాణభయంబున వధించి తన తండ్రి నుగ్రసేను సింహాసన భ్రష్టుఁ గావించి తాన రాజ్యంబుఁ గైకొని శూరసేనంబులు లోనుగాఁగల రాజ్యం బంతయు నేలుచుండెను.

కం. నరపతులు క్రూరమతులై
ధరణీరాజ్యంబుఁ గోరి దల్లిని దండ్రిన్
గురువుల మిత్రుల హిత సో
దరులను వధియించుచుంద్రు తమజీవికకై.

ఇట్లు బలవంతుడై నృశంసుండైన కంసుం డహంకార బలంబున బాణనరక జరాసంధ మహాశన కేశి ధేనుక బక ప్రలంబ తృణావర్త చాణూర ముష్టి కారిష్ట ద్వివిద పూతనాది సహాయుండై గండుమీఱి యుద్దండుండై దుండగంబున యదు వృష్టి భోజాంధకుల పీఁచమణఁచిన వారు గర్వంబులు ఖర్వంబులు గాఁగ నితరదేశముల తెరువులు పట్టిపోయిరి. పోనలేనివారు వానికి వశులై యుండిరి.

ఈవిధమునఁ గంసుండు దేవకీ పుత్రుల నార్వుర వధించె. పదపడి యమ్ముద్దియకు హర్షశోక వర్ధనంబై యేడవ గర్భంబు ప్రాప్తించె. ఆ గర్భంబున నాదిశేషుండు నిలిచె. అప్పుడు శ్రీహరి తన కారణంబుగఁ దన్ను నమ్మిన యాదవులకుఁ గంసుని వ్యాపాదంబున నాపాదిల్లు మహాపదం బాపఁ దలఁచి యోగమాయాదేవి కిట్లనియె.

భద్రా! నీవు గోగోపజనంబు లుండు నాలమందకుఁ బొమ్ము. అందు నందగోకులమున వసుదేవుదేవి రోహిణి కంసభయంబున దాగియున్నది. ఇప్పుడు దేవకి కడుపున శేషాఖ్యమైన నా తేజము తేజరిల్లుచున్నది. దానిని నీవు గొనిపోయి రోహిణి గర్భంబున నుంచుము. పదపడి నేను నంశభాగ యుతుఁడనై దేవకికి దనయుఁడనై జనియించెద. అప్పటికి నీవు యశోద యుదరంబున జనింపుము. నీ వీ దేవకార్యము సల్పుము. సాకారవైన నిన్ను లోకులుబలి పూజావిధానంబుల నర్చింతురు. నీవును నార్య, దుర్గ, భద్ర, వేదగర్భ భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, నారాయణి, యీశాన, శారద, యంబిక, క్షేమద, సుఖద యను నామంబులు ధరించి వింధ్య జాలంధరాది యోగపీఠంబుల శుంభనిశుంభ మర్దనివై వెలయుము. ని న్నీవిధంబుగ సాయంప్రాతః కాలంబులఁ గొనియాడు మానవుల సర్వకామంబుల నేన నీకృపావం బునఁ దీర్చుచుందుఁ బొమ్మని నియోగించిన నల్లెయని నమస్కరించి యా యోగనిద్ర చయ్యన నియ్యల కవతరించి దేవకీదేవి యుదరంబున భాసిల్లు గర్భంబు నొయ్యనఁ దిగిచికొనిపోయి రోహిణి యుదరంబున నునిచి తాను యశోద కడుపునఁ బ్రవేశించె. తెలియని వారు దేవకికిఁ గడుపు దిగజారెనని తలఁచిరి. నందగోకులంబున రోహిణి యుదరంబున లోక రాముఁడగుట రాముఁడనియు, మిగుల బలము కలిమి బలభద్రుం డనియు, గర్భసంకర్షణమున జనించుటఁ జేసి సంకర్షణుం డనియు నామంబులు వహించి సుతుం డుద్భవించె. తదనంతరంబ.

నారాయణుం డంశభాగ విశిష్టుండై దుష్టనిగ్రహార్థంబు శిష్టరక్షణార్థంబు వసుదేవు మనంబునఁ బ్రవేశించె. అప్పు డతఁ డుదయించు సూర్యునిఁ బోలి యేరికిఁ దేఱిచూడరాక దుష్టజన దుర్ధర్షుండై వెలుంగుచుండె. అట్టి జగన్మంగళ తేజంబు నతఁడు దేవకీదేవియందుఁ

జేర్చిన నా యమయు సర్వాత్మకుండును నాత్మభూతుండును నగు లక్ష్మీశ కాంతుని గర్భంబున ధరించి మేఘంబుచాటు చంద్రుని ధరించిన పూర్వదిశవలె మనోజ్ఞయయ్యు నాపతి కుండలోనుంచిన దీపశిఖయు జ్ఞానహీనున కలవడిన సరస్వతియుఁ బోలి కంసుని చెఱయందుండుట ప్రకాశింపదయ్యె.

కం. తాను స్వతంత్రుం డయ్యును
నానికఁ బరతంత్రు నట్టు లగు బద్ధుండున్
శ్రీ నారీ రమణుం; డది
జానుగ నెఱిఁగించు శౌరి స్వాతంత్ర్యంబున్.

ఇట్లు విశ్వగర్భు గర్భంబున ధరించి దుర్భరంబగు తేజంబున జూపఱుకన్నులు గోరగింపనుండు నయ్యంచుఁబోణి పోణిమియు మేని కాంతియు ముఖవికాసంబును జూచి నిజజీవితంబు పట్ల నిరాశుండై యా దురభిమాని కంసుండు మానసంబునఁ జింతాకులుండై యిట్లని తలపోయం దొడంగె.

ఔరా చిత్రము. ఈ చిన్నదానిగర్భము నా కన్నులకుఁ జూడ దుస్సహమై యున్నది. ముందటి గర్భములం దిట్టి తేజ విశేషమెయందుఁ గానరాదయ్యె. చూచుకొలఁది నా మనస్సున నొక వికార ముద యించుచున్నది. ఇది లోకసామాన్య గర్భము గాదు. దుర్భరంబై యున్నయది. మున్ను గగనవాణి వచించిన ట్లీమె యుదరంబునఁ గమలోదరుం డున్నవాఁడు కాఁబోలు. అట్లు గాకున్న నిట్టి తేజోవి శేషం బేల యొదవు? ఇప్పుడు నాకుఁ గర్తవ్యం బెయ్యది? దీనికిఁ బరిహారం బేమి యాలోచింతును. దిన దిన మునకు గర్భమా పెరుఁగు చున్నది. ఈమెను జంపుదమా యనిన నెట్లు చంపుదు? ఆఁడుది. అందుఁ జెల్లెలు. అందు గర్భిణి. ఘోరవారంబుల తలలు కత్తిరించు కృపాణంబున నీ పల్లవపాణి నెట్లు చంపుదు? అట్టి క్రూరకర్మము ఘోరధర్మమగునా? భీరు

ని వీరులు నవ్వరా? స్త్రీహంతయని లోకులు దిసంతులు గొట్టరా? ఆయువు కీర్తి ధర్మము నశింపదా? ఈ కాయంబునకై వావి వరుసలు న్యాయాన్యాయంబులు దలఁపక హేయకార్యంబు లొనర్చువానిని విజ్ఞులు జీవన్మృతుఁడనరా? నిందలపాలైన మందునిబ్రతుకొక బ్రతుకా?

అని యాలోచించి చెలియయుఁ జెలియలుఁ జూలునగు దేవకిని జంపనొల్లక పల్లటిల్లు నుల్లంబుతోడఁ బుట్టిన బిడ్డను బుట్టినప్పుడ మట్టుపెట్ట నిశ్చయించి యాదిట్టఁడు కారాగృహంబునఁ గావలివారి మఱికొందఱ నియమించి కొందల మందు డెందంబునఁ గుందుచు దినంబు లెన్నికొనుచు నుండె. మఱియు నెక్కడ విష్ణువు పుట్టునో యెప్పుడు తన్నుఁ జంపునో యను సంతతచింత వ్యాకులుండై తన్మయుండై చీమ చిటుక్కు మనినను నదె విష్ణుండు వచ్చుచున్నాఁడని యులికిపడును. ఏ శబ్దంబు వీనులఁ బడినను నది వెన్నుని పలుకని యదరి పడును.

ఎట్టయెదుట నే పదార్థంబు దోఁచినను దిగులుపడి యోహో నారాయణుండు రానే వచ్చెఁ గదా యని నిట్టచూపులం జూచును. ఇంట సంచరించు నెడఁ దటాలున నేపదార్థంబు మైసోఁకినను హరి తన్నుఁ బట్టుకొన వచ్చుచున్నాఁడని భ్రమించు. కమ్మవాసన లేవైన నాసిక సోఁకిన వనమాలికా గంధం బని కళవళించు. ఎవ్వరే పేర నెవ్వానిఁ బిలిచినను నవి యన్నియు హరినామములే యనియు హరిని జీరుచున్నారనియుఁ దలంచు. ఇంత యేల? కూర్చుండినను బరుండినను నడచినను గుడిచినను నన్ని దశలందును నన్ని దిశలందును హరి తనపై రోషించి భాషించునట్టు డాసి వ్రేసినట్టు లాతనికి గోచరించు. అతనికి బరమజ్ఞానికిఁ బోలె సర్వజగము హరిమయంబై కానవచ్చుచుండె.

అంత నక్కడ సంద్రాములు నారాయణు వాక్యంబులు స్మరించి యమ్మహానుభావుండు దేవకీగర్భ వివరస్థుండగుట భావించి మహా

యోగీశ్వరులకుఁ గానరాని మొదలి వెలుఁగు మూర్తిమంతంబై ధరణి నావిర్భవింప నెన్నఁడు కన్నారఁ గందుమో యని డెందంబున నానందించుచుఁ దడవగుట కోపక నెక్కడ మూలుగు వినఁబడినను దేవకీ గర్భవేదనయనియు నెందు బాలరోదనంబు వినఁబడిన నది హరి కంఠరవం బనియు నెందు వెలుంగు దోఁచిన నది హరితేజం బనియుఁ దలంచుచుఁ గాకున్న నివ్వెరపడుచు నెప్పుడు వెన్నుఁడు గర్భంబు విడిచివచ్చు నెన్నఁడు కన్నుల పండువుగ దర్శింపవచ్చు నెన్నం డా మహాభాగుండు పాపాత్ముల వ్రచ్చు భూభారంబుఁ బుచ్చు సాధువుల మెచ్చు నేలొకో తడవు సేయుచున్నవాఁడని తహతహ పడుచుండిరి. ఇట్లుండ నెల లంతకంతకు నెక్కి నీళ్ళాడు ప్రొద్దులైన బ్రహ్మయు శివుఁడును నింద్రాదిసురులును నారదాది మహర్షులు వచ్చి గర్భస్థుండగు పురుషోత్తము నిట్లు స్తుతించిరి.

## —: బ్రహ్మాదులు గర్భస్థుండగు విష్ణువును స్తుతించుట :—

దేవా! సత్యసంకల్పుడవు చిదచిదాత్మకమైన * జగముకంటె విలక్షణుండవు ప్రకృతి పురుష కాల శరీరకుండవు త్రికాలంబుల నిత్యుండవు చిదచిత్ప్రపంచమునకు గారణుండవు నిర్వికారంబు పరంబైన నభంబు నధిష్టించి సృష్ట ప్రపంచమున నంతర్యామివై యుండు వాడవు సత్యమునకు సత్యుండవు సూనృతవాక్య సమదర్శన ప్రవర్తకుండవు నగు నిన్ను రక్షకుండ వని నీదాపు చేరితిమి. ప్రకృతియొక్కటి పాదు. సుఖదుఃఖము లను నవి రెండును ఫలములు. సత్వము రజస్సు తమస్సను మూడుగుణములు వేళ్ళు, ధర్మార్థకామమోక్షంబు లను నాలుగు రసములు. నగాత్మభూతంబు లైదు నూడలు. జన్మ, మస్తిత్వము, వృద్ధి, పరిణామ, మపక్షయము నాశములను

* చిత్తు = జీవుడు. అచిత్తు — జడమైన ప్రకృతి. విలక్షణుడు — భిన్నుడు.
నిర్వికారము — మారుపాటులేక యెల్లప్పుడొకవిధముగ నుండునది.

నూఱ్ఱు లాఱును స్వభావంబు. వస, మాంసము, రుధిరము, మేదస్సు మజ్జ, యస్థి, శుక్లమునను రూపంబులుగల ధాతువు లేడును బైపొరలు. కరములు, చరణములు, కంఠము, వక్షము, శిరము, జఠరం బను నెనిమిది శాఖలు. నవ రంధ్రములు వృక్షబిలములు. ప్రాణ, మపానము, వ్యాన, ముదానము, సమానము,నాగము, కూర్మము, కృకరము దేవదత్తము, ధనంజయ మను ప్రాణములు పదియు నాకులు. జీవాత్మ పరమాత్మ రెండు పక్షులు. ఇట్టి దేహ రూపంబగు జగ ద్వృక్షంబును గలిగించు వాడవును వెలయించు వాడవును మానించు వాడవును నీవు. నీ మాయచే మోహితమైన మనస్సులు గల యజ్ఞానులు మా యట్టివారిని జగత్కారణ భూతులని నానా ప్రకారంబుల దలం తురు గాని తత్త్వం బెఱింగిన జ్ఞానులు నిన్నొక్కనినే జగమునకు గారణమని నూతురు. అంతరాత్మవైన నీవు చరా చరాత్మకం బైన లోకంబునకు క్షేమము గలిగింప శుద్ధ సత్త్వ మయంబు లును, సాధువు లకు సుఖావహం బులు, నసాధువులకు నమంగళ కరంబులు నగు రూపంబులను బలుమాఱు ధరింతువు. విశుద్ధ సత్త్వ మయంబైన విగ్ర హము గల నీ యొక్కని యందు జ్ఞానులు సమాధిచేఁ జిత్తంబు నిలపి సదాచార్యులచేఁ బ్రశంసితంబైన నీ చరణ కమలం బను నావచే సంసా రంబను సముద్రంబును లేఁగ యడుగువలె నవలీలఁ దరింతురు. దివ్య సుందర విగ్రహా! * యాధివ్యాధి జరామరణాదుల నతి భయంకరం బైన సంసార సాగరంబును దాము దాఁటుట మాత్రమునఁ దృప్తి లేని వారై భవాంబుధి మునింగి యున్న సర్వ భూతంబులందును నత్యంత దయాళురైన కొందఱు నీ భక్తులు, శ్రవణకీర్తనాది రూపంబైన భక్తి మార్గంబు లను నావను దమ యంతరంగ శిష్యుల కొసఁగి నీ పరమ పదంబుఁ బ్రాపించిరి. దేవా! యిట్లు నీవు సర్వదా సత్పురుషుల

* ఆధి = మనః పీడ; వ్యాధి = దేహ పీడ.

నను గ్రహించు స్వభావము కలవాఁడవు గదా. అరవింద లోచనా! యెల్లెట్లో మనుష్యా ద్యుత్తమ స్థానంబులఁ బొందిన యితరులు కొందఱు మేము ముక్తులమని తమలోఁ దామే వృథాభిమానులై తలంచుచు నీయందు భక్తి లేని కారణంబుచే నవిశుద్ధబుద్ధులై నీపదంబుల ననాదరించుటం జేసి మరలఁ గ్రిమికీటకాది రూపంబు లెత్తుచు నధోగతుల పాలగు చుందురు. మాధవా! నీయందు బద్ధ సౌహార్దులైన నీభక్తులు నీవలన రక్షింపఁ బడుచు విఘ్నకారణముల నెల్లఁ గాలిక్రింద నణఁగఁ ద్రొక్కి నిర్భయులై విహరించుచు సన్మార్గము నుండి యెప్పుడును దొలఁగరు.

మహానుభావా! జగతీ పాలనార్థంబుగను భక్తజనులు సులభంబుగ నుపాసించి శ్రేయస్సు నొందుటకును సత్త్వము విశుద్ధము నగు రూపంబుల ధరించి వేదక్రియల చేతను, యోగము తపస్సు సమాధి చేతను నిన్ను సంతుష్టుఁ జేయు వారలకు వారివారి కర్మంబులకుఁ దగు ఫలంబుల నిచ్చి రక్షింతువు. శుద్ధ సత్త్వాత్మకంబగు నీ యీదివ్య మంగళ విగ్రహంబును గోచరింపఁ జేయవేని మా బోంట్లకు విజ్ఞానమెట్లుదయించు? భేదజ్ఞాన మెట్లు లయించు? మహాత్మా! నీగుణంబుల చేత నీవు లోకంబుఁ బ్రకాశింపఁ జేయుదు వా గుణంబులచేత భగవంతుఁడవు నీ వొక్కఁడ వున్నాఁడవని యూహింపఁ బడు చున్నాఁడవు. వేద వాక్యంబుల చేతను దానిననుసరించు మనస్సు చేతను నూహింపఁ దగు వాఁడవు. సర్వ సాక్షియు నగు నీవు నామ రూపంబుల చేతను గుణకర్మజన్మాదుల చేతను నిరూపింపఁబడని వాఁడవయ్యు వైదిక క్రియలందు నారాధింపఁ బడుదువు. నిన్ను నుపాసించు వారికి నీవు గోచరింతువు. నీ దివ్యమంగళ నామ రూపంబుల నాలకించుచు వర్ణించుచు స్మరించుచుఁ జింతించుచుఁ భవత్పాదారవిందంబులపై మనస్సు నిల్పువాఁడు మరల జన్మంబులకు రాఁడు. హరీ! యీశ్వ

రుండవైన నీకుఁ బడంబైన భూమి భారం బంతయు మా యదృష్ట వశంబున నీవు జన్మించుటం జేసి తొలఁగెను. మా యదృష్టంబున శుభా సహంబులైన భవ త్పాదారవిందంబులచే నంకితంబులై నీచే ననుగ్రహింపఁ బడిన భువి దివులను దర్శించు భాగ్యంబునుం గలిగె. అథవా! భవదీయ జన్మంబులకు లోకంబుల ననుగ్రహించు కరుణయే కారణంబని తలఁతుము. అవిద్యయుఁ గర్మంబులును నిన్నెఱుంగని జీవ జంతువులకు జన్మ కారణంబు లగుఁ గాని నీవు వానికి వశపడవు. మత్స్య, హయ, కచ్ఛప, వరాహ, నృసింహ, హంస, క్షత్రియ, బ్రాహ్మణ, విబుధులందు నవతరించి భూభారంబుఁ బాపి లోకంబును మమ్మును రక్షించినట్లు నేఁడును యదువర్యుండవై యవతరించి ధరణీ భరం బణఁపుము. దేవా! మా నమో వాకంబులు గ్రహింపుము.

అని స్తుతించి దేవకీ దేవింజూచి తల్లీ! నీ యుదరంబునఁ బరమ పురుషుం డైన భగవంతుఁడు శ్రీమన్నారాయణుం డున్నవాఁడు. క్షీణాయువైన కంసు వలన మీకు భయంబు గలుగదు. నీ కుమారుఁడు యాదవ రక్షకుండగు. తల్లీ! తల్లి వనిత నీవు గాక తక్కినవారు తల్లులా? నీవెంత మహాభాగవో లోకముల నన్నిటిఁ దన యుదరంబున నుంచుకొని యుండు సనాతనుండు నీ గర్భ గోళంబున వసించి యున్నవాఁడు. అని తమ శక్తి గొలఁది భగవంతుని స్తుతియించి యశోద నూఱడించి గౌర వించి బ్రహ్మాదులు మున్నుగ దేవతలు తమ తమ లోకంబులకుం జనిరి.

## — : శ్రీ కృష్ణావతార ఘట్టము. : —

అయ్యది శ్రావణమాసంబు వర్షాసమయంబు. దుర్జన వ్యాప్తిచే లోకంబు పాపభూయిష్ఠం బయినట్లు కాఱుమేఘంబు లాకాశంబు నిండఁగ్రమ్మఁ జిమ్మచీఁకటులు సూచీభేద్యంబు గాకయుండె. సాధు వుల కన్నీటి ధారల వలె వర్ష ధారలు రాలుచుండె. పుణ్యాత్ముల పోలిక

గ్రహనక్షత్రంబు లెందో దాఁగి నిస్తేజంబులై యుండె. దుష్టుల పరుష భాషణంబులం బోలె మేఘ గర్జనంబులు హృదయ స్ఫోటంబు గావించు చుండె. క్రూరులం గన్నయట్లు లోకులు వలిగాలికి వజ వజ వణఁకు చుండిరి. అంత నష్టమ మాసంబున దేవకీ దేవికి నీళ్లాడఁ బ్రొద్దులయ్యె. సాధువుల యానంద బాష్పములో యనఁ జిత్రంబుగఁ బుష్ప వర్షంబు గురియఁ దొడంగె. దుర్జనవ్యాప్తి యణంగిపోవు నన్నట్లు మేఘంబులు విచ్చె. సజ్జనుల మనంబులవలె దిక్కులు ప్రసన్నంబు లయ్యె. సాధుజన వ్రాతంబురీతి గ్రహ నక్షత్రంబులు నిర్మలంబులై నిండు తేజంబునఁ బ్రకాశించె. సజ్జనాలాపంబులు మీఱు నన్నట్లు మేఘంబులు శ్రవ్య నాదంబుల నిచ్చె. కమ్మని చల్లని తెమ్మెర మెల్లగ వీచి జనుల యుల్లంబులు పల్లవింపఁ జేసె. సప్త సముద్రంబులు తమలోన తా ముప్పొంగె. ధరణీ రుహంబులు లేఁజిగుళ్ళ నుక్కలికా వికాసంబు నెఱసె. కమలాకరంబు లట్లు కమలాకరంబులం నవ నవ కాంతి శోభాయ మానంబు లయ్యె. నదులంగు నిర్మల వారి పూరంబులు ప్రవహించె. తేనె వాఁకలఁ దేంట్లు హల్లోహలంబు లగుచుండె. * సకల విహంగ మంబులు శ్రవ్య నాదంబుల నిచ్చె. జగంబు నీరజం బయ్యె. సర్వభూత మయుండైన నారాయణుండు మూర్తిమంతుండై దోఁచెడు హేతువున సర్వ భూతంబులు ప్రీతంబులై వికసన భావంబు వహించె. అంత నష్టమ మాసంబున దేవకీ దేవి సంకటపడి జగంబు సంకటంబు హరింప గల కుమారుఁ గనియె. అప్పుడు సంతోషంబున గంధర్వులు పాడిరి. అచ్చరలాడిరి. సిద్ధ కిన్నర కింపురుష హాదులు మింట గుమి గూడిరి. చారణాదులు భయము వీడిరి. దేవ దుందుభులు మొరసె. పుష్ప వృష్టి గురిసె. సాధుల మనంబుల నట్టిట్టి దనరాని సంతోషంబు నెరసె. ఇట్లు ద్వాపరాంతమున విరోధి (విశ్వావసు) సంవత్సరమున

---

* హల్లోహలంబులు = మునిఁగి తేలుటలు.

శ్రావణ మాసంబునఁ గృష్ణపక్షంబున నవమీ విద్ధగల యష్టమీ తిథిని రోహిణీ నక్షత్రంబున బుధవారంబున వృషభ లగ్నమున గాఢాంధకారంబగు నర్ధరాత్రంబునఁ దూర్పు శిరస్సు గలవాఁడును, పశ్చిమ దిక్కునఁ బాదములు గలవాఁడును నై తూర్పున నుదయించు చంద్ర బింబమో యన జగత్పద్మ వికసనార్థం బచ్యుతభానుఁ డుదయించెను.

రుక్మిణి — అప్పా! శ్రీకృష్ణమూర్తి పుట్టి యిప్పటి కెన్ని యేండ్లు?

తండ్రి — ౫౦౨౧ సంవత్సరము లందురు. ఆ కాలంబున గ్రహసంపత్తి,

| | | | |
|---|---|---|---|
| గు | రా | లగ్న | |
| | | | |
| కు | | | ర చం |
| | | శని శుకే | బు |

మేషంబున - రాహువు,
సింహంబున - రవి, చంద్రుడు,
కన్యయందు - బుధుఁడు,
తులయందు- శని శుక్ర కేతువులు,
మకరంబునఁ - కుజుఁడు,
మీనంబున - గురు వుండెనని దివనాథుఁడను నుజ్జయినీ జ్యోతిషుఁడు వ్రాసి యున్నాఁడు.

రుక్మిణి— ఎనిమిదవ నెలలోఁ బుట్టిన బిడ్డ బ్రతుక దందురే. కృష్ణుఁ డెట్లు బ్రతికెను?

తండ్రి—మానము గర్భవాస నరక మనుభవించుట భూమి మీఁదఁ బుట్టుట యనునవి మనము చేసిన పాపముల కొలఁది ఘటిల్లును. గర్భవాస నరకము మాత్ర మనుభవింప వలసి యుండిన జీవుఁడు గర్భమున నెనిమిది నెలలుండి పుట్టి వెంటనే చచ్చును. ఆ ఋణ మంత మాత్రమే. శ్రీకృష్ణుఁడు పాపముల ననుభవింపఁ బుట్టిన వాఁడా? భగవంతునికే యపాయము గలుగును? ఎనిమిదవ నెలలోఁ బుట్టుటకుఁ గారణము లేక పోలేదు. ముందు పుట్టిన బిడ్డలందఱు నెలలు తొమ్మిది నిండిన తరువాతనే పుట్టిరి. అట్టిదే యిది యగునని కంసుఁడు నమ్మి యుండెను. తొమ్మిదవ నెల పుట్టియుండెనా వాఁడే సర్వకాల సర్వావస్థలఁ

గత్తిదూసికొని యుండే కాచుకొని యుండును. ఎనిమిదవ నెలలో బిడ్డ పుట్టదని, పుట్టినను నది బ్రతుకదని తలఁచి కంసుఁ డేమఱి యుండెను. కావలి వాండ్రు నేమఱి యుండిరి.

రుక్మిణి—అప్పా! రాత్రియందు జననము గావునఁ జంద్ర బింబము వలె నని చెప్పుట బాగున్నది గాని సూర్యుని వలె నని చెప్పుట బాగుగలేదు. అర్థ రాత్రమున సూర్యుం డుదయించునా? పద్మములు వికసించునా?

తండ్రి—మేలు మేలు. అలంకారములు గూడ గ్రహింపఁ గలిగితివి. శుక పరాశరులు చెప్పిన మాటలు నేను జెప్పితిని. నిందుచంద్రుఁడని చెప్పుటచే సౌమ్యము నాహ్లాద కరత్వము లోనగు శాంత గుణములు గలవాఁడని తెలియ వలయును. సూర్యుఁడని చెప్పుటచేఁ దేజో విశేషమును, లోకమను పద్మమును వికసింప జేయుచు నరుటచే లోకమున దుష్టవధ గావించి యజ్ఞానమను చీఁకటిచేఁ ముకుళించి యున్న జన హృదయ పద్మములను జ్ఞానోపదేశ మను వెలుఁగుచే వికసింపఁ జేయునని గ్రహింప వలయును. కృష్ణ భగవానుఁడు గీతాచార్యుఁడు కదా. అంతియ కాదు. సూర్యుఁ డుదయించె నన నేమి? అంతకు ముందు లేని సూర్యుఁ డున్నట్టుండి యెక్కడ నుండియో వచ్చెనా? మనకుఁ గనఁబడక ముందు సూర్యుఁడు లేఁడా? సూర్యుఁ డస్తమించె నన సూర్యుఁడు లోకము లోనే లేకుండఁబోయె నని యర్థమా? కాదు. లంకయందు సూర్యుఁ డస్తమించు చుండ సిద్ధపురంబున సూర్యుఁ డుదయించు చుండునని మన జ్యోతిష గ్రంథమునం దున్నది. భూలోకమున సూర్యుఁ డొకచోట నుదయించు చుండిన మఱియొక చోట మధ్యాహ్నము గను మఱియొకచోట సాయంకాలము గను వేఱొక్కచోట నర్ధరాత్రి

ముగ నుండును. మన కన్నులకుఁ గనఁబడని మాత్రమున సూర్యుండే యంతకుముందు లేఁడని యెట్లు చెప్పరాదో యట్లే కృష్ణుఁ డవతరింపకముం దాయన లేఁడని మనమంద అము పుట్టినట్టులే యాయన పుట్టెనని చెప్పరాదు. మనకుఁ గానరానిసూర్యుఁడు మన కన్నుల కుదయమున గోచరించునట్లు మనకుఁ గనఁబడని భగవంతుఁడు మన కీరూపమునఁ గానవచ్చె నని తలంప వలయును. ఆకారణముచేఁ గృష్ణుఁడు సాక్షాద్విష్ణువే యని మునుల యభిప్రాయము. సాక్షా ద్విష్ణు వగుట చేతనే కదా ప్రాకృత శిశువులకు వలె గర్భ మలము కలయు మాగును లేక జనించెను. ఉదయా స్తమయములు సూర్యున కున్నట్లు మనకుఁ దోఁచునే కాని సూర్యునకువాస్తవముగ లేనట్లు భగవం తుఁడు జన్మించి నట్లు మనకుఁదోఁచునే కాని నిక్కముగ నాయ నకు జన్మాదులు లేవు. తరువాత విను.

ఇట్లు లాయింటికి దీపము వోలె నాలుగు భుజముల తోడను దివ్యాయుధముల తోడను దివ్యతేజము తోడను నుదయించి వెలుంగు చున్న కుమారుం గాంచి యబ్బాలుండు లోకపాలుం డైన సాక్షా ద్భగవంతుఁడని యుప్పొంగి వసుదేవ్రుం డట్టి తన స్థితియం దేమియుఁ జేయజాలక కన్నీట స్నానముచేసి మంచికాలము వచ్చిన నిచ్చెద నని పదివేల గోవులను బ్రాహ్మణులకు మనస్సునందే ధారవోసెను.

రుక్మిణి—అప్పా! సాక్షాద్భగవంతుఁ డంటివే భగవంతుఁ డా మూ రెండు పిల్లవాడా? అప్పుడు భగవంతుఁడు మరెక్కడ లేఁడా?

తండ్రి—భగవంతుఁడు సర్వ కాలములందు సర్వ పదార్థములందు నంతర్యామియై యుండును. ఆయన లేనిచోటు పరమాణు వైనలేదు. ఆవేశా వతారములని యను ప్రవేశావతారము లని యవతారములు పెక్కు విధములు. ఈవిషయ మాంధ్ర

వాల్మీకి రామాయణ వ్యాఖ్యాన పీఠికయందు వ్రాయబడి యున్నది కదా. బాగున్నప్పు డొకతె తినలేని యన్నమును దినుట నెత్తజాలని గుండు నెత్తుటయు లోనగు దుర్ఘటకార్యములను దయ్యా మావేశించి నపుడు చేయుట కలదు గదా. అట్టులే సామాన్య మనుష్యశక్తికి మించిన కార్యము చేయ వలసి వచ్చినప్పు డొక మనుష్యుని యందు గార్యసాధనమునకుఁ గావలసినంత తన తేజము ప్రవేశింప జేసి భగవంతు డాకార్య మొనర్చును. ఆకార్యము కాగానే తేజము నుపసంహరించును. ఇట్టి యవతారములందు దేహము పాంచభౌతికమైన మనుష్య దేహమే. తేజస్సు భగవంతునిది. సాక్షాద్భగవంతుఁ డున్నప్పుడు మనకు గనబడు దేహము కూడ నప్రాకృతమె. విష్ణుమాయచేత మనకు నది మన దేహమువలె గనబడు చుండును. కానవచ్చు నీమూర్తియందు ప్రకృతి సంబంధము లవమైన లేదు, భగవంతుడు మూరెడు పిల్లవాడు గాడు. కారాగృహమునుండి మరియొక్కఁడను లేకుండిన వాడును గాడు. సూర్యుని మనము చూడఁజాలముగదా. అట్టి సూర్యుడు తనబింబము నాకాశమంద యుంచి కించిత్తేజముతోఁ గుంతియింటికి రాలేదా? సూర్యమండల మంతయుఁ గుంతి యింటికి వచ్చిన నిల్లుపట్టునా? దేశము మసికాక నిలుచునా? కుంతి బ్రతికి యుండునా? గ్రహములకే యట్టిశక్తి యుండ భగవంతున కుండుట యేమి చిత్రము? మన మేలు గోరియే మనకు భగవంతుడు పూర్ణముగ గోచరింపడు. వారివారి యోగ్యత కొలది భక్తులకు నెంత మాత్ర మవశ్యమో యంతయే గోచరించును. సర్వశక్తియుక్తుండైన భగవంతున కేది యసాధ్యము. తరువాత విను. ఇట్లు వసుదేవుండు దానంబు చేసి మనస్సమాధానంబు

కల్పించుకొని పురిటిల్లు వెలుఁగఁజేయుచుఁ బ్రకాశించు నమ్మాహాత్మ్య మహిమ యెఱింగినవాఁడు కావునఁ గంసువలని భయంబు విడిచి భక్తిని గేలుదోయి ముకుళించి యిట్లని స్తుతించె. దేవా! నీవు ప్రకృతికంటెను బరుండవైన సాక్షాత్పరమపురుషుండ వనియునుఁ గేవల జ్ఞానానంద స్వరూపుఁడ వనియు, సర్వజ్ఞుండ వనియు నెఱుంగఁ బడెదవు. అట్టి నీవే కదా తొలుత నీప్రకృతిచేఁ ద్రిగుణాత్మకంబైన యీజగంబు సృష్టించి తరువాత దానియందుఁ బ్రవేశింపకయుఁ బ్రవేశించినట్లు భావింపఁ బడెదవు. ప్రకృతివికారాత్మకంబులైన మహాదహంకార *తన్మాత్రలను నేఁడును వాని వికారంబులైన స్థూల శరీరాదులతోడను నింద్రియముల తోడను బురుషు తోడను గూడి నానావీర్యంబులై నొకదానితో నొకటి మిళితమై పోఁజాలక వేఱువేఱై యొండొంటి డాయుట చేరుట మాత్రము కలవై బ్రహ్మాండమును గలిగించి యందుఁదాము జనించినట్టులు తోఁపఁజేయ నందు నంతర్గతంబులై కనుపట్టుచున్నవి గదా. అయినను బ్రహ్మాండోత్పత్తికిఁ బూర్వమే యవి యుండుటజేసి యండంబా పృథివ్యాదులఁ యుత్పత్తికిఁ గారణంబు కాజాలదు. అట్టులే నీవును నీ జగంబునఁ బ్రవేశింపకయుఁ ప్రవేశించినట్టులు కానవచ్చెదవు. స్వరూపాదిజ్ఞానముచే నూహింపఁదగిన రూపంబులుగల దేవమనుష్యాది పదార్థములఁ గూడియుండియు వాని యింద్రియములచే నీవు గ్రహింపఁబడవు. ఎట్టులన నొకఫలమును జూడ శక్తిగల కన్నులు దాని యందలి రుచి గ్రహింపలేదు గదా. అట్టులే నీవును బదార్థములఁ గూడి యుండియు నతీంద్రియుఁడ వగుట నింద్రియములచే గ్రహింపఁబడవు. వానికి వశుఁడవునుగావు. అంతియకాక యింద్రియములకుఁ బూర్వమే యునికిగల నీకు నింద్రియములఁ బ్రవేశించుటన నెట్టిది? గూండ్లయందు

---

*తన్మాత్రలు = సూక్ష్మమహాభూతములైదు.

వానికంటె నల్పంబులై పరిమితకాయంబులుగల పక్షులకుం బ్రవేశంబుఁ జెప్పినట్లు నీకుఁజెప్ప రాదు. ఏలన నీ వావరణ రహితుండవు. సర్వాత్ముఁడవును. ఆత్మవస్తువునగు నీకుఁ గొలఁది చెప్ప రాకుండుటచే నీకు వెలియనునది లోపలయనునది లేదు. ఇఁక నీకు దేనియందుఁ బ్రవేశము కలుగును? ఆవరణము లేనివాఁడవని యెట్లు లనెద వనిన సర్వస్వరూపున కావరణ మేది యగు? నీవు జీవునివలెఁ గర్మాయత్తమైన సంకోచ వికాసములు గల జ్ఞానము గలవాఁడవు కావు. సర్వదా యసంకుచితము నపరిచ్ఛిన్నము నగు జ్ఞానము గలవాఁడవు. ఆత్మస్వరూపంబె నిత్యంబగుట స్వస్వరూప వ్యతిరేకంబుగ నాత్మభోగ పదార్థములు నిత్యంబు లను నపండితుని వాక్యంబు లనువాదంబు లేక యంగీకరింపరాదు. ఏలన ననిత్యంబులని వివేకులు పరిత్యజించినవానిని వాఁడు స్వీకరించు చున్నాఁడు. సంకల్పేతర వ్యాపార రహితుండవును సత్వాది గుణత్రయ రహితుండవును వికారరహితుండవు నగు నీవలన జగత్సృష్టిస్థితి సంహారము లగునని దేవా! చెప్పుదురు. ఇట్లు చెప్పుట యీశ్వరుఁడవును బరబ్రహ్మమునగు నీయెడ విరోధింపదు. శరీర మొనర్చు కార్యముల కర్తృత్వము శరీరికిఁ జెప్పునట్లు విన్నాశ్రయించియుండు గుణంబులొనర్చు కార్యములు నీవొనర్చునట్లు చెప్పినఁ దప్పేమి? నీమాయచే లోకరక్షణార్థంబు శుక్లవర్ణంబును, సృష్టినిమిత్తము రక్తవర్ణమును, బ్రలయమునకుఁ గృష్ణవర్ణమును ధరింతువు. అఖిలేశ్వర! యీ లోకరక్షణార్థంబు మా యింట జనించి రాజు లనుపేరఁ బుట్టిన రాక్షస కోటుల చమూ సమూహముల నిర్మూలింపఁగలవు. నీవు మాయింటఁబుట్టెదవని దుష్టుఁడైన కంసుండు నీయన్నల నెల్లఁ బిలుకుమార్చె. ఇప్పుడు నీవు జనించిన వార్త తనసేవకులచే నెఱింగినంత మాత్రన కృపాణపాణియై యీ యసభ్యుండు నీపైఁ బఱతెంచునని స్తుతింప మహాపురుషలక్షణలక్షి

తుండగు సుతుంజూచి దేవకి కంసుం దలంచి భీతిల్లియు మందహాసంబు మోమున నంకురింప నిట్లని స్తుతించె.

—: దేవకీ దేవి కృష్ణు నుతించుట :—

దేవా! వేదాంతులే రూపంబును *నవ్యక్తమనియు నాద్యమనియు బ్రహ్మమనియు జ్యోతియనియు సర్వగుణంబనియు నిర్వికారమనియు సత్తామాత్రమనియు నిర్విశేషమనియు నిరీహమనియుఁ జెప్పుదురో యట్టియధ్యాత్మ దీపంబనయిన సాక్షాద్విష్ణుఁడవు నీవ. బ్రహ్మప్రళయ వేళ లోకంబులు లయంబు నొందఁ గాలవేగంబునఁ బృథివ్యాది మహాభూతంబులు వానివానికిఁ గారణంబులైన భూతంబులయందుఁ గ్రమంబుగ లయించి యాదిభూతంబైన యహంకారంబునను, నది ప్రధానంబునను, లయింప శేషసంజ్ఞుఁడవై నీవొక్కఁడవ మిగిలెదవు. అవ్యక్తబాంధవా! నిమేషము మొదలుగను సంవత్సరము తుదగను గలిగి యేకాలము విశ్వమును బ్రవర్తింపఁ జేయు నట్టికాలము నీచేష్ట యని పెద్దలందురు. ఈశానుండవును క్షేమ స్థానంబవునగు నిన్నుశరణు చొచ్చితిని. మృత్యు వను మహాసర్పంబునకు వెఱచి మర్త్యుండు లోకంబులం దెల్లఁ బరువుపాఱి యెందును భయంబు దిందుపడక యాదృచ్ఛికంబుగ నీ పదారవిందంబుల నాశ్రయించి మృత్యు భయంబుఁ బాసి హాయిగ నిర్భయుండై యుండు. అట్టినీవు నీభృత్యుల

* అవ్యక్తము = కన్ను మొదలగు నింద్రియములచే గ్రహింపరాక యదృశ్యమై యుండునది. అద్యము = అన్నిటికిఁ గారణభూతమగుటచే మొదటిది నిర్గుణము = సత్త్వాదిగుణములు లేనిది సత్తామాత్రము = వృద్ధిక్షయాదులులేక యెల్లప్పుడు నేకరీతి నుండునది. నిర్విశేషము = ఆకాశాది భూతపంచకము గుణములైన శబ్దస్పర్శాదులు లేనిది. జ్యోతి = ఇతర సాహాయ్యములేక స్వయముగ వెలుఁగునది నిర్వికారము = శోక మోహాది వికారములులేనిది. నిరీహము = పుణ్యపాపములు లేనిది. అధ్యాత్మదీపము = ఆత్మయందు దీపమువలె నసంకుచితము ధర్మభూతంబైన జ్ఞాన మాకారముగాఁ గలది.

కోరికలెఱింగి వారిభయంబుఁ బాపువాఁడవు గదా. శ్రేష్ఠుండైన యుగ్రసేనసుతునకుం జడిసి యలజడిపడు మమ్ము రక్షింపుము. దేవా పరమ పురుష సాధారణంబును యోగిజనులు ధ్యానకాలంబున నాశ్రయించుచునదియు నగు నీ యీ రూపంబును మాబోఁటివారల మాంస చక్షువులకు గోచరింపఁ జేయకుము. మహానుభావా! నీవు నాయందుదయించినవార్త కంసుండు వినకుండెడుఁ గాక. వానివలన నీ కేమి యెడరు గలుగునో యని నీనిమిత్తంబుగ ధైర్య మెడలి యడలుచున్న దానను. విశ్వస్వరూపా! శంఖ చక్రగదాపద్మ శ్రీలచేతను నలుభుజంబులచేతను విరాజిల్లు నీ యీ యలౌకికస్వరూపంబును నుపసంహరింపుము. ప్రళయావసానంబున సకలజగత్స్వరూపి యందు సమస్త విశ్వంబును నీయందు ధరింతువు. అట్టి విశ్వగర్భుండ వగునీవు నా యుదరంబునఁ బుట్టినట్టు నరుల ననుకరించెదవు. ఔరా నీ నరలోక విడంబనము.

— { శ్రీకృష్ణుండు దేవకీవసుదేవులకు వారి పూర్వవృత్తాంతము దెలుపుట. } —

అంత భగవంతుఁ డామెను జూచి యిట్లనియె. దేవీ! నీవు స్వాయంభువ మన్వంతరంబునఁ బృశ్ని యను పరమపతివ్రతవు. వసుదేవుండును సుతపుఁడను ప్రజాపతి. మీ రిరువురు పండ్రెండువేల సంవత్సరంబు లత్యంతనిష్ఠ ఫలపత్రాశనులై నన్ను నర్చించితిరి. మీ భక్తికి మెచ్చి నే నీ స్వరూపంబునఁ బ్రత్యక్షమై వరముఁ గోరుఁడనిన మీరును సంసారంబువలని తగులు పాయని కతంబున నా మాయకుఁ జిక్కి మోక్షంబుఁ గోరక నావంటి పుత్రుని గోరితిరి. నేను నట్లే యని యంగీకరించి శీలౌదార్యగుణంబుల నా యట్టివాఁడు మఱియొకఁడు లేమిం జేసి నేనే మీకుఁ బృశ్నిగర్భుఁడను పేరఁ గొమరుండనై జనించితిని. మఱియొక జన్మంబున మీ రదితి కశ్యపులుగా జన్మించినపుడు

నేను వామనుండనై మీ సుతుండ నైతి. ఇది మూఁడవ జన్మము. ఇట్లు నామాట యథార్థపఱచి మీ కోరిక దీర్చితి. పూర్వజన్మ స్మరణము గలిగి మీరు కృతార్థులగుటకు నే నిప్పు డీ రూపము మఱలఁ జూపితి. అటు కాదేని నా విషయమైన జ్ఞానము మర్త్యులకుఁ గలుగదు. ఇఁక మీఁద నేను మీ కుదయింపను. నన్ను మీరు నందనుఁడనియుఁ బర బ్రహ్మమనియుఁ దలంచుచు నా పరమపదంబు నొందెదరు. నిరంతర ధ్యానంబుకతన మీరును ముక్తులయ్యెదరు. మీకును నిఁక జన్మములు లేవని భగవంతుండు మఱియు నిట్లనియె.

కంసువలన నాకు భయము కలుగునని మీరు భయపడెదరేని యిట్లు సేయుఁడు. నన్నుఁ గొంపోయి గోకులంబుననుండు యశోద యొద్దఁ జేర్చి యందు యశోదకుఁ గూఁతురై పుట్టిన నా మాయను వేగంబ యిటఁ జేర్పుఁడు. ద్వారములెల్లఁ దమంతఁ దామే మీకు మార్గ మిచ్చును. యమునయు మీకుఁ గాల్నడకుఁ ద్రోవ యొసగును. అని తరువాత జరగవలసిన కార్యంబుల తెఱంగు వసుదేవునకు దెల్పి యా దివ్యరూపంబు విడిచి సామాన్య బాలకుండును బోలె గొన్ని వినోదములు చేయఁ దొడంగెను.

— : శ్రీకృష్ణుండు గోకులంబులఁ జేరుట. : —

ఏసమయంబున నిచట దేవకి శ్రీకృష్ణునిఁ బ్రసవించె నాసమయమంద మందయందు నందుని సుందరి యశోదకు యోగమాయ పుత్రికయై జనించె. మందలవారిని దల్లిదండ్రుల నెల్ల మాయగప్పిన నందలి వా రేమియు నెరుగక నిద్రించుచుండిరి. వసుదేవుండును భగవంతుఁడు తనకు బోధించినప్రకార మా కుమారు నెత్తుకొనిపోవ నుద్యమింపఁ గాలి సంకెలలు తమంతట వీడెను. పదిలంబుగ బిగించిన తలుపుల బీగంబులు తమంత నూడిపడెను. కావలివారును నూరివారును విష్ణుమాయవలన మోహితులై రాముని వెంట బోయిన

పాఱులవలె నొడలెఱుఁగక కూర్కుచుండిరి. దాని కచ్చెరు వందుచు నచ్చిఱుతపాపనిఁ బొత్తిగుడ్డలఁ బొదివి వసుదేవుండు మెల్లనఁ జప్పుడు గాకుండునట్లు వాకిం డ్లన్నియు దాటిపోయెను. మెల్లని యుఱుములతోఁ బలుచని చినుకులతో మేఘములు వర్షించుచుండ నాదిశేషుండు వసుదేవుండు ద్వారంబు దాఁటుట యాదిగాఁ దనపడగల బుడుతనికి ఛత్రమువలెఁ జేసి వెనువెంబఁ జనియె. శ్రీరామునకు సముద్రమువలె యమునయుఁ దెరువిచ్చిన వసుదేవుఁడు దానిదాఁటి చనిఁ యశోద పురిటిల్లు చొచ్చి తనకుమారు నామెప్రక్కఁ బరుండఁ బెట్టి యా యాఁడుశిశువు నెత్తికొని క్రమ్మఱివచ్చి దేవకీ ప్రక్కనుంచెను. మరలఁ దాళంబులన్నియుఁ దమంతఁదామ యెప్పటియట్ల బిగుసుకొనియె. సంకెలలును మరలఁ దొల్లిటివలెఁ బదంబులఁ దగులుకొనిన వసుదేవుఁ డేమియు నెఱుంగనివానివలె భయపడుచు నొదిగిన ట్లొకచోట నుండె.

రుక్మిణి—అప్పా! యిప్పుడే కదా వసుదేవుఁడు గాడిదకాళ్లు పట్టుకొనినది?

తండ్రి—అవును. దేవకి నొప్పులు పడుచుండఁగనే కంసుఁడు కావలి యుంచిన గాడిద కూయుటకుఁ బూనిన వలదని వసుదేవుఁడు దానికాళ్లు పట్టుకొనెనని యొక పురాణమునఁ గలదు. ఆవలవిను

—: కంసుఁడు యోగమాయనుజంప యత్నించుట :—

ఆయాఁడుపిల్లయు నావురావురని యేడువ దొడఁగె. ఆ చప్పుడు విని చెఱసాల కావలివారు దగ్గనలేచి దేవకీదేవి ప్రసవించెరా రమ్మని వారిఁ దలఁచి దిగులున వగలఁ బొగులు కంసున కెఱిఁగించిరి. వాఁడు నదరిపడి వీడి వ్రేలాడు వెండ్రుకల ముడుచుచు నోపికయు లేక పాపచిత్తుండు బెడిదంబగు నడిదంబు గేలఁ బూని పరువునఁ జెఱసాల సొచ్చి హెచ్చిన మచ్చరంబున నచ్చిఱుతం బట్టి లాగిన దేవకియు నడ్డమువచ్చి యతని కరంబులు పట్టుకొని దీనవదనయై కన్నీరు

గాఱి వేడ్చుచు, నయ్యో యన్నయ్యా! కన్నులు తెఱవని యీపిన్న దాని నేలచంప సాహసించెదవు. ఇది నీకు మేనకోడలుగాని యల్లుఁడు గాఁడు. మగబిడ్డఁడైనఁగదా నీబ్రతుకునకుఁ బగతుఁడగు. ఈ యాఁడు కూన నిన్నేమి చేయఁగలదు? అయ్యో యాఁడుపిల్లను జంపుట రాజ ధర్మమా? బోయలైనను నిట్టి ఘోరకార్యమునకుఁ దెగరే. క్షత్రియ వంశంబునందు భోజకులంబునఁ బుట్టి యిట్టి కట్టిఁడివి గాఁదగవా? క్షమింపుము. అన్నా నేను నీకుఁ జెల్లెలను గదా. అయ్యా! నీచరణం బుల వ్రాలెద. సహింపుము. ఈ కూనను బొరిగొనఁ దలంచితివేని నన్ను ముందు చంపుము. అయ్యా! యిదివఱకు నార్గురఁ గొడుకులఁ బట్టిచంపితివి. నీప్రాణభీతి నీవు చేసెదవని మిన్నకుంటిని గాదే. ఇది యాఁడుపడుచు. నీ కోడలు. దీనివలన నీకే ప్రాణభయంబు గలదు? కటకటా యింతటి కఠినచిత్తమా? అన్నా! నేను దొలిజన్మంబునఁ బుత్రులకు నోఁచినదానఁ గాను. ఈ పుత్రీభిక్షయైన నిమ్ము. పుణ్యం బునఁ బొమ్ము. రాజేంద్రా! కోపంబు మానుము. కరుణఁబూనుము. అని దీనయై యక్కాంత యెంత వేఁడికొనినను వేఁడిమి దింపక యా వాఁడి మొక్కలీఁడు తన సేమంబు రోసి స్నేహంబుఁ బాసి చెల్లెలిఁ దిట్టి దిగువఁబడంద్రోసి యాపుత్రవత్సల చంటికొత్తికొనియుండు బిడ్డ నొడిసిపట్టిలాగి చంప నుద్యమించి కడకాళ్ళు రెండును గలయఁబట్టి నేలమీఁద బాఁద విసరియెత్తిన నబ్బాలయు నేలంబడక మొదుపున గగనంబున కెగసి దివ్యమాల్యంబులును దివ్యచేలంబులును దివ్యాం గరాగాభరణంబులును ధరించి గదా శంఖ చక్ర చర్మశర చాపాసి సాధనంబు లెనిమిది హస్తంబులఁ బూని సిద్ధగంధర్వ చారణాప్సరః కిన్నరాదులు కానుకలిచ్చి పొగడుచుండ మింటన నిలిచి హింసా నిరంతరుండగు కంసుం జూచి యిట్లనియె.

బాలిశా! బాలికను ననుఁ జంపఁ బూనితివి. దీన నీకు రాఁగల లాభ మేమి? స్త్రీని జంప నుంకించు తెంపరివి నీవుగాక లోకంబున

నెవ్వరును లేరు. ఓరి క్రూరచిత్తుఁడా! మత్తుండవై మిత్తికివెఱచి యీ మత్తకాశిని తనయుల నెల్లఁ జంపి శిశుహత్యా దోషంబునకుఁ బాలుపడితివి. అంతనైన శాంతివహింపక కాంతనగు నన్ను నంత మొందింప రాలపై విసరి మోద యత్నించితివి. ఇది క్రూరధర్మమా పురుషకర్మమా? ఓరి మూఢుఁడా! చెప్పెద వినుము. ఇంత మాత్ర మున నీకు మృత్యువు దప్పదు. నిన్నుఁ జంపువాఁడు నా తోడనపుట్టి మఱి యొండుచోటఁ బెరుగుచున్న వాఁడు. వానిచే నీకుఁ జావు సిద్ధంబు. బుద్ధిమంతుండవై మనుము. అని మాయమైపోయి నానా దేశంబు నానాకారంబుల నిలచె.

### — { కంసుఁడు తన యకృత్యంబునకుఁ బశ్చాత్తాప పడుట. } —

వాఁడి ములుకులఁ బోని యా వేఁడి పలుకులు విని యులికి కంసుఁ డదరి చేయునది లేక తాను జేసిన యకార్యంబునకుఁ గుత్సించుచు నాకాశవాణి తన్ను వంచించెనని తలంచుచు నిఁక దేవకీ వసుదేవులతోఁ గంటు వహించుట మేలుగాదని యెంచి వారి నల్లన వీక్షించి యిట్లనియె. అయ్యో చెల్లెలా! అయ్యో బావా! ఆకాశవాణి యాడిన మోసపు నుడుల నమ్మి యెంతటి యకార్యంబు మీకెంతటి ద్రోహంబు జేసితి. అనృతమాడువారు మర్త్యులే గారు. దైవము నసత్యమే పలికెను. ఆపలుకుల నమ్మి చెల్లెలబిడ్డల నెల్ల నుఱుమాడితి. అయ్యో! యెంతపాపుడను. ఎట్టి జీవన్మృతుఁడను. నేనెట్టి యధోలోకములపాలై పోవలసియున్నాఁడనో కదా. కటకటా నా కంటెఁ బాపాత్ముఁ డెవ్వఁడు. ఎట్టి కసాయియు నావలె శిశుహత్యచేసిన వాఁడు లేఁడే. నాయట్టి బంధుద్రోహి నాయట్టి దుశ్చింతనుఁడు నాయట్టి క్రూరుఁడు నాయట్టి జీవన్మృతుఁ డయ్యయ్యో లోకంబున నేఁడే. చెడితిని జెడితిని. ఉభయలోకంబులఁ జెడితిని. గాలిమాట

లకు మీనులిచ్చి యిట్టి యాఱడి పాలయితి. పుణ్యాత్ములారా క్షమిం పుఁడు. తల్లీ! మహాపాపిని, మోహాంధుఁడను. సహింపుము. బావా! కోపింపకుము. ఈ కృతాపరాధుని యెడ నీ పరమపాపియెడ సదయ హృదయులరు కండు. శమింపుఁడు. అని మఱియు నిట్లనియె.

నేను మీబిడ్డలఁ జంపితిననియు మీబిడ్డలు నాచేఁ జచ్చి రనియుఁ దలఁపవలదు. జీవకోటియంతయుఁ బూర్వకృత కర్మానుసారం బుగఁ బుట్టుచు గిట్టుచుఁ దత్తత్కర్మఫలంబుల ననుభవించుచుండును. కావున స్వకృతఫలంబు లనుభవించిన మీసుతులకై వెతపడవలదు. దైవాధీనంబులయిన జంతువులకు స్థిరవాసం బొక్కచో నేనాఁటికిని లేదు. వానివాని ప్రారబ్ధకర్మఫలంబుల వానివానికిఁ గూర్చు భగ వంతుఁ డన్యుల సాధనంబులుగఁ జేసికొనుచుండును. పృథివీ సంబం ధంబులైన ఘటాదులకు నుత్పత్తినాశము కలుగుచున్నను భూమికి నాశము లేనట్లు దేహములు పుట్టుచుఁ జచ్చుచున్నను దేహికి నా శము లేదు. కావున జననమరణంబులు స్వభావంబులైన దేహంబు లకుఁగాని జననమరణ వికారములులేని యాత్మకుఁగావని యెఱిఁగి బుద్ధిమంతుఁడు విషాదపడఁడు. కల్యాణీ! నీ పుత్రుల నేను జంపినను దేహులెల్లఁ గర్మపరతంత్రులై తమతమకర్మంబులఁ దామనుభవింతురని తలంచి దుఃఖింపకుము. ఆత్మజ్ఞానంబు మఱచుటచే నెంతవఱకు దేహి నేను జంపితిని నేను జంపఁబడితి నని తలంచు నంతవఱకు దేహము తాననుకొను మూఢుఁడు బాధించువాఁడు బాధింపఁబడువాఁ డను భావంబు వహించి దానివలనఁగలుగు శోకపాపాదికఫలంబు లనుభ వించుచుండు. శత్రువుల నేను జంపితిని శత్రువులు నన్నుఁ జెరిచిరి యను బుద్ధి బాలున కుండునుగాని పండితునకుఁ గలుగదు. ఆత్మకు రాగమును లేదు, ద్వేషమును లేదు. రాగద్వేషంబులకు మూలకార ణము కర్మబంధమే సుఁడీ.

పుణ్యాత్ములారా! మీరు సాధువులరు. బంధువత్సలులరు. అప

సాధుల క్షమించుట సాధులక్షణము గావున నన్ను క్షమింపుడు. అని కన్నీరుగార నాయిరువుర పాదంబులపై పడి లేవకున్న వారును బశ్చాత్తప్తుండైన యతనిపట్ల రోషంబు విడిచిరి. కంసుఁడును గన్యా వాక్యంబులనమ్మి వారి కాలిసంకెలల విప్పి వారిని విడిచె.

అంత వసుదేవుండును నవ్వుచుఁ గంసుని జూచి మహారాజా నీవు చెప్పినది సత్యము. అజ్ఞానంబున దేహులకు నహంభావ ముద్భయించును. ఆ యహంకారమునఁ దాను బరు లను భేదజ్ఞానంబు గలుఁగు. ఆ భేదజ్ఞానంబు వలన శోకము మోహము, సంతోషము భయము ద్వేషము లోభ మోహ మదంబులు లోనగువానికి వశులై దా మొకరిని జంపెద మనియుఁ దా మొకరిచేఁ జచ్చెద మనియుఁ దలంతురుగాని తత్తద్గుణానుసారంబుగ దేహాదులకు నాశహేతువు భగవంతుండని యెఱుంగరు. భగవంతుఁడె యొకభూతమును బ్రేరించి మఱియొకభూతమును జంపించు నని చెప్పినఁ గంసుండును సంతోషించి తనగృహంబున కరిగె.

—: కంసుండు మంత్రులతో నాలోచించుట :—

అంత నుదయంబునఁ గంసుండు తన మంత్రులనెల్ల రావించి యోగమాయ నుడివిన పలుకులు చెప్పిన విని రాక్షసాంశసంభవులై కార్యా కార్య వివేకహీను లగుట వారిట్లనిరి.

భోజ రాజేంద్రా! యట్లయిన మన మిఁకఁ జేయవలసిన కార్యము తెలిసియే యున్నది. నీకు విరోధియగు శిశు వెందుండునది తెలియరాలేదు. కావునఁ బట్టణంబులఁ బల్లెల నిల్లిల్లు వెదకి పురుడు దీఱినవారిని దీఱని వారిని చంటిబిడ్డల నెల్ల పేరు వారనక వధించితిమేని వారిలో నీశత్రుండును జచ్చు. అప్పుడు రణమనిన మరణమనిన వెఱచి పఱచు పిఱికి పందలు దేవత లేమి ప్రయత్నములు చేసియు నిన్నేమి చేయఁగలవారు? నీధనుష్టంకారంబు విని గుండెలు తటతట కొట్టుకొన

నీశాతశర వ్రాతపాతంబునఁ గాందిశీకులై దేహంబులమీఁది యాశ గేహంబులు విడిచి దిక్కులవెంట గడగడ వడఁకుచు నడుగులు తడఁబడఁ బాఱిపోయిన వారుగారె. కొందఱు శస్త్రంబుల నేలవైచి భీతులై నీకు నమస్కరించిరి. మఱికొందఱు గోఁచులూడఁ దలవెండ్రుకలు వ్రేలాడ 'భయపడితి' మని నోరువిచ్చి చెప్పిరి. ఇట్లు శస్త్రంబులు మఱచిన వారని బుల్లు కఱచిన వారిని రథంబులు విఱిగిన వారిని నేల నెఱఁగిన వారిని పాదంబులపై భయంబున నొఱగిన వారిని చాపంబులు దెగిన వారిని యుద్ధంబు చాలించిన వారిని జంపవైతివి. గేహేశూరులును, దూరంబు లేనితఱిఁ దమ్ముదాము పొగడుకొను వారును నగు దేవత లేమిచేయగలరు! వారుగాకున్న దేవశ్రేష్ఠులైన హరిహరబ్రహ్మలైన నీవేమియు వంపఁగలరే. ఎచ్చటనో సర్జన ప్రదేశంబుల హృదయగుహల దాఁగు హరియు, మనుజులు మిట్టాడని మంచుఁగొండ యడవులం బడి కాలంబుఁ గడపు శంభుండును, బలహీనుఁడైన యింద్రుండును, దపస్సులఁ గాలంబు పుచ్చు పితామహుఁడును నిన్నేమి చేయఁగలరు? అయినను వారు మనకు శత్రుపక్షమువారగుట నుపేక్షింపరాదు. రాజేంద్రా! చిన్నపామునైనఁ బెద్దకట్టెతోఁ గొట్టవలయు. ఇప్పుడు నీ శత్రుండు బాలుండని యాలంబు సేసితి వేని యల్పకాలంబున వాఁడే నీ కాలంబునఁ గాలుండగు. పగతు రణఁగి మణఁగి యెందో ప్రమందినట్లున్నవారని మందులై యుండ రాదు. వారు సమయము వేచి పైపడివత్తురు. గోటఁబోవుపనికి గొడ్డలి వెదుక వలసివచ్చును. పతిపక్షులు నామావశిష్టులగు నంతకు నుపేక్షింప రాదు.

కం. పుట్టిన యప్పుడె తడయక
నెట్టినను బగఱ రుజల నింద్రియములఁ దా
నట్టనఁ ద్రుంపఁగఁ దగు; దమ
గిట్టింపనివారి నవియె గిట్టించుఁ జుమీ!

కాలయాపనం బపాయకరంబు. పగతుండు హతుండగుట కొక యుపాయంబు చెప్పెదము.

దేవతలయందు ముకుందుండు ముఖ్యుఁడు. కావున నెట్లయిన నతనిఁ గనిపట్టి మట్టుపెట్టుటే శ్రేయస్కరము. విష్ణు వెందున్నాఁడని చంపుదు రనెదవా వినుము. ఎచ్చట సనాతనధర్మంబులైన వర్ణాశ్రమ ధర్మంబులు గోబ్రాహ్మణ తపోయజ్ఞంబు లుండు నందు ముకుందుండు నిలుచు. గోవులు బ్రాహ్మణులు శాంతి వేదము దయ సత్యము యాగము తపస్సు శమము దమము శ్రద్ధ యోర్పు నను నీ గుణంబు లన్నియు విష్ణుదేహంబులు. వీని నన్నింటిని సంహరించిన విష్ణుండునుం జచ్చు. కావున వీనికి నిలయంబులైన బ్రాహ్మణుల ఋషుల నెల్ల సంహరింప మా కనుజ్ఞ నొసఁగుము. నీకు శత్రుశేషంబు లేకుండ నొనర్చెదము. బ్రాహ్మణ వేషంబులఁ బోయి వర్ణాశ్రమధర్మంబులు వ్యర్థంబులు. ఉత్తమాధమ భేదబుద్ధి జనకంబు లగుట యసూయా కారణంబులు ప్రజాంతః కలహహేతువులు ననియు, శూద్రవేషంబులఁజని మన మందఱకన్న నీచుల మఁట. బ్రాహ్మణు లెక్కువ యఁట. వర్ణాశ్రమధర్మంబు లాత్మశ్రేష్ఠత్వము రక్షించుకొన నసూయాపరులైన బ్రాహ్మణులచేఁ గల్పితంబులు. అట్టివారి మాటల నేల పాటింపవలయును. ఇట్టి బ్రాహ్మణుల నెల్ల మట్టుపెట్టుటే కర్తవ్యంబని బోధించు వారికి బ్రహ్మద్వేషంబు కల్పింతుము. అటు చేసిన నేయూరివిప్రు లాయూరనే హతులగుదురు. కాదేని భ్రష్టులయి యడవుల పాలగుదురు. అని బోధించిన స్వభావదుష్టచరిత్రుఁడగు నతండు కాలపాశంబులఁ గట్టుపడి పాపంబునకు భయపడక యట్టుల కావింపుఁడని యాజ్ఞ యిడియె. వారును గామరూపధరు లగు ననేకరాక్షసుల నియమింప వారు యజ్ఞాదులు ధ్వంసము చేయుచు బ్రాహ్మణుల హింసించుచు సాధుల బాధించుచు ఘోరకార్యంబు లొనర్చుచుం

డిరి. సాధువులకుఁ గీడుగావించువారి యాయువు సంపద ధర్మము పుణ్యము శ్రేయము కోరికలు క్షీణించునుగావున వారి పాపంబులచే వారు తేజంబు గోల్పోవుచుండిరి.

— : నందవ్రజ వృత్తాంతము : —

అంత నక్కడ మందయందు నందుండు నందనుండు పుట్టుట యెఱింగి యానందంబున వేదజ్ఞులగు బ్రాహ్మణుల రావించి పుణ్యాహవాచనము జాతకర్మము నిర్వర్తించి స్నానంబుచేసి శుచియై యలంకరించుకొని పితృదేవతల నర్చించి యలంకరించిన రెండులక్షల ధేనువులను మణిసువర్ణ వస్త్రంబులతోడ నేడు తిలపర్వతంబులను సదక్షిణంబుగ వారికి దానంబిచ్చి చూడవచ్చిన బంధువుల సర్వవిధంబుల నాదరించె. స్నానాదుల నేమి ఫలమంటి వేని భగవంతు నుపాసించుటచే నాత్మయెట్లు పరిశుద్ధమై హేయగంధముఁ బాయు నట్లు సకాలంబున నియతిచొప్పునఁ జేయు స్నానశౌచంబుల దేహంబు శుద్ధమగు. జాతకర్మాది సంస్కారంబుల బిడ్డలు పరిశుద్ధు లగుదురు. అట్లులే మంత్రజపహోమాదుల నిలువేల్పులును, దపస్సుచే నింద్రియంబులు, దానంబుచేతఁ బశుహిరణ్యధనధాన్యములు, సంతుష్టిచే మనస్సు పరిశుద్ధములగు. మంగళవాక్యంబుల బ్రాహ్మణులును బౌరాణికులగు సూతులును, వంశావళీ పాఠకులైన మాగధులును, స్తుతిపాఠకులైన వందులును, ప్రశంసించిరి. మర్దలభేరీ దుందుభులు మొరసె. వ్రేపల్లె యంతయు నలుకులచే ముగ్గులచేఁ జిత్రధ్వజములచేఁ బతాకలచేఁ బూలదండలచే, లేఁజిగురుల తోరణములచే నలంకరింపఁబడెను. గోవులకుఁ గోడెలకు దూడలకు నూనెపసుపులు పూసి గైరికధాతువుల రంగులు రాచి నెమలిపురులను గొమ్ములకుం గట్టిరి. విలువగల వలువలచే నాభరణంబులచే నలంకరించుకొని కంచుకంబులు దొడిగి శిరంబులఁ బాగాలు చుట్టి కానుకలు గొని గోపాలు రెల్ల సందర్శ నార్థం బరుదెంచిరి.

గోపస్త్రీలును యశోద కుమారుఁ బ్రసవించెనని విని యందరు నానందంబున మేలిచీరలు కట్టి కుంకుము బొట్టులు పెట్టి కాటుక దిద్ది సొమ్ములు ధరించి గంధము లలంది విరులుఁ దురిమి యమ్మమ్మా యెంత పుణ్యమమ్మా యిప్పుడొక యెంత మేలివార్త వింటిమి. అక్కా మన యశోద యిపుడొక్క చక్కని చిన్నమగశిశువును గనెనట మేలుమేలు మనమందఱ మిపుడపోయిచూచివత్తము రారండు. అని యొండొరులు గలయఁ బలికికొని పల్లవ పల్లవాధరలు గుంపులై పెంపారు బంగారు పళ్ళెరంబులఁ గానుకలుగొని జవ జవలాడు నడుములతోఁ దూఁగాడు ముంగురులతోఁ గులుకు మెఱుంగున పయోధరంబులతో వచ్చి యచ్చిన్నినన్నిల వెన్నునిం జూచి సంతోషంబున నా గోపాలికలు బాలకా! నీవు మా కేలికవై మమ్ము దీర్ఘకాలంబు రక్షింపుమా యని వచించి యాశిశువునకు నీళ్ళుపోసి రక్షపెట్టి తడియొత్తి ధూపము వైచి తొట్లనుంచి జోలలు పాడిరి. ఎన్నండు కన్నుమూయుని యావన్నె కాఁడును నన్నెలంతలు నిదురపుచ్చ కనులదెఱవక నిదురించు వాని భంగి నటించు చుండెను. నందుండును బంధువులను బీదసాదులను విద్యల వలన జీవించు వారిని దగిన విధముగ సత్కరించి పంపెను. గోపస్త్రీ లొండొరులకుఁ బసుపులు పూసిరి. గోపకులు వెన్న పెరుఁగు లొండొరులపైఁ జల్లిరి. విశ్వేశ్వరాంశమునఁ గృష్ణుండు జనించుటం జేసి యాకాశంబున వింతధ్వను లెల్ల వినంబడియె. నందుండును బుత్రోత్సవ సమయంబున రోహిణిం జేరఁ బిలిచి వస్త్రాలంకారము లర్పించి మన్నించె. అమ్మహాభాగయు నిలువేల్పు విష్ణు నారాధించు కొఱకును దన పుత్రుని యభ్యుదయార్థంబును దివ్యవస్త్రాభరణాదులు ధరించి చరించె.

అది మొదలు మొదవుల కడుపులు పొదుఁగు పొదుపులఁ బొదలి యుండె. పసువులకు నీరుమేపు కొఱత పడదయ్యె. కొంచెము పిదుకు నావులును గుంచములకొలది పిదుకుచుండె. గొడ్డుటావులు బక్కగో

వులు కలువయ్యె. వసుల యొడ నీఁగవాసిలిన జాతి పోవునట్లుండె. నాలికుంటులు లోనగు తెగుళ్ళ పేర్లు మఱపాయె. ఎందుఁజూచిన లేఁబచ్చిక నవనవలాడుచుండె. చెట్టులకొమ్మలు మాందాళిచీరలఁ గైసేసికొనిన కొమ్మలవలె లేఁజిగుళ్ళచేఁ జలిరుటాకులచే పూపపిందెలచేఁ దియ్యని ఫలంబులచే గోముసుమీఱుచుండె. సర్పసత్త్వాది భయంబులు లేక గోవులు విచ్చలవిడి మేయఁబోవుచుండె. పాలు పెరుఁగు కడు రుచ్యంబయ్యె. మున్నుకన్న వెన్నలు మిన్నగ రాఁదొడంగె. ఎందుఁ జూచిన లక్ష్మి నాట్యమాడుచుండె. ఆదినారాయణుఁ డున్న చోట లక్ష్మీదేవియుండు టేమి వింత.

## — { నందుండు మధురకుఁ బోయి వసుదేవునితో సంభాషించుట. } —

అంత నొక్కనాఁడు నందుం డేఁటేఁటఁ దాను గంసునకుఁ జెల్లింపవలసిన కప్పంబుఁగొని మధురకుఁ బోయి యతని కప్పగించె. భ్రాతయగు నందుండువచ్చి కప్పం బర్పించినవార్త విని వసుదేవుం డతండు దిగిన విడిదలకుం బోయెను. నందుండును దేహంబునకుఁ బ్రాణంబువలె వచ్చిన వసుదేవుం గాంచి తటాలున లేచి ప్రియతముఁ డైనయతని నతిప్రీతి రెండు చేతులఁ గౌఁగిలించి గౌరవించి కూర్చుండఁ బెట్టిన వసుదేవుఁడును బుత్త్రునిపైఁ దవిలిన మనమునఁ గుశలప్రశ్నంబుఁ గావించి యిట్లనియె.

అన్నా! యనపత్యుండవై వృద్ధుండవై సంతానాశయు మానిన నీకు నదృష్టవశంబునఁ బుత్త్రుండు గలిగెనవి విని పరమానందంబునఁ బొందితిని. సంసార చక్రంబున వర్తించు నీవు పుత్త్రరూపంబున బునర్జన్మంబుఁ గాంచితివి. ప్రియుండవైన నిన్నుఁ గారాగృహంబు నుండి విడివడిన నేను జూడఁగలుగుటయు నాకుఁ బునర్జన్మ మట్టిద. ప్రియతముఁడవైన నీదర్శనంబు దుర్లభంబు. అదేల యట్టు లనెద వని

యనియెదవేని ప్రవాహవేగంబున జలంబులఁ జిత్రకార్యంబులై నానావిధంబులఁ దేలియాడుచుఁ బోవు కట్టియ లొక్కపట్టునఁ జిర కాలంబు గూడి యుండ నేరని విధమునఁ బ్రియసంవాసంబును మర్త్యభంబు. అన్నా! పసులకు రోగంబులు లేవుకదా. ఆవులు దండిగఁ బాలు పిదుకునా? వాఁగుల వంకల నీటిసమృద్ధి కలదు గదా. మంద లకడఁ బులులు తోడేళ్లు చిఱుతలు లోనగు మృగంబులు మొదలా డవుకదా. అడవులందుఁ బచ్చిక యిచ్చకోలఁది కలదుగదా. గోపిక లకు గోపకులకు నారోగ్యంబు సుస్థిరంబ కదా.

కం. నాకాంతతోడ నీవును
నీకాంతయు గారవింప నినుఁ దండ్రిగ నా
లోకించుచు నీయందను
నాకొడుకున్నాఁడె నంద! నందాన్వితుఁడై. భాగ.

అయ్యా ధర్మార్థకామంబులు దేహసంబంధంబుగల బంధువుల తోడ ననుభవింపఁబడునేని సార్థకంబులగు. అట్లు గాక బంధువు లొండెడ ఖిన్నంచుచుండ నా త్రివర్గంబు నిష్ఫలంబుకావున నా దేటి సంసారంబని దీనుండై పలికిన నందగోపుఁ డిట్లనియె.

అక్కటా క్రక్కసుండయి యక్కంసుండు దేవకీకుమారులఁ బలువుర హింసించె. కడగొట్టు కూఁతురును దివంబున కరిగెఁగదా. నిజంబుగ జనంబుల సుఖదుఃఖానుభవంబునకు నదృష్టంబె మూలంబు. అదృష్టంబె యుత్కృష్ట కారణంబు, పరమంబు. అని యి ట్లదృష్ట తత్త్వం బెఱుఁగువాఁడు మోహములపాలు పడఁడు. అనిన వసు దేవుఁ డిట్లనియె.

అయ్యా! నృపాలున కియ్యేఁటికప్పు మప్పనచేసితివి. మేమును నిన్నుఁ జూచితిమి. వచ్చినపను లాయెఁగదా? గోకులంబున నుత్పాతంబులు పుట్టుచున్నవి. ఇందుఁ బెక్కుదినంబు లాలసింపకుము.

అని చెప్పిన నందాదు లతని వీడుకోలుపడసి యెడ్లబండ్లఁ దోలుకొని వేవల్లె కరిగిరి. నందుండును ద్రోవన యుత్పాతశకునంబులంగాంచి వసుదేవు వాక్యంబు లెన్నఁడు మృషలుగావని తలంచి తత్పరిహారణార్థంబు తన యిష్టదైవంబగు విష్ణుదేవుం ధ్యానించుచుఁ బోవుచుండె.

—: పూతనా సంహారము :—

అంత నక్కడ గోకులంబున బాలఘాతిని పూతనయను ఘోర రాక్షసి కామరూపిణి కంసుని పంపునఁ బల్లెలఁ బట్టణంబుల మందలం గల శిశుబృందంబుల మ్రందించుచుఁ దనపేరు విన్నమాత్రన నిశాచరుల విఫలప్రయత్నులఁ జేయు భక్తకల్పవృక్షము నారాయణుఁడుండు నందుని మందకుఁ దనయాకారంబు మఱుఁగుపఱచి దివ్యసుందరీవేషంబుధరించి మందమందగమనంబున నరుదెంచె. ఆ రక్కసియు మేలిదువ్వలువగట్టి తళుకు తళుక్కని మెఱయు కమ్మల మెఱుంగులు గ్రమ్మిన కుంతలంబులు మొగంబున కొకవింత కాంతులు సంతరింపఁ గురుల మల్లెవిరులుతుఱిమి పృథుల నితంబ కుచభరంబుల నలఁగి జవజవలాడు నెన్నడుముతో సుందర మందహాస కటాక్షవీక్షణంబులఁ జూపఱు మనంబుల కుల్లాసంబు గల్గించుచు హస్తకమలంబునఁ గమలంబుధరించి నిజపతిం దర్శింపవచ్చిన లచ్చియోయన గోపికలు విస్మయంబున వీక్షింప గోకులంబుఁ జొచ్చె.

ఇటుచొచ్చి శిశువుల వెదకుచు నా బాలఘాతిని యాకస్మికంబుగఁ దన సౌందర్యదర్శనంబున విభ్రాంతలై గోపకాంతలు వారింపనేర కూరకుండ నివురుగప్పిన నిప్పులాగాఁ దన తేజంబు దాఁచియున్న తెనపాలి కాలు బాలుఁ గృష్ణు దర్శించె. బాలకుమారీ గ్రహంబైన యా దుష్టనిశాటి తలంపెఱింగి యా చరాచరాత్మకుండు మహేశ్వరుండయ్యు బాలభావంబు నటించుచుఁ గన్నులు మోడ్చి యేమియు ననక యూరకుండె. స్వభావంబున సకలజగచ్చేష్టితం బెఱుంగు నాహరి తన

మృత్యువని యెఱుంగక సర్వంబును ద్రావని భ్రమించి తోడఁ జేర్చిన కుమతివలె నా పాపచారిణి నిద్రనటించు నాపాపని దనతొడపై నిడికొని లాలించి నిమురఁ జాలించిన యానిసుంగునకుఁ జన్నియ్యఁ దొడఁగె. దానిరూపము పటాటోపము మెత్తని మాటలు గని విని యది యొఱలోనికత్తి యని యెఱుంగక గొప్పవారి యిల్లాలని భ్రమించి యశోదా రోహిణులు దాని వారింపకుండిరి. అదియును నా నాయన! నా బంగారుకొండ! నాముద్దులయ్య! యాఁకలిగొంటివి పాలు త్రాగుమమ్మయని నతసినోర దుస్సహ విషపూరితంబైన తన చనుముక్క నుంచిన నాబాలుఁడును శీఘ్రమున దానిని జలగవలెఁ బట్టుకొని విడువక గుటుకు గుటుక్కుమని పాలను దానిప్రాణంబులతోడఁ ద్రావుచుండెను. ఒక్కొక్క గుటుకకుఁ జనుఁ బాలేగాక దేహములోని జవసత్వంబులును నుడుగువచ్చిన నది యదరి ప్రాణభీతిఁ జాలురా యబ్బా జాలుఁ జాలు నాపాలు నీకువలదు చాలుఁ జాలు నని యూడఁ దీసినను జనుముక్క బాలు నోటినుండి వీడిరాకయున్న వీఁడు లోకములోని బాలుఁడుగాఁ డమ్మమ్మా చచ్చితిఁ జచ్చితినని యఱచుచు వీధులఁ బఱచుచు శిశువు చన్ను కఱచి విడువక వ్రేలాడఁ బోయి వికృతపు రాక్షసి వేషంబునఁ దలవెంట్రుకలు ప్రేలఁ జేతులుఁ గాళ్ళుఁ బాఱవైచి దబాలునఁ గ్రిందఁబడి మాయారూపంబు విడిచి కన్నులు గిరగిర ద్రిప్పి నిజరూపంబున ప్రాణముల విడిచెను.

అతిగభీరం బైన దానికంఠధ్వనికి పర్వతంబులతోడ భూమియు గృహంబులతోడ నాకాశంబును వణఁకె. దిక్కులు ప్రతిధ్వను లిచ్చె. అధోలోకంబులదరె. జనులు పిడుగు తాఁకునం బోలి నేలవ్రాలిరి. ఇట్టులానిశాచరి పీడితస్తనయై విరిసిన వెంట్రుకలతోఁ జాఁచినకాలు చేతులతోఁ బడినచోటఁ జుట్టు నాలుగు క్రోసుల మేరదూరము లోని భూరుహంబులు నేల పాలయ్యె. రాజేంద్రా! యదిమిగుల నద్భుతం

బయలువడె. ఏడి కోలల పొడువుగల కోఱలును, కొండ బిలముల వంటి ముక్కరములును, గొండయందలి పెనుగుండ్లం బోలిన చన్నులును, నెఱ్ఱని విరిసిన వెంట్రుకలును, నంధకూపముల వంటి కన్నులును, నిసుక గుట్టలవంటి పిరుదులును, వనకట్టల వంటి చేతులు కాళ్ళు తొడలును, పాడు తటాకము వంటి కడుపునుగల కళేబరంబుఁ జూచి యారాక్షసి వేసినగుండెలు చెవులు తలలు పగులు కూఁతకే భీతిగొనిన వ్రేతలును వ్రేడులును మఱింత బెదరిరి. భయ మన నెట్టిదో యెఱుఁగక యాబాలుఁడు దానిపైఁ గ్రీడించుచుండఁ జూచి సంభ్రమంబున గోపకాంతలు పరువున వచ్చి యెత్తికొని గోపుచ్ఛంబున దిగఁదుడిచి గోమూత్రంబున మఱి గోధూళిని బాలకు లలాటంబున నిడిరి. గోమయంబుఁ జట్టివైచిరి. కేశవాది ద్వాదశనామంబుల బాలుని ద్వాదశాంగంబుల రక్షపెట్టిరి. గోపికలు జలంబుల నాచమించి విష్ణుకవచపఠన యోగ్యతానిమిత్తం బంగన్యాస కరన్యాసంబులు వేఱువేఱ కావించుకొని బాలునకు నట్లె యకారాది క్షకారాంత మాతృకా బీజాక్షరంబుల న్యాసంబుఁ గావించి విష్ణుకవచమంత్ర జపపూర్వకంబైన రక్షావిధానం బిట్లు గావించిరి.

నాయనా! యజుఁడు నీ యంఘ్రుల రక్షించుఁ గాక. నీ జానువుల నణిముఁడు ప్రోచుఁ గాక. ఊరువుల యజ్ఞుండును, గటితటం బచ్యుతుండును, జఠరంబును హయగ్రీవుండును, హృదయంబును గేశవుండును, నుదరం బీశుండును, గంఠం బినుండును, భుజంబుల విష్ణుండును, ముఖంబు నురుక్రముండును, శిరంబు నీశ్వరుండును రక్షించుఁ గాక యని పాదాది శిరః పర్యంతంబు రక్ష గావించి దిగ్రక్ష నిట్లు పఠించిరి. ముందు చక్రియు, వెనుక గదాధరుండయిన హరియు, నీ పార్శ్వంబులఁ జాపాసి ధరులైన మధువైరి యజితుండును, మూలల శంఖుండును, నూర్ధ్వంబున నుపేంద్రుం

డును, నధోభాగంబున హలధరుండును, నన్నికడలఁ బురుషుండును బ్రోతురుగాక. ఇట్లు బహిరంగరక్ష గావించి యంతరంగరక్షకై భగవంతు నిట్లు ప్రార్థించిరి. ఇంద్రియంబుల హృషీకేశుండును, ప్రాణంబుల నారాయణుండును, జిత్తంబును శ్వేతద్వీపపతియు, మనంబును యోగీశ్వరుండును, నీ బుద్ధిని బృశ్నిగర్భుండును, నాత్మను బరుండైన భగవంతుండును, గ్రీడించు నిన్ను గోవిందుండును, నిద్రించు నిన్ను మాధవుండును, నడచు నిన్ను వైకుంఠుండును, గూర్చుండు నిన్ను శ్రియఃపతియు, భుజించు నిన్ను యజ్ఞభోక్తయు, బాలారిష్టగ్రహంబులైన డాకినీ యాతుధాన కూశ్మాండంబులును, భూత ప్రేత పిశాచ యక్షరక్షో వినాయకులును, గోటరా రేవతీ జ్యేష్ఠా పూతనా మాతృకాదులును; దేహ ప్రాణేంద్రియ ద్రోహకంబులగు నున్మాదాపస్మారంబులును, స్వప్నదృష్ట మహోత్పాత వృద్ధ బాల గ్రహంబులును, సర్వగ్రహ భయంకరుఁడైన విష్ణుమూర్తి నీ నామగ్రహణమాత్రంబున నశించును. అని యిట్లు స్నేహకారణంబున గోపరమణులు రక్షగావింప యశోదయుఁ గృష్ణునకుఁ జన్నిచ్చి తొట్లలోఁ బరుండఁ బెట్టెను. అట్టిసమయంబున నందుండు మథురనుండి గోపాలురతోడవచ్చి చచ్చిపడియున్న పూతన కళేబరంబుఁ గాంచి దాని వృత్తాంత మాలించి యౌరా వసుదేవుండు ఋషియో జ్ఞానియో యోగియో కాకున్న నాయనవాక్య మిట్లు సరితూఁగునే యని యచ్చెరువు పడియె.

అంత గోపజనంబులును బూతనదేహంబు గండ్రగొడ్డండ్రఁ గత్తులఁ దుత్తునియలుగ నఱికి కాష్ఠంబులఁ బేర్చి దహించిరి. జగదీశ్వరుండు స్తన్యము పానముచేసిన కారణంబున నా రాకాసి పాపము లెల్ల సమయుటంజేసి యా కాలెడి పీనుఁగునుండి వెడలెడు పొగ యగరుధూమంబువలె గమగమలాడుచు దిక్కులఁ బరిమళము నిండఁ

జేసెను. ఔరా లోకమున కపకారము చేయునట్టియుఁ బిల్లవాండ్ర
పాలి పిశాచియునట్టియు రక్తమాంసంబు లాహారంబుగఁ గలయట్టియు
నారాకాసి హరిని జంపఁగోరి కుత్సితబుద్ధి వచ్చియుఁ జనుఁ బాలిచ్చిన
కతంబున సద్గతులు పడసెను. ఇఁకఁ బ్రీతిచేఁ గృష్ణునకు స్తన్యమిచ్చిన
తల్లులవలె శ్రద్ధాభక్తులతోఁ బరమాత్ముఁడైన కృష్ణునకు నేదేని ప్రియ
తమంబైనదాని గొంచె మర్పించిన వారు సద్గతిపొందు టేమియరుదు.
లోకవంద్యులైన బ్రహ్మాదులకు వంద్యంబులై భక్తుల హృదయపద్మం
బులు సద్మంబులుగాఁ గల హరిపాదంబులు తన్నొసోఁకి యమ్మహా
త్మ్యందు పాలుగుడిచినంతమాత్రన రాక్షసియయ్యు పూతన స్వర్గంబున
కేగెనన నమ్మహానుభావునకు బాలిచ్చిన తల్లుల గోవులఁగూర్చి నేమి
చెప్పవలయు? కైవల్యాది సకలార్థదాతయగు భగవంతునకు దేవకీ
పుత్రునకు నతనిఁ జూచినంతన పుత్రస్నేహంబునఁ జన్నులు చేఁపఁ
బాలిచ్చిన యా భాగ్యవతులకు, నతండు తన సుతుండని సతతంబు
వీక్షించు పుణ్యశీలిములకు, నజ్ఞానసంభవంబగు సంసారంబు మరలఁ
గలుగదు. ఇతర కార్యంబుపై దూరంబరిగినవారును బీనుఁగుపొగ
నుండి వెడలు పరిమళ మాఘ్రాణించి యెందుండి యీ ధూమము
వచ్చెనని మందపట్టునకువచ్చి వృత్తాంతమంతయు విని యాశ్చర్య
పడిరి. నందుండును నిజమందిరంబునకు వచ్చి నందను నెత్తికొని
ముద్దాడి యానందించె. నందనందను నద్భుతచారిత్రంబగు పూతనా
మోక్షకథను శ్రద్ధాభక్తుల విను మర్త్యులకు గోవింద పదార
విందంబులందలిభక్తి డెందంబునఁ గ్రందుకొన నారా ముకుందుపరమ
ధామంబుఁ జేరుదురు.

కం. ఇంచుక యేసియు ద్రోహం
బెంచుచు నేఁ గైటభారి కెది యేనిడు నా
పంచజనునకును హరి ని
ర్వంచనమతి సుగతి నొసఁగు వాత్సల్యమునన్.

రాజేంద్రా! జనార్దనుం డిట్లు గోపికా గోపాలకులకు శ్రేయస్కరంబగు కార్యములు పెక్కొనర్చుచు నందసదనంబునం బెరుఁగుచుండె ననిన విని పరిక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె.

మహాత్మా! యే యే యవతారంబుల భగవంతుండగు నీశ్వరుం డేయే విలాసంబులు నెఱపె నవియెల్ల మా వీనులకు విందును హృదయంబునకు నాహ్లాదకరంబునై యుండు. దేనిని వినినంతమాత్రమున మనోగ్లానియు విషయంబులందలి కోరికలును దొలఁగించి యంతఃకరణంబును సత్త్వగుణంబును శుద్ధంబుఁ గావించి భగవద్భక్తియు భాగవతసఖ్యంబును సమకూర్చునట్టి హరిచరిత్రంబు నీ కనుగ్రహంబు గల దేని వచింపుము. అందువిశేషించి మానవ లోకంబున నవతరించి కృష్ణుం డాచరించిన వివిధాద్భుత బాలక్రీడానటనంబులు వినఁ గౌతూహలం బయ్యెడి వినిపింపవే యని వేఁడిన వ్యాసకుమారుం డిట్లనియె.

## —: శ్రీకృష్ణుడు శకటాసురుం గూల్చుట :—

ఉత్తరానందనా! నందనందనుండు కొన్నాళ్ళకు బోరగిలఁబడఁ జొచ్చెను. బోరగిలంబడినఁ బోళీలు చేయవలయునందురు గావున నొక్క జన్మనక్షత్రంబున యశోవతీమ తల్లియగు యశోద యుత్సవంబుఁ గావించి మంగళవాద్యంబులు బోరుకొన సంగీత నాదంబులు బ్రాహ్మణాశీర్వచనంబులు కలసి బెరయ గోపస్త్రీలం గూడి బాలుని జలకమార్చి బ్రాహ్మణులకు వలయు పదార్థము లర్పించి వారిచేఁ గుమారు నాశీర్వదింపఁజేసి యతనిఁ దొట్లెలోఁ బరుండఁ బెట్టి నిద్దురపుచ్చి తాను లోనికిఁ జని వచ్చిన బంధువుల సత్కరించుచుఁ జాలకై బాలుఁ డేడ్చినను వినదయ్యె. అంత బాలుండు తల్లి రాదాయె నని రోషంబున నేడ్చుచునే పాదంబులుచాఁచి తన్నెను. ఆమహాత్ము మాహాత్మ్యంబెఱుంగక యతనిజంప నొకయసురుండు కంసునిపంపున వచ్చి నందుని శకటంబున నావేశించి యుండి యతనిపై వ్రాల

నతని యడుగులకడ నుండెను. ఆ బాలు మృదుచరణ పల్లవంబుల తాఁకున నా బండిరక్కసుండు ప్రక్కలై యిరుసువిఱిగి చక్రంబులు వక్రంబులై కూలి నొగలు తునుకలై యాకులు పోఁకలంతలై యెగసి తొల్లగావలంబడియె. బ్రహ్మాండభాండకాండంబులఁ బుట్టచెండు వలెఁ గాలిప్రేలిగోర నెగమీటఁగల మేటికి నొక బండిరక్కసు గండడఁగించు టేమి వింత.

ఆ నాదంబు విని యదరిపడి యేమియేమియని యశోదయు నందాదులు చుట్టంబులు పరువునవచ్చి విఱిగిన బండినిగని యెవ్వరిట్లుచేసిరనియడుగ నందాదులతోను గోపబాలకు లయ్యా! యీబాలు కాలితాఁకున నీశకటంబు వికలంబయ్యెననిన నదియేమి వింత, యీ బాలుఁడెక్కడ బండియెక్కడ సుకుమారకుమారుని చరణపల్లవంబుల తాఁకున బండివిఱుగుటెక్కడ యని విస్మయపడి కృష్ణుండు సామాన్య బాలుండని నమ్మిన భ్రాంతచిత్తులు పిల్లవాండ్రమాట కేమని నమ్మరైరి. యశోదయు గ్రహము సోఁకెనని బలిపూజా విధానంబులు గావించి బ్రాహ్మణోత్తముల స్వస్తివాక్యంబుల రక్షగావించి చన్నిచ్చి మరల నుయ్యెలలోఁ బరుండఁబెట్టెను. అసూయయు నసత్యంబును నీర్ష్యయు దంభంబును హింసయు నహంకారంబును లేని యుత్తమ బ్రాహ్మణుల మంగళాశాసనంబులు వ్యర్థంబులు గావు గావున నందుండట్టి సత్యశీలురైన బ్రాహ్మణులఁ బిలిపించి ఋగ్యజుస్సామ మంత్రంబులచేఁ బవిత్రంబులైన యోషధిజలములఁ గుమారునకు నభిషేకంబుఁ జేయించి స్వస్తివాచనంబు హోమంబుగావింపఁజేసి యన్నాదుల వారినెల్లఁ దృప్తులఁగావించె. మఱియు వారికి సాధువులగు ధేనువులను వాసోభూషాహారంబుల నలంకరించి తన తనయు నభ్యుదయార్థంబు వారికొసఁగి వారి దీవనలం బడసె. మంత్రవిదులైన బ్రాహ్మణోత్తములును యోగయుక్తులును వచించు నాశీర్వాదంబులు నరేంద్రా! యెన్నఁడు విఫలంబులుగావు.

## —: తృణావర్త నిరాకరణ వృత్తాంతము :—

అంత నొకానొక దినంబున యశోద వినోదంబుగఁ గొడుకును దొడపయిఁ గూర్చుండఁబెట్టుకొని ముంగిటిబయల ముద్దులాడుచుండ నతండు కొండంతభారంబయిన నాయమ యేమిది చిత్రము! ఎప్పటి బాలు డేకదా వీఁడు. ఇంతలో నింతభారమగుటకు నాకు బలంబుడిగెనా యని తలంచుచు స్వామీ నీవే కుమారుని రక్షింపుమని భగవంతుఁ బ్రార్థించుచు బాలుని నేలపైఁ గూర్చుండఁ బెట్టి యన్నా! యాడుకొనుచుండుము. నీకు వెన్న దెచ్చెదనని బుజ్జగించి కార్యవశంబున గృహంబులోనికిఁ జనియె. ఈలోఁ గంసునిభృత్యుఁడు తృణావర్తుం డనుదైత్యుండు సుడిగాలియై చూపఱకన్నుల దుమ్ముకొట్టుచు భయంకరంబుగ గిరగిరదిరుగుచు గోకులం బాకులంబుగవచ్చి కూర్చుండిన బాలుని నెత్తికొనిపోయెను. దిక్కులు పిక్కటిల్ల నొక్కమొగి మ్రోయు భయంకరారావంబునకు వెఱచఱచి పఱచు గోపకులు గోపాలికలు దుమ్ము పెల్లునఁగమ్మిన చిమ్మచీఁకటుల పెల్లున నొండొరు తెలియక తికమకలాడుచుఁ దృణావర్తుఁడు కల్పించిన ఱాలవాన తాఁకున భ్రమనొందిరి. అంతఁ గొంతసేపున కాయాపద వాసిన యశోద నిజకుమారుఁ డానుంచినచోటఁ గానక దుఃఖాతిశయంబున మూర్ఛపడి లేచి లేఁగచచ్చిన గోవువలె నఱచెను. ఆ యేడుపులువిని గొల్లవనితలు గుంపులైవచ్చి నందకుమారు నందందు వెదకి యెందుంగానక కన్నీరు పెన్నేఱులుగ నేడుచుచుండిరి. బాలు నెత్తికొనిపోయిన తృణావర్తుండు మింటికెగసియు దుర్భరుండైన యయ్యర్భకుఁ గొంపోనఁజాలక విడిచిపోవఁదలంప నానిలింపవైరి తలం పెఱిఁగి తద్దనన లంపటుండై కపటబాలకుండు వానిమెడఁ గ్రుచ్చిపట్టుకొనియె. వాఁడు పట్టువిడిపించుకొననేరక కంఠంబునఁ గొండవలె బాలుఁడు వ్రేలుచుంట నెగసిపోనోపక దబాలున నొక

గుండుపైఁబడి నలిగులియై చచ్చె. బాలుండు వానియొమ్మపై నాడుచుండె. కుమారు వెదుకుచుఁ బోయిన గొల్లయిల్లాండ్రు బాలుం గొనివచ్చి తల్లికిచ్చిరి. ఆమెయుఁ గొడుకునెత్తుకొని సమ్మదంబున వీఁపు చఱచి లాలించె. నందాదులును గోపసుందరులును దాని కానందంబునొంది యీ సుందరాకారుండు తన్ను భ్రమింపఁజూచిన మంపుని వాఁతఁబడక మందల నరుదెంచెనని మిక్కిలి సంతసించిరి. సాధువుల బాధింపఁజూచు దుర్మేధులే బాధనొందుదురుగాని సాధులు సమబుద్ధింజేసి కీడునొందరు. ఏతపంబు లొనర్చితిమో యేవిధంబున మాధవు నర్చించితిమో యే తటాకాదుల నిర్మించితిమో యే యజ్ఞాదు లాచరించితిమో యే దానంబుల సలిపితిమో యెంత భూతదయ గలిగి వర్తించితిమో మృత్యువువాతఁబడిన బాలుండు మరలజీవించి తనవారిఁ గలిసికొనఁ గలిగెనని వారెల్ల సంతసించిరి. నందుం డొకటివెదుక నొకటివచ్చు నుత్పాతంబులఁజూచి వసుదేవుని యెఱుకతో నబ్బుర పోవుచుండె.

## — ఆవులింత నెపంబునఁ గృష్ణుండు తల్లికి విశ్వరూపంబుఁ జూపుట —

ఆవల నొకనాఁడు యశోద బాలునికిఁ జన్నిచ్చి మోము నిమిరియెత్తి తొడలపై నడ్డంబుగఁ బరుండఁ బెట్టి చిటికెలు వేయుచు నాడించుచు నవ్వించుచుండ నాకుమారుండావులించి నోరువిచ్చిన నందు భూమియు నాకాశంబును ద్వీపములు సముద్రములు పర్వతములు తారకలు గ్రహనక్షత్రములు చరాచర భూతకోటులన్నియుఁ గనిపించిన నాహరిణాక్షి వీక్షించి యచ్చెరుపడి మేనువణఁక కన్నులు మూసికొనియె.

## —: రామకృష్ణులకు గర్గుఁడు నామకరణంబు గావించుట :—

పదపడి యొకనాఁడు యాదవపురోహితుండైన గర్గుండు వసు

దేవుని పంపున గోకులంబునకు విచ్చేసిన నందుం డెదురేగి తోడి తెచ్చి యర్ఘ్యపాద్యాదు లర్పించి సత్కరించి సుఖాసనాసీనుఁ గావించి నమస్కరించి యర్చించి యిట్లనియె. కారణంబులేక కొలఁది వారి యిండ్లకు గొప్పవారు రారు. అట్టివారి రాకకు శ్రేయంబు గూర్చుటే యుద్దేశంబై యుండు. కావున మీ రాక నిజంబుగ మా శుభోదర్కంబగు. బ్రాహ్మణోత్తమా! మహాత్ముండవైన నీకు మావలన నగు కార్యమయ్యేది గలుగు? మీ యట్టి మహానుభావులు మా యట్టి గృహస్థులకు మేలుసేయఁ దిరుగుదురు గాని కోరికలు గల వారై రారు. అందు బూర్వజన్మ కర్మంబును దాఁగల ఫలంబును దెలుపునట్టియుఁ గన్నులకు గోచరింపని విషయంబును బోధించు నట్టియు జ్యోతిశ్శాస్త్రంబును మీర కావించితిరి. మీరు బ్రహ్మవిదులలో నుత్తములరు. మీ రెఱుంగని విషయములు లేవు. కావున మీరీ కుమారులకు నామకరణాది సంస్కారంబులు గావింప నర్హులు. జన్మ మాత్రంబు చేతనే తక్కిన వారికి బ్రాహ్మణుండు గురుండు కదా యని వేఁడికొనిన గర్గాచార్యుం డిట్లనియె.

అయ్యా! నామాటవినుము. నేను యాదవాచార్యుండనగుటయు, నీకును వసుదేవునకును జెలిమి కలిమియుఁ గంసుం డెఱుంగుఁ గదా. అంతియగాక దేవమాయ వాక్యంబులు విన్నది మొదలు వాని మనస్సు నిలుకడ లేకయున్నది. ఆకాశవాణి వాక్య మసత్యము కానేరదనియు దేవకికి నెనిమిదవచూలు పిల్లయగుట కల్లయనియు యోగమాయ వాక్రుచ్చినట్లు వారికొడు కెక్కడనో పెరుఁగుచున్న వాఁడనియు నతఁ డాలోచించు చున్నవాఁడు. ఇట్టిచో నేను నీకుమారునకు నామకరణంబుఁ గావించినవార్తవినియెనా నీకుమారుండు నిక్కంబుగ వసుదేవ కుమారుండని యెఱింగి యితనిని గంసుండు హింసింపక మానఁడు. దాన ననర్థంబు పొసఁగుట చెప్పనేల యనిన నందుం డిట్లనియె.

మహాత్మా! నీవాక్యంబులు సత్యంబులు. ఈగోకులంబువారి

కని దెలియరాకుండునట్లు రహస్యంబుగఁ గార్యంబు నిర్వహింపుము. సూనులు సంస్కారహీనులై యుండుట కారాదుగదా యనిన గర్గుం డిట్లు వచించె.

గోకులపతీ! నీవు సత్యంబ పలికితివి. నీకది యే బోధింపవచ్చితిని. అని రహస్యంబుగ రోహిణీకుమారుండు తనగుణంబుల జనుల రమింపఁ జేయుఁగావున రాముఁడనియు బలాధికుం డగుట బలుఁడనియు యాదవులలో వేఱిమి కలుగకుండ నైకమత్యంబు గలిగించుఁ గావున సంకర్షణుండనియుఁ బేరిడియె. ఈయశోదా నందనుఁడు పూర్వము యుగభేదముంబట్టి తెలుపు నెఱుపు పసుపు వన్నెలు గలవాఁడైనను నిప్పుడు నీలవర్ణుండగుటఁ గృష్ణుఁడనంబడు. ఇప్పుడు నీకు నందనుండై యున్నను బూర్వము వసుదేవ సుతుండగుట వాసుదేవుం డనంబరఁగు. మఱియు నీబాలునకు గుణకర్మముల కనురూపంబులైన నామధేయంబులు పెక్కులు గలుగును. వాని లోకు లెఱుఁగరు గాని యే నెఱుఁగుదు. ఈబాలుఁడు గోపాలురకు గోపులకు నమితానందం బొదవించు. మీకెల్ల శ్రేయంబు ఘటించు. మీ సకల కష్టముల నంతమొందించు. తొల్లి భూమి రాజహీనంబైన సమయంబున దస్యువులు చెలరేఁగి సాధువులఁ బీడించిన వారీయన రక్షణంబు వడసి యెడరులఁ బాసిరి. ఇమ్మహాత్మునెడ భక్తి చేయువారు రాక్షసులచే విష్ణుభక్తులంబోలె వైరులచేఁ జెడరు. శ్రీకీర్తి మహిమలను సమస్త సద్గుణంబులను నీకుమారుండు నారాయణు నట్టివాఁడు. హెచ్చరిక గలిగి రక్షింపుమని యమ్మునియరిగె.

## —: బలరామ కృష్ణుల బాల క్రీడలు :—

అంత బలరామకృష్ణులు క్రమక్రమంబునఁ బెరుఁగుచుండిరి. తొలుత బోరగిలఁ బడినవారు పొట్టచేరుల్లం బెట్టసాగిరి. మోఁకాళులను చేతులను నేలమోపి కొంచముగ లేచిరి. తరువాత నిటునటు

కదలుచు నొక మోఁకాలు ముందిడి ప్రయత్నంబున రెండవకాలిని జరుపుచుఁ జేతులు కదలింపలేక భయపడిన వారివలె నటించిరి. అంతఁ జేతులుఁ గాళుఁగొనుచు దోఁగాడిరి. దోఁగాచుఁ గడపలు దాటఁలేక నీలియేడ్పు లేడ్చిరి. పదపడి దోఁగాడుచుఁ బోయి వాకిట గడపలం గూర్చుండి తెరువున వచ్చువారిని బోవువారిని హెచ్చరించుచుండిరి. ఆవల దోఁగాడుచు వీధిలోనికిఁ బోయిరి. ఎవ్వరైనఁ దమ్ముఁ గాంచి చేరవచ్చిన బారలు సాఁచియెత్తుకొమ్మని సైగలు చేయుచుఁ జీరకొంగుల పట్టి లేవఁ బోవుచుండిరి. ఆడుకొనునెడఁ గ్రొత్తవారు వచ్చిన భయపడినట్లు తల్లులయొద్దకు బిఱబిఱ పోవుచుండిరి. తెరువుదుమ్ము మేనునిండఁ దమయొద్దకువచ్చిన బాలకులను గని నాయనా! యిదియేమి చేష్టలుగా యని తల్లులు వారిదుమ్ము దుడిచి యొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొనినఁ బైఁటలాగుచుఁ జన్ను వేఁడుచుండిరి. చనుఁబాలీచుటఁ ద్రావుచు నాచంటఁ గేలిడుచు నడుమనడుమఁ బైఁటలోనుండి తల వెలిఁ జూపుచుఁ దటాలునఁ బైఁట తొలఁగించుచు గనుఁ తల్లి మొగంబు విన్నఁదనంబునఁ జూచుచుండిరి. మరల వారు లాలించి పాలిచ్చిన మెల్లగఁ ద్రావుచుండిరి. ఒక్కొక్కసారి బియ్యపుగింజలవంటి లేఁతపండ్లచేఁ జనుముక్కులు చుఱుక్కున నొక్కుచుఁ గోపించు తల్లుల మొగంబులు చూచి నవ్వుచు వారిని నవ్వఁజేయుచుండిరి. అటులైనఁ బాలీయనని తల్లులు రైకదిగజార్చి చక్కఁ బఱచికొనినఁ బైపడి మెడగుత్రవ్వుచు నీలిమూలుగులు మూల్గుచుఁ గన్నులు నులుముకొనుచుండిరి. ఇట్టులాతల్లులు బాలురలేనగుమొగంబులు చూచుచు నింటిపనులు మఱచియు నుపేక్షించియుఁ జేసియుఁ జిత్తంబులు కుమారాయత్తంబులు గావించి పరమభక్తులఁ బోలి నిమిష మేమఱినఁ దత్తఱించుచుండిరి. ఇట్లు భక్తపరాధీనుండగు భగవంతుండు వారిం దరింపఁ జేయ నానావినోదంబులు జేయుచు వారిమనంబు తమయంద నిలువఁ జేయుచుండెను.

అంతఁగొన్నిదినంబులకు మఱికొంత యీడువచ్చి చక్కఁ నడవఁ గాలునచ్చుటయు నింటనిలువక వీధులవెంటఁ బోవుచు దూడల తోఁకలు లాగుచు వానితో నాడుకొనుచు నవి త్రుమ్మవచ్చినఁ తొలఁగుచుఁ గ్రీడించుచుండిరి. వారివినోద కేళిఁ జూచు వేడుక గొల్లపల్లవాధరలు తమతమ యిండ్లపనులు చాలించి వెలికివచ్చుచుఁ బోవుచుండిరి. ఇట్లు వారిరువురు తమసేవకై యవతరించిన యాగోపాలికల ధన్యలంజేయ వారి మనంబులు మెల్లమెల్ల నాకర్షించుచుండిరి.

పరువులెత్తు ప్రాయంబువచ్చిన నచ్చిఱుతలు తమ యత్రత నిలువక గోకులంబునఁ దిరుగాడు నెడ నెక్కడ నేపసరము పొడుచునో యెక్కడ నేక్రూరమృగంబు బాధించునో యెక్కడ ముండ్లు గ్రొక్కుదురో యెక్కడ నిప్పు నీళ్లు పక్షుల వలన బాధల య్యెడినో యని వారి నరయుటకై వీధిలోనికి, గృహకృత్యములకై యింటిలోనికి, రాక పోకలుసేయ నోపిక లేక తల్లులు కష్టపడుచుఁ గష్టముగ నెంచుచుండిరి. తరువాత రామకృష్ణులవ్వాడ గోపబాలురతో నాడఁబోవుచు గోపికలకు ముదం బొనవించుచుండిరి. అందుగృష్ణుండు దుండగములు సేయుచుఁ దైలధారవలె నవిచ్ఛిన్నంబుగ సర్వదా గోపికల మనంబు తనయందు నిలుచునట్లును, నిదిగోఁ గృష్ణుఁడు వచ్చె, నదిగోఁ గృష్ణుడు పోయె నని తన్నె స్మరించునట్లును వారికి సర్వము కృష్ణమయమగునట్లు చేయుచుండెను. అతఁడు చేయు దుండగముల కోపక గోపిక లోపికలు వదలి ముగ్ధలై యశోదతో నిట్లనిరి.

—: గోపికలు యశోదతోఁ గృష్ణునిపై నేరములు చెప్పుట :—

యశోదా! కనికని లోకములో లేని బిడ్డ నెక్కడఁ గంటివి. మా కొఱకయియే నీకొడుకు పుట్టినట్లున్నది. అట్లు గాకున్న నిటిచేష్టలేబిడ్డఁడు చేయును? వాఁడు చేయు తుంటపనుల మే మేమని చెప్పుదుము. బాలురకుఁ బాలు గావలసి మేము పితుకఁ బోవుటకు

ముందే క్రేపుల నీపాపఁడు విడుచుటచే నొకయావైన గంటెఁడు పా లొసంగదు. బిడ్డలు పాలులేక మొత్తోయనుచున్నారు. ఇరుగింటమ్మను బొరుగింటమ్మను నడుగుదమనిన నన్నియిండ్లవా రిట్టులే తపించుచున్నారు. మేము కోపించి యేమిరా కృష్ణా యిట్టులేల చేసితివని యాక్రోశించినఁ జేతులతాళము వేయుచు నవ్వుచు గంతులు పెట్టును. కొత్తపాలు లేకున్న మానె మాపటి పాలైనఁ బోతమని చూచినఁ బాలకుండలలోఁ బాలుండవు. పెరుఁగుకుండలలోఁ బెరుఁ గుండదు. అన్నియు నుత్తకుండలే. చూడ మారెఁడు లేడు వీని కడు పదెంత కడుపో. లోకమంతయు వీనిపొట్టలోఁ బెట్టుకొనినను జాలనట్లున్నది. మేముచూచుచుండఁగానె కడవలకొలది పెరుగు దేవుకొని దేవుకొని జుఱ్ఱుకొని జుఱ్ఱుకొని నిమిషములో బావుకొనును. పట్టబోయినఁ జిక్కఁడు. తాను దినఁగా మిగిలెనా క్రోఁతులకుఁ బంచిపెట్టును. కోఁతులు రావాయెనా యాకుండలను వ్రక్కలుగొట్టును. దొంగతిండి వీని కెంత రుచియోఁగాని యొకకుండలోనైనఁ బాలు పెరుఁగు నేయి దక్కనీయఁడు. నీకొడుకునకు నీవు కడుపునిండఁ గూడుపెట్టక యిట్టు లూరివాడలమీఁద విడువవచ్చునా? కనికని చాలునమ్మా ముత్తెమునంటి బిడ్డను గంటివి. వీనికిఁ గానరాకుండ మే మన్నిఁటిని బదిలపఱిచితిమా మా మీఁదఁ గోపించి పోవుచుఁ బోవువాఁ డూరకపోక తొట్లలో నిద్రించు శిశువుల ముడ్డిగిల్లి యేడ్పించి వారల బోరగిలఁ ద్రోచిపోవును. వీని కందకుండ నెత్తువ నుట్టిమీఁద నుంచితిమా దానిక్రింద ఱోలుపీఁటలునిడి వానిపై నెక్కి తీసికొనును. ఇంతలో మేము కనుఁగొనిన కట్టెతోఁ గుండడుగునఁ దూటు పొడిచి పరుగిడును. నే మెందైనఁ గుండలఁ జీఁకటింట దాఁచి గృహకృత్యంబుల వర్తించుచున్న నందరిగి తాను ధరించిన దివ్యమణుల కాంతులచే నిల్లెల్లఁ బ్రకాశింపఁ జేయును. ఓరిదొంగకృష్ణా! మాయింటికి వచ్చి మా పాలు పెరుగు ముచ్చిలించెదవా యని బాలుఁడుగదా యని

బెదరించితివమా యీయిల్లు నాది మీరే దొంగలు నాయిల్లు విడిచి పొండని మమ్ము గద్దించును. మా యిలువేల్పు మందిరంబులను మేమలికి ముగ్గులిడి శుద్ధముగా నుంచిన నందుఁజొచ్చి మూత్ర పురీషంబులు విడుచును. ఇంతచేసియు నీయొద్దకువచ్చి సుప్రతీకము విధంబున నీపిల్లి యీపాలుత్రాగునా యని యెట్లున్నాఁడో చూడుము. అనిన నొకగోపిక విసవిసవచ్చి వినుతల్లీ! విను నీ వీనులార నీ తనయుని దుండగములు విను. నాయింటిలోఁ బది కడవల పాలు పెరుఁగు నెయ్యి నీకొడుకు బావుకొని బావుకొని తిని త్రాగుటయొకాక కుండలన్నిటిని బోరగిలఁ దోచివచ్చెను. ఇట్లయిన మేమెట్లు కాఁపురములు వేఁగింతుము. అనినఁ దక్కినవారిని ద్రోచికొని వేఱొకగొల్లెత వచ్చి యంతయిన మేలే తల్లీ నాయింటిలో నేఁబదికడవల పాలుపెరుఁగు ద్రాగికుండలన్ని పగులఁగొట్టి వచ్చినాఁడు. వీని కడుపులోఁ బెను భూతములున్నవా యేమమ్మా? అనిన నింకొకతె కన్ను లెఱ్ఱచేసికొని నేను బెద్దకడలనిండఁ బాలు పెరుఁగునించి గదిలోనుంచి తలుపు తాళముపెట్టియుండ నీతఁడా బీగములఁ బగులఁగొట్టి లోపలఁ జొచ్చెను. నేనును వెంటనె చొచ్చితిని. అంత పాలుపెరుఁగు నేమి చేసెనోకాని కడవలలో నొక్క బొట్టయిన నేదియులేదు. బిడ్డలు పాలుపెరుఁగునకై యేడ్చిన నేను వారి కేమమ్మా పోయుదును? ఇఁక నడవులులేవా పొలములులేవా యిట్లయిన నెవతె యిందుఁ గాఁపురము సేయునమ్మా? అనిన వేఱొకతలోదరి వచ్చి యిట్లనియె. నా మగఁడు బిడ్డలు కోరిన నేను గలకండపాలు రవవెన్నకలిపి పొంగలి వండి పొంతి దించితిని. అన్నికడవల పొంగలి నీకొడుకు కూర్చుండి తినెను. ఈమాటచెప్పిన మగవారు నమ్ముదురా. ఇప్పుడు నాగతి యేమి. మగఁడు కొట్టునో తిట్టునో యేమిచెప్పుదును. చాలునమ్మా చాలు. నీవుచాలు నీకొడుకుచాలు నీమందపట్టు చాలు. ఎందైన మేమందరము లేచిపోయెద మనియె.

ఇట్లు కృష్ణుని చిత్రచరిత్రము లాశోంపాగాత్రలు చెప్పిన యశోద యిట్లనియె. తల్లులారా! మీ రిట్టులాడిన నే నేమి చెప్పుదు. అమ్మ మ్మయని నన్నువిడిచి యిట్టటు పోవఁడు. ఎప్పుడు నాకన్నులఁ బ్రోలనే యాడుచున్నవాఁడు. అన్ని కడవల పాలు పెరుఁగు తిన్నవాని కడుపట్లు వటపత్రమువలెనా యుండును. అయినను మీరు కల్లలాడెడివారు కారు. ఈ కన్నులు తెఱవని కూనపై మీరేల నేరములు చెప్పుదురు. కావున మీమాట విశ్వసించితి. ఇఁక పేసినట్లు కట్టుదిట్టములలో నుంచెదనో చూడుఁడు. ఇప్పటికి క్షమింపుఁడనిన వారెల్ల సంతసించి తమతమ యిండ్లకుఁ బోయిరి.

క. పరమపద వాసు లెవ్వనిఁ
బరికింతురు; యోగు లెవని పదములఁ దమ హృ
త్సరసిజముల వెదకుదు రా
పరముఁడు గో డాడఁ జేసె వల్లవసతులన్.

క. క్షీరాంభోధి శయానుఁడు
సారగవిక్షీరపూర సంతర్పితుఁ డా
భీరీఘట దధ్యాజ్య
క్షీరంబుల ముచ్చిలించెఁ జిత్రం బహహా.

ఉ. పాలును బెర్గు నేయి గృహభాండములం దిడ ముచ్చిలించె గో
పాలుఁ డటంచుఁ గోపపడి భామలు పల్కిరిగాని ముగ్ధలై
పాలును బెర్గుతోడుతఁ గృపాలుఁడు స్వాత్మల ముచ్చిలించునా
జాలమెఱుంగ లేరయిరి; సారసనేత్రలకా వివేకముల్?

అనివారినోడఁబఱిచి దుడుకుఁ గొడుకుఁ దనవక యప్పుడతి యూరకుండె. కృష్ణుండును దనపై నేరములాడు గొల్లపూఁబోఁడుల మాటలాలించుచుఁ దల్లిని మెడ గ్రుచ్చి కౌఁగిలించుకొని యేమియు నెఱుంగని ముగ్ధుంబోలి వారిమోములు వీక్షించుచుండె.

ఒకసారి కృష్ణుండు గిన్నెలోని పాలు ద్రావక పుసులు

చుండిన యశోద కృష్ణా! వేగ పాలుఁ ద్రాగితివేని నీకుఁ తలవెండ్రుకలు పెరుఁగుననిన గుటుకుగుటుక్కున సగముఁ ద్రావి తల తడవి చూచుకొని యమ్మా వెండ్రుకలు సగము పెరిఁగిననని తల్లికిఁ జూపును.

కృష్ణుం డొక్కొకతేప యమ్మా పాలేయని గిన్నె తెచ్చిన నాయనా యిప్పుడు పా లెక్కడినుండి వచ్చునని తల్లి బుజ్జగింప నట యిన నెప్పుడు వచ్చునని యడుగఁ జీఁకటిపడిన వచ్చునని యామె చెప్పఁ గన్నులు మూసికొని చీఁకటివచ్చెను బాలు తెమ్మనును.

అంతియగాక వ్రేపల్లెలోని యింటింటికిఁబోయి రంతులు సేయఁ జిక్కినాఁడు కృష్ణుఁడు వీనికిఁ దగినశాస్తి చేయింపవలయునని యొక్కొక్క గోపికయు నొక్కొక్క కృష్ణుని బట్టుకొని యశోదకడకు వచ్చి యచ్చోటఁగృష్ణుండు దల్లియొద్ద ముద్దులాడుటయుఁ దాము పట్టితెచ్చిన కృష్ణులు మాయమై పోవుటయుఁ జూచి సిగ్గుపడి మరలి పోవుచుండిరి.

రుక్మిణి—కృష్ణుఁడు దేవుఁడు కదా. ఇటువంటి కొంటెతనములు దొంగతనములు చేయవచ్చునా?

తండ్రి—నేనక్కడక్కడఁ జెప్పిన కొన్నిమాటలు మీ మనన్నున కెక్క లేదు. కృష్ణచరిత్ర మంతయుఁ జెప్పిన తరువాతఁ గృష్ణావతార తత్త్వము చెప్పెదను. అప్పుడు మీ సందేహములు తీరును. చరిత్రమంతయుఁ దెలియక వాస్తవార్థము బోధపడదు.

## —: మృద్భక్షణము. విశ్వరూప దర్శనము :—

ఒకనాఁడు రామకృష్ణ గోపాలురెల్లఁ గలసి యాడుకొను సమయంబునఁ గృష్ణుండు మన్ను భక్షించెను. తక్కినవారు వారించినను వినఁడయ్యె. అంతట నారెల్లవచ్చి యశోదం గాంచి "యమ్మా కృష్ణుఁడు మన్నుదినుచున్నాఁ"డని నుడివిరి. మన్నుదిన్న వ్యాధులు వచ్చునని వెఱచి యత్తెఱవ వెంటనె పఱచి కృష్ణుని బట్టుకొని కొట్టునట్లు జంకె

లాడుచు నిట్లనియె. కృష్ణా నీకు వలసినంత వెన్న పాలు పెరుఁగు లోనగు కమ్మనిపదార్థము లీనుచున్నను మన్ను తినెదవే యెంత చంచలచిత్తుఁడవురా! కుమారా! మన్ను తినవలదని మున్నే నీకుఁ జెప్పితినిగదా. మన్నేల భక్షించెదవు? నీవు మన్నుతింటివని నీయన్నయుఁ జెలికాండ్రును జెప్పుచున్నారే. నీవు తినవలయుననిన నింట వెన్నలు లేవా. పాలు పెరుఁగులు లేవా. నామాట లేల నీవు పీటెంబుచ్చితి వనినఁ గృష్ణుండు భయము నటించి వడకుచు నమ్మా నేను మన్ను తిన్నవాఁడనుగాను. మన్నుతినుటకు నేనేమి వెఱ్ఱినా. పసికూననా. ఇప్పుడు భోజనము చేసితినే. ఇంతలో నాఁకలి యయ్యెనా. నీవు నన్నుఁ గొట్టవలయునని వీరు నాపై లేనిపోని నేరములు చెప్పుచున్నారు. నామాట నమ్మవేని నానోరు చూడుము. మన్నువాసన వచ్చుచున్నదో వెన్నవాసన వచ్చుచున్నదో? నాపలుకు లసత్యంబులైన నీ యిచ్చకు వచ్చినట్టులు దండింపుము. అని నోరు తెఱచిన నా క్రీడామనుజ కుమారునోరఁ బారావారములను సమస్త పర్వతములను వనములను భూగోళంబును ఖగోళంబును సూర్యచంద్రాది గ్రహంబులను బ్రహ్మాండ కరండంబును మనస్సు తన్మాత్రలను గుణేంద్రియంబులను దన్ను గోకులంబును నెల్లఁగాంచి విస్మితయై యశోద తనలో నిట్లు తలంచె.

ఔరా! విచిత్రము. ఇది స్వప్నమా? మేల్కొన్నవారికిఁ గల యెట్లువచ్చు? దేవమాయయా? అట్లైన ఘటపటాదులవలె నెల్లరకేల గోచరింపదు. నాకు బుద్ధిభ్రమమా? కాదు కాదు. ఎన్నిమార్లుచూచినను సత్యముగాఁ గానవచ్చుచున్నది. ఇది యీబాలున కుత్పత్తితోడ వచ్చిన స్వభావమైన యాత్మయోగమా? అగు నగు. అదియే యై యుండవలయు. చిత్తంబుచేతను మనస్సుచేతను గర్మములచేతను వాక్కుచేతను నిశ్చయ మిట్టిదని యూహింపరాని యీవిశ్వ మెవ్వని నాధారంబుగఁ గొనియుండు. దేనియందు జనించు. ఎందు జీవించు. ఎందు లయించు. అట్టి యవాఙ్మానస గోచరపదంబు నాశ్రయింతు.

అతఁడు నాపతియనియు నితఁడు నాకుమారుఁడనియు నామగఁడు గోకులంబున కధిపతియనియు నే నేలికసానిననియు నీ గోపికలు గోధనంబులతోడి గోపాలురు నావారనియు నిట్టి భ్రాంతమతియెన్వాని మాయచే జనించు నట్టి యీశ్వరుఁడే నాకు దిక్కుగుఁగాతమని తత్త్వమెఱింగి స్తుతించు యశోదకు మరలఁబుత్ర స్నేహమయంబైన మోహంబు గల్పింపఁ గృష్ణుండు వైష్ణవమాయ ప్రయోగించెను.

యశోదయు నెప్పటియట్ల బాలుని దొడపై నిడుకొని చుబుకంబుపుడికి ముద్దాడుచుండెను. మూఁడు వేదంబులు నుపనిషత్తులు సాంఖ్యయోగంబు నేమహాత్ముఁ గీర్తించు నట్టి పరమపురుషుని యశోద తన తనయుఁడని తలంచుచుండెను. అనినఁ బరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె.

—: యశోదానందుల పూర్వజన్మ వృత్తాంతము :—

దేవకీ వసుదేవులు గొప్ప తపస్సు చేయుటచేఁగదా వారికి భగవంతుండు సుతుండయ్యెను. అంత తపస్సు చేసినవారికిని నతని ముద్దుముద్దు చూచు భాగ్యంబుగాని కడుపాఱఁ గుమారునకుఁ బాలిచ్చు సదృష్టము తల్లికిఁగాని లేకుండఁగా నందయశోదల కేమి పుణ్యంబుకతన నట్టి భాగ్యంబు సమకూరె ననిన శుకముని యిట్లనియె.

వసువులలో ద్రోణుఁడను వాఁడు ముఖ్యుఁడు. అతనిభార్య ధర. బ్రహ్మ వారి కిట్లనియె. శిష్టరక్షణార్థము దుష్టశిక్షణార్థము విష్ణువు భూలోకంబున నవతరింపగలఁడు. సాక్షాద్భగవంతుని క్షీరప్రదానరూపమున నర్చించి తరింపఁగోరి ఋషులు గోవులై జనింతురు. అప్సరసలు గోపికలయ్యెదరు. కావున మీరిరువురు గోరక్షణార్థము భూమిపై జన్మింపుఁడు. అనిన వారిట్లనిరి.

దేవా! హరిభక్తిశూన్యులై భూమిని సంసారియై జనించుట దుఃఖముల పాలగుటకే కదా. సంసారపారావారముఁ దరింప గోవింద

పదారవింద ధ్యానంబె నావయగు. ఇతరోపాయములు సాపాయములు. కావున మాకట్టి పరమభక్తి నొసంగితివేని ధారణి జనింతుమనిరి. అట్లయగునని బ్రహ్మయు వర మిచ్చె. బ్రహ్మమాట పాటించి వారికిఁ దనయందు స్నేహపూర్వకధ్యానంబు నిలుకడయొనర్ప సట్టి వేడుకలు కృష్ణుఁ డొనర్చుచుండెఁ గాని ధూర్తుండై కాదు. ఆ ద్రోణుండే నందుఁడు. ఆ ధరయే యశోద. గోప గోపాలికల యెడ నట్లు వర్తించుట కిదియే కారణము.

అవల నొకనాఁడు పనికత్తెల నితరకార్యముల కనిచి యశోద తాను స్వయముగఁ బెరుఁగు చిలుకుచుండెను. చీర బిగియ నొడ్డాణంబు పెట్టి సవ్యాపసవ్యంబుగఁ గవ్వపుఁ ద్రాడీడ్చు రయంబునఁ గంకణంబులు కదలాడ హారంబులు తూఁగాడఁ బుత్రస్నేహంబున స్రవించు చనుఁబాలఁ బయ్యెద తడియ మోమునఁ జెమ్మట లొడియఁ గొప్పునఁ దుఱిమిన విరులు రాలఁ బ్రేఁటకొంగు వేల నిలఁబడి పెరుఁగు చిలుకు తల్లిం జేరి చీరచుంగులుపట్టుకొని యెగఁబ్రాకుచుఁ బాలిమ్మని బలాత్కరించుచు నామె యాలసించిన సైఁపక కృష్ణుండు కవ్వమును బట్టికొనియె. అంతఁ దల్లియు నవ్వుచుఁ గూర్చుండి పాలిచ్చుచుండెను. ఈలోఁ బొయ్యిపైఁ గాఁగెడిపాలు పొంగి పొయ్యిపాలుగా నున్నఁ జూచి బాలుని నేలవిడిచి యామె లేచిపోయెను. తాను దీరఁ ద్రాగుటకుముందే తల్లి లేచిపోయెనని కోపించి యధర పల్లవంబులు గదల దొంగయేడ్పు లేన్చుచుఁ గన్నీరు కార్చుచు దాపుననున్నఁ గుండ్రాతిం గొని పెరుఁగుకడవ పగులనడిచి కొంత క్రొత్తవెన్న గొని వేఱొక యేకాంతస్థలమునకుఁ బోయి దానిఁ దినుచుండె.

ఇంతలో యశోద వచ్చి శకలంబులైన దధి ఘటంబుఁ గాంచి యిది కృష్ణుని చేష్టయే యని తలంచి యతనివెదుకుచుఁ బోయి యొకచోట ఱోటిపైఁ గూర్చుండి వెన్న తాను దినుచు మిగిలినది క్రోఁతికిఁ బెట్టుచు నవ్వుచుఁ దన దొంగతనంబుఁ దలఁచి బిత్తఱిచూపులు

నూచు నబ్బాలు శిక్షపాలు గావింతమని కేలఁ గోలఁగొని యతని డాయఁ బోయెను. ఇట్లు తన్నుఁ గొట్టుటకు బెత్తమునుగొని చనుదెంచు తల్లిని గని బెదరి బెదరి చూచుచుఁ బోలుదిగి తొలఁగిపోవ నిట్టట్టు పాఱిన వెన్నుని బట్ట నామెయు వెన్నడించి యిట్లనియె.

కృష్ణా కానీ కానీ నీ వింతటివాఁడవా? నేనెన్ని చోటుల నెన్నియో చేష్టలు చేయుచున్నను నన్నుఁ గనిపట్టి పట్టినవారు లేరు. దండించినవా రంతకుఁ బూర్వమే లేరు. ఆసి యెవ్వరి వెఱపులేక నీ యిచ్చవచ్చినట్లు పెచ్చుపెరిఁగి మిన్ను మన్ను నేకంబుగ సంచరింపఁ జూచెదవు. నే నెవ్వతెనో యెఱుఁగవు కాఁబోలు. అందఱవంటి దానఁగాను. నేను నిన్నుఁ బట్టవలయునని మనసు పెట్టిన నీవు తప్పించుకొని యెందుఁ బోఁగలవు? అని యదలించుచు వెంటఁ బోవుచుఁ గొడుకు నడవడిఁ దలఁచి యిట్లని తలపోసె. ఎట్లు పిసిని జక్కఁబెట్టుదును. బాలుఁడుగదా యని యూరకుండమనిన పిఁడు చేయు చేష్ట లేపెద్దవారును జేయరు. భయముకలిగి వర్తింప బెదరింతునందునా పిఁడొకఁడే కదా. పోనీ మంచిమాటలచే బుద్ధి చెప్పుదమనందునా తనబుద్ధి తనదేగాని యితరులబుద్ధికి పను లేఁడు. కదలనీయక యింటిలోనే యుండఁ జేయుదమనందునా యిక్కడ నున్నట్టే యుండునుగాని యన్ని చోటుల పిఁడే. ఎవ్వరైన నెందైనఁ దనపేరు తలఁచిరా సరి యక్కడికిఁ బరువెత్తిపోవుచుండును. భయ మెఱుఁగడు. భక్తి యెఱుఁగఁడు. ఒక్క కర్మము నెఱుఁగఁడు. ఎట్లైన బోనిమ్మని యూరకుందునందునా యెక్కసక్కెములాడును. ఎట్లు పిసి దండింతును. ఎట్లు లోపఱుచుకొందును. పిల్లవాండ్రను ముద్దు సేసితిమా మొద్దు లగుదురు. కావున బాలురకుఁ దాడనమే పథ్యము కాని లాలనము కాదు. అని నిశ్చయించి సెలకోల జళిపించి కృష్ణా! నిలునిలుమని యదలించి యయ్యించుఁబోణి తుఱుముననుఁ దుఱిమిన విరులు రల కూడంబోయిన నమ్మామా బాలకుండును గజ్జెలు

మువ్వలుఘల్లుఘల్లనఁ, జూచుస్త్రీలు నవ్వఁ, గన్నులు నులుముకొనుచు నేడ్చుచుఁ బరువిడియె. యశోదయు బాలా! నిలునిలు మెందేగెదవని యోగీంద్రమనంబులును వెనుకొనలేని యతని నయ్యతివ వెనుకొని స్తంభాదు లడ్డంబయిన వానిమాటునఁ బట్టనీక యిటుటుదిరుగుచు నమ్మా యింక దొంగిలబోనే యీతప్పు క్షమింపవే యని యేడ్చుచుఁగంటికాటుక మొగంబున నలియఁ గన్నులు నులుముచు నే దిక్కునుండి తల్లివచ్చి తన్నుఁ బట్టుకొనునోయని క్రేగంటఁ జూచుచు సందు దొరికిన నుఱుక యత్నించుచునుండు కృష్ణు నెయిది పట్టుకొనితల్లి కడుపుకానఁగొట్టఁ జేతులాడక కట్టఁ దలఁచెను.

ఇట్లు తనపట్టిని బట్టుకొని కట్టదలఁచి వాని మొగం బట్టెచూచి యోహో వీరు శ్రీకృష్ణమూర్తులా? అయ్యో పాపము వీ రెన్నఁడైన వెన్నముఖ మెఱుఁగుదురా. దొంగిలించినఁ గాని వీరికిఁ గడుపు నిండదు గదాయని కన్నుల బెదరించుచుఁ జేతికోల నేలవైచి కృష్ణా! నన్నుఁ బట్టుకొనఁ జాలు వారు లేరని నీకింత గర్వమా? ఏమో పోనీ యని యుపేక్షాభావంబున నూరకుండిన నీయిచ్చవచ్చినట్లు సంచరించెదవుగాని పట్టుమని వూని పట్టఁదలఁచిన నిన్నుఁబట్టుట కష్టమా? ఇతరులకు నీవు పట్టుపడకుందువుగాక నాకుఁ బట్టుపడకుండఁ గలవా. నిన్నుదడించువారు లేరని కదా నీయిచ్చ చొప్పున నెందైనఁ దిరిగెదవు. ఒక్క చోటనైన గుణముగలిగి వర్తింపవు. నీవు మట్టుమర్యాద లెఱుఁగవు. మనకంటె వీరు పెద్దలుగదా లోపడియుండవలెనని యుండవు. కొంచె మేమఱిన నెందేనిఁ బోయెదవు. ఇట్టినిన్నుఁగలకాల మొక్కరీతిఁ గనిపట్టియుండ నెవరికి సాధ్యము?

కం. పట్టుకొన నెట్టివారికిఁ
బట్టీనఁట పోయెదంట పలువోకల నిఁక
బట్టఁగ మదిఁ బట్టినచోఁ
బట్టీ! నినుఁ బట్టు టొక్క బ్రహ్మాండంబే.

అని క్రిందుమీఁదులును బూర్వాపరంబులును లోవెలులును లేక జగద్రూపంబున సర్వత్ర సర్వదా నిండియుండు నమ్మహామహుఁ లీలామానుషవిగ్రహు సామాన్యబాలుఁడను భ్రాంతి నొక చిఱు త్రాటఁగట్టఁదలఁచి యమ్ముగ్ధ యొకత్రాడు తెచ్చి యతని నడుమునకుఁ జుట్టిన నది రెండు వ్రేళ్లు కొఱఁతపడియె. మఱియొకత్రాడు దెచ్చి చేర్చి కట్టిన మరల నంతయే కొదనపడియె. మఱియొక పొడుగుత్రాడు తెచ్చి చేర్చిచుట్టిన నంతయు తక్కువపడియె. ఇట్లింటనుండు త్రాళ్ళన్నియుఁ దెచ్చి చేర్చి చుట్టినను బొట్టతిరిగి రాదయ్యె. అనేకకోటి బ్రహ్మాండంబులు నిడియుండు నాకడుపును గట్ట నెవ్వరి తరంబు. చూచుచున్న గోపికలెల్ల నాశ్చర్యరసమగ్నలై నవ్విన యశోదయు నవ్వె. కట్టవలయునని పట్టుపట్టి నెట్టన యింటనున్న త్రాళ్నన్నియుఁ దెచ్చియును జాలమిని వెక్కసపడి గాసిని రోఁజుచున్న యామె డస్సెనని యెఱింగి భక్తపరాధీనుండును భక్తజన కామితార్థప్రదుండును గావున నాయమకోరిక దీర్పఁదలఁచి కట్టుపడియె. భగవంతునకు భక్తులపై నెంత వాత్సల్యమో కంటివా! తోడై తిరిగెడు హరుఁడును వక్షస్థల వాసిని లక్ష్మియుఁ దనూభవుండైన బ్రహ్మయు ముక్తిప్రదుండగు భగవంతునిచే నాగొల్ల యిల్లాలువడసిన మన్నన వడయఁజాలరు. నారాయణుండు భక్తులను దన బిడ్డలవలెఁ దలంచు. భక్తియుక్తులకుఁ జిక్కినట్లు భగవంతుఁడు జ్ఞానులకును మహానులకును యోగరక్తులకును విరక్తులకును జిక్కఁడు.

ఈప్రకారము యశోద తన్ను ఱ్రోని ఱోలికిఁగట్టి యింటి పనులుసేయ లోపలికిఁ బోవుటయుఁ గృష్ణుండు ఱోలీడ్చుకొని యాప్రాంతమునయున్న రెండు మద్దిచెట్లనడుమ దూరిపోయెను. ఆరెండు వృక్షంబులు ఱోటికిఁ బట్టుకొని విఱిగి నేలఁ గూలెను. ఇట్లవి వ్రేళ్ళతోడఁబెల్లగిలి కూలిన నందుండి యిరువురు గుహ్యకులు కుబేర పుత్రులు నలకూబర మణిగ్రీవు లనువారు నారదశాపముక్తులై నిజ

రూపంబుల వెలువడిరి. అనిన శుకయోగీంద్రుం జూచి యుత్తరాకుమా
రుం డిట్లనియె.

మునీంద్రా నలకూబర మణిగ్రీవుల కలిగి నారదుఁడేల శాప
మిచ్చె? ఋషియెడ వారట్టి గర్వాలైన దోషమేమి చేసిరి చెప్పవే
యనిన వ్యాసనందనుఁ డిట్లనియె,

నలకూబర మణిగ్రీవులు కుబేరుని పుత్రులును రుద్రుని యను
చరులును గావున మదోన్మత్తులై యొకనాఁడు గానలోలలగు లోలా
క్షులతోడం గూడి కైలాసశైల ప్రాంతకాంతారముల విహరించి మది
రాపానమత్తులౌట దిగంబరులై గంగనడుమున జలక్రీడ లాడుచుండిరి.
అట్టి సమయంబున నారదమహర్షి యా మార్గమునఁ బోవఁ బూవుఁ
బోణులాయనం జూచి భయభక్తులచేఁ దటాలున వస్త్రములు ధరిం
చిరి. వా రిరువురు మదిరాపానమదంబున వస్త్రంబులు ధరింపకుం
డిన వారిమదంబు సదమదంబుఁ జేసి వారి ననుగ్రహింపఁగోరి శపించు
వాఁడై యిట్లనియె.

విషయసుఖము లనుభవించువారికి నైశ్వర్యమదమువలె స
త్కులప్రసూతియు, స్త్రీసాంగత్యము, పానసేవనము, విద్య, సౌంద
ర్యములోనగువానివలనఁ గలుగు గర్వము బుద్ధినాశ మొనర్పఁ
జాలదు, కులీనుఁడనను గర్వమునకును, స్త్రీలోలతకు, జూదమున
కును, పానమునకును నైశ్వర్యమే కారణము. శ్రీమదంబువలన నశ్వర
దేహము జరాదిరహితమని భావింపఁబడు. దానివలన నవశీకృత
చిత్తులగుదురు. దానిచే నింద్రియ లోలత్వ మెక్కుడగు. దానివలన
దయాహీనత సంభవించు. దానివలన జంతుహింస గావింపఁబడు.
నరదేవ భూదేవ స్వర్గదేవ నామంబు లీ శరీరంబునకున్నను జీవిత
కాలమునఁ గ్రిమిమల సంయుతమై యవసానంబున భస్మపటలంబో
కుక్కలనక్కల పాలో యగును. ఇట్టి శరీరమును సుఖపెట్టఁగోరి
మత్తుండై విషయాసక్తుండై చరించుచుఁ బరద్రోహం బాచరించి

నరకగామియగువాఁ డెంతటి వివేకి. మరణానంతరం బీ కాయం బెటులైననేమి? జీవద్దశ సుఖానుభవము పాడియకదా యనిన జీవించి యుండునపుడు నీ దేహం బన్నదాతకో తండ్రికో తల్లికో తల్లితండ్రికో విక్రయించుకొనినవానికో బలవంతునకో యగ్నిశునకములకో వశపడియుండు. కావున నియతి రహితంబును బ్రకృతిభవంబునై ప్రకృతి యందు లయించు నీ దేహమం దాత్మభావంబు వహించి మూఢుండు తక్క మఱి యెవ్వఁడు పరహింసఁ గావించు? విజ్ఞుం డెన్నఁ డట్లొనర్పఁడు. శ్రీమదాంధుఁడైన దుష్టునకు దారిద్ర్యంబె పరమాంజనంబు. దారిద్ర్య దుఃఖపీడితుఁడు తన కష్టమువంటి దేకదా యితరుల కష్టమని యాత్మసామ్యమున నెల్లర వీక్షించుచుండు. ముల్లుగ్రొక్క బాధపడువాఁ డట్టిబాధ పరులకుఁ గోరఁడు. అట్టి బాధపడువారి పట్ల ననుతాపము గలిగి యుపకరించును. అట్టి బాధ యెఱుఁగనివాఁడు పరుల బాధ నెఱుంగలేఁడు.

దారిద్ర్యంబునఁ గలుగు మే లింతియగాదు. దరిద్రుం డహంకారరూప గర్వంబువదలి సర్వమదంబులు దొలఁగ నప్రయత్నముగఁ గాయశోషణాదికంబులు గాంచు. అదియే యతనికి నుత్కృష్టతపంబు. నిత్య మాఁకలిచేఁ గృశించిన దేహముగల దరిద్రునకు నింద్రియములు శోషించు. దానివలననే వాఁడు హింస మానును. అట్టి దరిద్రునకే సమదర్శులగు సాధుజనుల సాంగత్యము లభించు. సాధుసంగమమువలనఁ దృష్ణ యుడుగు. తృష్ణయుడిగిన నతఁడు ప్రకృతిసంబంధమైన యశుచిత్వమునుండి విముక్తుండై శుద్ధుండగు. భుక్తిముక్తిప్రదంబుల ముకుందచరణారవిందంబుల డెందంబునఁ బొందుపఱచినవారును, సమయట్ల పనులని సమచిత్తంబునఁ జూచువారును నగుసాధువులకు ధనమదాంధులతోడను దుర్జనులతోడను సజ్జనులకాశ్రయులైనవారితోడను నేమి కార్యము గలుగు? కావున ధనికులగు మీవలన నాకుఁ గావలసిన కార్యమేదియు లేదు. మదిరాపాన

మత్తులును, ధనమదాంధులును, స్త్రీ దాసులునునగు మీ తమో మదం బణంచెద. లోకపాలకు పుత్రులయ్యును దమంబున మునిఁగి విగతవస్త్రులగుటయు నెఱుఁగక దుర్మతులరై చరించుచున్నవారు. కావున మీరిరువురు మద్దిచెట్లై జన్మింపుఁడు. నిరపరాధుల మిమ్ము శపించితినని తపింపకుఁడు. మీ రిట్టి స్థితియందయుండి పూర్ణముగఁ జెడరాదు. మిమ్ము సన్మార్గప్రవర్తకులఁ జేయ మంచి దశకుఁ దేవలయును. కావున మీరు మతిలజ్జలేని యర్జున తరువులై యుండిన నా యనుగ్రహమున మీకుఁ బూర్వజన్మస్మృతి కలుగునుగాక. ఇట్లు నూఱు దివ్యవర్షంబులుండిన వసుదేవసూనుఁడైన శ్రీకృష్ణుఁడు మిమ్ము శాపముక్తులంజేయు. అయ్యవతారమూర్తిని దర్శించి మరల స్వర్గలోకంబునొంది భగవత్పాదారవిందసక్తచిత్తుల రగుదురుగాక యని వచించి నారదుండు నారాయణాశ్రమంబునకుం జనియె. నలకూబర మణిగ్రీవులు మద్దిచెట్లయి పుట్టిరి. భాగవతశిఖామణియైన నారదుండు నా కత్యంతప్రియుం డా సత్యవచను వాక్యంబులు సత్యమొనర్తునని శ్రీకృష్ణుఁడు ఆలోచించుకొని యచ్చటికి వచ్చి యా చెట్ల నడుమఁ దూఱి యీడ్చిన నవి పెళ పెళమను ధ్వనితో వ్రేళ్లతోడఁ బెల్లగిల్లి పడెను. ఆ రెండు వృక్షములనుండి యగ్నిజ్వాలలవలె దిక్కులు వెలిఁగించుచు గుహ్యకులిరువురు వెలువడి లోకనాథుఁడైన మాధవునకు నమస్కరించి యంజలి మోడ్చి యిట్లని స్తుతించిరి.

—: నలకూబర మణిగ్రీవులు శ్రీకృష్ణ స్తుతించుట: —

జగన్నాయకా! కృష్ణా! నీవు కేవల గోపాలబాలుఁడవు గావు. మహాయోగీంద్రుఁడవు. పరమపురుషుండవు. జగత్కారణుండవు. నామరూపాముల వ్యక్తంబైనను నవ్యక్తంబును* నగు నీవి

*ఆకారముచేతను, పేరుచేతను గన్నులలోనగు నింద్రియములకుఁ దెలియ వచ్చినను వాస్తవముగ నట్లు తెలియరానిది.

శ్వంబు సర్వశక్తిత్వము లోనగు కల్యాణగుణంబులుగల నీరూపంబని వేదాంతు లెఱుంగుదురు. సూక్ష్మ చిదచిచ్ఛరీరకుండవై* కారణంబును స్థూల చిదచిచ్ఛరీరకుండవై కార్యంబును నీవ యగుదువు. సమస్తభూతంబులఁ దేహంబులకుఁ బ్రాణములకు మనస్సునకు నింద్రియములకు నియంతవు నీవొకండవే. భగవంతుఁడు నీశ్వరుఁడు నవ్యయుఁడు నగునీవే కాలంబు. సత్త్వరజస్తమోమయంబయి నామరూప విభాగంబులకు ననర్హమగునట్లు సూక్ష్మంబైన మహాప్రకృతివి నీవ. సర్వ ♦క్షేత్రంబుల కధ్యక్షుండవైన పురుషుండవును. క్షేత్రవికారములఁ గలిగించువాఁడవును నీవ. చెవులులోనగు నింద్రియములచే గ్రహింపఁబడు శబ్దములోనగు గుణములు చెవుల నెట్లు గ్రహింపఁజాలవో యట్లు లింద్రియములకుఁ బూర్వమేయుండునిన్ను నింద్రియము లెట్లు గ్రహింపఁగలవు! కావున యోగియగువాఁడు నిన్నుపాసింపఁగలఁడు గాని ప్రాకృతగుణయుక్తుండైన పురుషుం డుపాసింపలేడు. జ్ఞానాది షడ్గుణపూర్ణుండవును. సాధుపరిత్రాణార్థంబు వసుదేవసుతుఁడవైన వాఁడవును సర్వకర్తవును జీవుల కెఱుఁగరాని మహిమగలవాఁడవును స్వప్రకాశుండవును నగునీకు నమస్కారంబు. కర్మబద్ధ శరీరులలో నకర్మకృత శరీరుండవగు నీవసమానంబును నభ్యధికంబును దేహుల కసంభావితమునగు వీర్యంబులచే నవతారమూర్తివని తెలియనగుదువు. సమస్తలోకముల కుద్భవమును గైవల్యమును గలిగింప నంశభాగయుతుండవై సర్వకామితప్రదుండవగు నీనవతరించితివి. పరమ కల్యాణమూర్తివియును విశ్వమంగళ కారణుండవును వాసుదేవుండవును క్షుత్తు, తృష్ణ, శోకము, మోహము, జరా, మృతులను షడూర్మలు లేనివాఁడవును యదుపతియునగు నీకుఁ బునఃపున స్సాష్టాంగ

* అచిత్తు — ప్రకృతి, చిత్తు — జీవుఁడు. ఈరెండును భగవంతునకు శరీరమగు సూక్ష్మదశ యందుఁ గారణముగ భగవంతుఁడుగ నుండువాఁడే కార్యదశ యందు ప్రపంచముగఁ దోఁచు. ♦క్షేత్రము — దేహము

నమస్కారములు. నిరవధికానందశాలీ! నీదాసునకు దాసులమైన మా కనుజ్ఞ నిమ్ము. నారదమహాముని యనుగ్రహంబున నీదర్శనంబు లభించె. దేవా! యొక్క విజ్ఞాపనంబు. నిన్నర్చించి ధన్యులమగుటకైకదా నీవు మాకుఁ గరణకళేబరంబు లొసంగితివి. అందు సర్వదా నీ పద్యంబులందే వీనులు, నీమూర్తియందే చూపులు, నీ కైంకర్యమునందే హస్తంబులు, నీపాదారవిందంబులమీఁదనే శిరములు, నీమీఁదనే చిత్తములు నిలువ ననుగ్రహింపుము. అని స్తుతించిన గుహ్యాకులంజూచి యులూఖలబద్ధుండైన గోపాలబాలకుండు నవ్వుచు వారి కిట్లనియె.

కరుణామయుండగు నారదుండు శ్రీమదాంధులగు మిమ్ము ననుగ్రహింపఁగోరి వాక్యరూపంబున దండించుట యెఱుఁగుదు. సూర్యదర్శనం బగువఱకు నంధకారంబు కన్నులఁ బీడించునట్లు సాధువులు సమచిత్తులు నాభక్తులగువారి దర్శనము లభించువఱకే సంసారబంధంబు బాధించు. సర్వోత్కృష్టుండనైన నాయందు మీకు మనస్సు నిలిచెఁ గావున నిఁక మీరు స్వస్థచిత్తులరై మీగృహంబుల కరుగునది. అనిన వారును నమ్మాయామానవమాణవకునకుఁ బ్రదక్షిణనమస్కారంబులు గావించి యుత్తరదిశ కేగిరి.

తే. తనదు నామంబె భవబంధ తతుల నెల్లఁ
ద్రుంచునఁట; యట్టివాఁడు ప్రేమించుఁ బోఁడి
దివిరి చిఱుత్రాటఁగట్టినఁ ద్రెంపనొల్లఁ
డౌర యాతని సౌశీల్య మతెఁడ యెఱుఁగు.

అమ్మణ్ణి—గుహ్యకులను శపించుటవలన నారదునకుఁ దపోహాని యయ్యెనా లేదా?

తండ్రి—లేదు. కోపముచే శాపమిచ్చిననే తపస్సునకు హాని. గుహ్యాకుల దుర్వృత్తికి నారదునకుఁ గోపముమాఱు పరితాపము

గలిగెను. వీరిట్లు దురాచారులై చెడిపోవుచున్నారనియె పరితాపము. కామాసక్తపురుషులు దిసమొలలతో నందు బహిరంగముగ నారబయల నందుఁ బట్టపగలు స్త్రీల సన్నిధిలో స్నానముఁ జేయుట యెంతటి కామమదమును దెలుపును? అందుఁ బూజ్యులైనవారిని జూచి వస్త్రములు ధరింపక యెట్ట యెదుట నట్టె నిలుచుట యెట్టిదో మీరే యూహింపుఁడు. కావునఁ జక్కఁబఱుచు శక్తిగల శిష్టులు దురాచారముల నణఁపవలయుట విధి. అట్లు చేయకుండినఁ దక్కినవారును వారిని జూచి చెడుదురు. ఆ దోషము శిష్టులఁ గొట్టును. కావున నారదుఁడు వారిని దండించి చక్కఁబఱిచెను. ఒకఁడు దొంగతనము చేసిన వానిని శిక్షించు న్యాయాధిపతికిఁ బాపము వచ్చునా? బాలుర దండించు తండ్రికిఁ బాపము వచ్చునా? ఆవల వినుఁడు.

అంత నక్కడ నందాదులైన గోపకులు వృక్షములు గూలిన మహాధ్వని విని పిడుగులుపడుటగా శంకించి యచ్చటికి వచ్చి నేలఁ గూలిన రెండు వృక్షంబులను వానినడుమ ఱోలీడ్చుచున్న కృష్ణునిం జూచి కారణం బెఱుఁగఁజాలక యక్కడఁ గ్రీడించు బాలుల నెట్లీ తరువు లురలెనని యడిగిన వా రిట్లనిరి. అయ్యా! యీ బాలుఁడు ఱోలీడ్చుకొనివచ్చి యీ వృక్షంబుల నడుమఁ దూఱి ఱోటి నడ్డంబుగ వానిని వేసి యీడ్చిన నవి కూలె. అంతియ కాదు. వానియందుండి యిరువురు పురుషులు వెలువడఁగంటిమి. అనిన నవి బాలభాషణంబులని నమ్మకయు వారేల తేరకుఁ గల్లలాడెదరనియుఁ దలఁచుచుండిరి. నందుఁడును గట్లువిప్పి కృష్ణునిఁ దల్లి కిచ్చె. తన చేత మఱుఁగు పఱుపఁ గృష్ణుఁడు నవ్వుచుఁ గేకలు వేయుచు గంతులు పెట్టుచు నాడుకొనఁ బోయెను.

అంతనొకతె పండ్లోయమ్మ పండ్లని యమ్మవచ్చుటయుఁ గృష్ణుం

డమ్మకడకేగి యమ్మా నాకిన్ని బియ్యము పెట్టుము పండ్లుకొనెద నని దోసెఁడుబియ్య మిప్పించుకొనిపోయి యో పండ్లమ్మా రారా పండ్లు కొనెదనని పిలిచెను. అదియును బండ్లబుట్ట తెచ్చిన నాగింజలు దాని బుట్టలోఁబోసి యాపండ్లు తీసికొనెను. ఆపండ్లది గంపయందుఁ జూడ గంపనిండ రత్నము లుండెను.

ఇట్లు కృష్ణుండు గోపికలు చేతులు తట్టి యాడించిన నాడుచుఁ బాడుమనఁ బాడుచు బొమ్మవలె నటించును. కృష్ణా యదిగో నచ్చటనుండు పీఁటతెమ్మనిన గోపికలకుఁ బ్రీతిగూర్ప దానిని మోయలేని వానివలె నటించుచు విజ్ఞులగువారు భగవంతుఁడెట్టి భక్తపరాధీనుఁ డని యబ్బురపావ శ్రమించి తెచ్చియిచ్చును.

ఒకనాఁడు రామకృష్ణు లిరువురు గోపబాలకులం గూడి యమునా తీరంబున నాడుచుండ నందుఁడు బాలకులం దోడ్కొని రమ్మని యశోదం బంచిన నామెయుఁ జని కృష్ణా రారమ్మా. ఆఁకలిదప్పి తెలియఁగని యాటలుండునా? తండ్రీ! ప్రొద్దునఁ గదా యిన్ని పాలు త్రాగితివి. నీతండ్రి భోజనమునకై వచ్చి కృష్ణన్న యేఁడీయని యడుగుచున్నాఁడు. నీవు లేకున్న నిల్లు బీచుమనియున్నది. రారమ్మా. రామా! తమ్ముని దోడ్కొనిరమ్ము. గోపాలకులారా! మీరును మీ యిండ్లకుఁ బోయి భోజనము చేసి రండు. కృష్ణా! యిదియేమి దేహమంతయు దుమ్మునిండి బూఁజులు రేఁగుచున్నది. ఈదినము నీజన్మనక్షత్రము. తలంటు పోసికొని క్రొత్తవస్త్రములు కట్టుకొని సొమ్ములు పెట్టుకొని పెద్దలకు నమస్కరించి బ్రాహ్మణులకు నీవు గోవులను దానము చేయవలయును. చూడు చూడు. ఆ పిల్లవాండ్రందఱిట్లు జలకమాడి తల్లుల యొద్ద నున్నారో యని రామకృష్ణుల నిరువురను జెరియొక కేలఁ బట్టుకొని యింటికిఁ దోడి తెచ్చెను. ఈవిధముగ యశోద లోకపితామహుని దన సుతుఁడని లాలించుచుండె. ఔరా యామె పుణ్యము.

## — : నందాదులు బృందావనమునకుఁ బోవుట : —

అంత గోకులంబున నుత్పాతంబులు పెక్కులు పుట్టఁగఁ జూచి జ్ఞాన వయోవృద్ధుఁడును దేశకాలార్థ తత్త్వజ్ఞుండు నగు నుపనందుఁ డనువాఁడు రామకృష్ణుల యభ్యుదయంబుఁ గోరి గోపకుల నందఱఁ జేరఁ జీరి యిట్లనియె.

మిత్రులారా! యిచ్చటఁ బ్రజానాశ హేతువులగు నుత్పాతములు పెక్కులు పుట్టుచున్నవి. బాలహంత్రియగు రాక్షసిచే మరణింపక యీబాలుఁ డెట్లో బ్రతికెను. వారికటాక్షముచే బండి పీనిపైఁ బడదయ్యె. సుడిగాలి రక్కసుఁ డిక్కుమారు మింటికిఁ గొని పోవ రాతిమీఁదఁ బడినపుడు నారాయణు దయచే మరణగండము దప్పెను. చెట్లనడుమఁ జిక్కినపుడు ప్రాణము దక్కుట మిక్కిలి యాశ్చర్యము. ఇంకను విపరీతపు టుత్పాతములచే గోకులమున వారికిఁ గీడు మూఁడక ముందే యీ స్థలము విడిచి యొండైన నొండు చోటికిఁ బోవుట మేలు. బృందావనమను క్రొత్త వనము గలదు. అందు గో గోపాల గోపాలికలు సుఖజీవన మొనర్ప వచ్చును. వలసి నంత పచ్చికయు నీళ్లును బొదలును గలవు. ప్రయాణమున కీదిన మే సుదినము. కావున నందఱు శకటంబులపై వారివారి పదార్థంబు లెక్కింపుడు. మీరు సమ్మతమేని గోవులను దోలుకొని మీరు ముందుపొండు.

ఆ పలుకులు విని యందఱొక్కమాటగా మేలుమేలని ప్రశంసించిరి. వెంటనే వృద్ధులను బాలురను స్త్రీలను నుపకరణంబులను బండ్లకెక్కించి గిత్తలఁగట్టి యందఱు పయనించిరి. గోపకులు చాపంబులుపూని వారిని గాచుచు గోవులఁ దోలుకొని వాద్యధ్వనుల తోడఁ బయనించిరి. గోపికలును శకటంబు లెక్కి కృష్ణు కథలు చెప్పికొనుచుఁ బోయిరి. యశోదా రోహిణు లొక్క శకట మెక్కి తమ కుమారుల నొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని ముద్దులాడుచుఁ బోయిరి. ఇట్లు సర్వ

కాల సుఖావహంబును నాశ్రితప్రాణి బృందావనంబును నైన బృందావనంబుఁ ప్రవేశించి శకటంబుల నెల్ల నర్ధ చంద్రాకారంబుగ నిలిపి విడిదిపట్లు కుదుర్చు కొనిరి. రామ కృష్ణులును గోవర్ధనంబును యమునా తీరంబున నిసుక దిన్నెలను జూచి మిగుల సంతోషించిరి.

రామకృష్ణులు మందపట్టు సమీపంబునఁ దక్కిన గోపబాలకులంగూడి పిల్లఁగ్రోవు లూఁదుచు నొక్కొక్క సారి గంతులు వేయుదురు. ఒక్కొక్క సారి వాదము లాడుదురు. ఒక్కొక్క పరి యుసిరి కల మారేడు కాయల నొకరిపై నొకరు మొలగజ్జలు మొఱయ నెగుర వేయుదురు. ఒక్కొకమాటు తీఁగలమని మోకాళ్ళ నడచుచు ఱంకెలు వేయుచుఁ గోడెలమని యొకరితో నొకరు ఢుమ్ములాడుచు నానా జాతి పక్షిధ్వను లొనరించుచుఁ గ్రీడించుచుండిరి.

## —: వత్సాసుర వధ :—

ఒకనాఁడు యమునా తీరంబున దూడల మేపుచు గోపాల బాలకులం గలసి రామ కృష్ణులు క్రీడించు చుండఁ గంసుని పంపున నొక్క రక్కసుండు వారిని హింసింపఁ దలచిఁ దూడలలోఁ దానొక్క దూడయై సంచరించు చుండఁ గృష్ణుం డెఱింగి బలరామున కా మర్మ్మం బెఱిఁగించి తా నేమియుఁ దెలియని వాని వలె నూరకుండెను. బలరాముఁడును మెల్లనఁ బోయి యా మాయ దూడను గదసి తోఁక తోడ వెనుకటి రెండు కాళ్ళను బట్టి గిర గిర ద్రిప్పి యొక వెలగల చెట్టు బోదె మీద విసరి మోదెను. ఆ ఘాతమున నా చెట్టు తోడ రాక్షసుఁడు భయంకర దేహముతోఁ జచ్చి పడెను. బాలకు లందఱు మేలు మేలని పొగడిరి. దేవతలును మెచ్చి పుష్పవృష్టి గురియించిరి.

## —: బకాసుర వధ :—

సర్వ లోక పాలకులు వత్స పాలకులై యొకనాఁడు చలుదులు కట్టు కొనిపోయి యమునా తీరంబునఁ గ్రేపులఁ మేపుచు సంచరించు

చుండిరి. తక్కిన గోపాలబాలకులు వారివారి లేఁగలను వారువారు వేఱు వేఱుగ మేపి వానికి నీళ్లు ద్రావను దాము చలుదులు భుజింపను దాపున నుండు నీటి రేవునకుఁ బోయిరి. అచ్చట విఱిగి పడిన కొండ శిఖరమువలె భయంకరరూపము ధరించి బకుఁడను రక్కసుఁడు కొంగవేషము వేసికొని కూర్చుండియుండెను. పిల్లవాండ్రందఱు అచ్చటికిఁబోవ వాఁడు తటాలునఁ బైబడి కృష్ణుని మ్రింగెను. బకము శ్రీకృష్ణుని గబళించుట చూచి రామాది గోపబాలకులు ప్రాణము లేని యింద్రియములవలె నైరి. బకుండును కృష్ణుని మ్రింగు నెడ నంగిట నిప్పుపెట్టి కాల్చినట్టయి మ్రింగరాకున్నఁ జూచి వెడలఁగ్రక్కి ముక్కుచే నొక్కి చంపఁ జూచెనుగాని కృష్ణుండును తటాలున నా కంసమిత్రుని ముక్కును రెండు చేతులఁ బట్టి గణుపులేని గడ్డిని చీల్చినట్లు లతని రెండుగ నిలువుగఁ జీల్చెను. బాలురు మేలుమేలని మెచ్చిరి. బృందారకులు నందన మందార మల్లీసుమ బృందంబులఁ గురియించిరి. రామాది బాలకులు మరలఁ బ్రాణమువచ్చిన యింద్రియములట్లువలె కృష్ణునితోడ మందకు వచ్చి జరిగిన వృత్తాంతంబంతయుఁ బెద్దవారికిఁ దెలిపిరి. మృతుఁడైన వాఁడు పునరాగతుఁడై వచ్చినఁ జూచిన ట్లందఱు విస్మయ దృష్టులతోఁ గృష్ణునిఁ జూచి యౌరా యీ చిన్నవాని కెన్ని గండములు. నారాయణు కృపవలన నన్నియుఁ దప్పి పోయెను. చెఱుపఁదలఁపకు చెడెద వన్నట్లు కీడు చేయఁ బూనిన వారే యగ్నిలోఁ బడిన మిడుతలవలె గీడునొందిరి. ఔరా! బ్రాహ్మణవాక్యము తప్పదయ్యె. భగవంతుఁడగు గర్గుఁడేమి జరుగునని చెప్పె నట్లయగుచున్నది. అని నందాదులు మందలింప నెల్లరును విని రామకృష్ణుల చరిత్రంబులు వర్ణించుచుఁ దత్సుకృతంబున సంసారదుఃఖ మెఱుఁగని వారైరి. ఇట్లాకుమారులు నిలయముల నిర్మించుట సేతువుకట్టుట క్రోఁతుల వలె నెగురుట లోనగు నాటలాడుచుఁ గౌమారంబుఁ గడపిరి.

ఒక్కనాఁడు కృష్ణుండు వన విహార వాంఛ నుదయంబున లేచి

కొమ్మూంది మిత్రుల నెల్లలేపి దూడలం దోలుకొని పోయెను. ఆయన వెంట వేలకొలంది గొల్లపిల్లవాండ్రు చిక్కంబులు పిల్లంగ్రోవులు కొమ్ములు తీసికొని వేలకొలందిగనున్న దూడలం గృష్ణుని దూడలలోం గలిపి తోలుకొనిపోయిరి. ఇంటం దల్లులు గాజుపూసలు పాలపూసలు గురిగింజలు మణులు లోనగువాని దండలం దమ్ము నలంకరించియు వారు చిగురుగుత్తులచేతను బండ్లచేతను బూలచేతను నెమలిపురుల చేతను రంగుల తాలచేతను నలంకరించుకొనిరి. ఆ బాలు రొకరిచిక్కంబుల నొకరు దాంతురు. కనుంగొనిరేని దూరంబున విసరి వైతురు. వైచిన వానిని మరలం దెచ్చియిత్తురు. వన శృంగారంబు వీక్షించు కౌతుకంబునం గృష్ణుండు దవ్వేగిన నేను ముందు నేను ముందని పంతులు వేసికొని యాతనం దాంకం బరువెత్తుదురు. కొందఱు పిల్లంగ్రోవులు వాయింతురు. కొందఱు కొమ్ము లూందుదురు. కొందఱు తుమ్మెదలవలె ఝుంకారింతురు. కొందఱు కోకిలలవలె గాన మొనర్తురు. కొందఱు మింటంబోఁవు పక్షుల నీడల వెంటం బరువెత్తుదురు. కొందరు హంసల వెంట నడతురు. కొందరు కొంగల బడి కూర్చుండుదురు. కొందఱు నెమిళ్ళతో నాడుదురు. కొందఱు క్రోంతుల తోంకలు పట్టి లాగుదురు. అవి చెట్లు లెక్కినం దాము నెక్కుదురు. అవి గుఱ్ఱు మనినం దాము వెక్కిరింతురు. కోటకొమ్మ లూఁగుదురు. నీళ్ళలో మునింగి కప్పలతోడం గుప్పిగంతులు వైతురు. ఒకరి ప్రతిబింబముల నొకరు చూచి నీమూతి వంకర నీముక్కు వంకర నీది పొట్టకన్ను నీదిమిట్టనొసలని వెక్కిరింతురు. ప్రతిధ్వనులం గావుల కేగి తిట్టుదురు. ఇవ్విధమున బ్రహ్మసుఖానుభవమున సాధువులు దాస్యంబుచేయు పరదైవంబుతో మాయామానవ బాలకులతో నా గొల్లపిల్లవాండ్రు పూర్వపుణ్యపుంజ పరిపాకంబున గ్రీడించిరి. అనేక జన్మంబులం దపోయోగాదిక్రియల శ్రమించి పూత మనస్కులైన యోగులును నెవ్వనిపాదరేణువు నొందజాల రట్టి

మహానుభావుఁడు తానై గోపాలురకుఁ బ్రత్యక్షంబుగ గోచరించెఁ. ఆహా! యేమి వారి భాగ్యాతిశయము!

## —: అఘాసుర వధ :—

ఇట్లు వారు యథాసుఖంబుగఁ గేళీలోలురై చరించుట చూపోపక పూతనా బకులకు సోదరుండగు నఘుండు కంసప్రేరితుండై చనుదెంచె. ఈయఘాసురు భీతిని నమృతంబుఁ గ్రోలిన యమరులును దమ బ్రతుకుపాటును సందేహించుచు వాని మృతి కెదురు సూచుచుందురు. అట్టి దుష్టుఁడు రామకృష్ణులను దక్కిన బాలురను యము పాలి కనిచి నా సోదరుల ఋణంబు దీఱఁ దిలోదకంబులు విడిచెద. ఏ రిరువురు సమసిగా ఘోషనివసనంబు మసనంబగు. బిడ్డలు గదా లోకంబున జీవులకుఁ బ్రాణము. ప్రాణముపోయిన దేహవిషయంబు చెప్పనేల. అంతతోఁ గంసుని పగయును నాపగయును దీఱునని తలంచి యోజనంబు నిడివియు పర్వతమునంతటి లావును గలిగిన కొండచిలువయై గుహవలె నోరు విచ్చి వారు వచ్చు మార్గంబున వారి భక్షింపఁ గోరి పడి యుండె. వాని క్రిందిపెదవి భూమిని పై పెదవి మేఘములను దాఁకుచుండె. కోఱలు కొండశిఖరములను, నోరు చీఁకట్లు గ్రమ్ము గుహను, నాలుక విశాలమైన బాటను, నిశ్వాసములు పెనుగాడ్పులను, చూపుల వేఁడిమి దావాగ్నిని బోలియుండె. ఆ గోపబాలురును దానినిజూచి యది బృందావనము నందలి వింత యందములలో నొకటియని తలఁచి యిట్లు వర్ణింపసాగిరి.

ఓహో మిత్రులారా యిది యేమి విచిత్రము. అటు చూడుఁడు అదిగొప్ప యడవిమృగంబునుబోలి యున్నదా లేదా? అది మనలను మ్రింగ నోరు తెఱచుకొని యున్నది కాఁబోలు. పై పెదవి సంజకెంజాయ నెరసిన యెఱ్ఱని మేఘము వలె నున్నది కదా! క్రింది పెదవి దాని ప్రతిబింబమన నుండ లేదా? దాని కుడి యెడమ తాలు

వులు కొండగుహాలఁ బోలుచున్నవి. దాని కోఱలు కొండశిఖరముల నెనసెడిని. దాని నాలుక రాచబాటవలె నున్నది. దాని నోటిలోని నలుపు శిఖరంబులోని చీఁకటి కాఁబోలు. దాని నిట్టూర్పు కాఁబోలుఁ గార్చిచ్చుమీఁదఁ గాడుపువలె వేఁడుములు వెదచల్లెడు. కారుచిచ్చునఁ గాలిన మృగముల వాసనవలె నిది మ్రింగిన మృగముల మాంసపుగవులు కొట్టుచున్నవి. ఇది మనలనెల్ల మ్రింగెనా మ్రింగనిండు. బకునివలెఁ జచ్చును. అని కృష్ణుముఖముఁ జూచుచుఁ జప్పట్లు చఱచుచు నాభీరులు ధీరులై దానికెదురుగఁ బోయిరి.

రాక్షసమాయ యని యెఱుంగక నిక్కపుఁ బాముని వీరు భ్రమించుచున్నారని కృష్ణుండు తలఁచి వారిని దూరముగఁ దొలఁగిపొండని చెప్పునంతలో వారు దానినోటిలోఁ జొరఁబాఱిరి. అహా కార్యము మించె, నిఁక వీరినెట్లు రక్షింతునని కృష్ణుఁ డాలోచించుచుండ నయ్యది రామకృష్ణులను మ్రింగఁ దలఁపుగలది కావున వారు వచ్చువఱకు గోపాలబాలురను మ్రింగక నోరుమూసికొనక యుండె. దానిని జూచి సకలాభయప్రదుండైన కృష్ణుఁడు తానే దిక్కుగాఁగల తనవారు చేదప్పి యాకొండచిలువ జఠరాగ్నికిఁ దృణమువలెఁ గానుండుటఁజూచి దయార్ద్రితుఁడై యెట్లు లీపాపాత్ముని వధింతును సాధువులగు వీరినెట్లు రక్షింతునని యాలోచించి సర్వజ్ఞుండు దాని వదనగహ్వరంబునఁ దానుఁ జొచ్చె. అది చూచి మేఘములచాటునున్న దేవతలు హా హా కారంబు లొసఁగించిరి. కంసపక్షపాతులైన యఘాసురబాంధవులు హర్షించి ధ్వనించిరి. ఆ కోలాహలంబు విని తన్ను గోపకులను దూడలను జూర్ణముచేయఁ దలంచుచుండు పాపకుత్తుకలో నూపిరి వెలికిరాకుండునట్లు తన దేహమును బెంచెను. ఊపిరి వెలికిరాక పొట్ట యుబ్బి గ్రుడ్లు గిరగిర తిరిగి వెలికిఁ బొడుచుకొని రాఁగఁ దల పగిలి రాక్షసుఁడు చచ్చెను. తన యమృతావలోకనముల మృతప్రాయులైన దూడలను గోపబాలకులను బ్రతికించి సుఖముగ

వెలికిఁదోడ్కొనివచ్చెను. సర్పదేహమునుండి పది దిక్కులు వెలుఁగ
నొకతేజము వెలువడి యాకాశమున సంచరించుచుండి కృష్ణుండు
వెలికివచ్చిన పదపడి యాయనదేహంబునం బ్రవేశించె. ఆ యజగర
మొండి పెక్కుకాలంబు గోపాలబాలురకుఁ గ్రీడాస్థానంబై యుండె.
ఆ యద్భుతంబు గని స్వకార్యంబొనర్చిన శ్రీకృష్ణునిపై దేవతలు
పుష్పవర్షంబులు గురియించిరి. గంధర్వులు పాడిరి. అచ్చర లాడిరి.
వందిమాగధులు స్తుతించిరి. విప్రర్షులు జయజయధ్వానంబు నించిరి.
ఈ మహాకోలాహలము విని బ్రహ్మదేవుం డరుదెంచి వృత్తాంత మాల
కించి యరుదందె. పరాపర పరముఁడును సర్వసృష్టికర్తయు నగు
మాయామానవ మాణవకుని యీ చరిత్రంబు చిత్రంబుగాదు.
అపవిత్రచరిత్రులకు నందరాని కైవల్యమును నిజాంగస్పర్శమాత్రం
బునఁ బాపరహితుండైన యఘాసురున కొసంగె. ఒక్కసారి తన
మనోమయమూర్తిని లోన ధరించునంతన యంతటి దుష్టస్వాంతున
కును ముక్తికాంతాసాంగత్య మొదవించెనన సర్వదా తమ మనంబుల
జ్ఞానానందమయుండైన భగవంతుని భక్తితో ధరించి మాయకు లోవ
డనివారికి ముక్తికలుగు టేమి యాశ్చర్యము. కృష్ణుని కౌమారదశ కడ
పటిసంవత్సరమువ నసఁగా జన్మాదిగ నైదవ సంవత్సరమున జరగిన యీ
కార్యమును కృష్ణుని యారవ సంవత్సరమున జరిగినట్లు గోపబాలు
రిండ్లలోఁ జెప్పిరి. అనిన నభిమన్యుసుతుండు వ్యాససుతునితో
నిట్లనియె.

బ్రాహ్మణోత్తమా! కాలాంతరమునఁ జేయఁబడిన కార్య
మీకాలమునఁ జేయఁబడిన దెట్లగు? ఐదవ సంవత్సరమునఁ జేయ
బడిన కార్యము పౌగండమునఁ దొలివత్సరమగు నారవయేటఁ
చేయఁబడినదెట్లగు? యోగీశ్వరా! యిది చిత్రము. విన వేడుక
లయ్యెడు. ఇది భగవన్మాయకాని యితరముకాదని తోఁచెడి. గుణు
వరా! మీ ముఖకమలమువలన వెలువడు పుణ్యకృష్ణకథామృతంబుఁ

దాగ్రిగుటచే క్షత్రబంధులమైన మే మే ధన్యులము. అని యిట్లు ప్రశ్నించిన భగవదాకృష్ట సకలేంద్రియుండై యంతర్దృష్టిగల శుకుఁ డెట్టి ప్రశ్న కతంబున మెల్లగ బహిర్దృష్టిగలవాఁడై భాగవతోత్తముఁడైన పరీక్షిత్తున కిట్లనియె.

భాగవతోత్తమా! మహాభాగా! నీప్రశ్నం బెంతయు మేలుఁ పలుమాఱు భగవచ్చరిత్రములు వినియుఁ గ్రొత్తలు చేయు చున్నావు. విటులకుఁ దమ ప్రియురాండ్ర వార్త యెంత వినినను క్రొత్తగానుం డుట సహజంబకదా. అట్లు హరికథలు ప్రతిక్షణము వినుకొలఁది క్రొత్తక్రొత్తగఁ బ్రశ్నించి తెలిసికొనుట సారగ్రాహులగు సాధువులకు స్వభావము. రాజేంద్రా! శ్రద్ధాభక్తులుగల శిష్యులకు గురువులు రహస్యవిషయములను దాఁపక చెప్పవలయును గావున నిది దేవరహస్యమైనను నీకుఁ జెప్పెదను. సావధానుండవై వినుము అఘాసురు వదనంబునం బడి యమసదనంబున కరిగిన గోపాలకులను దూడలను మరల జీవింపఁ జేసి సరోవర పులినతీరమునకుఁ దోడ్కొని పోయి శ్రీకృష్ణుండు వారితో నిట్లనియె. ఆహా మిత్రులారా! యీ దిన్నె యెంత రమ్యమై తెల్లని మెత్తని యిసుము మిసిమి శేటల నీటుమీఱ నాటకు వాటమై సపాటమై మనోహరమై యున్నది. సరసిని విరిసిన సుమముల పరిమళ మాఘ్రాణింపఁ జనుదెంచిన తుమ్మెదలయుఁ బక్షులయు నీటితరఁగల ధ్వనుల ప్రతిధ్వనులకుఁ దీరవృక్షంబులు వ్యాకులంబులయి నట్లున్నవి. మనమందఱ మిందు భుజింతము చాలఁ బ్రొద్దెక్కినది. లేఁగలు దాపునంద నీరుగ్రోలి పచ్చిక మేయు చుండును. అనిన గోపాలబాలకులును గ్రేపుల నీరుద్రావం జేసి పచ్చిక మెయిఁ బచ్చికపట్టుల మేయ విడిచి చిక్కంబులు సడలించి చలుదులు కృష్ణుని తోడ మొసవిర తామరదుద్దు చుట్టురేకులన గోపబాలకులెల్లఁ గృష్ణుని జుట్టి కూర్చుండి విచ్చినకన్నుల నతని వంకనే చూచుచుండిరి. పత్రంబులు పుష్పంబులు ఫలంబులు చిక్కంబులు

చిగుళ్లు కంచంబులుగా భుజింప మొదలిడిరి. అందొక్క గొల్లపిల్ల వాఁడు చూపుడు(వ్రేలు వంచి యాడించుచు వేఱొకనికిఁ జూపి యూరించుచు నూరుఁగాయ నంజుకొనియె. ఒకఁడు నోరనిడుకొనఁబోవు నూరుఁగాయదబ్బనుఁ బ్రక్కవాఁ డెగురఁగొట్ట వేఱొకఁడు దానిఁ బట్టుకొని దంతముల సందున నిఱికించికొని యా యిరువురఁజూచి నవ్వుచుండ, నొండొకఁడు దాని లాగికొని మ్రింగి యేమియెఱుఁగని వానివలెఁ గూర్చుండెను. పుడుక గ్రుంచి పాయసి ప్రక్కవానిపై వైచి వాఁ డిటటు చూచుచుండ వాని యాకులోనిదంతయు వేఱొకఁడు భుజించి లేదని నోరు చూపును. నే నిచ్చెద రమ్మని వేఱొకఁడు పిల్చి యాశచే వాఁడు సమీపించిరాఁగా దేవమార్గంబుఁ జూపును. పందెము చఱచి యిరువుర ముప్పురయన్న మొక్కఁడే భుజించును.

సీ. కడుపున దిండుగాఁ గట్టిన వలువలో
లాలిత వంశ నాళంబుఁ జొనిపి
విమల శృంగంబును వేత్రదండంబును
జాఱి రానీక చంకనిఱికి
మీఁగడ పెరుఁగున మేళవించిన చల్ది
ముద్ద డాపలిచేత మొనయ నునిచి
చెలరేఁగి కొసరి తెచ్చిన యూరుఁగాయలు
వ్రేళ్ల సందుల నెల్ల వెలయ నిఱికి

ఆ. సంగడీలనడుమఁ జక్కనఁ గూర్చుండి
నర్మభాషణముల నగవు నెఱపి
యాగభోక్త కృష్ణుఁ డమరులు వెఱగంద
శైశవంబు మెఱసి చల్ది గుడిచె. భాగ.

వీరిట్లు చెలుదురు భుజించుచుండ దూడలు మేయుచు దూరంబుపోయిన వానిని గానక బాలురు భయపడినఁ గృష్ణుఁడును మీరు భయపడక భుజింపుఁడు. నేను వానిని దోలికొని వచ్చెదనని వెడలి

చని చేతిలోని ముద్ద దినుచునే గిరులదరులఁ దరులమాటులఁ గొండపేటులఁ బొదలచాటుల నెంతయు దవ్వు వెదకుచుండెను. ఈలో రజోగుణాత్మకుండగు బ్రహ్మయుఁ గృష్ణుని మహిమంబు తెలియవేఁడి దూడలను బాలకులను గానరాకుండ దాఁచెను. కృష్ణుఁడటు దూడలవెదకి కానక మరల మిత్రు లుండు నిసుక దిన్నెకడకు వచ్చి వారిని గానక యేమిదియని కాననమంతయు వెదకి సర్వజ్ఞుండైన కృష్ణుం డిది బ్రహ్మచేష్టయని తెలిసికొనెను.

రుక్మిణి—అఘాసురుని జంపినపుడు దేవతలు శ్రీకృష్ణుఁడు నారాయణమూర్తి యని తెలిసికదా పూలవాన గురియించిరి. అట్లు దేవతలకుఁ దెలిసినవిషయము బ్రహ్మకేల తెలియదు? అదియును గాక విష్ణుమూర్తియే కృష్ణుఁడుగా నవతరించెనని బ్రహ్మకుఁ దెలియునుగదా మఱపెల వచ్చెను?

తండ్రి—ఏదైన గొప్ప దేవకార్యమును లోకహితముగ నెవరు చేసినను దేవతలు సంతోషించి పూలవాన గురియింతురు. శిశుపాలుని గృష్ణుఁడు వధించుటకుముందు భక్తియుక్తమైన మాట చెప్పినసమయమే దేవతలు సహదేవునిపైఁ బుష్పవృష్టి గురియించిరి. సహదేవుఁడు దేవుఁడా? అఘాసురుని వేఁడిమికి దేవతలు తల్లడిల్లుచుండిరి. అట్టి దేవమానవ కంటకునిఁ జంపెనని సంతోషించి కృష్ణునిపై దేవతలు పూలవాన కురియించిరి. విష్ణుమాయయందు బ్రహ్మమొదలు సమస్త జీవకోటి నెల్లవేళ మునిఁగి యుండును. ఎవరి నెప్పు డనుగ్రహింపఁ దలఁచునో యప్పు డామాయను వారియెడఁ దొలఁగించును. తక్కిన వేళల నెల్లజీవుల ముంచియే యుంచును. కావున విష్ణుమాయకులోనైనిజము కనుఁగొనలేక రజోగుణబలంబున మోహపడి బ్రహ్మ తనవలెఁ బ్రాణమిచ్చువాఁడు మఱి యొకఁ డెవఁడో యెట్టివాఁడో పరీక్షింతమని తలంచెను. శుద్ధసాత్త్వికుఁడు మహా

భక్తుఁడగు నారదుఁడే యొక్కొక్క సారి విష్ణుమాయ దెలియక చిక్కి తికమికలాడుచుండు నఁట. ఇఁక రజోగుణ యుక్తుఁడగు బ్రహ్మ భ్రమచెందు టేమి వింత తెరువాత విను.

ఇట్లు బ్రహ్మ గోవత్సములను గోపాలకులను దాఁచెనని యెఱింగి యాయనకుఁ దన మహిమ దెలుపుటకును దల్లుల సంతోష పెట్టుటకును నీశ్వరుఁడగు కృష్ణుఁడు తానే వత్సములును బాలకులునై నిలిచెను. ఏయేగోపాలబాలుఁ డెట్టిముఖ యన హస్తాద్యవయవములు గలవాఁడై యెట్టివేణువు, చిక్కము, కొమ్ము, సొమ్ములులోనైనవిధరించి యుండెనో యట్టట్టిస్వరూపమే యట్టట్టి పదార్థములే ధరించినవాఁడై వారివారి దూడ లెట్టెట్టివో యట్టిదూడలును దానేయై గోవత్సములైన తన్నుఁ దానే గోపాలకుఁడై తోలుకొనుచు వ్రేపల్లెకుఁ బిల్లఁగ్రోవు లూఁదుచు వచ్చెను. వారి నడతలు నడకలు వయస్సు స్వరము సర్వము గొల్లపిలవాండ్రవేయై యుండెను. ఏయే పిల్లవాఁ డేయేదూడలచే యే యింటికి నెట్టెట్లు తోలుకొని పోయి యే యేచోట నెట్లెట్లు కట్టవలయునో యట్టులే మాయాబాలక స్వరూపముల కృష్ణుఁ డొనర్చెను.

ఇట్లు తమతమ బాలుర వేణునాదములు వీనులఁ బడినంతనే యాయాతల్లులు తెప్పున లేచిపోయి చేఁపుఁజన్నులతో బాలుర నెదుర్కొని కోడి తెచ్చి యాబాలకులు తమబాలకులని తలఁచి వారికి నౌడలురుద్ది నీళ్ళుపోసి యలంకరించి రక్షాతిలక ముంచి కాటుకపెట్టి కట్టువస్త్రములు మంచివిచ్చి లాలించిరి. దూడలును మందవట్టులకుఁ దోఁకలెత్తి అంకెలువైచుచు గెంతులుఱుకుచు దాటులతోఁ దల్లుల యొద్దకుఁ బాఱెను. ఆవులును హుంభారవముల వచ్చి తమతమ లేఁగల మేనులు నాకుచు నవి పొదుఁగులు గ్రుమ్మఁ బాలిచ్చుచుండెను. మునుపటి బాలురకున్నట్లు మావీరు తల్లులు వీరిబిడ్డలము మేమను లోప్రీతి మాత్రము తప్పఁ దక్కిన బహిర్నటనము లన్నియు వీరికి నుండెను.

తల్లులకు మాత్రము వీరియెడ మునుపటి తమ పిల్లవాండ్రపై నున్న ప్రీతి కేమాత్రము కొఱంతలేక మీఁదు మిక్కిలి యతిశయించి యుండెను. ఇట్లు వత్సపాలక వ్యాజంబున భగవంతుఁడుతన్నుఁదానే తోలుచుఁ దోలఁబడుచు, మేపుచు మేపఁబడుచుఁ, జిత్రంబుగ నైనాఱు దినముఁ గొఱతగ నొక్క సంవత్సరము గడపెను.

అయ్యెడ గోవర్ధనపర్వత శిఖరంబున మేయు గోవులు దూరమునఁ బొలములలో మేయు తమ దూడలనుజూచి స్నేహాధిక్యంబున నొడలెఱుఁగక ముండ్లు గండ్లని చూడక దుర్గమ మార్గంబులఁ బడి కోడెలు తోఁకలెత్తి మోరలోగారవంచి నాలుగుకాళ్ళు రెండుకాళ్ళు కాఁగా దాఁటులు వైచుచు ముందువెనుకల రాఁగాఁ బరువుపాఱి క్రేపులఁ గలిసికొని వానిమేనులు నాకుచుఁ బాలుగుడిపె. ఇట్లు క్రేళ్లుఱుకు గోవులను గోడెలను నిలుపలేక వానివెంట దుర్గమంబులఁ బరువిడలేక సిగ్గునను గోపంబునను జిడిముడిపడుచు గొల్లలు మెల్లగవచ్చి దూడలకుఁ బాలిచ్చు ధేనువులను జూచి సంతోషించిరి. కాని కోపింపరైరి. వారును దమబిడ్డలఁ గౌగిలించుకొని సమ్మోదంబునఁ దేలి కొంతవడికిఁ గష్టంబున లేఁగలను దల్లులనుండి యెడఁదీసి దూరంబున మేపఁ దోలుకొని పోయిరి.

బలరాముఁడును వ్రజంబునఁ బాలుపిడిచిన బాలురమీఁద గోపకులకు గోపికలకుఁగల విశేషప్రేమాధిక్యంబు నెఱింగి యిట్లు తలపోసె. ఇట్టి యపూర్వప్రేమ మందలవారికిఁ దమ బిడ్డలపై నిప్పుడు గలుగనేల? పూర్వము గోపకులకుఁ గృష్ణుపై నెట్టి ప్రేమయుండె నట్టిప్రేమ నిప్పు డెల్లబాలురపట్లఁ జూపుచున్నవారు. ఇట్లగుటకుఁ గతం బేమొకో. ఇది దైవమాయయో మనుష్యమాయయో యసురమాయయో. ఏమాయయు నిట్లు సకలజనవిమోహినియై యుండఁ జాలదు. అంతియగాక నాస్వామిమాయగాక యితరమాయలు నన్ను మోహపడఁ జేయఁజాలవు. అని జ్ఞానచక్షువుల నీక్షించి వత్సములు

వత్సపాలురు విష్ణుమయుం బని యెఱింగి సందేహము బాపుకొనఁ గృష్ణునిఁ జూచి యిట్లనియె.

కృష్ణా! మునుపు గోవులు ఋషుల యంశములనియు గోపాలకులు దేవతాంశములనియుఁ జూచుచుంటిని. ఇప్పుడవి ఋష్యంశములు గావు వీరు దేవతాంశములును గారు. సర్వము నీవయై తోఁచెదవు. అని యెట్లనిన నాయనకు శ్రీకృష్ణుఁ డారహస్యముం దెలిపె.

ఇట్లు బ్రహ్మదేవుఁడు గోవత్సంబులను గోపాలకులను దాఁచి తన లోకంబున కరుగ ద్వారపాలు రతనిఁ జూచి బ్రహ్మదేవుడు స్వస్థానంబునఁ గూర్చుండియుండ నీవెవ్వఁడ వతని వేషము ధరించి వచ్చితివని వారించిన సంకోచపడి యిదేమి వింత బ్రహ్మకే మోసమువచ్చెనని మరలి మందకడ కరుదెంచెను. ఇంతకు బ్రహ్మకాలమానమున నొకత్రుటి గడచెను. ఇట్లు వచ్చి తా నుంచిన గుహాయందు నిద్రించు వత్సములను గోపాలబాలురను జూచి వీరు నామాయచే మోహితులై నే నుంచినట్లు నిద్రించుచున్నారు. వీ రిచ్చటన యుండ నచ్చట ఘోషంబున సంచరించు మాడలు బాలు రెవరు? వీరందఱు నెప్పటియట్ల కృష్ణునితోఁ గ్రీడించెదరు. వీరు నామాయచే మోహితులగున వారు కారు. కాని వారు వీరు నొక్కరూపున నున్నారు. వీ రెవరో యన్యులు. వీరెక్కడివారు? మనుష్యమానమున నొకసంవత్సరముగఁ గ్రీడించుచున్నారు. అని యాభేదమునకుఁ గృష్ణ మాహాత్మ్యము కారణమనియు వారందఱు కృష్ణాత్మకులనియు నెఱుంగనేరఁడయ్యె. విమోహుండును విశ్వమోహనుండునగు కృష్ణు మోసగింపఁ బోయి బ్రహ్మ తానే మోసపోయెను. రేయి చీఁకటియందు మంచు చీఁకటియు, నెండయందు మిణుఁగురు పురుగు ప్రకాశమును నణఁగునట్లు విష్ణుమాయయందుఁ దక్కిన యందఱిమాయలు నణఁగి ప్రకాశింపక పోవునే కాని దాని మించఁ జాలవు. ఇట్లు బ్రహ్మవిస్మయంబునఁ జూచుచుండఁ గ్రేపులును గోపబాలకులును నీలమేఘశ్యాములును, పీతాం

బరధరులును, చతుర్భుజులును, శంఖచక్ర గదాపద్మపాణులును, కిరీటు లును, కుండలులును, హారులును, వనమాలులును, శ్రీవత్సప్రభాయు క్తాంగదలసిత భుజులును, రత్నమయ కంకణులును, శ్రీవత్సాంకిత వక్షులును, కౌస్తుభాముక్త కంధరులును, నూపురకటక కటిసూత్రాం గుళీయకులును, భూరిపుణ్యపురుష సమర్పిత తులసీదామా పూర్ణపాద మస్తక కోమల సర్వగాత్రులును, రజోగుణంబుఁ బోలినయనాపాంగా రుణ గుణముచే భక్తులకోరికలు సృజించుచు సత్త్వగుణముఁ బోలిన చంద్రికాధవళ మందహాసముచే వారి కోరికలఁ బాలించువారును, దాను మొదలు స్తంబపర్యంతముగల సకల చరాచర భూతముల యాకారంబులు ధరించి నృత్తగీతాదులగు నానా సాధనములచే నుపాసింపఁ బడువారును, నణిమాది మహిమలును, గార్యోపయోగి శక్తులును, మహదాది చతుర్వింశతి తత్త్వంబులును, గుణక్షోభ హేతువైన నిమేషాది వత్సరాంతకాలంబును, బరిణామహేతువైన స్వభావంబును, నుద్బోధహేతువగు సంస్కారంబును, గర్మహేతు వగు కామంబును, దత్తద్దేహలబ్ధి కారణంబయిన కర్మంబును, జ్ఞానవిక్షేప మోహ హేతువులగు సత్త్వాది గుణంబులును, దమతమ స్వరూపం బులు ధరించి స్వమహిమ ధ్వస్తతేజంబులై యుపాసింపఁబడు వారును, కేవల నిత్యనిర్వికార జ్ఞానానంద రసైకరూపులై యాత్మజ్ఞాన నేత్రులకును దెలియశక్యముగాని భూరిమహాత్మ్యము గలవారు నునై యీ చరాచర జగంబునెల్ల నిజతేజంబున వెలింగించు పర బ్రహ్మంబుగాఁ బరమేష్ఠి కొక్కసారి గోచరించిరి. బ్రహ్మయుఁ దద్వి లోకనంబున నాశ్చర్య మగ్నమానసుండై తత్తేజో విశేషంబున జడంబులై యేకాదశేంద్రియంబులు పరవశంబులుగా వ్రజాధిష్ఠాన దేవ సమీపంబున బమ్మ నలుమొగంబుల బంగరుబొమ్మయై నిలిచె. తర్కించి తెలియరానిదియు నసాధారణ మహిమగలదియుఁ బ్రకృ తికిఁ బరంబును నగు నిజమహిమ చూచుటకును నిది యిట్టిదని

యెఱుంగుటకు నైన నేరక బ్రహ్మ దిగ్భ్రమగొని కికమిక లాడుచుండ నతని దురవస్థంజూచి కరుణించి సర్వాధికుండైన కృష్ణుండు మరల నతని దనమాయచేఁ గప్పెను. అంత విరించి మరణించిన వాఁడు మరల జీవించినట్లులై మరల నింద్రియములఁ దన వశపఱుచుకొని యెట్టెట్టో మెల్లనఁ గన్నులువిచ్చి బాహ్యదృష్టి గలవాఁడై పూర్వము సర్వము భగవత్స్వరూపముగఁ జూచినవాఁ డిప్పుడు తన్నుఁదన్నుగను లోకమును లోకమునుగాఁ జూచెను. ఇట్లు కన్నులు తెఱచి నలుగడలు పరికించి బృందావనము బృందావనముగను నందలి జంతువులు జంతువులుగను జెట్లు చెట్లుగను జూచెను. భగవంతుఁ డందు వసించుటఁ జేసి నరపశుసింహ వ్యాఘ్రాది మృగంబులు తమతమ క్రోధ లోభాదులు విడిచి యన్యోన్యమైత్రి వసించుచుండుటయుఁ జూచెను. మఱియును నద్వయుండు నొక్కఁడు నయ్యెను, బర మనంత మగాధమునైన జ్ఞానముగలవాఁ డయ్యెను, సర్వదాపూర్ణ స్వభావుఁ డయ్యెను వలచేత దధ్యన్నమును ముద్దను గొని దినుచుఁ బశువులను జెలికాండ్రను వెదకుచున్న గొల్లపిల్లవాని నాట్యమును జూచెను.

ఇట్లు విలోకించి బ్రహ్మ తన హంసవాహనము డిగ్గనుఱికి ధర కవతరించి బంగారు దండమువలెఁ దన దేహమంతయు నేలపైఁ బడవైచి నాలుగు కిరీటములు కృష్ణుని చరణకమలములు దవుల నమస్కరించి వానిని దన యానందాశ్రువులచే నభిషేకించెను. ముందు చూచిన మహిమ స్మృతికి రాఁగ రాఁగ దాని స్మరించుచు స్మరించుచు నేలపై మఱి మఱి వ్రాలుచు వ్రాలుచు లేచుచు లేచుచుఁ బునః పునః ప్రణామంబులు గావించి మెల్లన లేచి కన్నులు దుడిచికొని కృష్ణు ముఖంబుపై దృష్టి నిలిపి సవినయుండై తా నొనర్చిన యపరాధంబుఁ దలఁచి వడఁకుచు శిరంబు వ్రాల్చి గద్గదస్వరంబునఁ గ్రేటుకొనుచు నిట్లని స్తుతించె.

—:బ్రహ్మ శ్రీకృష్ణు స్తుతించుట;—

దేవాది దేవా! మహానుభావా! నెమలిపురి యింద్రధనుస్సుగను, పీతాంబరము మెఱుఁగుగను, చెల్లని గురిగింజపేరులు జలబిందువుల చాలుగనునై నీలమేఘంబు విడంబించు రూపంబునఁ బ్రకాశించు నీకు నమస్కారంబులు. వన్యపుష్పంబుల సరంబులు మెడను, బెరుఁగన్నపు ముద్ద నెడమచేతను, బెత్తము కుడికేలను, కొమ్ము చంకను బిల్లంగ్రోవి రొండిని ధరించి గోపాలబాలక వేషంబునఁ గోమల పల్లవపదంబులఁ జరించు నీకు నమోవాకంబులు. దేవా నన్ను గ్రహింప నీవు నాకుఁ గనఁబఱిచినట్టియు భూతమయంబు గానట్టియు స్వేచ్ఛామయమైనట్టియు నాత్మసుఖానుభవరూపమైనట్టియు నీరూపము మహిమంబును నంతరింద్రియము చేతనైన నిశ్చయించుటకు నెవ్వఁడును సమర్థుఁడు కాఁడు. విపులానందరూపా! జ్ఞానమున నన్ను సాధించు ప్రయాసమును మాని వేదోక్తములైన నీ చరిత్రములను దనువాఙ్మనసములచేఁ బఠించుచు స్మరించుచుఁ దమ తమ వర్ణాశ్రమాచారము లందు నిలిచి బుద్ధిమంతులు నీ శరణంబుఁ జొచ్చెదరు. నీ వితరులకు సాధింపరాని వాఁడ వయ్యును నట్టి యైహికాముష్మిక ఫలాపేక్షారహితులకు సాధ్యుఁడవే యవుదువు. విభూ! శ్రేయస్సును నమృతమును బిదుకుచున్న భక్తియను కామధేనువును విడిచి కేవలజ్ఞానయోగమున శ్రమించువారికి నుముకదంచు వారికిం బోలె శ్రమము మాత్రమే ఫలమగును. తొల్లి యనేక జ్ఞానయోగులు నిజకర్మలబ్ధంబై ఫలాభిసంధి రహితంబైన యీహాచే నీ కథాపఠనమునఁ గలిగిన భక్తిచే నీ స్వరూప స్వభావంబులు చూచి యెఱింగినవారై నిన్నే శరణంబుఁ జొచ్చి యచ్యుతా నీ పరమ పదంబు నొందిరి. నిర్గుణుండవైన నీ మహిమంబు దెలియుటకు విమలాంతరాత్ములును శక్తులుగారు. ఏలన: అవికారంబును నరూపంబును స్వజ్ఞానైక జ్ఞేయంబును ననన్య బోధాత్మంబును నగు నీ పట్టి గుణములు గలవారికిఁ

గాక పరులకెట్లు తెలియఁ బడుదువు? కాలక్రమమున లోకములోని మంచు బిందువులను, భూపరాగ రేణువులను, నక్షత్రములను లెక్కింపఁ గల నిపుణుఁడు కూడ లోకమునకు మేలుసేయఁ గోరి యవతరించిన నీ గుణముల లెక్కింప లేఁడు. కావున దేహముచేతను మనస్సుచేతను వాక్కుచేతను నిన్నుఁ బూజించుచు ధ్యానించుచు స్తుతించుచు నీకృప యెన్నఁడు తనపైఁ బ్రవర్తించునో యని యెదురు చూచుచుఁ దాను బూర్వజన్మమునఁ జేసిన పుణ్యపాపముల ఫలములం దాసక్తి లేకయు ననుభవించుచు జీవించు నతఁడు ముక్తిపదంబున నిత్యసుఖభావంబును దండ్రిసొత్తు కుమారునివలెఁ బంచుకొను వాఁడగును. ఈశ్వరా! నా దౌర్జన్యంబుఁ జూడుము. అనంతుఁడవు నాద్యుఁడవును, బరమాత్ముఁడవును, మాయావంతులను మాయలో ముంచు వాఁడవును నగు నిన్ను మాయచేఁ గప్పి నా యైశ్వర్యంబు చూడ నభిలషించిన నాకంటెఁ దుచ్ఛుఁ డెవఁడు? అగ్నినుండి వెలువడిన మిణుఁగు రగ్ని మహిమ యెంతయు నెఱుంగ నెట్లుగునని యైన నాలోచింపని నే నెంతమాత్రము? అచ్యుతా! రజోగుణమునఁ బుట్టి యజుండను జగత్కర్తనను గర్వాంధకారము కప్పుటచేఁ గన్నులుగానక యేను వేఱొక యండాధిపతి నని యభిమానము వహించు నజ్ఞుఁడనైన నన్ను "ఏడు నా కింకరుఁడు దయసేయుఁ" డని క్షమింపుము. తమస్సు, మహత్తు, నహంకారము, నాకాశము, వాయువు, నగ్ని, జలము నను సప్తావరణములచేఁ జుట్టఁబడి స్వపరిమాణమున నేడు జేనల యండఘటమైన కాయముగల నే నెక్కడ? గవాక్షముల సంచరించుచు పరమాణులవలె నిట్టి లెక్కలేని యండములు ప్రతిరోమకూపంబునఁ దిరుగు నీ మహిమ యెక్కడ?

జగత్సాక్షీ! గర్భంబున నున్న శిశువు తల్లిని దన కాలిచేఁ దన్నిన నది యపరాధ మగునా? కలదు లేదని వ్యవహరింపఁ బడు సమస్తము మఱి వెలుపల నెందును లేక నీ కుక్షియందే కదా యున్నది.

నేనును నానిలోని వాఁడను గానే. ప్రలయంబున జగత్త్రయ మంతయు నీట మునింగియున్నపుడు నారాయణు నాభికమల నాళమునుండి నేను వెలువడితిననుట సత్యమా! ఈశ్వరా! నే నట్లు వెలువడితినా లేనా? నీవు నారాయణుఁడవు కానా? అధీశ్వరా! సర్వదేహుల యంతరాత్మ నీవేకదా? అఖిలలోక సాక్షివి నీవేకదా? నర భూజలాయనుండ వగుట నారాయణ శబ్దంబు నీయందే కదా ప్రవర్తించును. ఇట్టి నీ రూపంబు మాయ గాదు సత్యంబు. ఆ కారణంబునఁగదా జలస్థంబై జగద్రూపకంబైన నీదేహంబు తొలుత నేఁ గనలేక మఱి నీవే యనుగ్రహించి నాపఁ జూడఁ గలిగితిని. మాయా దమనా! యీ యవతారంబున ను స్పష్టముగ వెలుపలఁ గానవచ్చు నీ ప్రపంచం బంతయు నీ తల్లికి నీ యుదరంబునఁ జూపితివి గదా? దీని వలన నీ మాయ ప్రకటితమయ్యెఁ గదా? నేను మొదలుగ సకల జీవరాసులు గల యీ ప్రపంచంబు సర్వంబు వెలుపలఁ దోఁచునట్లు నీ కుక్షి గోచరింపఁ జేసితివి. నీ కుక్షి నెట్లట్లు జగంబుండు నట్లట్లు వెలుపల సృజించితివి. ఇది నీ మాయగాకున్న మఱియేది? నీ తల్లికి నీవు నీ మాయ ప్రదర్శించితి వని యెప్పటి మాటయో యేల? ఇప్పుడు నాకును నీ మాయ కనఁబఱచితివి కదా? తొలుత నొక్కండవై యుండి మఱి వత్స వత్సపాలకు లైతివి. వారందఱు చతుర్భుజులై కనఁబడిరి. వారంతలో విరాట్స్వరూపంబులు దాలిచి నాచేతను సమస్త జగంబు చేతను నుపాసితులైరి. అంతట మరల నమితంబై యద్వితీయంబైన బ్రహ్మంబొక్కఁడవ మిగిలితివి. నీ స్వరూపంబు దెలియని వారిపై నీ మాయం బ్రయోగించి జగత్సృష్టియందు నావలెను బాలన మందు నీ వలెను నంతమొందించుట యందు రుద్రునివలెను వారికిఁ దోఁచునట్లు వెలిఁగెదవు. సురల యందును, ఋషులయందును, నరులయందును, దిర్యక్కులందును, జలజంతువులందును జన్మరహితుం డవైన నీవు దుర్మదుల నిగ్రహించుటకు సాధువుల ననుగ్రహించుట

కును నవతరించుచుందువు. అపరిచ్ఛిన్నాకారా! యచింత్యైశ్వర్యా! పరాత్మా! యోగీశ్వరా! ముల్లోకంబులందు నెక్కడ నెట్లు నెన్ని రూపంబుల నెప్పుడవతరింతువో యెవ్వఁడెఱుఁగు? యోగమాయ యనుపేర సాధనభూతమైన నీశక్తిని విస్తరింపఁజేసి యిచ్ఛచొప్పునఁ గ్రీడింతువు. ఆకారణముచేన తత్స్వరూపంబును, స్వప్నసమంబును, నష్టానబోధంబును, నత్యంతదుఃఖ విశేషంబును నగు జగంబెల్ల నిత్యుఁడవును, సుఖబోధతనుండవును, ననంతుఁడవును, నగు నీయందే యచింత్యమైన నీయద్భుతశక్తివలన నుత్పత్తిలయంబులఁ గాచుచుండినను సత్యంబువలెఁ దోఁచుచుండు. నీవొక్కఁడవే యాత్మయుఁ, బురాణపురుషుండును, సత్యుండును, స్వయంజ్యోతియు, ననంతుండును, నాద్యుండును, నిత్యుండును, నక్షరుండును, నిత్యసుఖుండును, నిరంజనుండును, బూర్ణుండును, నద్వయుండును, నుపాధిరహితుండును, నమృతుండును నగుదువు. ఈవిధంబుగ సర్వాత్మలకు నాత్మవైన నిన్ను గురుఁడను సూర్యునిచే లభించిన వేదాంతజ్ఞానమను నేత్రములచే స్వాంతరాత్మలయందుఁ జూచువారు సంసారమను ననృతసాగరంబును దరింతురు. ఇట్లాత్మలో నిన్నెఱుంగక తన దేహమే యాత్మయనుకొను వానికే యీసంసారంబు ప్రాప్తించు. మరల నయ్యది జ్ఞానముచే నశించు. త్రాటిని జూచి యథార్థజ్ఞానములేక పామని భయమున నణఁకువాఁడు త్రాడను జ్ఞానము గలిగినంతనే భ్రాంతి నివర్తింప భయమును వదలును గదా? సంసారబంధము దానినుండి ముక్తియను నవి రెండును నజ్ఞానసంజ్ఞలు. అజ్ఞానము లేనిచో నవి యుండవు. ఆలోచింపఁగా లోకులకుఁగాక సూర్యునకు రాత్రియని పవలని లేనట్లు సంతతప్రకాశముగల జీవునకును, కేవలుఁడైన పరమాత్మకును బంధమోక్షములు లేవు. పరుండవైన నిన్ను జీవుఁడనియు జీవుఁడే పరమాత్మయనియు దేహమే తాననియుఁ దాను దేహమే యనియుఁ దలంచి వెలుపల నెందో యున్నట్లు లాత్మను లోకులు వెదకుదురు.

ఔరా యజ్ఞానుల మాహాత్మ్య మేమనవచ్చును! అనంతా! పండితులనాత్మపదార్థంబు వదలి దేహమధ్యంబున నున్న నిన్నే వెదకుదురు. ఎట్లన వివేకులగువారు సమీపముననున్న త్రాటిని సర్పమని తలఁపరుగదా? అట్లయ్యును దేవా! నీచరణకమల యుగళ ప్రసాద లేశంబుచే ననుగ్రహింపఁ బడినవారే నిన్నే తత్త్వంబుగ నెఱుంగఁ గలరు గాని నీవనుగ్రహింపని వాఁడొక్కఁడైనఁ జిరకాలము పర్యాలోచించియుఁ గనఁజాలఁడు. కావున నాథా! యిచ్చటఁగాని మఱి యెచ్చటఁగాని పశుపక్ష్యాదులందుఁ గాని నీయనుగ్రహపాత్రులగువారినడుమ నొకఁడనై నీ పాదపల్లవంబుల సేవించు మహా భాగ్యంబు నాకుఁ గలుగుంగాక. ఈ మందయందలి గోవులు గోపికలాహా యెంత ధన్యలెంత ధన్యులు!! అధ్వరంబులచేతను దృప్తిఁగాంచని నీవు దూడలవై గోవులపాలను, బాలకులభంగి గోపస్త్రీల చనుఁబాలును జక్కఁగఁ ద్రావి తృప్తిఁగొంటివి. నందగోపుని మందపట్టు నందుండు వారి దేమి యదృష్ట మేమి యదృష్టము!!! ఔరా! పరమానందుండును బూర్ణుండును సనాతనుండును బరబ్రహ్మంబు నగువాఁడు వారికి మిత్రుఁడయ్యెను. అచ్యుతా! వారి భాగ్యమహిమ యటుండనిమ్ము. వారు నిన్ను సేవించు సమయంబున వారి మనస్సు బుద్ధి యహంకారము చక్షువులు లోనగు నింద్రియముల కధిష్ఠాన దేవతలైన చంద్రుఁడు గీష్పతి రుద్రుఁడు లోనగు మేమును నా యీ యింద్రియములను పాత్రంబులఁ బలుమాఱు నీ పాదారవింద మరందామృతముఁ గ్రోలి మైమఱచుచుండు మా భాగ్యము నేమని వర్ణింతును. వేదంబులు నీ పాదనీరజంబుల రజంబుల వెదకుచుండును గాని దర్శించినవి కావు. కావున నిప్పుడీబృందావనమున నీ గోకులంబున ముకుందుఁడే తమ జీవితంబు సర్వంబని నిశ్చయించి చరించు గొల్లపిల్లవాండ్ర పాదధూళిచే శిరంబు నభిషేకించుకొనఁగల జన్మంబును మనుష్య పశు పక్షి వృక్షాదులలో దేనినైన నొందు భాగ్యము కలుగనిమ్ము. సాధువేషంబు

వహించి వచ్చిన స్వజన సహితమయిన పూతనకు దాని వేషంబునే నిమిత్తంబుఁజేసి నిన్ను నర్పించుకొంటివి. ఇఁక నిండ్లు వాకిండ్లు ధనములు దేహములు సుహృత్తులు మిత్రులు పుత్రులు ప్రాణములు మనస్సులు నీకే యర్పించిన యీ ఘోషనివాసులకు సర్వఫల స్వరూపమైన నీకంటె సిఁక నేమి యియ్యఁగలవో యెఱుఁగ లేకున్నాఁడను. కృష్ణా! యెంతవఱకు రాగద్వేషము లను చోరులచే నొకఁడు బాధింపఁబడు నంతవఱకే యిల్లు చెఱసాల. అంతవఱకే మోహమనునది సంకెల యగును గాని నీమీఁద మనస్సు నిలిపిన నీవారికి సంసారంబు చెఱసాలయు మోహంబు కాళ్ళబందాలును గానేరవు. ప్రాకృతశరీరంబును దద్వ్యాపారంబును నీకు లేకుండినను ప్రపంచమును ననుకరింతువు. ఇట్లు సేయుట ప్రపంచమునందలి నీభక్తజనుల యానంద సంతతిని వృద్ధిపఱుచుట కేకాని కపటనాటకంబు సలుపఁగాదు. దేవా! పలుమాటలేల? ఎవరు నీస్వరూప స్వభావంబుల నెఱుంగుదురో వారే యీ యనుకరణహేతువును నెఱుంగుదురు గాక. నామనస్సు దేహము వాక్కు వీనికి నీ విభవం బగోచరంబు. కృష్ణా! యిఁక నా కనుజ్ఞనిమ్ము. సర్వజ్ఞుఁడవు నీవ. సర్వసాక్షియు నీవ. జగంబున కెల్ల నీవే నాథుండవు. నీవే యీ జగము సృష్టించి నీయందే నిలిపితివి.

సూర్యచంద్రాతి శాయీ! ఆ కల్పంబు నీకు నమస్కరించెద. దేవా క్షమింపుమని సవినయంబుగ సంస్తుతించి సంకుచిత శరీరుండై విరించనుండు ముమ్మాఱు ప్రదక్షిణించి పాదంబుల వ్రాలి లేచి భ్రూచలనంబుచే ననుజ్ఞాతుండై తన లోకంబునకుం బోయెను.

ఇట్లు బ్రహ్మ వెడలిపోయిన శ్రీకృష్ణుండును దూడలఁ దోలుకొని మున్దున్న పులినతలంబు పొంతకు వచ్చెను. ఈ లోపల నొక సంవత్సరము గడచినను గృష్ణు నెడఁబాసిన క్షణ మొకయేఁడుగ వారు దలఁచునట్లు ప్రాణేశుఁడైన కృష్ణుని విడిచి మాయా హతులైన

యీ పిల్లవాం డ్రొక యర్థక్షణము గడచినట్లు తలంచిరి. ఎవని మాయచే మోహితంబైన జగంబు సర్వథా మఱవరాని యాత్మ స్వరూపంబునే విపరీత జ్ఞానంబుచే మరల మరల మఱచుచుండ విష్ణు మాయా బలంబున నెవ్వరు దేనిని మఱవకుందురు? అట్లే వారు నా సంవత్సర కాలమున నాఁకలి దప్పులు మఱచిరి.

అట్లు దూడలఁ దోలుకొనివచ్చు కృష్ణునిఁ జూచి గోపబాలురు కృష్ణా! నీ వేగి యెంత తడవాయె. వేగ రారమ్ము నీ రాకకై వేచి మే మొక్కరు నొక్క ముద్దైనఁ దినినవారము గాము. అనినఁ గృష్ణుఁడు నవ్వుచు బాలురఁ గలసి భుజించి వనంబు నుండి వ్రజంబునకు వచ్చుచుఁ ద్రోవలోనున్న యజగర చర్మమును జూపెను. నెమలి పురుల చేతను, బూవుల చేతను ధాతువుల చేతను విచిత్రముగ నలంకరించుకొని యాకులను బూరగలవలెఁ జుట్టి యూఁదుచు దూడల నదలించి తోలుచురాని వానిని బిలుచుచుఁ దోడి బాలకులు తనకీర్తి పాటలుగఁ బాడుచుండ గోపలోలలోచనా లోచన చకోర చంద్రుండై మందకు మరలివచ్చెను. గోపాలబాలురును యశోదా నంద కుమారుండు తమ్ముఁ గొండచిలువ నోటినుండి వెలువరించి తెచ్చిన చరిత్రం బెల్లరకుఁ దెలిపిరి. అనినఁ బరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె.

యోగీంద్రా! తమ సొంతకుమారుల మీఁది ప్రేమకన్నను గొల్ల భామలకుఁ బరపుత్రుఁడైన కృష్ణునిపై నధిక ప్రేమగలుగఁ గారణం బేమి యనిన వ్యాసనందనుం డిట్లనియె.

రాజేంద్రా! సమస్త జంతువులకుఁ దమయాత్మయే ప్రియతమము. దానికి మించిన ప్రియతమంబు వేఱొండు లేదు. దానికి సంబంధించిన వగుటచే నితరములైన ధనములు సంతానములు లోనైనవి ప్రియము లగును. నృపాలా! దేహధారులకుఁ దమతమ యాత్మల యందుండు ప్రీతి తమవి యని చెప్పఁబడు పుత్రవిత్త గృహాదులందుం

డను. దేహమే యాత్మయని వాదించువారు కూడఁ దమ దేహమం దుండు ప్రీతిని బిడ్డలులోనగు వారియందుంపరు. "నేను" అను యనుకొనుటలో 'నాకు సంబంధించినది' యని యనుకొనుటలోఁ దారతమ్యము గలదుకదా. తనయాత్మ తనకు స్వాతిశ్రేష్ఠము. తక్కిన నట్లు కావు. దేహాత్మలకుఁ గల వ్యవధానమే కారణము. ఆత్మ దేహము కాదనియు దేహ మాత్మ కుపాధియని తెలియను వారికి నాత్మవలె దేహము ప్రియముకాదు. కావుననే కదా దేహము జీర్ణించి యిఁక బ్రదుకఁడను సమయంబునఁ గూడ దేహికి నేను జీవింతు నను నాశ బలిష్ఠమై యుండు. ఆ కారణముచే జన్మమెత్తిన యందఱకుఁ దమ యాత్మ ప్రియతమంబై యుండు. ఆత్మార్థమే సచరాచరంబైన సకల జగంబు ప్రియంబగు. అఖిలాత్మలకు శ్రీకృష్ణుఁడే యాత్మయనియు జగము హితముకొఱకుఁ దనమాయచే దేహివలెఁ దోఁచుచున్నాఁ డనియు నెఱుఁగుము. వాస్తవము నూహించిన సచరాచరంబయిన సకల ప్రపంచము భగవంతుని శరీరమై యున్నది. అది తప్ప నన్యమేదియుఁ గొంచెమైన లేదు. సకల ధాతువులందు భావంబున భవతి ధాతువు చెప్పంబడు నట్లు *శ్రీకృష్ణుండు సమస్త భూతములకుఁ బరమార్థంబు. కారణములకెల్లఁ గారణము. అటు కానిది కల దేని చెప్పుము. పుణ్యయశంబును మహాత్ముల కాశ్రయంబును నగు నంద నందను చరణారవిందము లనెడు నావ నాశ్రయించిన వారికి సంసార సాగరము వత్సపదంబగు. వారు పరమపదంబుఁ బ్రాపింతురు. నా నాపదల కేనాఁడును గుఱి కానేరరు. ఎన్నఁడైనఁ గలిగినను నది తొలంగిపోయి

---

* సత్తార్థమందు భూ ధాతు వుపయోగింపఁబడు. సత్తయనఁగా నునికి. ఏ ధాతువునకే యర్థము చెప్పినను నం దునికి యనువర్థము లేకుండఁబోదు. ఇచ్చట ధాతువనఁగా బ్రత్యయముతోడను నర్థముతోడను గూడిన పదము. అగుచున్నాఁడు. తినుచున్నాఁడు. రమించుచున్నాఁడు. శోకించుచున్నాఁడు. నను నన్నిటియందు 'నున్న' యనునది లేకుండఁబోదు. 'ఉన్న' యనునదియే భగవంతుని దెలుపును.

మరల నెన్నటికిని రాదు. కౌమార దశయందు జరగినది పౌగండ మున జరిగినట్లు చెప్పుటకుఁ గారణమేమని నీ వడిగిన ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరముగ సర్వము చెప్పితిని. గోవింద కృతంబైన యఘా సుర వధంబును బచ్చికపట్టుల భోజనంబును శుద్ధ సత్త్వాత్మకంబైన వత్సవత్సపాది రూపంబును బ్రహ్మ కృత స్తుతియును వినువారును జెప్పు వారును సకలాభీష్టంబులు పడయుదురు. సకృదుచ్చరితంబైన నిజనామ మనేకకోటి జన్మార్జిత తాఘంబు నిర్మూలించుచుండ నిఁకఁ దానొక యఘాసురుఁ ద్రుంచు టేమి వింత.

## —: ధేనుకాసుర భంజనము: —

పుట్టినది మొదలై దువర్షంబులనఱకుఁ గౌమారంబు. ఆఱవ వర్షము మొదలు పౌగండంబు. ఇట్లు పౌగండ వయస్కులై రామ కృష్ణులు చెలికాండ్రంగూడి గోవుల మేపుచు బృందావనంబునఁ బాదసంచారము గావించి దానిని బరమపవిత్ర క్షేత్రంబుఁ గావించిరి. అందుఁ గృష్ణుఁడు వేణుగాన మొనర్చుచుఁ దనకీర్తిని బాడుచున్న గోపాలురతోఁ గలసి రామసహితుఁడై కుసుమాకరంబును బహు హితంబునునగు నవ్వనంబునకుఁ బోయెను. ఇట్లుపోయి మనోహర ముగ ధ్వనించు తుమ్మెదలచేతను మృగములచేతను బక్షులచేతను వ్యాప్తంబై మహాత్ముల మనస్సుఁ బోలి ప్రసన్నంబై వికసితకమల పరి మళంబుచేఁ బరిమిళితంబై శీతమందవాత పోతజాతంబులకుఁ జలించు సరోవరంబు వీక్షించి దాని తీరంబునఁ గ్రీడింప శ్రీకృష్ణుండు తలంపు గొనెను. అచ్చట నచ్చట నరుణపల్లవకాంతి శోభిల్లి ఫలపుష్ప భారము కారణంబుగ శిఖలు పాదముల వ్రాలు మహాతరులను దిల కించి సంతసించి చిఱునవ్వునఁ గృష్ణుండు రామున కిట్లనియె.

అన్నా! దేవశ్రేష్ఠు లర్చించు నీ పాదముల నీ వృక్షంబులు తరు జన్మకారణంబయిన పాపంబు నీఁగికొన. బుష్పఫలాది పూజా ద్రవ్య

ముల గ్రహించి నీకుఁ గొనకొమ్మలచే నమస్కరించుచున్నవి. ఆది పురుషా! యీ తుమ్మెదలు సకల లోక పావనంబయిన నీ కీర్తిని బాడుచు వెంటవెంటఁ దిరుగుచున్నవి. అనఘా! యాత్మదైవమగు నిన్ను నెఱుఁ బాయఁజాలక వనమందును నీకు ముఖ్యములైన మునుల సమూహంబు లిట్లు గూఢ వేషంబుననుండు నిన్నుఁ గూడ గొలుచుచున్నవని తోఁచెఁ డిని. ఇదె చూడుము. తమ విడిది పట్టునకు వచ్చిన నిన్నుఁ జూచి సంతోషముచే నెమి ళ్లాడుచున్నవి. గోపికలవలె నాఁడు జింకలు ప్రియముతో నిన్నుఁ జూచుచున్నవి. కోకిలల సమూహంబులు సూక్తులచే గారవించుచున్నవి. ఈ వనౌకసముల జన్మము ధన్యము గదా. సాధువుల కిట్టి యతిథిసత్కారంబు చేఁత స్వభావము. నీ పాద ములు నొవ్వకుండునట్లు లేఁ బచ్చికయు లేఁ జిగురుఁ గొమ్మల నర్పించి యీ ధాత్రి ధన్య మయ్యెను. నీ కరస్పర్శ కారణమునఁ దరువులు లతలు ధన్యము లయ్యెను. నదులు కొండలు పక్షులు మృగములు నీ కరుణాకటాక్ష ప్రసరణంబున ధన్యము లయ్యెను. అటు లే గోపికలు నిన్నుఁ గూర్మి సంపదచేఁ గౌఁగిలించి లాలించుటచే గోవ్రజంబు ధన్యంబయ్యెను. ఇట్లు శ్రీమంతంబైన బృందావనముం జూపి ప్రీత చిత్తుండై కృష్ణుండు సహచరులతో గిరి సరిత్తటంబుల గోవుల మేపు చుండెను.

తన చరితంబు గానంబొనర్చు చెలికాండ్రను బలరామునిఁ గూడి యొక తావునఁ దామరపూఁదేనెలనాని మదించి కన్నులు గానక ఝుమ్మని తుమ్మెదలు మ్రోయఁ దాను నట్లే ధ్వనించును. ఒకయెడఁ గలహంససంగతి నాడుచు వానివలె రవళించును. ఒక చోట నెయ్యురఁ గేలిసేయుచు నెమళ్ల కెదురుగ నిల్చి యవి యాడినట్ల యాడును. ఒక్కొక్కసారి దవ్వేగిన గోవులను మనోహర మేఘ గంభీరధ్వనిఁ బేరెత్తి పిలుచును. చకోరక్రౌంచ చక్రవాక భరద్వా జంబుల ధ్వనుల ననుకరించును. వ్యాఘ్రసింహసత్త్వంబులకు జడి

సినవానివలెఁ బరువెత్తును. ఒకొక్కసారి యాటల పాటలచే నలసి గోపకుల తొడలు తలగడగాఁ బరుండిన యన్నకుఁ బాదసేవ నువచరించి గాసి తొలఁగించును. ఒకొక్క పరి యాడుచుఁ బాడుచు బచరించుచు నొకరి భుజంబు లొకరు పట్టుకొని మల్లుపోరు సలుపు గోపాలురఁ జూచి నవ్వుచు రామకృష్ణులు ప్రశంసింతురు. ఒకమఱి బాహుయుద్ధం బొనరించి డస్సి చిగురు పాన్పులపైఁ జెట్లమొదళ్ళ గోపాలురఁ యూరువులు తలఁదిండుగఁ జేసి పరుండిన శ్రీకృష్ణునకుఁ గొందఱు చరణసేవ యొనర్తురు. మఱికొందఱు పాపరహితు లమ్మహాత్మునకు వీవనల విసరుదురు. ఇతరులు ప్రేమార్ద్రంబైన హృదయంబుల మహారాజా! తదనురూపంబులైన కృష్ణచరితంబులు వీనుల విందుగఁ బాడుదురు. ఈవిధమున నిజమాయచేఁ దనరహస్య స్వభావంబు దాఁచి గోపడింభకు ననుకరించి రమారమణీమణీ సేవిచరణకిసలయుండయ్యు భగవంతుండు కృష్ణుండు పామర జనులం గలసి పామరునివలె నటించుచు నడుమ నడుమ నిజ సంకల్పానుసారంబుగ నీశ్వర చేష్టలఁ జేయుచుండె.

రామకృష్ణుల మిత్రుఁడగు సుదాముఁడను గోపుఁడును సుబలుఁడు స్తోకకృష్ణుడు లోనగు గోపాలురును హాళిమెయి వారితో నిట్లనిరి. రామ రామ! బలసంపన్నా! కృష్ణ దుష్టశిక్షణా! యిచ్చటికనతి దూరంబున నొక పెద్ద తాలవనంబు గలదు. ఆ త్రాటితోఁపునందుఁ బెద్దపెద్ద పండ్లు రాలినవి రాలుచుండునవి గలవు. అయిన నేమి ఫలము ధేనుకుండను దురాత్మకుఁడు గార్దభరూపంబు ధరించి తన యట్టివారినిగూడి యందు సంచరించుచు నెవ్వరి నచ్చోరువఁ జేగనీయకున్నవాఁడు. మనుష్యులు డాసిన వారిని భక్షించును. కావున నెవ్వ రాప్రక్కఁ బోవ నోడుదురు. ఇదివఱ కెవ్వరు చవిచూడనివియు, రుచిమంతంబులయినవియుఁ, గమ్మని కమ్మవాసనలు నలుదిక్కుల వెదచల్లునవియు, నగు ఫలంబులు పెక్కులున్నవి.

వానిని భుజింప నాశ యయ్యెడు. మా కోరిక దీర్పుఁడు. ఆవాసన
సోఁకి మాకు నోరూరుచున్నది. రామా! మీకు నమ్మతమేని యచ
టికిఁ బోదమా యనిన మిత్రవాంఛఁ దీర్చి వారికిఁ బ్రియంబుసేయ
గోవులఁ దోలుకొని గోపాలురఁ దోడుకొని రామకృష్ణులు తాలవనం
బుఁ జేరఁబోయిరి. ఇట్లు పోయి వనంబునఁ బ్రవేశించి మాతంగబలం
బున రాముఁడు చెట్లమొదళ్లు పట్టి యూఁచిన ఫలంబులు జలజల నేల
రాలెను. దబ్బుదబ్బుని పండ్లు రాలు ధ్వని విని గొబ్బుగొబ్బున గర్ద
భాసురుండు పర్వతంబు గడగడలాడఁ బరువున ఉవ్వాన వారిపై కుఱి
కెను. ఇట్లు చేరంబోయి చివాలున వెనుకకు మరలి యారాక్ష
సుండు బలరాముని ఱొమ్మున వెనుకటికాళ్ళ నెగసితన్ని యోండ్ర
పెట్టిచుట్టుతిరిగి మరలవచ్చి వెనుకటి పాదంబులఁ దన్న యత్నించు
టయు రాముఁ డొడికంబున నా రెండుకాళ్ళ నొడిసి పట్టి యొక కేల
గిరగిర ద్రిప్పి విసరి యొక తాటిచెట్టుపైఁ గొట్టిన నది ఫెళ్లని విఱిగి
యొండు తాటిపైఁబడిన నది తునిసి వేఱొక తాలంబుపైఁ బడియె.
ఇట్లు పెక్కుతాలంబులు నేల వ్రాలె. ఖరాసురుఁడు విగతాసువై
కూలె. వాని బంధువులగు రాక్షసులు రేవు గుఱ్ఱంబుల రూపంబుల
వచ్చిన వారి నెల్లఁ గాళ్ళనుబట్టి విసరి తాటిచెట్టులకుఁ గొట్టి రామ
కృష్ణులు చంపిరి. ఇట్లు తాల వనంబెల్ల రాలిన ఫలంబులతో విఱి
గిన తరువులతో గాడిద రక్కసుల కళేబరంబులతో నిండి మబ్బుల
తోడి యాకాశంబును దలపించుచుండె. అనంతుఁడును జగదీశ్వరుఁ
డును భగవంతుఁడును బ్రపంచమను వస్త్రమునకుఁ బేకయుఁ బడు
గునునై యుండు నతఁ డీ కార్య మొనర్చు టేమి చిత్రము. ఈ
చిత్రకర్మముఁ జూచి దేవతలు హర్షించి వాద్యంబులు మొరయించి
పుష్పవర్షంబు గురియించిరి. నాఁడుమొదలు ప్రజ లా ఫలంబుల
నిర్భయులై భుజించిరి. పసువులు నందుఁ బచ్చిక నిచ్చలొలఁది
మేయుచుండె. కమలలోచనుండును బుణ్యశ్రవణకీర్తనుండును నగు

కృష్ణుఁడు సహచరులు శ్లాఘించుచుండ నన్న తోడ వ్రజంబునకు వచ్చెను.

గోధూళిధూసరితంబులైన కురుల నెమిలిపింఛ మలంకరింప, మొలకనవ్వులు వెలుఁగు జూపులు ముఖంబునకు వికాసంబు గలిగింప నడవి పూలదండ లురంబున వ్రేలాడ, వీనుల విందైన పిల్లఁగ్రోవి నాదంబును గోపకులు మెచ్చి పొగడుచుండ వింత కాంతులతోడఁ బసులఁ దోలుకొని పల్లెకు వచ్చు నా శ్రీకాంతుని గోపకాంత లేపోవని చూపులఁ గనులపండువుగఁ గాంచి కాంచి తదీయవదనారవింద మరందంబు నేత్ర మిళిందంబుల వలనఁ ద్రావి త్రావి దినవియోగతాపంబు మాని యుల్లసిల్లిరి.

ఇట్లు వచ్చిన యచ్చియుతలం గాంచి రోహిణీ యశోదలు పరమానందంబునఁ గొడుకులం జేరం బోయి యథాకామంబుగఁ గాలయోగ్యంబుగ నాశీర్వదించి బడలిక తీర్చుకొనిన తనయులకు నలుగిడి జలకమార్చి మేలివలువలు కట్టనిచ్చి మచ్చికమీఱఁ బువ్వుదామంబుల నలంకరించి రుచిరంబైన యన్నంబిడిన వారును భుజించి మెత్తని మెత్తలపై నత్తమిల్లి నిదురించిరి. ఇట్లు కృష్ణుండు బృందావనంబునఁ జరించుచు బలరాముఁడు రాని యొక్కనాఁడు చెలికాండ్రతోడ యమునాతీరంబునకు గోవులం దోలికొని పోయెను. అప్పుడెండ వేఁడిమికిఁ దాళఁజాలక గోపాలురును గోవులును దప్పి గొని యమునకుఁ బోయి విషదూషితంబైన నీరు ద్రావి ప్రాణములు పోయి క్రిందఁబడినఁ జూచి యోగీశ్వరేశ్వరుండు తన కరుణామృతదృష్టులఁ జూచి వారిని మరల జీవింపఁజేసె. గోపాలురును లబ్ధజీవితులై యిది కృష్ణు ననుగ్రహ మనియు లేకున్న విషము ద్రావి బ్రతుకుటెట్లనియుఁ దలంచిరి. కృష్ణుండును యమునానదిని విషదూషితఁ జేసిన కాళియుఁ డను మహోసర్పమును నందుండి వెడలఁ నడిచెదనినఁ బరిక్షిన్న రేంద్రుం డిట్లనియె.

## —: కాళియమర్దనము :—

మునీంద్రా! నాగుఁబాములు నీటఁ జరించునవి కావు గదా అట్టుండఁ గాళియసర్ప మేల యగాధజలంబులఁ బెక్కుయుగంబులు వసించె వినిపింపుము. బ్రాహ్మణోత్తమా! స్వచ్ఛందవర్తియగు శ్రీకృష్ణు నుదారచరిత్రంబు వినుటయం దెవ్వఁడు తృప్తిఁగొను ననిన శుకయోగీంద్రుం డిట్లనియె.

కాళిందీనదియందుఁ గాళియమను నొక మడుఁగు గలదు. అందుఁ గాళియుఁడను మహాసర్పము వసించుచుండెను. దాని విషముచే నీరెల్ల విషమై దానిమీఁదినుండి వీచు గాలియు విషమై యుండెను. ఆమడుగునకు సూటిగ నాకాశంబునఁ బోవు పక్షులును గిరగిర తిరిగి పడి చచ్చుచుండెను. ఆ జలబిందువులతోడి గాలి సోఁకినఁ దీరంబుననుండు వృక్షంబులును మలమలమాడినట్లగుచుండెనన దానిని సమీపించిన ప్రాణుల వార్త నేమి చెప్పనలయును.

అట్లు క్రూరసర్పము నందుండి తఱుమఁదలఁచి దుష్టసంహార నిమిత్త మవతరించిన భగవంతుండు దట్టి చక్కఁ బిగించి యాతీరంబుననున్న యెత్తైన కడప మ్రానిపై నెక్కి బాహువు లప్పళించి కుప్పించి తటాలున నీట దూఁకెను. ఇట్లు దుముకుటయు విషభీకరంబైన యా మడుఁగు నీరు పొంగినట్టి పెద్దయల లెగసి నాలుగునూర్ల మూరల కొలఁది దూరము నేలపై వ్యాపించె. ఇట్లు దూఁకి మదగజంబుఁబోలె విజృంభించి కచ్చుకై విచ్చలవిడి పెచ్చు పెరిఁగి మడుఁగెల్ల నల్లకల్లోలంబుగఁ దన పేటిపట్టునకుఁ బట్టిన గతిఁజూచి యది తన కవమానంబుగఁ దోఁచుటయుఁ దత్పరిభవంబు సహింపనేరక సైన్యంబుతోడఁ వచ్చి యెంతచూచినను దనివితీరని యందముగల సుకుమారుండును జలదాభ దేహుఁడును శ్రీవత్స పీతాంబరుండును మందహాస సుందర వదనారవిందుండును కౌస్తుభయ రహితుండును గమలోదరచరణుండును, నగు శ్రీకృష్ణుఁ దిలకించి కాళియుఁడు కోపోద్దీపితుండై

యౌరా యీ శేనేఁడు పిల్లవాని గర్వంబు! వీఁడా నామడుఁగుఁ జొచ్చి యల్లకల్లోలంబు గావించుచున్నాఁడు. పళయ కాలానలాభీల దుర్విషమహా విషాగ్ని జ్వాలామాలికల వీనిని భస్మీభూతుం గావించెదఁ జూడుండని కోపం బుద్దీపింప వడిం బయిపడి సర్వాంగంబులం గఱచె. ఇట్లు కఱచి కఱచి తృప్తి లేక తన దేహం బాయన మేనితోఁ బెనచి నట్లు చుట్టె. ఇట్లు పాముచేతఁ జుట్టఁబడి చేష్టారహితు నట్లున్న చిన్ని కృష్ణుంజూచి యాయన ప్రియసఖులు తారు నిజమిత్రార్థ కామ కళత్రాదులు కృష్ణునికై సమర్పించిన వారగుట భయార్తులై దుఃఖశోక భయవేగంబున నేమియుఁ దోఁపక దిగ్భ్రమఁగొని మూర్ఛిల్లి పడిరి. గోవులు కోడెలు తీఁగలు కృష్ణునియందే తమ గమ చూడ్కులు నిలిపి దుఃఖంబున భీతిని నేడ్చునట్లుండె.

అక్కడ మందయందు నాపద సూచించు మూఁడువిధము లైన యుత్పాతంబులును దోఁచె. ఇట్లు భూకంపాదులు నేలను, గోఱవులవాన నాకసంబునను, దమదేహంబులఁ గన్నులు చలించుట లోనగు నపశకునంబులఁ జూచి నందుండులోనగు వారానం దంబు కుంటుపడ నొక్క కఁడువం జేరి నేఁడు కృష్ణుండు రాముని విడిచి చనినవాఁడు. ఎందో యేదో కీడుమూఁడి యుండునని భయపడిరి. మనస్సు ప్రాణంబులన్నియు ముకుందునందే పొందుపఱిచిన వారగుట మందయందలి బాలురు వృద్ధులు స్త్రీలు నందఱు గేహంబులు వీడి స్నేహంబు బలిమి దేహంబులు మఱచి కృష్ణదర్శన లాలసులై యాలసింపక కృష్ణా కృష్ణాయని యఱచుచు నానాఁడు పసులు పోయిన జాడవెదకి కనిపట్టి ధ్వజాంకుశ యవవజ్ర చిహ్నితంబైన కృష్ణపదంబులను జూచుచు నడుమ నడుమ మేయు పశువుల గుర్తెఱింగి కాల్నడ యమునా తీరంబునకుఁ బరువు పాఱిరి. బలరాముఁడు తన తమ్ముని ప్రభావ మ్మెఱిగిన వాడగుట దిగులు పడక భయకంపితులైన వారింజూచి నవ్వుకొనుచుండెను. అట్లు గోపాల

కలుపోయి నీటినడుమఁ బాపవుఁ బాము దేహమాద్యంతము చుట్టు కొన స్మృతి తప్పినట్లుండు కుమారుని దిగ్భ్రమగొని యున్న గోపకులను నంభాయని యఱచుచున్న పశువులను జూచి యార్తులై మిక్కిలి వ్యాకుల పడిరి.

ఆ నెయ్యము తియ్యందనము చిఱునగవు చూపులును బలుకు తీపులును దలఁచి తలఁచి యనంతుఁడైన భగవంతునియందు నను రక్తమనస్కులైన గోపికలు పాముపట్టుకొన్న తమ ప్రియతమునిఁ జూచి దుఃఖసంతప్తలై ప్రియవిరహంబున జగంబు పాడుపడినట్లు చూచిరి. కుమారునికై శోకించుచు మడుఁగునఁ బడ నుంకించు యశోదను జుట్టుకొని పట్టుకొని యంతటి దుఃఖముచేఁ గన్నీరు మున్నీరుగఁ గార్చు గోపికలు కృష్ణచరిత్రము లెల్ల స్మరించుచుఁ గృష్ణుని ముఖము నందే తమ చూపులు నిలిపి శవంబులఁ బోలెనుండి విలపించిరి.

కం. నీవెం దేగిన నేమను
నీ వెనుకన వత్తుఁగాక నిలుతునె యిచటన్
నీవున్న నడవి స్వర్గము
నీ వెడలిన స్వర్గ మడవి బిడాటవియౌ.

కం. నీనవ్వులు నీచూపులు
నీనయగారములు ప్రియము నీనటనంబుల్
నే నెన్నఁ డెవరి యందిఁకఁ
గానం గలరా! కుమార కరుణోదారా!

సీ. కన్నార నీమోముఁ గాంచుటెన్నం డింక
లాలితాకార గోపాల బాల
వీనులవిందుగా వినుట యెన్నండింక
నీముద్దుపలుకులు నీరజాక్ష
నీవు పైఁబ్రాఁకంగ నెలమిఁ గౌఁగిటఁ గ్రుచ్చి
ముద్దాడు టెన్నఁడు మోహనాంగ

చిఱునవ్వు లొలుకంగఁ జెలఁగి నవ్వించుచుఁ
జేయుట యెన్నఁడో చిన్ని కుఱ్ఱ
గీ. నీ వొకండ వున్న నిఖిలంబు మాకుండు
నీవొకండు లేక నిఖల ముండి
జగమె పాడుపడినఁ జందంబుగా నగు
నవ్యగుణ విహార నా కుమార.

అని యిట్లు విలపించుచుఁ గృష్ణుఁడే ప్రాణముగాఁ గల వారగుట శోకాతిశయమున మడుగులోఁ జొఱఁ బార యత్నించు యశోదానందాదులను భగవంతుఁడైన బలరాముఁడు తన సోదరు మహిమ తెలిసినవాఁ డగుట వారించెను. ఇటు తన నిమిత్తము పరితపించు స్త్రీ బాల వృద్ధ సహితంబును ననన్య గతికంబును నగు గోపసమూహంబును జూచి యించుకసేపు మనుష్య లీలానటనంబు జరిపి యురగ బంధంబుల విడిపించుకొనఁ దలఁచి తన దేహమును బెంచెను. ఆయన దేహము లోలోనఁ బెరుఁగు కొలఁది చుట్టుకొని యున్న కాళీయుని దేహము బిగువున నలిగి నలుగులిగానుండ నది పీడితమైన చుట్లు కట్లు విడిచి పడగ లెత్తి కోపంబునఁ గ్రాఁగిన పెనమువలె నుండు నా సారంధ్రముల విషవాయువుల నూర్పుచ్చుచుఁ గొఱవుల నఱ సేయని మొగంబున నమ్మహాత్ము సబ్బములగు చూపులఁ జూచు చుండెను. నాలుకలు గ్రోయుచు దవుడలు నాకుచు మిక్కిలి భయంకరమై విషాగ్నులఁ గ్రక్కు దృష్టులఁ దన్నుఁ జూచు భుజంగంబు చుట్టు గరుత్మంతునివలెఁ దిరిగి తిరిగి సమయంబుగని పెట్టి యీ త్రిప్పటలచే నలసియున్న యున్నాగుఁ కాము ఫణముల పైకిఁ దటాలున నెగిరి దూఁకి విశాలంబులగు వాని పై నాద్యుండయిన కృష్ణుండు పడగలఁ గల రతనంబుల తాఁకున మఱింత యెఱ్ఱనైన పాదకమలములతో నఖిల విద్యాగురుండు తాండవ మాడఁ జొచ్చెను. ఇట్లు తాండవమునకై యుపక్రమించిన కృష్ణుంజూచి గంధర్వ సిద్ధ చారణ ముని దేవతా స్త్రీలు సంతో

పించి నర్తనమున కనురూపమగుగతి మర్దల తాళాది ధ్వనులు నెఱపిరి. సంగీతము పాడిరి. పూలకానుక లర్పించి స్తుతించిరి. వంచకుండైన కాళీయుండు తనపడగలందు దేని నెక్కఁబెట్టు దానినే పదాఘాతంబుల మరల నెత్తకుండునట్లు మఱిమఱి తన్నితన్ని నర్తనము గావించుచుండెను. ఆ నెఱవాది పాదాహతులకుఁ దాళఁజాలక క్షీణాయుష్కుండై కన్నుల నెత్తురు నోట విషముఁ గ్రక్కుచు నుక్కిరి బిక్కిరియై గ్రుక్కి మొగంబులు వాఁచి యా కాళీయుండు మిక్కిలి కష్టదశకుం బాల్పడియె. ఇట్లు పురాణ పురుషుండు నర్తించి గోడుగుడిపించి వాని మదంబడంచి పుష్పార్చనంబుఁ గొన్న వానివలె సంతసించెను. ఆ చిత్రతాండవ కారణంబున దేహమంతయుఁ జిదుగఁ గొట్టినట్లైన వేయి పడగలనుండి బుడబుడ నెత్తురు వెడలఁ గ్రక్కుచు సొక్కి దిక్కుమాలి యిట్లు తలపోసె.

దేవతలైనను నామదుఁగు సమీపించి బ్రతుకలేరు. సమీపించిరిపో యించుక గాలిసోఁకిన మాత్రన జీవింపలేరు. ఇట్టిచో నన్నీ బొట్టెఁడు రట్టుపెట్టెడి. వీఁడు నామదుఁగున దూఁకి యల్లకల్లోల పఱుచుటే కాక నేను గోఱలఁ జాఱలుపడఁ గఱచినను జావక సరకును జేయక వీఁడు మిక్కిలి చెలరేఁగి నా పడగలపై నెక్కి త్రొక్కి త్రొక్కి నాట్యమాడుచున్నవాఁడు. వీఁడెవ్వఁడో కదా? ప్రాకృత మానవున కిట్టి దురూహ శక్తి యెట్లు వచ్చెను. చిత్రము చిత్రము. వివేకించి చూడ నితండు మనుష్య మాత్రుండు గాఁడు. నా గర్వ మణఁప వచ్చిన భగవంతుఁడు నారాయణుఁడే యైయుండనోపు. కాకున్న లోకంబునఁ దక్కన వారెవ్వ రింత శక్తిమంతులు. అని చరాచర గురుండును బురాణ పురుషుండును నగు నారాయణుఁడే శరణ మని తనలో ధ్యానింపఁ జొచ్చెను.

విశ్వంభరచరణ తాడనంబుల సంధులూడి గర్వంబు వీడి వాఁడి తఱిగి కొఱయూపిరి తోడనుండు తమ పతి దురవస్థం జూచి

యాతని మద వతులు విగత ముదంబున నార్తలై చాఋవస్త్రములు రాలు భూషణములు, వీడు కేశపాశములు, కొట్టుకొను గుండియలు నై బాలుర ముండిడుకొని వనజ నయనుఁ జేరబోయి దండప్రణామంబులు గావించుచు నేల వ్రాలి యిట్లనిరి.

చం. ఖలులను నిగ్రహింపఁగను గారణ జన్ముఁడవైన నీకు నీ
కలుషచరిత్రు దండితుసేఁగా నొనరించుట న్యాయమే; సుతా
వళిరిపుజాలమందు సమ వర్తనుఁడై చరియించు నీ వెవో
ఫలము నొసంగ శిక్షలకుఁ బాల్పఋపం దలపోయు దీశ్వరా.

చం. సుహితచరిత్ర! నీ విపుడు మానక కూర్చిన దండనం బను
గ్రహముగ నెంచువార; మది కల్మషమున్ దొలగించుఁ గాన ని
గ్రహమనఁ బోము; పూర్వకృత కల్మష ఘోర పరంపరం గదా
యహితను వచ్చె నీశనికి; నా యఘముల్ విడు నింక నీ కృపన్.

ఉ. ఎట్టితపంబుఁ జేసెనొకొ హీన మదుండయి సజ్జనాంఘ్రులం
బట్టెనొ సర్వభూతదయఁ బావన ధర్మము లేవిచేసె నీ
కట్టెఁడి సర్వజీవనతిఁ గాలెడి నీవిటు సంత సించుటన్
గట్టిగవీఁడు నీచరణ కంజములన్ శిరసావహించెడిన్.

మ. శివశక్రామర పూజితాంఘ్రియుగు నా శ్రీ దేవి నిష్కామయై
యవి చింత్యాద్భుతమౌ తపంబు వ్రతమాయాసంబునం జల్పితా
భవదీయాంఘ్రి సరోజ రేణులవ సంస్పర్శోన్నతిం గాంచె; వీఁ
డవురా కాంచెను నక్షమంబునసె! భాగ్యంబెట్టిదో వీనికిన్.

ఉ. కోరరు నాకలోకమును, గోరరు బ్రహ్మపదంబు నొందఁగాఁ,
గోరరు సార్వభౌమమును, గోరరు భోగి జగత్ప్రభుత్వమున్
గోరరు యోగ సిద్ధులను, గోరరు మోక్ష సుఖంబు నేనియున్,
సారసనేత్ర! త్వచ్చరణ సారససక్త వరాగలాలసుల్.

ఉ. తామస జన్ముఁడున్ మఱియు దారుణ రోష వశుండు పాఁపరా
జీతఁడు నన్య దుర్లభము నీశ్వర! త్వత్పద రేణువందె నా

నా మహి సంసృతిం దిరుగు నట్టిశరీరి యదృచ్ఛఁ గాంచుఁ బో
మ్మా మఱి నీకటాక్షము సమక్షమునన్ భవదీయ సత్కృపన్.

దేవా! భగవంతుండవును, పురుషుఁడవును, మహాత్ముఁడవును, భూతావాసుఁడవును, భూతుఁడవును, పరుఁడవును, పరమాత్ముఁడవును, జ్ఞానవిజ్ఞాన నిధియును, బ్రహ్మమును, ననంతశక్తియును, నగుణుండవును, నవికారుండవును, నప్రాకృతుండవును, నగు నీకు నమస్కారంబులు. కాలుండవును, కాలనాభుండవును, కాలావయవ సాక్షియు, విశ్వుండవును, విశ్వరూపుఁడవును, విశ్వకర్తయు, విశ్వహేతువును, భూతమాత్రేంద్రియ ప్రాణమనో బుద్ధ్యాశయాత్ముండవును, త్రిగుణాభిమానగూఢ స్వాత్మానుభూతియు, నగు నీకుఁ బ్రణామంబులు. అనంతుఁడవును, సూక్ష్ముండవును, కూటస్థుండవును, విపశ్చితుండవును, నానావాదానురోధుండవును, వాచావాచక శక్తియును, నగు నీకు నమోవాకంబులు. ప్రమాణమూలంబును, కవియు, శాస్త్రయోనియుఁ, బ్రవృత్తుండవును, నివృత్తుండవును నిగముఁడవును, నగు నీకుఁ బునః పునః ప్రణతులు. కృష్ణుండవును, రాముఁడవును, వసుదేవ సూనుఁడవును, ప్రద్యుమ్నుఁడవును, ననిరుద్ధుండవును. సాత్వతులకుఁ బతియు నగు నీకు నతులు. గుణప్రదీపుఁడవును, గుణాత్మచ్ఛాదనుండవును, గుణవృత్త్యుపలభ్యుఁడవును, గుణద్రష్టవును, స్వసంవిదుండవును, నవ్యాకృత విహారుండవును, సర్వవ్యాకృత సిద్ధియు, నగు నీకు సాష్టాంగంబులు. హృషీకేశా! మునియు, మౌనశీలియుఁ, బరావర గతిజ్ఞుండవును, సర్వాధ్యక్షుండవు, విశ్వుండవు, నవిశ్వుండవు, విశ్వద్రష్టయు, విశ్వహేతువునగు నీకు దండంబులు. జగదీశా! అనీహుఁడవయ్యు ననాదికాలంబను శక్తిం ధరించి గుణములచే నీజగంబునకు జన్మ స్థితి లయంబులు గలిగించుచు దత్తత్స్వభావంబులంగల సత్త్వముల దృష్టిచేఁ బ్రతిబోధించి యప్రతిహత వ్యాపారుండవై యుండుదువు. మూఁడు లోకంబులఁగల శాంతులు,

నశాంతులు, మూఢులగు వారెల్ల నీకు శరీరంబులు. ఇప్పుడు ధర్మపరిపాలనార్థంబు సాధువుల రక్షింపఁబూనిన నీకు శాంతులు ప్రియులైరి. కావున మీ బిడ్డఁడైన మాభర్త పన్నగుఁడు తెలియక మూఢుడై కావించిన యపరాధంబు శాంత మానసంబున క్షమింపుము. ఈ భుజంగుఁడు ప్రాణంబులం బాయు స్థితి యందున్న వాఁడు. ఈశ్వరా! స్త్రీలు సాధు శోచనీయులు గదా? అట్టి స్త్రీలమైన మాకుఁ బతియే ప్రాణంబు. కావున మాకుఁ బతి భిక్ష నిమ్ము. వీఁడు బాలుఁడు గావున నజ్ఞానంబుచే నీ కవజ్ఞ గావించెనని కాని మంచి వాఁడని కాని చెప్పము. మహా క్రూరుఁడు పరమ కోపనుఁడు దురాచారుఁడు వక్రగామియగుట నిజము. వాఁడెట్టివాఁడైనను మాకు భర్త. మా సౌభాగ్యలక్ష్మి యతని యందు నిలచి యున్నది. నీవు కారణంబున నతనికి నిరాకారంబుఁ గావించిన నిరపరాధిను లగు మా యలంకారంబులఁ బాపి మా కపకారంబుఁ జేసిన వాఁడ వగుదువు. దేవా యనాథలము. నీ శరణుఁ జొచ్చిన వారము. శరణన్న యావల మా దీనాలాపంబు లాలింపకునికి నీకు ధర్మంబుగాదు. కావున మాకుఁ బతి భిక్ష యిచ్చి నీ లీలాతాండవంబు చాలింపుము. దేహంబు నలిగులియయ్యె. పడగలు కలిపిన పిండయ్యె ప్రాణంబును కంఠగతంబులయ్యె. శ్రియఃపతీ! యభయం బభయం బభయం బిమ్ము. మా మంగళ సూత్రంబులు నిలుపుము.

నీ కింకరులమైన మాకుఁ గార్యం బాజ్ఞాపింపుము. నీ యాజ్ఞ చొప్పున నడచువారు భయముక్తులు. కావున నీ యానతి శిరసా వహించి చరింతుము.

ఆ. ఎంతమూఢజన్మ మెత్తిన నందును, ముగుదలేక దదాభిముఖ్యమున్న
స్వామిసన్నిధానసత్ప్రభావంబున, నుత్తమంపుజ్ఞాన మొదవు నిజము.

అని నాగపత్నులు స్తుతింపఁ గృష్ణుండు పడగలు పగిలి మూర్ఛిల్లిపడిన పడగదారిని బాధఘట్టనంబుల నొప్పింపక విడిచె.

కం. తా నెంత దుష్టుఁడైనను
మానుగఁ దనవారిలోన మాధవ పద సే
వానిరతుఁ డొకఁడుండిన
మానవుఁడు తరించు శౌరిమానిత కృపచేన్.

కాళియుండును మెల్లమెల్లగ నింద్రియప్రాణంబులఁ గుదురు పఱుచుకొని యెట్టెట్టో యూర్పుచ్చి దీనుండై కృష్ణుంజూచి యిట్లనియె.

దేవా! మేము పుట్టువుచేతనే ఖలులము. వక్రప్రచారులము. దీర్ఘకోపులము. దుష్టపిశాచంబువలె స్వభావంబు దుస్త్యజంబు గదా. గుణంబులచే సమస్తజగంబు పలువిధంబులైన స్వభావంబులు, బలంబులు, ప్రవృత్తిసామర్థ్యంబులు, నుత్పత్తిక్షేత్రంబులు కారణంబులు నాకారంబులు గలదానినిగ నీవే సృజించితివి.

అందు మేము స్వభావకోపనుల మైన సర్పములము. అట్టి నీ మాయచే మోహితులమైన మేము స్వభావంబు వర్జింప నెట్లు శక్తి గలవార మగుదుము. సర్వజ్ఞుండవును జగదీశ్వరుండవును నైన నీవే దీనికిఁ గారణము. అనుగ్రహమో నిగ్రహమో నీ యిచ్చచొప్పున విధింపుము. అనినఁ గారణమానవుండైన కృష్ణుం డిట్లనియె.

కాళియా! నీ వింక నిందుండవలదు. తత్క్షణము సముద్రమున వసింపఁబొమ్ము. బంధువులతో బిడ్డపాపలతో భార్యలతో గోవులతో లోకు లీ నది నుపయోగింపవలయు. నేను నీకుఁ గావించిన యీ శాసనం బెవ్వఁడు రెండు సంధ్యలయందు స్మరించుఁ గీర్తించు నతఁడు మీ సర్పవిషంబువలన భయంబు నొందఁడు. ఎవ్వఁ డీమడుఁగున నిక స్నానము గావించి దేవపితృతర్పణంబులు గావించు, నటుగాక యుపవసించి స్మరించి పూజించు నతఁడు సర్వపాపముక్తుండగును, ఎవని భయంబువలన నీవు రమణకద్వీపంబు వదలి యిందుఁ జేరితి వట్టి గరుడుండు నీ శిరస్సున నా పాదచిహ్నములం జూచి నిన్ను హింసింప మానును. అని యద్భుతచరిత్రుండైన కృష్ణుం డిట్లు వచించిన నాగపత్నులును

సాదరంబుగ నాయను దివ్యాంబరములచేతను, బుష్పమాలికల చేతను, సమూల్యాభరణంబుల చేతను, దివ్యగంధానులేపనంబుల చేతను, బూజించిరి. కాళియుఁడును గృష్ణునకుఁ బ్రదక్షిణ నమస్కారంబులు గావించి భార్యలతోడ సముద్రమంతలి ద్వీపంబునకుం జనియె. క్రీడామానవరూపియగు భగవంతుఁ డనుగ్రహింప యమునానది విషముక్తయై యమృతజలయుతయై సకలజనులకు సేవ్య యయ్యె.

—: కాళియుని పూర్వవృత్తాంతము :—

అనినఁ బరీక్షిన్నృపాలుండు యోగిజనపాలుం డైనశుకుం జూచి యేమి దోషంబునఁ గాళియుఁడు సర్పాలయమైన రమణకంబు విడిచి యమునానదిం జేరె ననిన నయ్యోగిచంద్రుం డిట్లనియె.

ముందు గరుత్మనకు భయపడి రమణకమందలి నాగంబులు నెలకొక్కొక్కసారి యతనికి వనస్పతికడ బలి నిచ్చున ట్లంగీకరించి యట్లె ప్రతిపర్వంబున నాత్మరక్షణార్థంబు బలుల నిచ్చుచు నతనిభయంబువాసియుండిరి. ఇట్లు కొంతకాలంబు గడచిన విషవీర్యంబునఁ గాళియుఁడు మదించి లక్ష్యపెట్టక గరుడ భాగంబు బలిని దాన యొకనాఁడు భక్షించెను. ఆవార్త విని భగవత్ప్రియుఁ డైనగరుడుండు కోపించి కాళియుఁజంప నుత్సహించి యకుంచిత వేగంబునఁ బఱతెంచె. ఇట్లే తెంచు పన్నగారిం జూచి భయపడక విషాయుధుఁ డైన కాళియుఁడు పడగలెత్తి యతని మార్కొని దారుణదంష్ట్రిలలార్చుచు నతనిఁ గఱచె. ఆ సర్పంబు గర్వంబు నుపలక్షించి పక్షిరాజు రాఁజు కోపం బుద్దీపింప నుగ్రవిక్రమంబున బంగరు వన్నె గలడాపలి ఱెక్క నక్కుటిలుని శిరంబు వ్రక్కలుగాఁ దన్నె. ఆ ఱెక్క తాఁకున భుజంగుండు విహ్వాలించి ప్రాణభయంబునఁ బఱచి గరుడునకు దుర్గమం

బును నగాధంబును నగు కాళింది హ్రదంబునఁ జేరె. అందు గరు
డుం డొకనాఁడు సౌభరియను మునీంద్రుండు వలదు వలదని వారించి
నను వినక యొకమీనంబును భుజించె. ఇట్లు తమపతి హతుం డైనఁ
దక్కిన మీనంబులు దిక్కుమాలి పెక్కువిధంబుల బొక్కుచుండె.
వాని దుఃఖంబుఁ జూచి సహింపఁజాలక దయానిధి యగు నమ్మునీం
ద్రుండు గరుడుం డిఁక నిందు మత్స్యంబుల భుజించెనేని తత్క్షణము మర
ణించుఁ గాక యని శపించె. ఆ శాపభయంబున గరుడుండా ప్రాం
తంబున విహరింప వెఱచు. ఇది కాళియుం డొక్కఁ డెఱుఁగును గాని
తక్కిన సర్పంబు లెఱుంగవు.

కం. శక్తి గలవాఁడ యేన్ హరి
భక్తులతోఁ బగయుఁ గొన్న భ్రష్టుండ యగున్;
రక్తుండై హరిపదయుగ
సక్తుండగు నేని భద్రసంపదఁ గాంచున్.

దివ్యమాలికా గంధవస్త్రుండును, మహామణి గణాలంకృతుం
డును సువర్ణ రత్నభూషితుండునై మడుఁగు వెడలి యరుదెంచిన
కృష్ణుంగాంచి లబ్ధప్రాణంబులైన యింద్రియములవలెనై గోపకు లెల్లరు
లేచి సంతోషంబున నాయనను జుట్టుకొనిరి. నందాది గోపులును య
శోదారోహిణులును గోపికలును లబ్ధచేష్టలై ప్రాప్తమనోరథలై యా
బాలుం జేరి కౌఁగిలించిరి. బలరాముఁడు తమ్ముని మహిమమ్ము నెఱిఁ
గినవాఁడగుటఁ జిఱునవ్వునఁ గృష్ణునిఁ గౌఁగిలించుకొని ప్రేమాతి
శయంబునఁ దొడపైఁ గూర్చుండఁబెట్టుకొని మఱిమఱి యాయనను
వీక్షించుచుండె. వాడినవృక్షంబులు దీనంబులైన దూడలు కోడెలు
గోవులు పరమపదంబున వికాసంబు వహించె. బ్రాహ్మణులును పెద్ద
లును నరుదెంచి పాఁపవాతఁబడిన యీ పాపండు మరల బ్రతికె
నెంతయదృష్టమని నందుని నభినందించిరి. మహాభాగ యశోదయు
మరణించిన బిడ్డఁడు మరల జీవించెనని సుతునిఁ గౌఁగిలించుకొని

తొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని మఱిమఱి ముద్దులిడుచు నానంద బాష్పంబులు గార్చె. అంతట సూర్యుఁ డస్తమించె. బలరామాదులతోడ నందఱు గోపాలకులు నా రేయి యాఁకలి దప్పుల నలఁగుచు గోవులతోడ యమునాతటంబుననే వసించిరి.

### —{ శ్రీకృష్ణుండు దావాగ్నిఁ ద్రావి గోప రక్షణంబుఁ గావించుట }—

ఇట్లందఱు నిద్రించు సమయంబున నర్ధరాత్రంబునఁ గారుచిచ్చు గోగోపాల సంఘంబును జుట్టుకొని కాల్ప మొదలిడియె. అది చూచి యందఱు సంభ్రాంతులై లేచి మాయా మనుష్యుండైన శ్రీకృష్ణునే శరణుఁ జొచ్చిరి. కృష్ణా కృష్ణా రామా రామా మీరే దిక్కు రందురంపు. మీ వారమైన మమ్మీ కాలాగ్ని వంటి దావాగ్ని దహించుచున్నది. మీరు భయమున నెట్టిదో యెఱుఁగని వారు. మీ చరణకమలముల విడిచి యుండనేరని మీ వారిని మమ్ము రక్షింపుడు. అని ప్రార్థించు తన వారిమొఱ యాలించి యనంతశక్తి ధరుండైన యనంతుఁ డా దావాగ్ని నెల్లఁ ద్రావెను.

### —: గ్రీష్మర్తువర్ణనము :—

తరువాత సంతుష్టస్వాంతులైన బంధువు లందఱుఁ దన్నుబలసి రాఁగా గోపాలబాలకులు తన చరిత్రములు పాడుచుండఁ గృష్ణుండు గోకులమండితంబైన వ్రజంబుఁ బ్రవేశించె. ఇట్లు మాయాగోపాలుఁడు క్రీడించు నవసరంబున సకలజీవజంతువుల కూష్మంబు కతన మిగులఁ బ్రియంబుగాని గ్రీష్మంబు భీష్మంబుగా నెసఁగె. ఝల్లికాని నాదంబుల ఝంకారవంబులతో దొరలు సెల యేఱుల తుంపురుల పరంపరలచే నింపారు భూరుహంబుల చేతను, నెండలయుఁ గారుచిచ్చులయు సూర్యునియు ముకాఁక తెలియనీక కమలోత్పల కహ్లారప్రసూన పరాగ రమ్యంబైన నదులయుఁ గొలఁకులయుఁ గొండ

వంకలయు నలలనుండి వీచు చల్లని పిల్లగాలులచే నుల్లసిల్లు పచ్చిక
పట్టులచేతను, లోఁతు తెలియరాని యమున తరఁగల పొరలి కలచే
నెట్టిబిట్టుండలకుఁ దడియాఱని నాఁచుగల యిసుకదిన్నెల చేతను, శ్రీని
వాసునకు వాసంబగుట నవ్వనంబున నిదాఘంబు వసంతంబన భాసిల్లె.
మఱియు విరిసిన విరులును, బూచిన తరులును, మనోహరా రావం
బుల శ్రవణపర్వం బొదవించు మృగపక్షి గణంబులును, గాన లోలం
బులైన మయూర భ్రమరజాలంబును, కూయుకోకిల సారసంబులునై
యా బృందావనంబు డెందంబున నమందా నందంబు కందళింపఁ జేయు
చుండె. అట్టి కాంతారంబు గో గోపబాలురతో రామ కృష్ణులు
వేణునాదంబు లొనర్చుచుఁ జొచ్చి ఖేలాలోలురై చరించు చుండురి.
చిగురు గుబురులు, లేదళంబుల సరంబులు, భూషణంబులుగ నల
వరించికొని ధాతువులు మేనికి రంగులీన రామకృష్ణాది గోపులు
నాట్యమాడువారును యుద్ధము సలుపువారును, గాన మొనర్చు
వారును నైరి. కృష్ణుఁడు నర్తింపఁ గొందఱు కరతాలములు వేయు
దురు. కొందఱు పాడుదురు. కొందఱు కొమ్ములు పిల్లఁగ్రోవులు
నూఁదుదురు. కొందఱు బళే బలేయని మెచ్చుచుందురు. గోపాల
వేషములు ధరించిన దేవతలగు రామకృష్ణులును, మేటినటుల
యటులు నటనంబును బొగడిరి. పరస్పరము కరములు పట్టుకొని
యొకరినొకరు చుట్టితిరుగుచు దాఁటులు వేయుచు భుజంబు లప్ప
ళించుచు లాగుచు లాఁగులు వేయుచు మల్లసఱచుచు జట్టులట్లు
పోరుచు ముద్దులుగురియు జులుపాలతో రామకృష్ణులు క్రీడించిరి.
ఇతరు లాడుచుఁ బాడుచుఁ గరతాళములు వేయుచుండ రామకృ
ష్ణులు మేలుమేలని ప్రశంసించు చుండిరి. మారేడు, గుగ్గులు, నుసి
రిక ఫలంబులనుగవ్వలను సరి జేసులు లోనుగా నాటలును, దాఁగిలి
మూఁతలును, నాడుచు ఖగమృగంబులఁ బోలె వర్తించుచుఁ, గొన్ని
యెడల గవ్వగంతులు వేయుచు గేలిసేయుచుఁ గికురించి డాయుచు

నుయ్యాల లూఁగుచు రాజులవలె నాజ్ఞలుపెట్టుచు నిట్టి లోకసిద్ధంబులైన యాటలు కొండదోనలయందును, బోదలయందును, నడవులయందును, నదులందును, నాడుచుండిరి. ఈ విధంబుగ వినోదంబుగఁ జరించుచు గోరక్షణంబుసేయు రామకృష్ణుల వధింపనెంచి ప్రలంబుఁడను నిశాచరుండు గోపార్భకు వేషము వహించి వారిలోవచ్చి కలసికొనెను.

## —: ప్రలంబవధ: —

సర్వదర్శియగు భగవంతుఁడు వానియున్న రూపెఱిఁగి వాని వధింపనెంచి వానితో మిత్రుని బోలెఁ గలసి మెలసి వర్తించుచు నిట్లనియె. గోపాలకులారా! మీరంద ఱిట్లురండు. నేఁడొక చెండాట యాడవలయును. అందు మనమెల్లరము రెండుద్దులము గావలయుఁ గొందఱు నా యుద్దికి రండు. కొంద ఱన్నయుద్దికిఁ బొండు. ఓడిన వారు గెలిచినవారిని మోచి తిరుగ వలయును. అని యందఱు భాండీరకమను వటవృక్షంబు పొంతకేగిరి. శ్రీదామ వృషభాదులు రాముని పక్షము వహించిరి. భద్రసేన ప్రలంబాదులు కృష్ణుపక్షమున నిలిచిరి. అందుఁ గృష్ణుని పక్షమువారు చెంగిపోవుటచే భద్రసేనుఁడు వృషభుని. ప్రలంబుఁడు రాముని, మోచి తిరుగనయ్యె. తృణావర్తుని గతిఁ దలంచి కృష్ణుఁడు తనకు మోవరానివాఁడని ప్రలంబుఁడు రాము నెత్తికొని మేరగీఱ మీఱి యతివేగంబునఁ జాలదూరము పరువెత్తెను. ఇట్లు కొంతదవ్వుపఱచి కొండవలె బరువైన రాముని భారాతిశయంబున రయం బుడిగి మెల్లనఁబోవుచుండె. ఆవల మనుష్యరూపంబున మోయలేక నిజరూపంబుఁ గైకొనియె. సర్వాలంకార భూషితంబైన నల్లని రాక్షస శరీరంబు రాముండు పైనుండుటంజేసి చంద్రబింబముతోడి మేఘుంబువలెఁ దోఁచె. అంబరంబు నొరయు నెఱ్ఱని మండు చూపులును బొమముడి బెగడుగొలుప నుగ్రదంష్ట్రిలచే దుర్నిరీక్షంబగు ముఖమును రక్తశిఖయును, గటకాదికాంతులను జూచి యేమిది

చిత్రమని రాముఁడు విస్మితుఁడై తొలుత నించుక వెఱ సంచలించినట్టు లయ్యు స్మృతి తెచ్చుకొని భయంబువిడిచి యోహో వీఁడు మనల వధింపఁ గొనిపోవు రక్కసుండని నిక్కంబెఱిఁగి పిడికిట నతని శిరంబు బిట్టు పొడిచెను. ఆ పిడికిటి పోటున వానితల పిడుగుతాఁకునఁ గొండ వలెఁ జీలెను. నెత్తురు గ్రక్కుచు నాయక్కపుఁడు పుడమిఁబడియె. రాముఁడును గ్రమ్మరివచ్చి తనవారిం గలసికొనియె. మహాబలుఁడైన బలరామునిచేఁ జచ్చిన వియచ్చర విరోధింగాంచి యచ్చెరుపడి గోపకులు రామునిఁ గౌఁగిలించి మిక్కిలి శ్లాఘించిరి. పాపావలంబుఁడగు ప్రలంబునిపాటు చూచి సుఖితులై దేవతలు రామునిపైఁ బుష్పవర్షంబు గురియించి మేలుమేలని ప్రశంసించిరి.

కం. నటియించుచు సాధువువలెఁ
గుటిలమతిన్ సాధుజనులకుం గీడరయన్
కటువర్తను సైఁపఁడు ప్ర
స్ఫుటముగ నారాయణుండు పొరిదండించున్.

—: కృష్ణుఁడు దావాగ్ని బానము సేయుట. :—

ఈకరణి గోపాలు రాటల మఱగి యరయమి గోవులు తమంతఁ దాము యథేచ్ఛము విహరించుచు మేయుచు నొక యడవినుండి మఱియొం డడవికిఁ బోయిపోయి యెండవేఁడిమికి దప్పిగొని యొక ముంజారణ్యముం బ్రవేశించెను. పసుల మరలింప వేళయయిన నాటలు చాలించి రామకృష్ణాది గోపాలు రావుల వెదక నవి యెంటను గాన రావయ్యె. అట్లు వెదకుచు నవి సగము కొఱికి విడిచిన పచ్చికలును గిట్టలగుర్తులుగల బాటలును బట్టి నష్టజీవులై విచార గ్రస్తులై త్రోవదప్పి దప్పిచే గోవులఱచు నఱపుల వినుచుఁ బోయిరి గాని వానిని మాత్రము గానలేరైరి. ఆ తెల్లడవి యందు నావులెం దుండునది తెలియక నీరు పట్టుచేతను నలసటచేతను గాసిపడి పసుల

కాపరులెల్ల మరలిరి. అప్పుడు కృష్ణుండు కారుమబ్బు డాలుగల యున్నత వృక్షంబుపైనెక్కి మేఘగంభీరరవంబునఁ బేరుపెట్టి గోవులఁ బిలిచెను. తమ పేరు పెట్టిపిలుచు కృష్ణ కంఠరావం బాలించిన యంతన ధేనువులెల్ల మాఱెలుఁగిచ్చి యాఱెల్లడవి నుండి బయలు వెడలి వచ్చెను. ఇట్లు పశువులు గోపాలు రొక్కొక్కరు వెలికివచ్చు లోనఁగానన ధూమకేతువైన కారుచిచ్చు మారుతప్రేరితమై చిటపట రవంబులతో విస్ఫులింగంబులఁ గ్రక్కుచు నాలుకలు[ఱ]కోయుచు నలు ప్రక్కల నిమిషమునఁ జుట్టుకొనియె. ఇట్లు పైపడినచ్చు కారుచిచ్చు గని యా భీరులు భీతిల్లి యుల్లంబులఁ దల్లడిల్లి రామసహితుండౌ కృష్ణుం జూచి మృత్యువుఁగని భయపడినవారివలె విపన్నులై యిట్లువిన్నవించిరి.

కృష్ణ కృష్ణ మహావీర్యా! ఓరామా యమిత విక్రమా! కారుచిచ్చునఁ దగులుకొనిన మమ్ము రక్షింపుడు, కృష్ణా మేము మీ బంధువులము. నీవే దిక్కుగాఁగలిగి నీవే రక్షణోపాయమని తలఁచి తలఁపులు నీపై నిలిపి యున్నవారము. ఇట్టిమమ్ముఁ జేవిడు చుట సర్వధర్మజ్ఞుడవైన నీకుధర్మము గాదు. అని మొఱలిడ భగవం తుఁడు మిత్రబంధు దీనాలాపంబు లాలించి యిట్లనియె. ఓ గోపాల కులారా! భయపడకుఁడు. కన్నులు మూసికొనుఁడు. అనిన వారెల్లఁ గన్నులు మూసికొనిరి. అంత యోగాధీశుండగు కృష్ణుండు దావాగ్ని నెల్లఁ దనముఖంబునఁ ద్రావి గో గోపాలకుల నెల్ల భాండీరవటం బుఁజేర్చెను. వారును గన్నులువిచ్చి ముందు తాయున్న వటంబుఁ జూచి యాశ్చర్యపడి తాము గోవు లగ్నినుండి తప్పుటకుఁ గృష్ణుని యోగమాయాప్రభావంబె కారణంబని తలఁచి వారు దేవమూర్తు లని భావించిరి. సాయంకాలమున బలరామయుతుండై కృష్ణుండు వేణునాద మొనర్చుచు గో గోపాలురతోడ మందకు వచ్చెను. కృష్ణుని విడిచియుండుక్షణ మొక యుగశతంబుగఁ దలఁచు గోపికలు శ్రీ కృష్ణుం జూచి పరమానంద భరితలైరి. తమ్ము దావాగ్నినుండి రక్షిం

చుటయుఁ బ్రలంబవధయు గోపాలురు గోపవనితలకుఁ దెలిపిరి. ఆ యద్భుత చర్యలు విని గోపికలును వృద్ధగోపాలురును విస్మితులై రామ కృష్ణులను మందయందు జనించిన దేవశ్రేష్ఠులని భావించిరి.

కం. హరి యొక్కండే దిక్కని
స్థిరవిశ్వాసంబు గల్గుదీనులను సదా
కరిపరదుఁ డెల్ల తెఱఁగుల
నరయును సర్వత్ర యెట్టి యదనున నైనన్.

## —: వర్షర్తు వర్ణనము :—

అంత సమస్త ప్రాణులకు నదీనదంబులకు జీవనదంబై సంతోషకరంబై యుంబైన వర్షఋతువు ప్రారంభించె. ఆకసంబున నింద్రచాపంబులు దోఁచె. మేఘగర్జనలును గొర్కారలును మింట వ్యాపించె. గుబ్బతిల్లు కారు మబ్బుల యుబ్బునను, మెఱుపులతోడి యాఱుముల పేరిమిని దిరోహితమాట నస్పష్టజ్యోతియై యాకసంబు సగుణ బ్రహ్మంబుం బోలియుండె. ఎనిమిది మాసంబులు భూమినుండి యుదకంబను ధనము గ్రహించి పర్జన్యుండు యుక్తకాలంబు సంప్రాప్తంబైన మరలఁ దన కరంబులచే నొసంగ నారంభించెను. జీవి జీవనాధారమైన జలములను దీవ్రమారుత కంపితుఁడైన మహామేఘుఁడు దయాశాలివలె విడువ దొరకొనెను. ఐహికవాంఛలుగోరి తపస్సు చేసి కష్టించి నతఁడు తపఃఫలంబు నొంది పురికొనినట్లు వేసంగి వేఁడిమికిఁ గృశించినయుర్వర వర్షాధిదేవతలచేఁ దడుపఁబడి సమృద్ధిఁ గాంచెను. కలియుగంబున వేదంబులు ప్రకాశింపక పాపపుఁబాషండ గ్రంథంబులు వెలుఁగునట్లు మబ్బులపెల్లునఁ జీఁకటు లావరించిన ముని మాపులందు గ్రహంబుల తేజం బడంగి మిణుఁగురు పురుగుల కాంతులు వ్యాపించె. సూర్యోదయపూర్వ మారక శయనించి యుండు శిష్యులు కృత నియముఁడైన యాచార్యు వేదరవంబు విని

లేచి యధ్యయనంబు ప్రారంభించు నట్లు మింట మేఘంబు లుఱుముట విని మండూకంబులును గూయ సాగెను. స్వతంత్రుండై యింద్రియలోలుండైన పురుషుని ధన దేహసంపద యపాత్రంబులకు వ్యయపడు నట్లు క్షుద్రనదులును జలపూరితంబులై యొడ్డులు మీఱి నానా ముఖంబులఁ బ్రవహించెను. పచ్చని లేఁబచ్చికలచేఁ బచ్చనై యారుద్రపురుగులచే నెఱ్ఱనై పుట్టగొడుగుల నీడలుగలిగి భూమి నరుల శ్రీవలె నుండెను. ఫలంబు దైవాధీనంబని యెఱుంగక దేహాత్మాభిమానంబుగల కర్షకులకుఁ బైరులనిండిన పొలములు సంతోషంబును దుఃఖంబును ఘటించుచుండెను. నిజహృదయ కమలంబున హరిం ధరించిన సహృదయులఁ బోలి జలచరంబులును స్థలచరంబులును క్రొత్తనీటఁ దడిసి సౌమ్యరూపంబు ధరించె. కామాయత్తంబయి పక్వంబుగాని యోగిచిత్తంబు విషయసంగంబునఁ గలఁతపడు పగిది సముద్రంబు మారుతాహతి రేఁగిన భంగంబులతో నదుల కలయికఁ గలఁక చెందియుండెను. అధోక్షజు మనంబున నిడుకొనిన వారు తాపత్రయబాధితులయ్యుఁ జలింపనట్లు నిరంతర వర్ష ధారలచేఁ గొట్టఁబడియుఁ బర్వతంబులు వ్యథగొనవయ్యె. మరల మరల నల్లెవేయని ద్విజులకు వేదము సకాలమున స్ఫురింపక మఱపు తగులునట్లు మార్గములును రాకపోకలు లేమి నలఁగక పచ్చికపెరిఁగి మాసి సందేహ మొదవించుచుండెను. గుణవంతులైన పురుషులయందుఁ జెలిపెలకు స్థిరస్నేహముండ నట్లు లోకబంధువులైన జలధరంబులందు మెఱుపులకు నిలుకడ యునికిలేకుండెను. గుణవ్యతికరంబైన దేహంబునందు గుణహీనుఁడగు పురుషునివలె శబ్దగుణకంబైన యాకాశమందు నింద్రచాపంబు నిర్గుణంబై యుండె. తన ప్రకాశముచేఁ బ్రకాశించు నహంకారముచే నావరింపఁబడి యాత్మ దేహమునకంటె వేఱుగఁ బ్రకాశింపనట్లు చంద్రుండును దన తేజముచేఁ దేజరిల్లు మేఘములచేఁ గప్పఁబడి ప్రకాశింప కుండెను. తాపత్రయముచే నిర్విణ్ణు

లైన గృహస్థులు భగవద్భక్తుల రాకకు సంతోషించునట్లు మేఘా
గమనంబను నుత్సవంబున నెమిళ్లు మిగుల సంతసించెను. తపస్వులు
తొలుత దపస్సుచేఁ గృశించి శ్రాంతులై కామితప్రాప్తిదశ యందు
నానావిధములఁ బ్రకాశించునట్లు వృక్షములును మూలములచే నీర
ములఁ ద్రావి కొమ్మలు రెమ్మలు చిగురులు పూవులు పండ్లు లోనగు
నానారూపములఁ బ్రకాశించెను. ఎడఁదెగని గృహకృత్యంబులందు
దురాశయులైన గ్రామ్యజనులవలెఁ గలఁకఁబాఱినకొలఁకుల జలంబు
లందుఁ జక్రవాకంబులు ప్రీతి వహించెను. కలియుగంబునఁ బాషం
డుల యపద్వాదంబులచే వేదమార్గంబులవలె వాననీటి వెల్లువలచే
ననకట్టలు తెగుచుండెను. ద్విజప్రేరితులై రాజు లాయా కాలంబున
నర్థులకు దానాదు లొసంగునట్లు వాయుప్రేరిత మేఘములు లోకుల
కమృత మొసఁగుచుండెను.

అట్టి వానకాలంబున దండిగఁ బండిన నేరేడులు ఖర్జూరం
బులు లోనగువాని కతంబున మనోహరమైన వనంబునఁ గృష్ణుండు
బలరామ సహితుండై గో గోపాలకులతోడఁ గాననంబు చొచ్చి
విహరించుచుండె. బలిసిన పొదుగుల బరువుచే నావులు మందగమ
నంబు లయ్యును గృష్ణుండు పిలిచి నంతన క్షీరములు స్రవింపఁ
బ్రీతి హేతువున వేవేగ నతని వెన్నంటిపోవుచుండె. వనవాసులు
ప్రమోదభాసురు లైరి. వనరాజులెల్లఁ దేనెలు గురియుచుండె.
గిరాల దరుల జలధారలు ఘోషించుచుండె. ఝురులను వాని
దాపుననున్న దరులను జూచి కృష్ణుండు హృష్టమనస్కుండై వర్షవేళ
నొక్కొక్కమాటు చెట్లమొదళ్లను నొక్కొక్కమాటు గుహాల
యందునుండి కందమూలఫలము లారగించుచుండె. ఒక్కొక్కసారి
యింటినుండి తెచ్చిన దధ్యోదనంబును బలరామగోపకసహితుఁడై
నీళ్లరేవున చాఁపరాలపైఁ గూర్చుండి భుజించె. ఒక్కొక్కవేళఁ
గన్నులు మూసికొని పచ్చికమేయు మదించిన కోడెలను దూడలను

పొదుగును బరువున జడను పడిన నడల కదుపులఁ జూచుచు మచ్చికఁ బచ్చికపైఁ గూర్చుండి యాత్మశక్తి సమృద్ధమైన సర్వభూతమనోహార వర్షాకాల లక్ష్మిని భగవంతుఁడు పూజించె.

## —: శరదృతువర్ణనము :—

ఇట్లు రామకృష్ణులు మాదవట్టునందు నుల్లాసంబుగఁ జరించు చుండ వచ్చిన మేఘంబులతో స్వచ్ఛమైన నీరంబులతో సౌమ్య వాయువులతో శరత్కాలము ప్రాప్తించె. యోగభ్రష్టుని చిత్తంబు మరల యోగాభ్యాసవశంబునఁ బ్రసన్నమైనట్టులు శరత్కాలంబున నీరజోత్పత్తిచే నీరంబు లెప్పటియట్ల నిర్మలంబు లయ్యె. నాలుగాశ్రమముల నుండువారి యశుభంబులను గృష్ణభక్తివలె శరత్కాలంబు గగనంబున మేఘావరణంబును, భూతముల సంపర్కంబును, భూమి పంకంబును, జలంబుల మలంబును హరించె. ఇషణత్రయముల వదలి శాంతులై ముక్తకల్మషులైన మునులవలె మేఘంబులు సర్వస్వంబును వదలి శుభ్రకాంతి రాజిల్లె. జ్ఞానులగువారు జ్ఞానామృతము నొకప్పు డొసఁగి యొకప్పు డొసఁగనట్లు పర్వతంబు లొకప్పుడు నిర్మలవారి నిచ్చి యొకప్పు డీయకుండె. సంసారమగ్నులై మూఢులగు కుటుంబులు ప్రతిదినము తమ యాయుస్సు క్షీణమగుట తెలియ లేని విధంబున లోఁతులేని జలంబులఁ దిరుగు జలచరంబులు క్రమంబుగ జలము వట్టిపోవుట తెలియలేకుండె. దరిద్రుఁడును గృపణుఁడును నజితేంద్రియుఁడునగు కుటుంబి సంసారతాపమునఁ బడునట్లు గాధ జలంబుల జలచరంబులు సూర్యరశ్మికిఁ దపించుచుండె. జ్ఞాని శరీరాదులైన యనాత్మపదార్థములయందు నహంతామమతలు వదలునట్లు స్థలంబులు పంకంబును దీఁగె. లపర్వదశను మెల్లమెల్లగ వదలె. ఆత్మయం దుపరతినొందు ముని యాగమంబులు వదలునట్లు శరత్కాలంబున సముద్రంబు నిశ్చలజలంబుతో తూష్ణీంభావము వహించె.

ఇంద్రియముల వలన బాహ్యవిషయముల పైఁ బాఱు జ్ఞానంబును యోగి నిరోధించినట్లు కర్షకులు కేదారములందు గట్టి గనిమలు వైచి నీళ్లు పోకుండఁ జేసిరి. జ్ఞానము దేహాభిమానము వలనఁ గలుగు తాపమును, కృష్ణుఁడు గోపస్త్రీల తాపమును హరించినట్లు శరత్కాల సూర్యకిరణముల వేఁడిమిని జంద్రుఁడు హరించె. సత్త్వయుక్తమైన చిత్తంబు వేదార్థ దర్శనమునఁబోలె నాకాశంబు మేఘరహితంబై నిర్మల తారకంబై పొలుపారె. భూమియందు వృష్ణికులజుల సమూహంబుతోడఁ గృష్ణుండుపోలె మింట నక్షత్రసమూహముతో నిండుఁ జందురుండు శోభిల్లె. చలి వేఁడుములు సమానంబుగఁగల పూలతోఁటల గాలి ననుభవించి జను లెండవడం బడిన దేహముల తాపంబు మానిరిగాని కృష్ణుఁడు హరించిన చిత్తంబుల తాపంబును గోపికలు విడువలేరైరి. భగవదారాధనంబు ఫలవంతం బగునట్లు గోవులు మృగములు పక్షులు స్త్రీలు శరదాగమనంబునఁ దమతమ పతులతోడం గలసి గర్భములం ధరించిరి. రాజపరిపాలనంబునఁ జోరులు తక్కఁ దక్కినవారు నిర్భయులై చరించునట్లు కలువలు తప్పఁ దక్కినవారిజంబులు సూర్యప్రకాశంబున నలరిల్లె. నూతన ధాన్యంబుఁ బొంగళ్లు వండి పాలు పొంగించి జనులు పురంబుల గ్రామంబుల మహోత్సవంబులు గావించిరి. భూమియు రామకృష్ణుల సాన్నిధ్యమువలనఁ బండిన పంటలచే సమృద్ధమై విరాజిల్లె. తపస్సిద్ధులు కాలము ప్రాప్తింపఁ దమతమ పుణ్యఫలంబు లనుభవింప బోవునట్లు వాన లాఁకట్టిన వణిజులు మునులు రాజులు బ్రహ్మచారులు యథేచ్ఛముగఁ దమతమ కార్యముల వెంట సంచరింపఁ బోయిరి.

## —: గోపస్త్రీలు కృష్ణుని వేణుగానము వర్ణించుట :—

ఇట్లు నిర్మలజలంబును బద్మసుగంధబంధుర గంధవాహంబును నైన యాశరత్కాలంబున విరిసిన వనంబుల మత్తిలిమూఁగి యత్త

మిల్లిన మత్తాళి ద్విజంబుల మొత్తంబుల మ్రోఁతలను నదీగిరి సరోవర శతంబులఁ గృష్ణుండు బలరామాది గోపసమేతుండై పశువుల మేపుచు వేణుగాన మొనర్చెను.

సీ. చెక్కిలి మెఱుఁగులు చెవిపందిఁ జెరివిన
కర్ణికారమునకుఁ గాంతిఁ గూర్పఁ
గురుల కొండియమీఁద నిరవొందు నునునెమ్మి
పురి యనుగమునకుఁ బొంగి యాడ
బంగారు పట్టంబు వస్త్ర మేనును మీఁది
మెఱుపుల మెఱుఁగున మెఱుఁగు లీన
వైజయంతీమాల వక్షస్స్థలంబున
నంఘ్రులతోడ నాట్యంబుఁ జలుప
గీ. నధరపీయూష గంధవాహంబున వేణు
రంధ్రముల నించి వల్లవవ్రజము తనదు
యశముఁ గీర్తింప స్వాపద మోహనము వనము
దరిసె జిగిమీఱి నట వేషధారి శౌరి.

స్మరోదయకారణమై సర్వభూత మనోహరమైన శ్రీగోపాల కృష్ణ మురళీగానంబు విని కొందఱు గోపికలు కృష్ణుని పరోక్షంబునఁ దమ సఖులం గూడఁ బిలుచుకొని కృష్ణచేష్టితంబు లిట్లు వర్ణించిరి.

చెలియలారా! కన్నులు గల భాగ్యంబిది గాక మఱొం డెద్ది గలదు. గోపాలబాలురు గొలువ నాలఁ దోలుకొని వేణుగానామృతంబును ననురాగ రసభరితంబులైన కటాక్షంబులను వెదచల్లుచుఁ బోవు రామకృష్ణుల వదనేందు బింబకాంతులఁ గఱవుదీఱ నంజలులఁ గొని గ్రోలుటకంటె మఱియొండు భాగ్యంబును గలదే. ఆహా యేమి యీ గోపాలుర యదృష్టము! అదె వారిమంద నడుమ నెలమావి జిగురుటాకు జొంపముల గుబురులయుఁ గలువదామరలయు సరంబు లురంబున డంబునింప నీలపీతాంబరంబులను వలెవాటు వైచి విచిత్రి

మనోహరమూర్తులై నాట్యరంగంబున గానంబొనర్చు నటులవలె నందనందను లానందంబున నించుచున్నవారు. కాంతలారా! యీ వేణు వెట్టి పుణ్యంబొనర్చెనో కదా గోపాలికలపాలి మాధవాధర సుధారసధారలు తానే గ్రోలుచున్నది. నిజవంశంబున జనించిన భగవద్భక్తులంజూచి సముచిత రోమాంచకంచుకితులై హర్షచకితులై కులవృద్ధులానంద బాష్పబిందు సందోహంబులఁ గార్చునటు లీవేణువును దననీరు పోసి పెంచిన నది కమలవనమును నెపమునఁ బులకరించుచున్నది. తరువులను మరందబిందు వ్యాజంబున నానందాశ్రువుల రాల్చుచున్నవి. అచేతనంబు లిట్లు ప్రమదాకులితంబులగుచుండఁ జేతనంబులమైన ప్రమదలము మనము ముదము గొను టేమి యబ్బురము.

సఖీ! భూమియం దీబృందావన మనన్యసాధారణకీర్తి కాటపట్టు కాఁగలదు. ఏల యనెదవా విను. ఇది గోవిందసుందర పదారవిందంబులచే నందంబగుట యటుండ ముకుందమురళీరవంబు మందజలదరవంబని భ్రమించి తదనురూపంబుగ మయూరంబులు హరినటనంబు గావింపఁ దక్కిన ప్రాణికోటు లెల్లఁ దమతమ వ్యాపారంబుల మఱచి వానినే విలోకించుచున్నవి. మూఢజాతి నుద్భవించినను, సౌందర్యాసౌందర్యముల తారతమ్యంబు వివేకింపఁ జాలకున్నను, హరిణతరుణులు నందనందన చిత్రసుందర వేషంబు నీక్షించుచు మకరందంబుఁ జిందు వేణుగానంబు నాకర్ణించుచుఁ దమ మనశ్చోరకము లగు కృష్ణసారములతోడఁ బ్రణయావలోకనంబులు కృష్ణునందే నిలిపి పూజలు గావించుచున్నవి. ఆహా! వ్రేతలారా! యింతకు నత్యద్భుతంబు నాలకింపుఁడు. సమానలోకవాసు లొకరి నొకరు ప్రేమించుట వింతగాదు. నాకలోకవాసినులైన దేవచారుహాసినులు వనితోత్సవచారు శీలుఁడగు నందబాలు ఖేలాలోలుఁ దిలకించి పులకించి మురళీగానం బాలించి పతులతోడి యుల్లాసంపు సయ్యాటంబులు చాలించి విమానంబులఁ బ్రియుల తొడలపైఁ గూర్చుండియుఁ గుసు

మవిసరంబులఁ బసమీఱు కబరీభరంబులు వీడఁ, బోకముడు లూడ, మోహావశలై వల్లభుల యురంబులపై వ్రాలిరి. సుందరీ! నందనంద నేందు వదనార విందంబునుండి ప్రవహించు వేణుగీతామృతంబును జెవిదొప్పలెత్తి మొదవులు ముద మొదవఁ గ్రోలుచున్నవి. లేఁగలును జనుగుడువఁ దల్లుల పొదుఁగుల డాసియు గోవింద గానంబు వీనులం బడిన మోరలెత్తి పాలుఁద్రావక కనుఁగొనలఁ బ్రమదాశ్రువులు రాల రాల సాలభంజికలవలె నిలిచినవి. అక్కా! యీ వనంబు నందలి విహంగంబులు ప్రాయికంబుగ మునులై యుండనోపు. రుచిరపల్లవ సల్లలితమ్ములైన కొమ్మల నెక్కియుండియుఁ గృష్ణ ముఖమ్మునందె తమ చూడ్కులు నిలిపి పుష్పఫలాది భోగ్యంబులెల్ల వదలి యితరపదార్థంబులపైఁ జూపులు జాఱనోయను వెఱపునంబోలెఁ గన్నులు మోడ్చి మైమఱపున నేమియో యానంద మనుభవించుచు మధుర వేణు నాదంబునకు వీను లర్పించి వినుచున్నవి.

చెలీ! చేతనంబు లిట్లగుట యేమి వింతగఁ జెప్పెదవు. అటు చూడుము. నదులును యశోదాదాయాదు పూతగీత మాలించి మనోభవభగ్న వేగంబులై తమవ్యాకులత్వంబును సుళ్ల నెపంబునఁ జూపుచుఁ దరంగంబు లనుకరంబులఁ గమలోపహారంబులఁ గొనిపోయి కృష్ణచరణ తామరసంబుల నర్పించి కౌఁగిలింపఁ జూచెడి. యమునాతీర చారులగు రామగోపాలురం గూడి పసుల వెంట వేణువూఁ దుచుఁ బోవు కృష్ణుంజూచి తోఁచి మేఘంబు ప్రేమప్రవృద్ధమై సఖుఁ బోలి కుసుమావళిం బోలిన తుంపరనింపుచు వాఁడిమయూఖంబుల వేఁడిమి సోకకుండఁ దనమేను గొడుగుగా నమర్చుచున్నది. శ్రీదయితాస్తన మండితంబైన కృష్ణపదాబ్జరాగ శ్రీకుంకుమముచే లిప్తంబైన తృణంబులం గాంచి వానిని కుచాననంబుల రాచుకొనుచుఁ బుళిందమందయానలు కందర్ప దర్పం బార్చిరి. వారెపో ధన్యలు. ఛీ మన దేటి బ్రతుకు. ఏకవ్రజంబున వసించియు మన కట్టి భాగ్యంబు

లేదాయెు. ఓ కామినీ! యీరా యీగోవర్ధనగిరి హరిదాసులందు శ్రేష్ఠమైనది. ఏమి యదృష్టమో! ఎట్లనగా: రామకృష్ణచరణ స్పర్శంబునఁ జెలువగు పులకంబులో యన లేఁ బచ్చిక మొలక లీరిక లెత్తుచున్నవి. అది వారికిని వారి గోగణంబులకును గంధరము లందలి కందమూలంబులచేతను పానీయంబుచేతను మంచి లేఁగ సవుచేతను నాతిథేయం బొసఁగి సత్కరించుచున్నది.

అది యేమి యాశ్చర్య మిటు చూడుము. త్రాళ్లు తలుగులు కేలఁగొని గోపాలుర వెంటఁ గృష్ణుం డడవి వెంబడి నడవి యందుఁ బశులమేపుచు నవ్యక్త మధురస్వరంబు లుదారంబులుగ నీవ వేణువూఁదుచుఁ బోవఁ జేతనంబు లచేతనంబులై యచేతనంబులు చేతనంబులట్లయి జంగమంబులు కదల మొదలకున్నవి. తరువులు పులకరించుచున్నవి. అని బృందావనమున సంచరించు కృష్ణుని క్రీడలు వర్ణించుచు గోపస్త్రీలు తన్మయత్వంబు నొందిరి.

## —: గోపికావస్త్రాపహరణ కథారంభము :—

అంత నితాంత కాంతంబై శ్యామంతి కాసంతాన శ్రీమంతంబైన హేమంతంబునఁ దొలి నెలయైన మార్గశిరంబున నందుని మందయందలి గోపకుమారికలు* నియతాహారలై హవిష్యంబు భుజించుచు నరుణోదయ వేళ యమునానదిం గ్రుంకి యా నదీతీరంబున నిసుకతో దుర్గావిగ్రహంబు కల్పించి సువాసనగల గంధమాల్యంబులఁ బూజించి నానావిధంబులయిన ప్రవాల ఫలజాల తండులంబుల నైవేద్యంబు లర్పించి ధూపదీపంబు లొసఁగి †మహా

---

*సగోత్రసపిండత్వాది సంబంధములేనివారని భావము. కప్రత్యయము బాల్యమును సూచించుచున్నది.

†ధూపదీపంబులు నైవేద్యమునకు ముం దీయవలసియుండఁ క్రమభంగము గావించుట మనస్సులు కృష్ణునియం దుండుటచేత నని యెఱుంగవలయు. భక్తిగలవారి పూజ యందలి లోపము దోషావహము గాదు.

మాయా మహాయోగినీ యధీశ్వరీ కాత్యాయనీదేవీ నమస్కారము. నాకు నందగోపనందనుండు వల్లభుండుగా ననుగ్రహింపుము. అని యర్థమిచ్చు మంత్రంబును * జపించి రాజేంద్రా! యాపిల్లలు కాత్యాయనీవ్రతం బాచరించిరి. ఇట్లు కృష్ణునియందు మనంబు నిలిపి యాయనయే తమకుఁ బతి గావలయునని గోపకన్యలు భద్రకాళీపూజ యొక నెల సలిపిరి.

ఇట్లు గోపకన్యక లొకనాఁటి యుషఃకాలంబున లేచి యొకరి నొకరు పిలిచి యమునకుఁ బోయి యెప్పటివలెఁ జీరలువిచ్చి రేవున నొకచోటనుంచి యొకరిహస్తంబు లొకరు పట్టుకొని కృష్ణగీతంబులు పాడుచు జలంబుల దిగి జలక్రీడ లాడుచుండిరి. యోగేశ్వరేశ్వరుండైన కృష్ణుండు వారి యభిప్రాయం బెఱింగి వారి కోర్కె సఫలంబుచేయఁ జెలికాండ్రంగూడ ♦ యచ్చటికి వచ్చెను. ఇట్లు వచ్చి చప్పుడుగాకుండ మెల్లమెల్లన నడుగులిడుచుఁబోయి వారి చీరల నపహరించి బాలురు నవ్వుచుండ నవ్వుచుఁ గృష్ణుండు కదంబవృక్షమెక్కి యా గోపకన్యకలతో నిట్లనియె.

అబలలారా § రండు. వారివారి చీరలు వారువారు యథేష్టముగాఁ గొనిపొండు. వ్రతమొనర్చి చాల కృశించితిరి. నావి సత్యములుగాని పరిహాసవాక్యములుగావు. | నేనిదివఱకెన్నఁ డసత్యమా

*శ్లో॥ కాత్యాయని! మహామాయే! మహాయోగిన్యధీశ్వరి! నందగోప సుతం దేవి! పతిం మే కురు తే నమః। విగ్రహారాధనము ఫలప్రదము భగవత్ప్రీతి కరమనుటకు నిది లక్ష్యము.

♦ చెలికాండ్రు = పరమాంతరంగులైన దామ సుదామ వసుదాములు. వీరు బాలురు. ప్రౌఢులు తత్సంబంధులు కారని భావము.

§ అబలలారా = మీరు బలహీనలు గావునఁ జలినీటఁ జాలఁ గాలము నిలుచుట యారోగ్యకరము గాదని భావము.

| నవ్వుచుఁ జెప్పిన కారణమున హాస్యమను కొనకుఁడు.

డిన వాఁడఁగాను. ఈగోపాలు రెల్ల నెఱుఁగుదురు. * తనుమధ్యలారా! మీరొక్కొక్కరుగఁ గాని యందఱు కలసిగాని వచ్చి తీసికొనిపొండు. అనిన గోవిందుని మాటలు గోపికలు విని ప్రేమరసంబున మఱింత మునిఁగి సిగ్గుపడి యొకరి నొకరు చూచి నవ్వుచుఁ గుత్తుకబంటి నీళ్లలో నిలిచి చలికి గడ గడ వడఁకుచుఁ దీరంబునకు రాక యిట్లనిరి.

కృష్ణా! వలదు. ఈయన్యాయ్యకార్యంబుఁ జేయకుము. నీవు నందగోపరాజ నందనుండవనియు ♦ నగనికిఁ బ్రియుండవనియు మే మెఱుంగుదుము. నీవు మందయందు శ్లాఘనీయుండవనియు నెఱుంగుదుము. చలికి గజగజ వణఁకుచున్న వారము. మావస్త్రములు మాకిమ్ము. శ్యామ! సుందరా! మేము నీ దాసీజనులము. నీ వేపని చెప్పినఁ జేయఁగలవారము. ధర్మజ్ఞా! మాచీరలు మాకిమ్ము. ఈయకుండితి వేని రాజున కెఱిఁగింతుము సుమా యనినఁ గృష్ణుండు దరహాసరోచిష్ణుఁడై యిట్లనియె.

§ శుచిస్మితలారా! దిసమొలలతో మీరు రాజసభకెట్లు పోయెదరు? మీరెవరినైనఁ బంప మీవా రెవ రిందు లేరు. రాజు విచారించి

---

*వారు నీ స్నేహితులు గదా, వారిమాట లెట్లు నమ్మెదను? తనుమధ్యలు — సన్నని నడుములు గలవారు గావునఁ జాలసేపు నిలువఁజాలరు. ఇది వారి సౌందర్యమును గూర్చి చెప్పినమాట కావున వారిమనస్సును గలఁతపెట్టెను. గోవిందుని — సమయోచితముగ మాటలాడువాని అని వ్యుత్పత్త్యర్థము (గో = వాక్కు) వారి ప్రేమచే నాకర్షింపఁబడినవాఁడు గావున నిట్లుపలికెను. గాని యెడల నిట్లుపలికి యుండఁడని భావము.

♦నందగోపరాజనందనుఁడు — నీవు రాజకుమారుఁడ వగుట యువరాజవు. యువరాజిట్టి కార్యము చేయరాదు. నందరాజునకు నీవు ప్రియుఁడవు కావున నప్రియకార్యము చేయరాదు.

§శుచిస్మితలారా — అనుటచే మీరు నిజముగాఁ జలిచే బాధపడుచున్న వారేని మీకుఁ జిఱునవ్వు రాఁజాలదు. కావున మీరు చలిని నెపముగాఁ జెప్పుచున్నారని భావము.

నన్నాజ్ఞ పెట్టువఱకు మీరు నీటిలో నుండెదరా? అట్టైన మీరు నా దాసీజనములని నా యాజ్ఞ వర్తించెదమని యాడినమాట బూటకమే కదా? కావున నవి యన్నియు నేను వినువాఁడను గాను. మీరు నా దాసిక లగుటయు నేను బిలిచిన పను లొనర్చుటయు నిక్కమేని మీరు నీరు వెడలివచ్చి మీ మీ వలువలు పుచ్చుకొనుఁడు.

అనిన వలిగొని మేనులు గొంకులు పోవ వణఁకు నా పిల్లలు నీట నిలువలేక మర్మస్థానంబులు హస్తంబుల మూసికొని జలంబుల వెడలి వచ్చిరి. యుక్తవయస్సువచ్చి రాని యా పిల్లం జూచి కృష్ణుండు మందస్మితంబునఁ జీరలెల్లఁ గొమ్మలనుండి తీసి భుజంబులపై వైచికొని ప్రీతుండై శుద్ధమనస్కులై యనుగ్రహింపఁబడిన వారగుట వారితో నిట్లనియె. బాలికలారా! మీరు వ్రతదినంబులఁ జీరలు విడిచి దిస మొలలతో నీట స్నానము చేసితిరి. ఇది దేవతాపరాధంబు గదా. ♦ ఆ పాపంబు పోవ మీరు రెండు చేతు లెత్తి శిరంబున నుంచుకొని నాకు నమస్కరించి పదపడివచ్చి మీ మీ కట్టుచీరలు మీరు కొనిపొండు. అనిన ధర్మయుక్తంబైన యమ్మహాత్మువాక్యంబు లాలించి వారొక్క కేల గోప్యస్థలంబులు మూసికొని యొకచేత నమస్కరించిరి. ఒక కరంబున నమస్కరించు వారిని గాంచి కృష్ణుండు ధర్మ సమ్మతమైన సూక్తి నిట్లనియె. పడుచులారా! మీ రెఱుఁగ రోటు. ఎవరు భగవంతు నచ్యుతుని నొంటికేల నమస్కరింతురో వారికి దండంబు కరచ్ఛేదంబు. అని వేదవిదులు చెప్పుదురు. రెండు చేతులు జోడించిగా మనుష్యులు దేవతా నమస్కారంబుఁ గావింప వలయు. కావున మీ రాప్రకారమే మ్రొక్కిన నాకుఁ బ్రియంబగు. అనిన నుచ్చమల్లులై స్నాన మొనర్చుట వ్రత భంగం బని యెఱింగి వ్రజ కన్యకలు వ్రత పూర్తిం గోరి సర్వ కర్మములకుఁ బ్రత్యక్ష ఫలభూతంబైన కృష్ణుం గూర్చి

♦ దేవతాపరాధము — వరుణుని హేళనము చేయుట. మేము బాలికల మందు లేని వ్రతయుక్తలు గదా. ఉచ్చమల్లులు — దిసమొలవారు.

రెండు చేతులెత్తి నమస్కరించిరి. అప్పుడు కృష్ణుండు సంతసించి కరుణచే వారివస్త్రంబులను వారి కిచ్చెను.

కం. మానవతీ జనములకుం
ప్రాణంబులకంటె మిన్న మానంబె సుమీ;
మానము నర్పించుచు హరి
కై నారులు గనిరి యిహాముఁ గైవల్యంబుఁ.

రుక్మిణి — నాన్నా! పటములందు గోపకన్యలు వెంద్రుకల నడ్డము వేసికొని నట్లున్నదే నీవట్లు చెప్పలేదే.

తండ్రి — చేతులతో మూసి కొనుట యెట్టిదో వెంద్రుకలచేఁ గప్పుకొనుట యట్టిదే. అట్టి చేత నిర్మలాంతః కరణమును దెలుపక సవ్యాజసమర్పణమును గొంకును దాఁపఱికము నాత్మరక్షా స్వాతంత్ర్యమును దెలుపును. ఇట్టి రాజస సమర్పణము హరి మెచ్చఁడు. దుశ్శాసనుఁడు వలువ లొలువ వచ్చినపుడు ద్రౌపది తన దేహబలం బుప యోగించి వాని నివారించుచుండినంత వఱకు భగవంతుఁడు సహాయ పడఁడయ్యె. స్వప్రయత్నము మాని యాత్మ రక్షాభారము భగవంతుని యందిడి యాయన నుద్దేశించి రెండు చేతులెత్తి నమస్కరింపఁగాఁ జీర లక్షయ్యంబు లయ్యె. భక్తుల హృదయంబుఁ బరీక్షింప వారి ద్రవ్యమును భగవంతుఁడు హరించును గాని మరల నంతకు మిన్నగ వారి కొసగుఁను. బలిదానము స్మరింపుము. భగవంతుని పట్ల వంచన కారాదు. వంచకులే వంచితు లగుదురు.

ఇట్లు తమ్ముఁగృష్ణుఁ డాక్షేపించినను వంచించినను, సిగ్గు దీసినను, బరిహాసించినను, జీర లపహరించి నను, బొమ్మల వలె నాడించినను బహుచు వ్రేతలు కృష్ణుండు తమకుఁ బ్రియుఁడుగానఁ గృష్ణుపైఁ గోపింపక యానందించిరి. చీరలు మరల ధరించి ప్రియ సంగంబున వశీకృతలై మన స్సాయన యందే నిలిపి సిగ్గు దొలఁకు కలికి చూపుల

నచ్చిలుకల కొలుకులు గోవిందుఁ జూచుచు నిల్చిరి. నిజ పాదస్పర్శంబుఁ గోరి ధృతవ్రతలైన యాయబలల సంకల్పం బెఱింగి దామోదరుండు వారి కిట్లనియె.

సాధ్వులారా! మీరు చెప్పకుండినను నన్నర్చించు మీసంకల్పం బెఱుఁగుదు. నేను దాని ననుమోదించితిని. మీ కోరిక సఫలము కాఁదగినది. నాయందు మనస్సుంచిన వారి కామంబు కేవల విషయభోగ మాత్రంబైన కామంబు కాఁజాలదు. మద్విషయకాభిలాష సంసార బీజంబును నిర్వీర్యంబు గావించుఁ గావున నది మరల సంసారహేతువు గాఁజాలదు. నన్ను సేవించువారు స్వర్గాది కామాసక్తులైనను వారికామంబు భక్తినిగలిగించి •ముక్తికి హేతువగు. ప్రకృతి సంబంధవిషయంబులందలి యభిలాషయే మరలఁ బ్రకృతి సంబంధమైన సంసారంబుఁ గలిగించుఁగాని యప్రాకృతుఁడనైన నాయందలి కామంబు ప్రకృతి పాలు గావింపక ప్రకృతి బంధంబునుండి తొలఁగించు. స్వసంబంధములైన భూజలాదుల సంసర్గముగల బీజంబులు మొలకలెత్తును గాని యగ్నియందు వేఁచి యుడికించిన ధాన్యంబులు ప్రాయికముగా మొలకలెత్తునా? బాలికలారా! మీరు మందకుఁ బొండు. సతులారా! § మీకోరిక పూర్ణమయ్యెను. నాతోడ నీ రాత్రులందుఁ గ్రీడింపఁ గలుగుదురు. అని యాజ్ఞాపించిన నాకుమారికలు భగవంతునిచే లబ్ధకాములై యాయన పాదకమలముల ధ్యానించుచుఁ బో నిష్టములేకయు నెట్టెట్లో మందకుఁ బోయిరి.

చం. మనమునఁ దన్నె కోరి యనుమానము వీడి యెటేని భక్తిఁ బూ
జన మొనరించి సర్వమును సమ్మతి వంచన లేక ప్రీతి ని

•కర్దమ ధ్రువాదుల చరితలు దృష్టాంతములు.

§ సతులారా = కృష్ణుఁడు వీరిని భార్యలుగా గ్రహించిన కారణమున వీరు వేఱుపతుల వివాహమాడలేదనియు రాస క్రీడానంతర మీ స్త్రీల కిచ్చుటనే సాయుజ్యమొసగఁబడెననియు తెలియంగవలయు.

చ్చిన జనపాళిపట్ల హరిసేయఁ డుపేక్ష; దదీయ వాంఛలన్
బనిగొని తీర్చు, మీఁద నపవర్గముఁ గూర్చుఁ, దొలంచు సంసృతిన్.

రుక్మిణి—వీరు పిల్లవాండ్రు. ఉలువలు తిందువా బఠవన్నా యనిన నూరక తల యూఁచినట్లు నే నేమి చెప్పినను వీరు విని యూర కుందురు. వీరి కేమి తెలియునని తప్పులు చెప్పుచున్నావా?

తండ్రి—నే నేమి తప్పు చెప్పిని?

రుక్మిణి—గోపికా వస్త్రాపహరణము చిత్రించిన పటములలో నెల్ల వయస్సు ముదిరిన ప్రౌఢలవలె గోపికలను వ్రాసి యుండఁగా నీవు గొల్లపిల్లలని కుమారికలని బాలికలని చెప్పుచున్నావే. మాకు నిజము చెప్పరాదని యట్లు చెప్పెదవా?

తండ్రి—నీవు తప్పుడు తడకలగు కొన్ని పంచాంగములను బ్రమాణముగ నెంచి గ్రహసంచారములను సవరించు దానవు. నేను శ్రీభాగవతము ప్రమాణముగఁ గొని దానిలో నున్న మాటలే చెప్పితిని. వ్యాఖ్యాతలును నేను జెప్పినట్లే వ్రాసియున్నారు. నా కల్పన యేమియు లేదు. వాస్తవ మాలోచింపక యో తెలియక యో పొరపాటుననో వ్రాసినవారి వ్రాతలు వికారపు బొమ్మలు మొదలైనవానిని నమ్మి నామాట లసత్యము లనెదవే. ఏమి నీ సాహసము? సత్యము మీకుఁ జెప్పవలయు ననియు, వివేకహీనులకుఁ గృష్ణుని యందుఁగల దురభిప్రాయములఁ బోఁగొట్టవలయునననియు, నా యభిప్రాయము గాని సత్యము మఱుఁగుపఱువలయు ననుట నా తలఁపు గాదు. వీరందఱు వివాహములుగాని గోపకన్యకలే.

ఇంటిలోఁ దల్లిదండ్రులు మన పిల్ల నా గొల్లపిల్లవాని కిచ్చిన బాగా యీ గొల్ల పిల్ల వానికిచ్చిన బాగా యని యాలోచించు చుండ సౌందర్యముచేత గుణముచేత నైశ్వర్యముచేత నందఱ నతిశయించు నట్టియుఁ బెద్దవారందఱు దేవుఁడే యని నమ్మినట్టియుఁ గృష్ణునిపై

మనస్సులు నిలిపి కృష్ణుఁడే తమకు మగఁడు కావలయునని కోరి వారు వ్రతమొనర్చిరి. దీనిలో స్వభావ విరుద్ధ మేమి యున్నది? తరువాత విను.

అంతట గోపాలురు పరివేష్టించి కొలువ నన్న తోడ శ్రీకృష్ణుండు బృందావనమునకు జాల దూరంబుననుండు వనంబునకుఁ బసులఁ దోలుకొని పోయెను. వేసవి యందు నెండలకు గొడుగుల వలెఁ దమకు నీడలు కల్పించు వృక్షంబులఁ జూచి శ్రీకృష్ణుండు గోపాలురతో నిట్లనియె.

ఓస్తోక కృష్ణా! ఓ యంశుడా! శ్రీదామా! సుబలా! అర్జునా విశాలా! వృషభా! ఓజస్వీ! దేవప్రస్థ! వరూధపా! చూచితిరా! నియతముగఁ బరోపకార మొనర్చుచు జీవించు మహాభాగ్యంబు గల యీ భూరుహంబులు తాము చలి గాలి యెండ ముంచులను సహించుచు మనకు వానిబాధ దొలఁగించుచున్నవి. ఔరా! దరిద్రుల కోరికలు వ్యర్థపఱుపని దాతలంబోలి సర్వప్రాణి జీవనాధారమైన జీవనముగల వీని జన్మము మనుష్యజన్మముకంటెను శ్రేష్ఠమైనది. ఆకులు పూలు పండ్లు నీడలు వేళ్లు నార పట్ట కొయ్య బంక బూది బొగ్గులు చిగురులు మొదలైనవానిచే లోకుల కోరికలను బూర్తి చేయుచున్నవి. దేహధారులయందును సర్వప్రాణ బుద్ధి వాక్కులచే సదా పరులకు శ్రేయస్సు గలిగించు వారి జన్మమే సఫలము. ♦ అని పల్లవమంజరీ ఫల పుష్ప దళంబులు దళంబుగ నిండి సొబగారు శాఖలుగల తరువుల నడుమఁ దూఱి యమునకుఁ బోయెను. ఇట్లు పోయి పశువులకు మధుర శీతల నిర్మలవారిఁ ద్రావించి గోపాలురు తామును దనివి దీర రామకృష్ణులు జలముఁ గ్రోలిరి.

♦ మనుష్యులకుఁ బోలె వీనికి నాత్మలు సుఖ దుఃఖానుభవంబులు మరణంబులుఁ గలవు. ఇప్పటి వీని పుణ్యపరిపాకంబుననే జన్మాంతరములఁ దివ్యజ్ఞమనుష్య దేహంబులఁ బ్రాపించు. జ్ఞానహీనులగు మనుష్యులు దుష్కర్మాచరణంబున వీని వలె నగుదురు. ఎట్టి వారికిఁ గర్మం బనివార్యంబు.

—: శ్రీకృష్ణుండు బ్రాహ్మణభార్యల ననుగ్రహించుట :—

ఇట్లా వనంబున యథేచ్ఛంబుగ సంచరించి పశువుల మేపుచు దూరసంచార కారణంబున నాఁకలి గొని గోపకు లిట్లనిరి. రామ! రామ! మహాబల సంపన్న! కృష్ణా! కృష్ణా! దుష్టసంహారకా! మేమాఁకటఁ దపించు చున్నారము. మా యాఁకటంబు దీర్ప నెరవు వెదకుఁడని విన్నవించిన జగదీశుండైన కృష్ణుండు భక్తురాండ్రైన విప్రభార్యల ననుగ్రహింపఁగోరి వారితో నిట్లనియె. ఇచ్చటికి దాపునంద బ్రహ్మవాదులైన బ్రాహ్మణులు స్వర్గసౌఖ్యంబుఁ గోరి యాంగిరసం బనుసత్త్రంబు సాగించుచున్నారు. మీ రచ్చటికిఁ బోయి రామకృష్ణులు పంపిన వచ్చితిమని మాపేరుచెప్పి యన్నమడుగుఁడు. అని చెప్పిన గోపాలురు బ్రాహ్మణుల యొద్దకుఁ బోయి సాష్టాంగ దండ ప్రణామంబులు గావించి చేతులుమోడ్చి యో భూదేవతలారా! వినుండు. రామకృష్ణుల యానతిగొని మీకడకు వచ్చితిమి. ఇచ్చటికి దాపునంద రామకృష్ణులు పసులమేపుచు నాఁకలిగొని యన్నమభిలషించి యున్నవారు. అర్థుల కోరికలు వ్యర్థపఱుప రాదను శ్రద్ధ మీకుఁ గలదేని ధర్మ విదుత్తములారా! యన్న మిండుఁడు. దీక్షితాన్నంబు భుజింపరా దనకుఁడు దీక్ష మొదలుగ నగ్నీషోమీయ పశ్వాలంభము పఱకును సౌత్రామణి యందును దీక్షితాన్నంబు దుష్టంబు గాని తక్కిన వేళల దుష్టంబు గాదు. అనిన క్షుద్రస్వర్గ ఫలదంబులైన భూరికర్మము లొనర్చు నాబాలిశులు జ్ఞానవృద్ధమానులు వారి వేఁడికోలు వినియు విననివారివలె నుండిరి. దేశంబు కాలంబు ద్రవ్యంబు మంత్ర తంత్రంబులు ఋత్విక్కులు నగ్నులు దేవతయు యజమానుఁడు ఋతు ధర్మంబులు నెవ్వనిమయమో యట్టి పరబ్రహ్మంబు సాక్షా ద్భగవంతుఁ డధోక్షజుఁడు సామాన్య మనుష్య మాత్రుఁడని దుర్బుద్ధులై తలఁచి కలదని కాని లేదనికాని యేమియుఁ జెప్పరైరి.

గోపాలకులు నిరాశులై మరలివచ్చి రామకృష్ణుల కావార్తఁ

తెలిపిరి, వారి పలుకులు విని జగదీశ్వరుండు భక్తి లేని కర్మఠుల గతి యింతకాక మఱియెంతయని నవ్వి లౌకికమార్గంబుఁ దెలిపి మీరు మరలఁబోయి బ్రాహ్మణ భార్యలను జూచి రాముఁడు నేను నిచ్చటికి వచ్చియున్న వారమని చెప్పి యన్నమడుగుఁడు. నాయందే మనస్సు నిలిపి యున్న వారగుట వారు మీకోరికదీర నన్న మిడుదురు పొం డన వారు స్త్రీ లుండు శాలకుఁబోయి యలంకృతలై కూర్చుండి యుండు బ్రాహ్మణ పత్నులఁ జూచి నమస్కరించి సవినయంబుగ నిల్చనిరి. తల్లులారా! మీకు నమస్కారములు. మామాట లాలింపుఁడు. కృష్ణు పనుపున వచ్చితిమి. ఆయన తన యన్న బలరామునితోడ నాలమేపుచు నేఁడు చాల దూరమువచ్చి యిచ్చటికి సమీపంబున నిలిచి యాఁకలి గొనినవాఁడు. కావున వారికిని దోడి వారికిని చాలిన ట్లన్నము పెట్టుఁడు.

వారినుడుల విని కృష్ణ చారిత్రములందే మనస్సు నిలిపిన భక్తురాండ్రగుట యావిప్రపత్నులు కృష్ణదర్శనోత్సాహంబున సంభ్రమంబునఁ బాత్రంబులఁ జతుర్విధాన్నంబుల బహుగుణంబులుగఁ గొని సముద్రమునకై పాఱు నేఱులట్లు శీఘ్రగమనంబులఁ బయనించిరి. దీర్ఘకాలంబుగ భగవంతుని కీర్తి విన్నవారై యాయనయందే మనస్సులు నిలిపిన వారగుటచేఁ దండ్రులు భర్తలు సోదరులు పుత్రులు వారించినను నిలువరైరి. అట్లు కదలివచ్చి యమునా తీరంబునఁ గ్రొత్త యశోక పల్లవంబుల శోభిల్లు నుపవనంబున బలరామ గోపాలురం గూడి చరించు చామనిచాయ మేనివాని, బంగరుటొల్లియ వల్లెవాటుగ వైచినవాని, నడవి పూసరులును నెమలి పురులును రంగులరాలును జిగురులచాలును ధరించి నటవేషంబువలె నుండువానిని, గోపాలు పై నొకకేలు వైచి మఱియొక కేలఁ గమలంబు విలాసంబుగఁ ద్రిప్పువానిని, వీనులఁ గలువలు చెక్కుల ముంగురులు మోముఁ దమ్మిని జిఱునవ్వును గల వానిని గృష్ణుం జూచిరి. పలుమాఱు తాము విన్న

కథలచే వీనులను గృతార్థంబులఁ జేసినవారై యాయన యందే నిలిచి, గిన మనము గలవారగుట నేత్రరంధ్రంబుల మార్గంబున నాయనను లోఁ బ్రవేశించి సుచిరంబుగ భగవంతుఁ బరిరంభించి బ్రహ్మాభిముఖ బుద్ధులై భగవద్దర్శన లాలసులైన భక్తులవలెఁ దదదర్శన భావజాం బైనతాపంబు వదలిరి. ఇట్లు కోరికలెల్ల వదలి తన దర్శనంబుఁ గాంక్షించి వచ్చిన వారి యభిప్రాయంబు సర్వజ్ఞుఁ డెఱిఁగి నవ్వుచు వారితో నిట్లనియె.

పుణ్యచరిత్రలారా! మీకు స్వాగతము. కూర్చుండుఁడు. మీకు మావలనఁ గాఁ దగిన కార్యంబేమి గలదు? నా దర్శనంబుఁ గోరి వచ్చితిరి. ఇది మీకు యోగ్య కార్యమే. తమ మే లెఱింగిన వివేకు లాత్మప్రియుండైన నాయందే నిర్హేతుకంబుగ నిరంతరము భక్తి చేయుదురు. అవివేకులగు వారికి నింద్రియార్థంబులం దెట్టి ప్రీతి గల దట్టి ప్రీతి మీకు నా యందుఁ గలదు. ఎవని సంబంధమునఁ బ్రాణంబు బుద్ధి యాత్మ మనస్సు దారపుత్రధనాదులు ప్రియంబగు నట్టి నా కంటెఁ బ్రియంబైనది మఱొండెద్ది గలదు? కావున మీరు మరలి యజ్ఞవాటంబునకుఁ బొండు. మీతోడఁ గూడి మీభర్తలు సత్రంబు కొఱఁత లేకుండఁ బూర్తి చేయుదురు.

అనిన విప్రపత్ను లిట్లనిరి. సర్వవ్యాపకా! నీ విట్లు పరుషంబుగఁ బలుకఁ జనదు. వేదోక్తిని సత్యంబొనర్పుము. బంధువుల నెల్ల దిరస్కరించి నీపాదమూలంబు నాశ్రయింప వచ్చిన వారము. నీవు కాలిచేఁ ద్రోచివైచిన తులసీదామంబు శిరంబున ధరించు మేము నీ దాసికలము. మమ్ము భర్తలు, దల్లిదండ్రులుఁ, బుత్రులు, సోదరులు, బంధువులు, సుహృత్తులు మరల గ్రహింప రనినఁ దక్కిన వారిని జెప్ప నేల. నీ పాదాగ్రంబులఁ బడిన మాకు నీవు తప్ప వేఱుగతి లేదు. కావున నరిందమా! నీవే దానిని సమకూర్పుము. అనిన భగవంతుఁ డిట్లనియె.

బ్రాహ్మణీమణులారా! పతిసుత సోదరాదులు మీపైఁ గినియరు. మీరు భయపడవలదు. నా యొద్దకు వచ్చితి రనుకారణమున లోకులును దేవతలును నా యాజ్ఞచే మిమ్ము గారవింతురు గౌరవింతురు. లోకుల కంగ సంగంబువలనఁ బ్రీతిగాని యనురాగంబు గాని కలుగదు. కావున మీరు మనస్సులు నాయందు నిలుపుఁడు. శీఘ్రకాలంబుననే మత్ప్రాప్తి మీకుఁ గలుగును. శ్రవణదర్శన ధ్యానంబులను గీర్తనంబునను గలుగు ప్రీతి సమీపంబున నుండుటచేఁ గలుగదు. కావున మీ రిండ్లకుఁ బొండు. అనినఁ గృష్ణు వాక్యంబు లాకర్ణించి! యాబ్రాహ్మణ స్త్రీలు యజ్ఞవాటంబునకు మరలి పోయిరి. బ్రాహ్మణులును వారిని గ్రహించి సత్త్రంబుఁ గొనసాగించిరి ఆ బ్రాహ్మణ స్త్రీలయం దొకర్తె మాత్రము కృష్ణు నొద్దకుఁ బోనీయక బలాత్కారముగఁ బతిచే నిర్బంధింపఁ బడుటచే మనస్సున దాను విన్న పగిదిఁ గృష్ణుని ధ్యానించుచుఁ గర్మానుబంధంబైన దేహంబును సంత్యక్తంబు గావించెను. * కృష్ణుఁడును భక్ష్యభోజ్యచోష్య లేహ్యంబు లనునాలుగు విధములైన యాహారంబులను గోపాలురకు సంతుష్టిగ నిడి తానును భుజించెను. ఇట్లు లీలామానుష విగ్రహుండైన పరమాత్ముండు మనుజవర్తనం బనుకరించుచు గో గోప గోపాలికామధ్యంబున రూపవాక్కార్యంబుల రమించుచు వారిని సంతోషపెట్టుచుండెను.

అపరాధులైన బ్రాహ్మణులు విశ్వేశ్వరుండే మానుష వేషంబులఁ జరించుట స్మరించి యాయన వేఁడికోలు వృథాచేసితి మని తపించిరి. ఇతరులకు దుర్లభమైన భక్తి స్త్రీల కుండుటయుఁ దమ కా మాత్రము లేకుండుటయుఁ జూచి ఛీ ఛీ యేమి బ్రతుకు. అధోక్ష

---

*త్యక్తమనక సంత్యక్తమనుటచేఁ బునరావృత్తి రహితంబుగ విడిచె నని భావము. ప్రేమ మయమైన సిద్ధదేహంబునఁ గృష్ణునిలోఁ గలసె నని యెఱుంగవలయు. "యం యం వాపి స్మరన్ భావం, యే యథా మాం ప్రపద్యంతే" యని కలవు గదా.

జానకు విముఖులమైన మనకు శౌక్లంబు సావిత్రంబు దైక్షంబని త్రిగుణితంబైన జన్మంబేల? వ్రతంబేల? పెక్కులు చదివియేల? కులమేల? యజ్ఞాదిక్రియలేల? తదనుష్ఠాన సామర్థ్యమేల? ఆహా! భగవంతుని మాయ యోగులనుగూడ మోహింపఁజేయు నన మన మెంతవారము. మన మొకరికి నుపదేశించు గురువులమయ్యు మన విషయంబుననే మోసపోయితిమి. ఔరా! వీరో యాఁడువారైనను గృహమను పేరిటి మృత్యుపాశములను ద్రెంచివైచి జగద్గురువైన కృష్ణునందు ననవధికంబైన భక్తి గలవారైరి. వీరి కుపనయనాది సంస్కారములా? గురుకులవాసమా? తపమా? ఆత్మవిచారమా? అఘమర్షణస్నానాదులచే శుద్ధియా? సంధ్యోపాసనాది క్రియలా? ఏవియు లేవే. అట్లుండియు నుత్తమశ్లోకుండును యోగేశ్వరేశ్వరుండు ననగు కృష్ణునియందు వీరికి దృఢభక్తి కుదిరెను. అన్ని సంస్కారములుండియు మనము భక్తిశూన్యుల మైతిమి. గృహకృత్యముల మరగి ప్రమత్తులమై యాత్మహితమందు మూఢులమైన మనల సాధువులకు దిక్కైన కృష్ణుండు గోప వాక్యంబులఁ బ్రబోధించె. అటుగాకున్నఁ బూర్ణకాముఁడును కైవల్యాది సమస్త భోగమోక్షలకుఁబతియు నీశ్వరుండు నగు భగవంతున కిది లోకవిడంబనార్థము గాక యాశితవ్యులైన మనతో నే కార్యము గలదు? సర్వకాల సర్వావస్థలయం దెవ్వని పాదస్పర్శమందలి యాశచే నితరుల నందఱ వదలి తన చాంచల్యమును మాని శ్రీమహాలక్ష్మి సేవించుచుండు నట్టివాఁడు యాచించుట జనముల మోహింపఁ జేయుటకుఁ గాక మఱి యే ప్రయోజనము గలదగు? దేశకాలద్రవ్య మంత్ర తంత్రములు ఋత్విజులు నగ్నులు దేవతయు యజమానుఁడును క్రతుధర్మంబెవ్వని మయములో యట్టి భగవంతుండు సాక్షాద్విష్ణుండు యోగేశ్వరేశ్వరుండు యదువంశంబునఁ బుట్టినవాఁడని సర్వత్ర విని యుండియు నాయనచేఁ బ్రబోధింపఁబడియు మూఢులమై యెఱుం

గమైతిమి. ఎవ్వని మాయచే మోహితమైన బుద్ధిచే భ్రమించి కర్మమార్గంబునఁ బడితిమో యట్టి భగవంతుఁడవును నకుంఠ బుద్ధివియు నగు కృష్ణా! నీకు నమస్కారంబు. నీ మాయచే మోహితాత్ములమై నీమహిమం బెఱుంగనేరక నీయెడ నతిక్రమం బొనర్చిన మమ్ము నాదిపురుషా! క్షమింపుము. అని తాము చేసిన కృష్ణ హేలనముఁ దలంచి తలంచి పాపం బొనర్చితిమని తపించిరి గాని కంసభయంబున బ్రారబ్ధం బడ్డగింపఁ గృష్ణు దర్శింపఁ బోవనైరి.

కం. వేదంబులఁ గులధనముల
వాదంబుల ధర్మశాస్త్ర పఠనంబులచే
మోదింపఁడు హరి తన్నున
భేదమతిఁ దలచు హరిఁ బ్రీతిఁ దలఁచుఁ.

రుక్మిణి—బావా! వంట పెంట యింటి తంటలలోఁ బడిన స్త్రీలకు భక్తి కుదురుటకును గల కాలము చదివి తపస్సు చేసి యజ్ఞాదులు చేసి వ్రతములు సలిపి నలఁగిన బ్రాహ్మణులకు భక్తి లేక పోవుటకుఁ గారణ మేమి!

చంద్రిక—స్త్రీలకు భక్తి కుదురుట సులభము. కర్మమునఁ గాయక్లేశము నొందు. జ్ఞానమార్గమున మనఃక్లేశము నొందు. భక్తియోగమున నీరెండుక్లేశములు లేవు. కర్మము లన్నియుఁ జేయవలయు ననిన ధనము దేహదార్ఢ్యము కావలయును. జ్ఞానమునకు విద్యాపాండిత్యము కావలయును. భక్తియోగమున కివి రెండు నక్కఱలేదు. భక్తిలేని కర్మము జ్ఞానము నిష్ప్రయోజనములు. కర్మజ్ఞానములు సాపాయములు. భక్తి నిరపాయము. భక్తి కల్పవృక్షము. కర్మమునకు జ్ఞానమున కధికార ముండవలయును. భక్తికి స్త్రీలు శూద్రులు చండాలాదు లెల్లరును నధికారులే. దేవాలయమందుఁ జూచినను, బటములయందు జూచినను, నింటఁ దిరువారాధనమందుఁ జూచినను, నుండు దేవుడో

క్కఁడేయనియు మూర్తులు మాత్రము వేఱనియు నే మూర్తిని గొలిచినను దేవునినే కొలుచుచున్నామని తమకు భక్తి యుండినఁ దమ కోరికలు భగవంతుఁడు నెఱ వేర్చునను నమ్మకము స్త్రీలకు సులభముగ లభ్యపడును. పురుషుల కన్ననో వారిలో విద్యావంతులకు నిది సులభసాధ్యము గాదు. విద్యతోడ దురభిమానము వచ్చును. అట్టివారు చెడినవారే. సాధువులగు విద్యావంతులకో వారి విద్యయే వారికి బెక్కు సందేహములు గలిగించుచుండును. వారు చదువు గ్రంథములందొకచోట రాజయోగమే కైవల్య ప్రదమని యుండును. ఒండొకచోటఁ గర్మయోగమే శ్రేష్ఠమని యుండును. మఱియొక చోట జ్ఞానమునకు సమానమైనది లేదని యుండును. మఱియొకచోట భక్తి యనుత్తమ మని యుండును. లోకమున నాచారము భిన్నమై యుండును. ఇట్టిచోట దేని యందైన నొకదానియందు నిశ్చయజ్ఞానము లేనివాఁడు రాజయోగము మేలని చదివినపుడు ముక్కుపట్టుకొని బుసగొట్టుచుండును. కర్మయోగమును గురించి చదివినప్పుడు రవంతసేపు సర్వం శ్రీకృష్ణార్పణమస్తనుచుండును. జ్ఞానమును గురించి చదివినపుడు లోకమును వెఱ్ఱిచూపులఁ జూచుచుండును. భక్తియోగమును గుఱించి చదివి సాఁగిల బడి పడి దండములు పెట్టుచుండును. ఇట్లు కుదుటఁబడని బుద్ధితో దేనియందును బక్వదశ నొందక డోలాయమానమానసుఁడై యుండును. ఇట్టి బాధలులేక యితర సాధనము లెఱుఁగని స్త్రీలు మొదలగు వారికే మనసున నిశ్చంచలముగ భక్తి కుదురును. ఏనాఁటి మాటయో యేల యీ నాఁడును బురుషులకంటె స్త్రీలే దైవభక్తి శ్రద్ధలు గలిగియున్నారు. ఇట్టివారినిగూడఁ గామ

దాసికలఁ జేయఁ గోరి యొదఋ పురుషులు తాఁ జెడ్డక్రోఁతి వనమెల్లఁ జెఱచినట్లు వర్తింనుచున్నారో మీరెఱుంగరా?

రుక్మిణి—కలి విలాసము మఱచి నీ వేల నగచెద వాప్పా! కృతయుగము రమ్మనిన నేఁడు వచ్చునా? కర్మము కొలఁది గదా బుద్ధి. ఇంతకు శ్రీరాములవారు చెప్పినట్లు తనకుఁ దా నేడ్చుట మేలు గాని యితరుల కేడ్చుట తగదు కావున నీ వీ విచారను వదలి నీమార్గమందే నీ వుండుము. రామాయణములోఁ బిడుకల కొట్లాట యిది యేలగాని నే నింకొకటి యడిగెదఁ జెప్పుము. నీవు రామాయణములో

చం. హితమతిఁ బెద్దవారలకు నెప్పుడు మ్రొక్కుక యున్నఁగాని, దే
వతల యజింపమానినను వారిజ నేత్రకు భర్తృసేవ స
ద్గతి సమకూర్చుఁ, దల్లి! నిరతవ్రతయై సతతోపవాసయై
సతి పతి భక్తిఁగొల్వమిని సత్యముగా నిరయంబునం బడున్.

అని వ్రాసితివే యిప్పుడు బ్రాహ్మణ భార్యలు మగలమాట నతిక్రమించి పోయిరి కదా. వారికిఁ బాతివ్రత్యహాని నరకము కలవా లేవా?

తండ్రి—చెప్పెద వినుఁడు. ధర్మమని యర్థమని కామమని మోక్షమని పురుషార్థములు నాలుగు. అందు మొదటి మూఁటికిఁ ద్రివర్గమని పేరు. త్రివర్గమార్గమునఁ బోవువారు స్వర్గమునకు మాత్రమే పోవఁగలుగుదురు. వారచ్చటఁ జేసిన పుణ్యఫలమచ్చట ననుభవించి మరల భూమిమీఁద జన్మించుచుందురు. మోక్షమార్గమునఁ బోవువారికిఁ ద్రివర్గములతోఁ బనిలేదు. త్రివర్గమునకు సంబంధించిన కార్యములు చేయమిని వారికిఁ బాతకము లేదు. చేసినంత మాత్రమున లాభమును లేదు. అటని నేను మోక్షమార్గమునఁ బోయెద నని ప్రతిమనుష్యుఁడు త్రివర్గము విడవరాదు. నారదుఁడు ప్రహ్లాదుఁడు లోనగు మోక్షాధికారులు త్రివర్గమార్గము విడువఁ దగును.

మనస్సు పరిపక్వమగు వఱకుఁ త్రివర్గము విడువరాదు. పరిపక్వమై దృఢమైన పరభక్తియో జ్ఞానమో కుదిరినపిమ్మటఁ త్రివర్గము విడిచిన దోషములేదు. బ్రాహ్మణ స్త్రీలకు మనస్సు పక్వమై భగవంతునియందు దృఢభక్తి కుదిరినది. భగవంతుఁడొక్కఁడే నిరుపాధిక బంధువని తక్కిన వారందఱు సోపాధిక బాంధవులని మోక్షమీయఁజాలరని నిశ్చయమైన జ్ఞానము గలవారై భగవంతునుద్దేశించి పోయిరి. భగవత్ప్రాప్తికిఁ బతిసుతాదులందఱు ప్రతిబంధకములే కావున వారిని విడుచుట వలన దోషములేదు. సమస్తము విడిచినఁగాని భగవత్ప్రాప్తి కలుగదు. కాఁబట్టి బ్రాహ్మణ భార్యలకుఁ బాతివ్రత్యహాని నరకములు లేవు. వివాహకాలమున వరుఁడు ధర్మమందు నర్థమందుఁ గామమందు భార్య నతిక్రమించి పోవనని వాగ్దానము చేసెను. కావున మోక్షాసక్తుఁడు భార్య నతిక్రమించి పోవచ్చును. అట్లులే భార్యయు ధర్మార్థకామములందు భర్త నతిక్రమించి పోరాదుగాని మోక్షమునకై పోవచ్చును. ఇది మిథ్యాచారుల కన్వయింపదు. రామాయణమందలి పద్యము త్రివర్గవిషయమని యెఱుఁగుము. త్రివర్గవిషయమైన ధర్మము సామాన్యధర్మము. భగవద్విషయము విశేషధర్మము. సామాన్యధర్మ మెప్పుడును విశేషధర్మమును బాధింపదు గాని విశేషధర్మము సామాన్యధర్మమును బాధించును. బ్రాహ్మణులు సామాన్యధర్మము నవలంబించిరి. వారి భార్యలు విశేషధర్మము నవలంబించిరి. సత్యము చెప్పుమను వేదోక్తి బలిష్ఠమని తలఁచి యసత్యమునకు వెఱచి దానిని గ్రహించి భగవంతుఁడైన శ్రీరాముని విడనాడి దశరథుఁడు భ్రష్టుఁ డయ్యెను. పుట్టిన బిడ్డల నీకిచ్చెదనని వసుదేవుఁడు కంసునకు వాగ్దానము గావించియు సామాన్యధర్మమైన సత్యమును బాటింపక భగవంతు

నాశ్రయించి యుభయ సుఖము లనుభవించెను. సామాన్య ధర్మమునకంటె విశేషధర్మము గొప్పదనుట యీ కృష్ణచరిత్రమందు మీరు జ్ఞప్తియందుంచుకొనిన ననేక సందేహములు తొలఁగిపోవును. సకాలమున సంధ్య వార్చవలయు ననుట సామాన్యవిధియైనను దత్కాలమున దేహముగాని మనస్సుగాని భగవద్విషయమున వర్తించుచుండిన సమయ భంగదోషము లేదు. "అత్యంత భక్తియుక్తానాం, నచ శాస్త్రం నచక్రమ" యని శాస్త్రోక్తి. ఇట్టులే తక్కినవి గ్రహింపుఁడు. తరువాతి వృత్తాంతము వినుఁడు.

## —: ఇంద్రయాగ భంజనము :—

బలరామ సహితుండై కృష్ణభగవానుండు బృందావనంబు నందయుండ నొకనాఁ డింద్రయాగ మొనర్ప గోపాలురు ప్రయత్నించిరి. సర్వాత్ముండును సర్వదర్శుండును నగు శ్రీకృష్ణుండు దాని విధం బెఱింగియు సవినయముగ నందాది వృద్ధులతో నిట్లనియె.

నాయనా! మీ సంభ్రమమునకుఁ గారణమేమి? నాకుఁ దెలుపుఁడు. మీ కేమి సంభవించెను? ఇది వృథా సంభ్రమము కాదు. యజ్ఞ ప్రయత్నమంటిరా యీ యాగముచేసిన రాఁగల ఫలమేమి? ఎవని నుద్దేశించి యాగ మొనర్చెదరు? దీనికి సాధకు లెవ్వరు? సాధన మెద్ది? తండ్రీ! యిది విన నాకు మిక్కిలి కుతూహల మగుచున్నది. వినిపింపుము. సర్వసమ స్వభావులయిన వారి కార్యంబులందుఁ బరులకు జెప్పరాని రహస్యముండదు. నేను- నాకు- నాది- పరునిది యను స్వపరదృష్టులు గలవారికిని శత్రువులకు నుదాసీనులకు రహస్యము వినిపింపరాదు గాని తనతో సమానులైన మిత్రులకు వినిపింపకుండ రాదు. కావున సుహృదుండనైన నాకు మీరు రహస్యమైనను జెప్పవచ్చును. సుహృదులైన వారితో నాలోచించి చేసిన యొక కార్యము

చేయవలయును గాని యొకరు చేయుచున్నారు గదా మన మట్లు
చేయుదమని గతానుగతికముగ నేకార్యమును జేయరాదు. జనులు
తెలిసియుఁ దెలియకయుఁ గార్యములుఁ జేయుచుందురు. ఆలోచించి
తెలిసిచేసిన వారికి గలుగు ఫలము తెలియక చేసినవారికిఁ గలు
గదు. కావున మీరు చేయఁబూనిన కార్యముగుఱించి యెవరితో
నాలోచించితిరి? ఏమి యాలోచించితిరి? దీనికిఁ బ్రమాణము శాస్త్ర
మా? లౌకికాచారమా? వివరింపుఁ డనిన నందుఁ డిట్లనియె.

కుమారా! యింద్రుఁడు వర్షాధిదేవత. మేఘము లతనికి దేహ
సమానంబులు. అవి యింద్రుని ప్రేరణముచేఁ బ్రాణికోటికి జీవన
భూతంబైన జలమును వర్షించును. కావున నాయనా! మేమును నిత
రులును మేఘములకుఁ బతియైన యింద్రుని నాయన యిచ్చిన జల
ములచేఁ బుట్టిన పదార్థములచేఁ బూజింతుము. ఆ యాగ శేషములైన
పదార్థములచే జీవింతుము. ఇట్లు చేయుటకు ధర్మార్థకామంబు
లందలి కోరికయే కారణము. కృషి లోనగు పురుషప్రయత్నములు
చేయువారికి ఫలము నొసఁగువాఁ డింద్రుఁడే కావునఁ గామముచేఁ
గాని లోభముచేఁగాని భయముచేఁ గాని విరోధబుద్ధిచేఁ గాని యీ
ధర్మము నాచరింపనివాఁడు శుభంబులు పడయఁడు. అని నందాది
గోపాలకులు చెప్పిన స్వాధికార ప్రమత్తుఁడైన యింద్రునకుఁ గోప
ముదయింపఁ జేయఁ గృష్ణుఁ డిట్లనియె.

అయ్యా! పర్జన్యుఁడు ఫలమిచ్చునంటిరి. అది సరిగాదు. జంతు
వులు తాము చేసిన కర్మముననే పుట్టును. ఆ కర్మముచేతనే గిట్టును.
ఈలోకసుఖము, దుఃఖము, భయము, పరలోకమున క్షేమము, కర్మము
వలననే కలుగుచుండును. క్షణకాలమునఁ జేసి ముగియు జడమైన
కర్మము పిదప నేనాఁడో దాని ఫలము నెట్లిచ్చును. గావున ఫలము
నిచ్చువాఁడు దేవతయే యందురేని యా దేవత లెందఱు? అగ్ని
వాయువు మొదలైనవారు పెక్కురున్నారా? లేక యొక్కఁడా? ఈ

యింద్రాదులే దుఃఖముల బోఁగొట్టి సుఖముల నిచ్చువారేని వారి దుఃఖములను వారు పోఁగొట్టుకొని సుఖములను మాత్రమే సంపాదింపఁగలిగిరా? లేదు కదా! వారికిని సుఖదుఃఖములు మనుష్యులకు వలె నున్నవికదా! అట్లు తమ దుఃఖములను బోఁగొట్టుకొని సుఖమును సంపాదింప లేనివారి కితరులకు నిష్టానిష్టములు గూర్చు శక్తి యెట్లు గలిగెను? వారును గార్యములుచేసి కర్మవశులై సుఖదుఃఖములనుభవించు చున్నారు గదా? అటు గాక మనముచేయు కర్మమునకు ఫలము నిచ్చువాఁ డీశ్వరుఁడొకఁ డంతర్యామియై యున్నాఁడందురేని యాయనయును గర్మముల కొలఁది ఫలము నిచ్చువాఁడగుటచేఁ గర్మమునకుఁ బరతంత్రుఁడే కదా? కర్మములు చేయనివారి కాయన యేమిఫల మిచ్చును? కావునఁ గర్మమే గౌరవింపఁదగినది. తమతమ కర్మముల స్వభావమునుబట్టి ననువర్తించు ప్రాణులకుఁ గర్మఫలంబులఁ దప్పింపనేరని యింద్రునివలనఁ గాఁగల కార్యమేమి గలదు? అంతర్యామియైన యీశ్వరుఁడు మన కర్మమునకుఁ దగిన ఫలం బిచ్చువాఁడేని యప్పుడును నింద్రునితో మన కేమి పని? స్వభావ పరతంత్రులగుట జనులు స్వభావమును ననుసరించి వర్తింతురు. దేవాసుర మనుష్యసహితంబైన ప్రపంచమంతయు స్వభావస్థమై యున్నది. జంతువులు నానావిధములయిన దేహములను గర్మము చేతనే పొందుచున్నవి. కర్మము చేతనే విడుచుచున్నవి. శత్రువులు మిత్రులు నుదాసీనులు కర్మము వలననే కలుగుచుందురు. కర్మమే గురువు. కర్మమే యీశ్వరుఁడు. కావున స్వభావస్థులై స్వభావ నియతకర్మములను జేయువారు కర్మమునే గౌరవింప వలయును. స్వభావసిద్ధమైన యేకర్మము వలన నెవఁడు సుఖముగ జీవించునో వాని కదియే దైవతము. ఒకదానివలన జీవించుచు మఱియొక దాని ననుసరించి పరువెత్తువాఁడు పతియందుఁ బ్రీతి సేయక విటకానిపైఁ బ్రీతిసేయు నంకటాలి వలె క్షేమము గననేరఁడు. బ్రాహ్మణులకు వేదము వృత్తి. రాజులకుఁ బ్రజా

పరిపాలనము వృత్తి. వైశ్యులకు వార్త వృత్తి. ద్విజసేవచే శూద్రులు జీవింపవలయును. వైశ్యవృత్తియైన వార్త కృషియు, వాణిజ్యము గోరక్షణము, వడ్డివలన జీవించుట యని నాలుగు విధములు.

అందు మనము గోవులరక్షించి జీవించు వారము. సృష్టి స్థితి లయములకు రజస్సు సత్వము తమస్సు నను గుణములు కారణములు. రజోగుణము వలన స్త్రీపురుష సంయోగముచే వివిధమైన జగత్తు పుట్టుచున్నది. ఈ రజోగుణముచేఁ బ్రేరింపఁబడి మేఘములన్ని స్థలములయందు వర్షించుచున్నవి. గోవులు లోనగు నవి మేఘములచే జీవించుచున్నవి. ఇఁక నింద్రుఁడు చేయు కార్యమేది? పూజించు వారికే యింద్రుఁడు వర్షము గురియించునేని సముద్రము లోనగు స్థలముల నేల గురియించును? ఎవరు పూజించుటచే నచ్చటఁ గురియించు చున్నాఁడు? మనము నగరవాసులము గాము. దేశవాసులము గాము. గ్రామవాసులమును గాము. ఇండ్లు నిలుకడగఁ గట్టి కొని సంసారములు చేయువారమును గాము. తండ్రీ! మనము పర్వతారణ్యముల నివసించు వనవాసులము. కావున మనము మన మేలుకోరి యాశీర్వదించు బ్రాహ్మణులను మన పశువులకు గడ్డి నీరు నొసంగు పర్వతములను గోవుల నుద్దేశించి యజ్ఞము చేయుదము. ఇంద్రయాగము నిమిత్తము సంపాదించిన సంభారములే దీనికి వినియోగింపవచ్చును. వివిధములైన పాకములు దీర్పింపుము. అన్నము పప్పు పాయసము గోధుమ పిండివంటలు సెవెలలు నప్పుచ్చులు చక్కిలములు సిద్ధముచేయింపుఁడు. గృహిణు లందఱుఁ బిండిన యావు పాలతోనే సమస్త భోజ్యములు సిద్ధపఱుప నియోగింపుఁడు. బ్రహ్మవాదులైన బ్రాహ్మణులచేఁ జక్కఁగ హోమము చేయింపుఁడు. వారికి విస్తారముగ నన్నమును దక్షిణయు ధేనువులను నిండు. కుక్కలకుఁ జండాలురకుఁ బతితులకుఁ దగిన ట్లన్నము పెట్టుఁడు. ఆవులకుఁ బచ్చిక యును బర్వతమునకు బలియు నిడుఁడు. చక్కఁగ స్నానముచేసి యలంక

రించుకొని భుజించి గంధములందికొని మంచివస్త్రములు కట్టుకొని పూవులు పెట్టుకొని యగ్నులకు గోవులకు విప్రులకుఁ బర్వతమునకుఁ బ్రదక్షిణింపుఁడు. తండ్రీ! యిది నా యభిప్రాయము. మీకిష్ట మున్న యెడల నిటుసేయుఁడు. ఇట్లాచరించు మఖము గో బ్రాహ్మణాదులకును నాకును బ్రీతికరము.

అని యింద్రుని గర్వమణంపఁ దలంచి కాలాత్ముఁడైన భగవంతుఁ డాడిన మాట లాయన యుద్దేశము తెలియని నందాదులు సరియని యంగీకరించిరి. కృష్ణుఁడు చెప్పిన ప్రకారము కార్యములం దీర్చి యాపదార్థములతోనే గిరిబ్రాహ్మణుల నుద్దేశించి పుణ్యాహవాచనంబుఁ గావించి బలు లొసఁగి యావులకు మేపిడి వానిని ముందుంచుకొని గిరిప్రదక్షిణంబుఁ గావించిరి. నందాదులును గోపికలు నలంకరించుకొని మంచి గిత్తలు పూన్చిన శకటంబులెక్కి కృష్ణలీలలు పాడుచు గిరికిఁ బ్రదక్షిణించిరి. అప్పుడు కృష్ణుం డచేతనంబైన యీ పర్వతమును బూజించిన ఫలమేమి యను నందుని సందేహంబు దీర వేఱొక మహారూపము ధరించి పర్వత శిఖరంబుపైఁ దోఁచి "గోపకులారా! నేను బర్వతమను. మీబలులు నాకిడుఁ డని వారు పెట్టిన పదార్థము లెల్ల భుజించెను. అప్పుడు గోపాలకృష్ణుఁడు పర్వతమందున్న మూర్తినిజూపి యీరా గోపాలకులారా! చూడుఁడు పర్వతంబుమనయం దను గ్రహించి స్వస్వరూపంబున మన మిడిన పదార్థములెల్ల గ్రహించె. దీనికి మ్రొక్కుఁడని చెప్పి వారితోడఁ దాను నారూపంబు ధరించిన తన మూర్తికి నమస్కరించి "చూచితిరి గదా మన మ్రొక్కులుగైకొని యనుగ్రహించినట్లు తన్నుఁ దిరస్కరించిన వారిని గోరిన రూపంబు ధరించి చంపు"నని చెప్పెను. ఇట్లు వారు దేవ ప్రేరితులై యగ్నిగోద్విజమఖం బాచరించి కృష్ణుని గూడి గోపాలురెల్లరు వ్రజంబునకుఁ బోయిరి.

గీ. అఖిలకర్మ సమారాధ్యుఁడైన శౌరి
పామరులు వేఱు విధమున భక్తి యుక్తిఁ
గర్మముల సల్పినను వాని గాదనండు;
ప్రీతుఁడగుచును వానిఁ దా స్వీకరించు.

కం. ఏ మూర్తి నైనఁ గానీ
యా మూర్తియె హరియటంచు నర్చించినఁ దా,
నా మూర్తి వానిఁ గైకొని
శ్రీమాధవుఁడుఁ ఘటించు శ్రేయము లెల్లన్

కం. వ్యక్తముగఁ దోఁచు మూర్తి వి
రక్తిని విడనాడి గోచరముగాని మహా
వ్యక్తుని ధ్యానించు సమా
సక్తిని కృష్ణుండు మెచ్చఁ జాలం డెపుడున్.

ఇట్లు తనపూజ భంగమై పోయెనని యింద్రుఁడు కృష్ణుఁడే దిక్కు గాఁగల నందాదులపైఁ గోపించి ప్రలయ కాలంబున లోకంబుల జలంబుల ముంచు సంవర్తకంబు లను మేఘములఁ బిలిచి తానేయీశ్వరుండు ననియభిమానంబున నైశ్వర్యగర్వమహిమ నడవిమనుష్యులైన గొల్లలు మర్త్యుఁడైన కృష్ణు నాశ్రయించి దేవతిరస్కారంబు గావించిరి. మహా దృఢములైన నావలవంటివై కర్మమయములై క్రతువులను పేరుగల వాని నాధారముగఁగొని యన్వీక్షకిని సంసారసాగరంబు వీరు దాఁట యత్నించిరి. వాచాలుండును బాలిశుండును స్తబ్ధుండును నజ్ఞుండును బండితమానియు మర్త్యుఁడు నగు కృష్ణుని సహాయునిఁగ గొని నా కప్రియంబుఁ గావించిరి. ఈ శ్రీమత్తులును గృష్ణరక్షిత దేవాలును నగు వారి యైశ్వర్య గర్వజాడ్యంబును నిర్మూలింపుఁడు. పశువుల నెల్ల నాశ మొనర్పుఁడు నందగోపవధార్థంబు నేను నైరావతము నెక్కి మహావేగములైన వాయువులం దోడుకొని మందపల్లెకు వచ్చెదను.

అని చెప్పి వాని నిర్బంధమునుండి విడిచిన నవి విచ్చలవిడి పెచ్చు పెరిఁగి వ్రేపల్లెకు వచ్చి నందగోకులంబుఁ బీడింపఁ దొడఁగెను. తళుకు తళుక్కని కన్నులు మిఱుమిట్లుగొలుప మెఱయు మెఱుపులును, చెవు డుపట్టనట్టన రట్టుగొలుపు నుఱుములును, విడివడిఁ దొడిఁదొడిపడు పిడుగులును, ఉవ్వ్వఉవ్వ్వనఁ దాఁకు వడిగండ్లునునై బోరున నోరు గాలి వీవ స్తంభములావు జలధారల దారుణంబుగ నాకాశంబు చిల్లులు పడినట్లు కురియ దొరఁకొనెను. మిట్టపల్లము దెలియరాకుండ నట్లు నీళ్లువంకలై పాఱుచుండెను. బెడిదంబగు గాడుపుతోడి జడివా నకుఁ బసువులు గడగడవడఁకఁ జొచ్చెను. చలికి వలిగొని వ్రేతలును గోపాలురును గోవులును గృష్ణుమఱుఁగు చొచ్చిరి. ఆసార బాధిత లైనవల్లవ కుంభపయోధరలు బిడ్డల కడ్డంబుగఁ దమమేనులు వంచి వడఁకుచుఁ గృష్ణుని శరణుఁ జొచ్చిరి. కృష్ణా కృష్ణా మహానుభావా! గోకులంబునకు నీవే దిక్కు. భక్తవత్సలా! కోపించిన యింద్రునవలన మమ్ము రక్షించు భారము నీది. అని తనశరణు చొచ్చుటయు గాలివా నచే బిట్టుకొట్టఁబడుచున్న తనవారిం జూచి వారిజాక్షుం డింద్రుండు తనయాగము విఘ్నపఱిచితి నని కోపించి యాగడంబునకు లోఁగి యకాలమం దిట్టిగాలియు గాలవానయు నుత్పాదించె. దీనికిఁ బ్రతివి ధానము నాయోగశక్తిని ఘటించెద. అజ్ఞానంబుచేఁ దాను లోకేశుఁడ నని తలంచు నీతని యైశ్వర్యమదంబు సదమదంబుచేసెద. నాయందు మనస్సుంచి యుండు దేవతలకుఁ దామే ప్రభువులమను గర్వము యోగ్యముకాదు. కావున నసాధువర్తనమునకుఁ బాల్పడిన వారినవ మానపఱుచుటే కార్యము. ఆటైనచే వారు మరలఁ గన్నులు తెఱచి చూచిచక్కఁ బడుదురు. నాశరణుచొచ్చి నన్నే దిక్కుగానమ్మి నన్నే యాధారముగాఁదలంచియుండు గోకులమును నా యోగమహిమచే రక్షించెద.

## —: కృష్ణుండు గోవర్ధన మెత్తుట: —

ఇది నా వ్రతము గదా. అని బాలుండు పుట్టగొడుగెత్తి పట్టి నట్లు కృష్ణుం డవలీలఁ దన యెడమచేతి చిటికెనవ్రేలితో గోవర్ధన పర్వతము నెత్తి గొడుగుగఁ బట్టి "తల్లీ! నాయనా! గోపాలురారా! రండు మీ గోవులతోడ దీనిక్రింద నిలుఁడు.

తల్లి దండ్రులారా!

చం. వలవదు మీకుభీతి పసిబాలుఁ డీతఁడు, కొండనెత్తఁగా
వలఁతియె? యిట్లుక్రింద నిలువందగు? నంచు వినిశ్చలాత్ములై
నిలువుఁడు మీరు గోవులును నీరజలోచన లెల్లవార లీ
బలితపు గాలివానయును బాసెడి దాఁక ధరింతు నీగిరిన్.

అని ధైర్యంబు చెప్పిన వారందఱు కృష్ణువాక్యంబులు విశ్వ సించి తమతమ సమస్తపదార్థములతో ధనములతో బిడ్డలతో నాశ్ర యించినవారితోడ దానిక్రింద నిలిచిరి. గోవ్రజంబంతయుఁ జూచుఁ చుండ శ్రీకృష్ణభగవానుఁ డాఁకలి దప్పులు లేక యేడురాత్రు లేడు పగళ్లటు పెట్టిన కాలిటు పెట్టక యాకొండనెత్తి పట్టుకొనెను. కృష్ణుని యోగమహిమఁజూచి శచీపతి యతివిస్మితుఁడై జాడ్యము మాని భ్రష్ట సంకల్పుఁడై మేఘములనెల్ల మరలించెను. మబ్బులు విచ్చెను. సూర్య బింబము లోకగోచరమై యుదయించెను. దారుణమైన గాలివీచుట మానెను. వానయు వెలిసెను. అదిచూచి గోవర్ధనధరుండు గోపాలు రతో నిట్లనియె. అయ్యలారా వాన వెలిసెను. గాలివీచుటమానెను. వెల్లువలు సన్నగిల్లెను. ఇక మీరు నిర్భయముగ మీ మీ పదార్థ ములతో నాఁడువారితో బిడ్డపాపలతో వ్రేపల్లెకుఁ బొండు. అని చెప్పిన గోపాలకులు స్త్రీబాల వృద్ధులతో శకటాది గృహోపకరణ ములతో గోవర్గముతో వ్రేపల్లెకుఁ బోయిరి. అందఱు సమక్షంబునఁ బుండరీకాక్షుండు పర్వతమును యథాస్థానమున నిలిపె. అంత గోప

కులు నితాంతప్రేమంబున నాపిల్ల వానిఁ గౌఁగిలింతలు మొదలైన వానిచే నాదరించిరి. గోపస్త్రీలు స్నేహాతిశయంబున నక్కతలు పెరుఁగు లోనగు వానిచేఁ గృష్ణుంబూజించి యాశీర్వదించిరి. ఆకాశంబున దేవసిద్ధసాధ్య గంధర్వాదులు సంతుష్టిఁబుష్పవృష్టిఁ గురియించి శంఖ దుందుభుల నాదంబు దిగంతంబులు నిండఁ బూరించిరి. తుంబురుఁడు లోనగు గంధర్వులు పాడిరి. తనయందు వాళిగల గోపపాళింగూడి హాళిమెయి బలరామునితోఁ గృష్ణుఁడు మందకేగెను. గోప స్త్రీలును గృష్ణలీలలు మనోహరంబుగఁ బాడుచుఁ బోయిరి.

కృష్ణుని యిట్టి యద్భుతకార్యములు చూచి గోపాలురు విస్మితులై యతనిశక్తి యిట్టిదని యెఱుంగనేరక నందునికడకు వచ్చి యిట్లనిరి. అయ్యా! నీకుమారుని యత్యద్భుత కర్మములు చూడ నీయన యెవఁడో మహాపురుషుఁడని తోఁచుచున్నది. ఇట్టి మహానుభావుఁడతి జుగుప్సితమైన గొల్లజన్మ మేల యెత్తెనో తెలియలేము. లేకున్న నేడేండ్ల బాలు డెక్కడ? ఏనుఁగుకమలమును బోలెఁ గొండనెత్తి పట్టుటయెక్కడ? కన్నులు తెఱవని పిన్ననాఁట మహాబలశాలినియైన పూతన చనుఁబాలను యౌవనమును గాలముహరించునట్లు ప్రాణములతోఁ హరించెను. మూఁడునెలలు శిశువై పరుండి రోదనంబుఁగావించుచునే కాలితాఁకున బండిని విఱుగఁ దన్నె. ఏఁడాది బాలుఁడై కూర్చుండియుండి తన్నాకాశంబునకు నెత్తికొనిపోయిన తృణావర్తుని మెడఁబట్టుకొని కూలఁ ద్రోచి వధించె. తల్లి తన్ను ఱోటికిఁ గట్ట దాని నీడ్చుకొని పోయి మద్దుల సందునలాగి వానిఁ గూలఁ ద్రోచె. రామగోపాలురతో వనసంచారంబుఁ గావించుచుఁ దన్నుఁజంప నుద్దేశించిన బకాసురుఁ జీల్చి కూల్చె. వధింపఁగోర వేగలతో వేఁగమై వచ్చిన వత్సాసురు వెలగ చెట్టుతోడ లీలగ నేలపాలు గావించె. సబాంధవుఁడైన గర్దభాసురుఁ జంపి పరిపక్వఫలాన్వితంబైన తాలవనంబు జనోపభోగ్యంబుఁ గావించె. బలశాలియగు బలునిచేఁ బ్రలంబు

మృతునిఁ గావింపించె. దావాగ్నినుండి మందపశువులనెల్ల రక్షించె. మహాఘోర విషభయంకరంబైన సర్పమును యమున మడుఁగు నుండి వెడలఁదోలె. ఎంతటి ప్రభావశాలియందును నొకనికిఁ గాకున్న వేఱొకనికి విషమబుద్ధి యుండుట గలదు. అది స్వభావమై యుండ మాకందఱకుఁ బ్రాణములందువలె వీని యం దనురాగము త్యజింప రాకున్నది. అది యెట్లు?

అని వారెల్ల నభినందించిన నందుండు వారి నందఱఁ జూచి మున్నుగర్గుండు తనకుఁ జెప్పిన రహస్యంబు దెలిపి యిట్లనియె.

ఆయన మాటలు పట్టిచూడ శ్రీకృష్ణుఁ డఘటనఘటనా సమర్థుఁడగు సాక్షాన్నారాయణుఁడని తోఁచుచున్నది. అనిన నందుని వాక్యములు విని విగత విస్మయులై సంతోషంబున నందునిఁ గృష్ణుని నర్చించి గోపాలురు తమ తమ యిండ్లకుఁ బోయిరి.

## —: గోవిందపట్టాభిషేకము :—

గోవర్ధన పర్వతం బెత్తుటయు జడివాననలన గోకులంబు రక్షించుటయుఁ జూచి యింద్రుఁడు సురభితోడ భూలోకమునకు వచ్చి శ్రీకృష్ణునిం గడసి తాను జేసిన యపరాధమునకు సిగ్గుపడి యేకాంతమునఁ దన కిరీట మాయన పాదకమలములు తగులునట్లు నేలఁ వ్రాలి లేచి త్రిలోకనాథుఁడ నను ముదమువిడిచి కరములు మొగిడించి యాయన మహిమ విన్నవాఁడును గన్నవాఁడును నగుట యిట్లు స్తుతించెను.

దేవా! నీధామంబు విశుద్ధసత్త్వంబు శాంతంబు తపోమయంబు రజస్తమోరహితంబు. అట్టి నీకు గ్రహణానుబంధమై గుణ సంప్రవాహమైన సంసారపు మాయామయంబన నేల దానికిఁ గారణములై మూఢులకుఁ జిహ్నములైన లోభాదులు నీ కెక్కడివి? అటులయ్యు ధర్మరక్షణమునకును దుష్టశిక్షణమునకునై దండంబు

ధరింతువు. దీనికిఁ గారణము నీవు జగమునకుఁ దండ్రివి గురుఁడవు నధీశుఁడవు నగుటయే. ఎట్టివానికిని మీఱ శక్యంబుగాని కాలోచిత దండంబును నీవు ధరింతువు, దురభిమానుల గర్వము ఖర్వ మొనర్ప లోకేశ్వరా! స్వేచ్ఛా తనువుల లోక హితమునకై గ్రహింతువు. నావంటి యజ్ఞులు జగదీశాభిమానులు భయంకర కాల దండధరు నిన్నుఁ జూచి గర్వము విడిచి యార్య మార్గంబునఁ బ్రవర్తింతురు. దుష్టులగు వారి యెత్తికోలు దుది దాఁకనీయకుండుటే నీవు విధించు దండము. అట్టి నవైశ్వర్యమదమున్నుఁడును కృతాపరాధుఁడును నీ ప్రభావ మెఱుంగని వాఁడును, మూఢ చేతస్కుఁడును గు నా యపరాధంబు సహించి యిట్టి దుర్బుద్ధి మరల నాకు జనింపకుండ ననుగ్రహింపుము. భూమికి భారముగ జనించిన చమూపతుల నణఁపను, నీ చరణారవింద వందారువులను నుద్ధరింపను నీ వీ యవతారమెత్తితివి. భగవంతుఁడవును బురుషరూపుఁడవును మహాత్ముఁ డవును భక్త పాలకుఁడవును వాసుదేవుఁడవు నగు కృష్ణా నీకు నమస్కారంబు. స్వేచ్ఛాగృహీత దేహుఁడవును విశుద్ధజ్ఞానమూర్తి వి సర్వుఁడవు సర్వ కారణుఁడవు సర్వభూతములకు నాత్మయైన వాఁడవు నగు నీకు నమస్కారంబు. న న్నుద్దేశించిన జన్నమునకు బన్న మొనరఁజేసితి నను కోపంబున మంద నంతయు ప్రమందింప జాలవాన గురియించితి. నా ప్రయత్నంబు విఫలంబు చేసి నా మదము నణంచి జాడ్యము దొలఁగించితివి. ఈశ్వరుఁడవు నాత్మగురుఁడ వగు నిన్ను శరణుచొచ్చితిని.

అని యింద్రుండు స్తుతించిన మేఘ గంభీర భాషణంబుల యదుకుల భూషణుం డిట్లనియె. ఇంద్రా! సంపదచే మత్తిల్లిన నీ మదం బణంచి నన్ను స్మరింపఁజేయు పొంటె నీ యజ్ఞము విఘ్న మొనర్చితిని. ఐశ్వర్యమదాంధులు దండపాణి నగు నన్నుఁ గానలేరు. ఎవరి ననుగ్రహింపఁ దలంతు నట్టి వారి సంపద హరింతు. శక్రుఁడా! పోయి రమ్ము. నీకు శుభం బగుఁ గాక. నా శాసనంబుఁ జలుపుచుండుము. అని

నయరహితుండవై హెచ్చరికతో నీయధికారంబుల నిలిచి నా యానతిచొప్పున నడుచుకొనుము. అని పలికిన వాంఛితార్థ ప్రదానంబునఁ బ్రసిద్ధమనస్కయైన కామధేనువు గోపరూపము వహించి తన సంతానమును రక్షించు నధోక్షజునకు మ్రొక్కి యిట్లనియె.

మహాయోగియు విశ్వాత్ముఁడవును విశ్వసంభవుఁడవును నచ్యుతుఁడవును నగు కృష్ణా లోకనాథుఁడవైన నీవే మాకును దిక్కు. లోకనాయకా! నీకంటె నింద్రుఁడు లేఁడు. నీవే మాకుఁ బరమ దైవము. గోవులకు విప్రులకు దేవతలకు సాధువులకు నీవే క్షేమంబు గలిగింపుము. నీవే మాకు నింద్రుఁడ వగుము. భూభార మణఁగింప నీవు పుట్టితివని చెప్పి బ్రహ్మ నిన్నింద్రుఁడుగా నభిషేకింపఁ బ్రేరించెను. కావున నీవు దీని నంగీకరింపుము. అని యాయన యనుమతిం బడసి తనక్షీరంబులచే నభిషేకించెను. ఐరావతం బాకాశ గంగో దకంబును ఘటంబునఁ దెచ్చిన నింద్రుఁడు దేవమాతృప్రేరితుఁడై సురర్షులతోడ దానిచేఁ గృష్ణు నభిషేకించి నీవు గోవిందుఁడ వని కీర్తించె. అప్పటికిఁ దుంబురు నారదాదులు గంధర్వ విద్యాధర సిద్ధ చారణులు వచ్చి లోక పాతకహారంబులైన పూతహరి గీతంబులు పాడిరి. సురాంగన లాడిరి. దేవతాశ్రేష్ఠులు సంతుష్టులై పుష్ప వృష్టిఁ గురియించిరి. త్రిజగంబులు పరమానందంబున నోలలాడుచుండె. ధేనువులు భూమి జిబజిబలాడ క్షీరంబులు గురియించె. నదులు నానారసంబులఁ బ్రవహించె. వృక్షంబులు తేనియల వర్షించె. దున్నకయే సస్యంబులు ఫలించె. పర్వతంబులు రత్నంబుల వెలిఁ బ్రకటించె. స్వభావక్రూరంబులగు మృగంబులు విరోధంబులు మాని చరించె. ఇట్లు కామధేనువు గోవిందుని గోగోపకుల పతిగా నభిషేకించి యనుజ్ఞఁ గొని దేవతలతో దివంబునకుం జనియె.

గీ. తా నొసంగిన యాధిపత్యమున నిలిచి
కన్నుగానక మదమున మిన్ను చూచు

వారి గర్వంబు వారించు వనజనయనుఁ
డప్పు డప్పుడు హితబుద్ధి నలవరించి.

— { కృష్ణుఁడు వరుణలోకఁబున కరిగిన నందుని మరలఁ దెచ్చుట. } —

నందుఁడొక యేకాదశి నిరాహారుండై జనార్దనుఁ బూజించి కళామాత్రము మిగిలిన ద్వాదశియందుఁ బారణ గావించు కుతుకంబుతో నా రాత్రి కాళిందీనీరంబుల స్నానంబు సేయం బోయెను. అసుర వేళయని తెలియక యద్దము రేయిని మజ్జనమాడ జలంబుల దిగిన యతనిని వరుణభృత్యుఁడొక యసురుఁడు కొనిపోయి వరుణున కప్పగించెను. ఇచ్చట నందునితోడ నేటికిఁ బోయిన వా రతనిం గానక రామా కృష్ణా యని మొఱలు పెట్టిరి. శ్రీకృష్ణుండు వరుణుండు తన తండ్రిని గొనిపోయెనని యెఱింగి స్వజనుల కభయప్రదాత యగు విభుండు వరుణునిఁ జూడ నతని యొద్దకుఁ బోయెను. ఇట్లు విచ్చేసిన వాసుదేవుం జూచి వరుణుండు భక్తియుక్తుఁడై పూజించి తద్దర్శనమున కలరి యిట్లనియె.

దేవా! నేను దేహము ధరించిన ఫలము నేఁడు పూర్ణమయ్యెను. ఇప్పుడే నాకోరికలన్నియు నెఱవేఱెను. భవదీయ దర్శనంబునఁ గనులు వాక్కులు సఫలము లయ్యెను. నీపాదభజనమాత్రంబున జనులు సంసారమును దరించుచుండ నిన్ను దర్శించిన నా పుణ్యంబునకు ఫల మెట్టిదని చెప్పఁగలను. జీవలోక జ్ఞానంబునకు సంకోచ వికాసంబులు వివిధంబులుగఁ గలిగించునదియు దేవమనుష్యాది నానావిధ శరీరంబులఁ గల్పించునదియు నగుమాయ యను పేరునైన వినరాని బ్రహ్మంబును బరమాత్మయు భగవంతుఁడ వగు నీకు నమస్కారంబు. కార్యాకార్యంబు లెఱుఁగని మూఢుఁడైన నా భటుఁడు నీ తండ్రిని గొనివచ్చెను. దేవా! క్షమింపుము. నీ తండ్రిని

గొనివచ్చిన కతంబునం గదా నీపాద దర్శనంబు మాకు లభించెను. గోవిందా! వీఁడె నీ తండ్రి. కొనిపొమ్ము. అపరాధులమైన మేము నీ బిడ్డలమగుట నీయనుగ్రహంబున కర్హులము. అనిన హర్షించి నందుని గొని కృష్ణుండు మరలివచ్చి బంధుల నెల్ల సంతోషపెట్టెను. నందుఁడును మున్నెన్నఁడు చూడనిదియుఁ జూడ సాధ్యము కానిదియు నగు వరుణైశ్వర్యమును, నతఁడు కృష్ణునియెడ నణఁగి మణఁగి వర్తించుటయుఁ జూచి విస్మితుఁడై కృష్ణుసన్నిధియందు తన బంధువులతో సర్వమును జెప్పెను.

గీ. మహిని సోపాధిక స్వసంబంధమునను
మమతఁ గావించు మనుజుల మహిత కష్ట
ములను దొలఁగించు నబ్జనాభుండు ప్రీతిఁ
దన్ను వలచుటె తనకుఁ బ్రధానమగుట.

గోపాలకులను శ్రీకృష్ణు సాక్షాజ్జగదీశ్వరుఁ గా భావించి యుత్సుకులై యమ్మహానుభావుఁడు తమ కెట్టిదని తెలియరాని స్వగతిం బొందించునో యని తలంచిరి. అఖిల దర్శనుండైన హరి తనవారి యాలోచన యెఱింగి దయచే వారి సంకల్పంబు నెఱవేర్పఁ గోరి యిట్లు తలంచె. ఈ జనులు దేహాభిమానంబు వహించి యజ్ఞానులై దేహాత్మానుగుణంబైన యా యా భోగంబు లనుభవింపఁ గోరుచు వాని కనుగుణంబైన కార్యంబు లాచరించుచు దేవతిర్యగాది నానావిధ రూపంబులగు గతుల భ్రమించుచు స్వగతిం గాన లేరు. అని తలంచి పరమదయాళుండైన హరి గోపాలురకుఁ దమస్సునకుఁ బరంబైన సత్యంబును జ్ఞానంబును ననంతంబును స్వయంప్రకాశంబును సనాతనంబునునై దేనిని త్రిగుణాత్మక ప్రకృతి సంబంధమును వదలిన మునులు గాంతురో యట్టి తన లోకంబును జూపెను. వారి నెల్ల యమునయందలి బ్రహ్మహ్రదంబున మునుఁగునకుం గొనిపోయి యందు మునుఁగుఁ డని చెప్పి యప్పుడు బ్రహ్మలోకంబుఁ జూపి లేవ

నత్తెను. అక్రూరుండు బ్రహ్మస్వరూపంబు సర్వత్ర దర్శించుటచే నా మడుగున కా పేరు గలిగె. నందాదు లందఱు దానిని జూచి యాశ్చర్యపడి కృష్ణుని నానావిధముల స్తుతించిరి.

## —{ సర్ప రూపధారియగు సుదర్శనుని శాపమోక్షణము. }—

ఒకనాఁడు దేవయాత్రయందలి కౌతూహలముచే గోపాలు రెద్దులు బండ్లపై నంబికా వనంబునకుఁ బయనించిరి. అచ్చట సరస్వతీ నదియందు స్నానమాడి పార్వతీ పరమేశ్వరుల నర్వా విధంబులఁ బూజించి బ్రాహ్మణులకు గోవులను హిరణ్యాభరణములను వస్త్రములను దేనెను జక్కెరపొంగలి లోనగు మధురాన్నంబులను నొసఁగి తాము మాత్రము నదీ జలంబులఁ గ్రోలి నంద సునందకాదు లుపవసించి యా రేయి యా నదీతీరమంద వసించిరి. అర్ధ రాత్ర వేళఁ బెనుఁబా మొకటి యాకఁటిపెల్లున నడవి నడుమనుండి వెడలి వచ్చి నిదురించుచున్న నందునిపైఁ దటాలునఁ బడి మ్రింగ నారంభింప నతం డదరిపడి మేల్కొని విడిపించికొన నేరక కృష్ణా కృష్ణా నాయనా నన్నుఁ బాము మ్రింగుచున్నది. వే వేగ విడిపింప రమ్మని యఱచెను. ఆ యఱపు విని కొఱవులఁ గొని గొల్లవాం డ్రందఱు దానిని బాఁదిరి గాని యది విడువదయ్యె. అప్పుడు కృష్ణుండు వచ్చి పాదతలంబునఁ దన్నిన నది తన పట్టుతోడఁ బ్రాణంబులను వదలి దేహకాంతులు దిక్కుల వెలిఁగింప విద్యాధర రూపంబుఁ గైకొని నమస్కరించి స్తుతించు నతనిం గాంచి పురుషోత్తముఁ డిట్లనియె.

ఆర్యా! నీ వెవ్వఁడవు? దివ్యంబైన తేజంబున వెలుఁగుచున్న వాఁడవు. నీ కట్టి జుగుప్సిత రూపం బెట్లు కలిగె ? అనిన నతఁ డిట్లనియె.

దేవాదిదేవా! నేను సుదర్శనుం డను విద్యాధరుండను. సౌందర్య మదోన్మత్తుండనై విమానంబునఁ జరించుచు నొకనాఁడు

విరూపులైన యంగిరసులఁ జూచి నవ్విన వారు కోపించి యిట్టి రూపంబునఁ బుట్ట శపించిరి. నే నెంతయు వినయంబున వేఁడుకొన నెవ్వడు లోకగురుండైన భగవంతుని పాదంబులు నిన్ను సోఁకు నపుడ శాపమోక్షణం బగు: బొమ్మని యనుగ్రహించిరి. మహాపురుషా! కృష్ణా సర్వలోకేశ్వరేశ్వర! మహాయోగివర్యా! ప్రపన్నుండ నైన నన్ననుగ్రహింపుము. అచ్యుతా నీ దర్శనంబున బ్రాహ్మణ శాపంబున విముక్తుండ నైతి. నీ నామం బుచ్చరించు వారును వినువారును సద్యః పవిత్రు లగుచుండ నిఁక నీపాదతలంబు సోఁకిన నేను బునీతుఁడ నగుట చెప్పనేల? అని యతండు కృష్ణునకుఁ బ్రదక్షిణ నమస్కారంబు లాచరించి యథేచ్ఛ మరిగె. నందుండును గష్టము వలనఁ బాసి మోదించె. ఈ కృష్ణ వైభవంబు విని గోపాలు రెల్ల విస్మితచేతస్కులై నియమంబు సమాప్తంబు గావించి వీడుపట్టుల కరిగిరి.

## —: శంఖచూడ వధ :—

ఒకనాఁ డద్భుత విక్రములైన రామకృష్ణులు మనోహర భంగి శృంగారించుకొని చందనములందిన నిర్మలవస్త్రంబుల ధరించి బద్ధసౌహృదలైన ముదితలు తమ చరిత్రంబు గాన మొనర్చుచుండ గోపీ జన మధ్యంబున రాత్రి వేళఁ జరించుచుండిరి. తారావారంబుల నిశాకరకరజాలంబుల మనోహరంబైన నిశాముఖంబున మల్లికాగంధ బంధురంబును గువలయామోద మంథరంబు నగు మలయగంధ వహంబు మెల్లన వీచుచుండ సర్వభూతంబులకు మనశ్శ్రవణమంగళంబైన గానం బిరువురు నేక కాలంబున నెఱపిరి. ఆ గీతం బాలకించి గోపాల లోలాక్షులు జాఱు చీరలు, వీడు పోకముడులు, కురులనుండి యురలు పూల సరులునై మోహపరవశలై యొడ లెఱుంగక యుండిరి. ఇట్లు రామకృష్ణు లంద మనస్సు నిలిపి వారె తమ దిక్కుగాఁ దలంచు చుండిన యా ప్రమదాజనంబులను గుబేరానుచరుండు శంఖచూ

ఘుండను వాడు బలాత్కారంబుగ గ్రహించి యుత్తరదిశవైపు పరు విడుచుం బోయె. తమ్మిల్లు బలంబున నెత్తికొని పోవు టెఱింగి యాతెఱవలు హా రామా హా కృష్ణా యని మొఱ లిడిరి. రామకృష్ణు లిరువురు రెండు వృక్షంబులం జేతికొని మహావేగంబున నా గుహ్యకాధము నెదురుగంబోవం గాలమృత్యువువలెం బైపడ వచ్చు వారిం గని యతం డప్పడంతులం బుడమిపై దిగవిడిచి ప్రాణంబులు దక్కించుకొను నాశచేం బరువెత్తెను. కృష్ణుండును స్త్రీజన రక్షణార్థంబు బలరాము నిలిపి గుహ్యకు వెంటనంటి యతం డెందెందుం బోవు నందందుం దానును జనుచు నెయిది పట్టుకొని యొక్క పిడికిటి పోటున శిరంబు వ్రక్కలుగాం బొడిచి యతని తల మానికంబు గ్రహించి మరలివచ్చి యాలోల లోచనలు విలోకించుచుండ దాని నన్నకుం గానుకగ సమర్పించె.

—: వృషభాసుర వధ :—

అంత నొక్కనాం డరిష్టుండను రాక్షసుండు వృషభరూపంబు ధరించి ఖురంబుల నేలం ద్రవ్వుచు చెవుడు గొలుప ఱంకెలు వైచుచు దోంకయెత్తి మందకుం గోటవలెం జుట్టియుండు కంచెగోడలను గొమ్ములం గోరాడి కూలం ద్రోయుచు నించుకించుక మూత్ర పురీషంబుల విడుచుచు స్తబ్ధలోచనుండై నిష్ఠురకంఠ రావంబున మనుష్యులను బశువులను భయపెట్టుచుం బ్రసవకాలంబు రాని గర్భిణులకు భయంబున గర్భస్రావంబును గర్భపాతంబును గలిగించుచుం బర్వత శిఖరంబను భ్రాంతి మేఘంబులు తన మూంపు నాశ్రయింప మందకుం జనుదెంచి యల్లకల్లోలంబుం గావించిన గోప గోపాలికలు భయపడిరి.

పశువులు గోకులంబు విడిచి భయంబున నలుదెసలం బరువెత్తె. అందరు కృష్ణా నీవే గతియని వాపోవుచు నాయనను జేరం బాఱిరి. గోవిందుడును భయపడకుండని వారి భయంబు దీర్చి వృషభాసురు కట్టెదు రరిగి యోరి నీచుండా! భయపడెదు బాలుర తోడను

పశువులతోడను నేమి పని? తేరకు వానినేల భయపెట్టెదవు? వీరంబు గలదేని నా యెదుటికి రమ్ము. నీ వంటి దురాత్ముల పీచం బడంప నిదె యున్న వాఁడనని యతనికిఁ గోపంబు జనింప బలికి బాహువు లప్పళించి చెలికాని మూఁపుపైఁ జేయి సాఁచి నిలబడియె. అరిష్టుండును గృష్ణ వాక్యంబులఁ గ్రుద్ధుండై గిట్టలఁ గాలు ద్రవ్వుచు రక్తలోచనుండై కొమ్ము లోరగ వంచి తోఁక యెత్తి ఘుశిల్లున అంకె వైచి పిడుగువడువున యువ్వెనఁ గృష్ణుపై కుఱికె.

అచ్యుతుండును దటాలున వాని రెండు కొమ్ములు పట్టుకొని ఏనుఁ గేనుంగును వెనుకకు నెట్టునట్టులు పదునెనిమిది యడుగుల దూరంబు వెనుకకుఁ ద్రోసికొని పోయి కూలఁద్రోచె. అరిష్టుండును నేలఁబడి చివాలున లేచి మే నెల్ల నీటఁ దడియఁ గ్రోధంబున నొడలెఱుఁగక బిట్టు రోజుచు మరలఁ గృష్ణు గదియఁ బాఱిన దుష్టశిక్షణ దక్షుం డా రాక్షసు రెండు కొమ్ములఁ బట్టుకొని నేలఁ గూలఁ ద్రోసి తడివలువను మెలిక పెట్టి పిండునట్లు త్రిప్పి కొమ్ము లూడఁ బెఱికి వానిచేతన యతని మోఁదెను. వాఁడును నెత్తురు గ్రక్కుచు మూత్రపురీషంబులు వదలుచుఁ గాళ్లు తన్నుకొని గుడ్లు గిరగిర ద్రిప్పి ప్రాణంబులు విడిచె. అంత దేవతలు గోవిందుపైఁ బుష్పవర్షంబు గురియించిరి. దేవతలు స్తుతించిరి. ఈవిధంబున వృషభాసురు వధించి మధుమథనుండు స్వజనులు గీర్తింప బలరామసహితుండై గోపికాలోచన చకోరచంద్రుండై మందం బ్రవేశించె.

## — { కృష్ణుండు గోపికలతోడ వెన్నెలలోఁ గ్రీడించుట. } —

భగవంతుఁడగు కృష్ణుఁడు గోపికలకుఁ దాను జెప్పిన మాట స్మరించి వికసించిన మల్లెలచే *నుల్లంబున కుల్లాసంబు వెల్లిగొలుపు

* యోగమాయ = అచింత్యమైన యచిచ్ఛక్తి పరాశక్తి. (2) యోగ = గోపికా సంయోగ నిమిత్తమైన మాయా = కృప. దానిని విశేషముగ నాశ్రయించి.

నా శరత్కాల రాత్రుల * జూచి యోగమాయ నాశ్రయించి క్రీడింపఁ దలంచెను. ఆ సమయంబున దీర్ఘకాలం బెడఁ బాసియుండి యరుదెంచిన పతి చిరవిరహిణియైన తన ప్రియురాలిని ననురాగమునఁ జేరునట్లు చంద్రుఁడు తన సుఖకరములైన కరముల నుదయరాగంబను కుంకుమ పూఁతచే నింద్రదిశాంగనా ముఖంబు నలంకరించుచు నోషధులకు మనుష్యులకుఁ దాపం బణంచుచు నుదయించె. నవకుంకుమారుణంబై రమాననంబుంబోలి కుముదంబులకు ముదం బాపాదించు నఖండ చంద్రమండలంబును దత్కోమల కిరణ రమణీయంబైన వనంబును జూచి శ్రీకృష్ణుండు కలంబై ♦ వామలోచనా మనోహరంబైన గానంబు నెరపె. మన్మథోద్దీపకంబైన యా గీతంబు విని ప్రేపల్లెనున్న వల్లవ పల్లవాధరలు యదువల్లభుచే నాకర్షింపఁబడిన మనస్సులు గలవారై నడచు వేగంబునఁ గదలు కమ్మలు తళతళ గాంతు లీన నొకరి నొకరు హెచ్చరింపక కృష్ణునొద్దకుఁ బయనించి వచ్చిరి సముత్సుకలై పాలు పిదుకువారు పిదుకకయుఁ, బిది

*మార్గశిరంబున గోపికా వస్త్రాపహరణము. ఇది మఱుసటి సంవత్సరమున నాశ్వయుజ కార్తీకమాసముల వృత్తాంతము. రమా = రాధ.

♦కలంబై = వామలోచనా మనోహరంబై = దీనియందుఁ గ్లీం బీజాక్షరము గలదు. ఇది కామబీజము. మన్మథోద్దీపకము.

కలంబు = అస్పష్టము మధురమునైన ధ్వని; అస్పష్ట మగుటచేఁ దనయందుఁ ప్రేమగలిగిన వారు మాత్రము తమతమ పేరుపెట్టి పిలుచుచున్నాఁడని తోఁచునట్లును తదితరుల కది యేమైనది తెలియకుండునట్లును, "నామసమేతం కృతసంకేతం వాదయతే మృదువేణుమ్" అని జయదేవుఁడు. మధురము గావుననే మనస్సుల నాకర్షింపఁ గలిగెను.

వామలోచనా మనోహరము = వామలోచనలు కుటిల దృష్టి గలవారు. అనఁగాఁ దాను వాగ్దానము చేసిన ప్రకారము నెఱవేర్పక పోయెఁగదా కృష్ణుఁ డెంత వంచకుఁడని తలంచుచుండిన స్త్రీలకు మనోహరము. సర్వేంద్రియ వ్యాపారమూలమైన మనస్సును హరించుటచే వారికట్టి తలంపు తొలఁగెను.

కినపాలు ప్రొయ్యిమీఁద నుంచినవారు దింపకయుఁ, బాయసంబుఁ గాఁచుచున్నవారు కాఁపకయుఁ, బతిసుతులకు వడ్డించువారు వడ్డింపకయు, బిడ్డలకుఁ బాలుపోయువారు పోయకయుఁ, బతిశుశ్రూష చేయువారు చేయకయు, భుజించువారు భుజింపకయు, వడ్డించుకొనినవారు వదలియు, గంధమలఁదుకొనువార లలఁదుకొనకయు, నొడలు కడుగుకొనువారు కడుగుకొనకయుఁ; గాటుక పెట్టుకొనువారు పెట్టుకొనకయుఁ, జీరలు సొమ్ములు ధరించువారు వ్యత్యస్తముగ ధరించియు, నొంటి కంటి కాటుకతోను, నెగఁదీసిన యొంటిచంటి రవికతోను, సంగిలిచేతులతోను, నములుచున్న యన్నముతోను, సగము చేతిగంధపుఁ బూఁతతోను, గరిఁటెలతో విస్తళ్లతోఁ దడిమొదళ్లతోఁ, దల క్రిందుగఁ గట్టిన చీరలతో, నొడ్డాణపు మెడలతో, సరముల నడుములతో, బావిలీల ముక్కులతో, బులాకి చెవులతో, నందెల చేతులతోఁ, గాసెకొంగు పైటలతోఁ, గృష్ణునొద్దకుఁ బరువిడి వచ్చిరి * పతులు సుతులు తండ్రులు నన్నలు నెవ్వరు వారించినను గారించినను, నిలువక మరలక సడలక బడలక తిరిగిచూడక గోవిందునిచే నాకర్షింపఁబడిన డెందంబులు గల యా మందగమన లమందయానంబున

---

*వచ్చిరి = పోయిరని చెప్పవలసియుండఁగా వచ్చిరని శుకయోగి చెప్పెను. శుకయోగి తా నప్పుడు కృష్ణునియొద్ద నున్నట్లెంచి చెప్పెను. గోపికలకును స్వస్థానము కృష్ణసాన్నిధ్యము, పరస్థానము మందయందలి గృహములు, కావున బయటఁ బోయినవారు వారియిండ్లకు వచ్చినట్టని భావము.

వేణువు = అర్ధాంగుళాంతరోన్మానం తారాది వివరాష్టకం, తతోంగుళాంతరే యత్ర ముఖరంధ్రం తథాంగుళం; శిరోవేదాంగుళం పుచ్ఛం త్ర్యంగుళం సా తు వంశికా, నవరంధ్రా స్మృతా సప్తదశాంగుళమితా బుధైః। దశాంగుళాంతరాస్స్యుశ్చే త్తారాన్తర ముఖరంధ్రయోః। మహానందా మోహినీ చ యా తు స్యాద్ద్వాదశాంగుళా। ఆకర్షణీ సాపి వేణూ రత్న స్వర్ణ స్త్రిధోదితా" అను శాస్త్రవాక్యమునుబట్టి కృష్ణుని వేణువు మనస్సుల నాకర్షించు హైమి యని యెఱుఁగవలయు.

వచ్చిరి. * అంతర్గృహంబునఁ బతులచే నిరుద్ధలై పోవ వలను పడని లలనలు కృష్ణుని భావంబునందె నిలిపి కన్నులు మోడ్చి తద్ధ్యానయుక్తలై సహింపరాని ప్రియతమ విరహాతీవ్రతాపంబునఁ బ్రారబ్ధమెల్ల నణంచి ధ్యానప్రాప్తుండైన నచ్యుతు నాలింగనంబుఁ గావించి యమంగళంబు లెల్ల క్షయింపఁ జేసిరి. ♦ కృష్ణుని గాంతభావంబుతోఁ గూడియు

---

* శ్రీకృష్ణుని మురళీ శబ్దము వినఁగానే యాయనయందే యాసక్తిగల మనస్సులుగల వారికిఁ బతిగమందే త్రివర్గమునకు సంబంధించిన కర్మములు విడిచి పోవునని జ్ఞాపకార్థమిది చెప్పఁబడెను. భగవంతుని యందలి యనురాగాతిశయముచేఁ గొందఱు వ్యవహారిక కర్మములను గూడ విడుతురని తెలియవలయును. ఇట్టివారు గృహములను బంధువులను నత్యంత ప్రీతిపాత్రములగు చంటిబిడ్డలను దైహికములను విడుతురు. గోపికలు శృంగారింపఁగొనుట శ్రీకృష్ణుని సంతుష్టికై. ఆయనయందు మనస్సునిలిపి చేయు కార్యములు వ్యత్యస్తముగఁ జేసినను ఫలము తప్పదు. శ్రీకృష్ణుఁడు పరిహసించిన పిమ్మట వీరు చీరలు రవికలు చక్కఁగాఁ దొడుగుకొని సొమ్ములు చక్కఁ దిద్దుకొనిరని తెలియవలయును. ఇందు విభ్రమానుభావము వర్ణింపఁబడెను. పాఠకులకిందొక సందేహము నయింపఁ గలదు. గోపికలు మగఁడు లోనగువారు వారించినను నిలుగక పోయిరని చెప్పఁబడినది. ఇంటింట నొకరిద్దఱు స్త్రీలను మగవారు వారింపఁ జాలక పోయిరా? అట్లు పోయిరేని వారివెంటనే మగవారేల వారిని వెదకఁ బోలేదు? ఒకవేళఁ గోపముచేఁ బోలేదని తలఁచిన మరల వారి నెట్లు బిడ్డలలోనికి రానిచ్చి వారితో మరల సంసారముచేయ నీయకొనిరి. వారి కంతటికిఁ గృష్ణునిపై నేల కోపము రాలేదు? సమాధానము:- పురుషులు తొలుత స్త్రీలను నడ్డగించినను విడవఁ గృష్ణుఁడే వీరిని ధిక్కొట్టి పంపివేయును అప్పుడు గాని వీరికి బుద్ధిరాదు కావున బోనిమ్మని యెక్కువ పట్టుదలతో వారించిన వారుకారు. ఆవలఁ గొంచెము కాలములోనే కృష్ణుఁడు యోగమాయాబలంబున సృష్టించిపంపిన గోపికల ప్రతిరూపములనుజూచి తమ యాఁడువాండ్రను దాము తలఁచి నట్లు కృష్ణుండు బుద్ధిచెప్పి పంపెనని యెంచి వెదకఁబోవక యూరకుండిరి. కావుననే గోపిక లుదయమున వచ్చినపుడు వారి మీఁదఁగాని కృష్ణుని మీఁదఁగాని గోపాలు రలుగరైరని ముందు చెప్పఁబడును.

♦ అంతర్గృహంబున = గోపికలు నలువిధములు. (1) గోలోకములందుండి కృష్ణునితోడ నవతరించిన రాధ మొదలగు నిత్యసిద్ధలు. (2) రామావతారంబున ఋషులుగానుండి యప్పుడాయనను గౌఁగిలింప వలనుపడక యిప్పుడు గోపికలుగాఁ బుట్టిన

నప్పుడే బంధనిర్ముక్తలై గుణమయ దేహంబును వదలి యా పర
మాత్మునందుఁ గలసిరి. అనినఁ బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె.

యోగీంద్రా! గోపికలు కృష్ణునిఁ గాంతునిగాఁ దలంచిరి గాని
పరబ్రహ్మమని ధ్యానింపరైరి కదా. గుణాసక్తబుద్ధులగు వారికెట్లు గుణ
ప్రవాహంబు శాంతించెననిన శుకుం డిట్లనియె. ♦

రాజా! శిశుపాలుఁడు భగవంతుని గలసెనని చెప్పినప్పుడే
యీ విషయము నీ కెఱిగించితిని. విరోధించి దూషించిన శిశు
పాలుఁడే ముక్తిఁ జెందఁగా హరిప్రియులు ముక్తి జెందుట చెప్పనేల?
నరులకు మోక్షమిచ్చుటకే గదా భగవంతుఁడు మానవ స్వరూపము
ధరించెను. అవ్యక్తుండును నప్రమేయుండును నిర్గుణుండును గుణా
త్ముండును నగు భగవంతుని గామముచేఁగాని క్రోధముచేఁగాని భయ
ముచేఁగాని స్నేహముచేఁగాని సౌహృదముచేఁ గాని నిత్యము దలంచు
వారు తన్మయత్వంబు నొందుదురు. అట్లుండ నధోక్షజుండును నజుం
డును యోగీశ్వరుండును భగవంతుఁడును నగు కృష్ణుండు స్థావ

---

వారు. (3) సాధనసిద్ధలు, (4) దేవకన్యలు. ఇందు రెండు మూఁడు తెగలవారు కేవల
మనుష్యస్త్రీలు. వీరిలోఁ గొందఱు పతులు పడుకటింటిలోఁ దలుపుమూసి యడ్డము
నిలుచుటచేఁ గృష్ణునొద్దకుఁ బోఁజాలరైరి. తక్కినవారికిఁ బోల వీరికి భక్తిపక్వము గాలేదు
కావునఁ దక్కినపతులకుఁ గలిగినయపేక్ష తమ పతులకుఁ గలిగించునంత భక్తిప్రభావము
వీరియందు లేదయ్యె.

♦ శ్రీకృష్ణుఁడు సాక్షాత్పరబ్రహ్మమని శుకయోగి పెక్కుతడవ లింతకుముందే
చెప్పెను గావున శ్రీకృష్ణుఁడు మనుష్యమాత్రుఁడని రాజు తలఁచి ప్రశ్నించె ననుట
యసంగతము. శ్రీకృష్ణుఁడు ప్రత్యగభిన్న బ్రహ్మముగ గోపికలకు గోచరింపలేదు గదా.
వారికెట్లు మోక్షము లభించె? జీవితకాలమంతయు శ్రీకృష్ణుఁడు కాంతుఁడని తలంచు
వారికిఁ గడపటఁ జ్ఞానోదయమెట్లయ్యెనను జ్ఞానవాదుల సందేహమును, పరమాత్మ
నందుఁ గలసి రనుటచే గోపికలకు బ్రహ్మోపాసకులవలె సాయుజ్యమెట్లు గలిగెనను
భక్తుల సందేహమును నివారింప రాజీ ప్రశ్న యడిగెను.

గుణాసక్తబుద్ధులు = కృష్ణగుణములందే బద్ధమైన ప్రేమచే నిండియుండువారు.

రంబులకును మోక్షమిచ్చుచుండ గోపికల కిచ్చుట నీవు వింతగాఁ దలంపరాదు.

ఆ. నయముచేతనైన భయముచేనైనను
గోపముననో కామ తాపముననో
భక్తినైనఁ గులమురక్తిచేనైనను
హరి సదా స్మరింప నబ్బు ముక్తి.

రుక్మిణి—రాజు మంచి ప్రశ్నమే యడిగినాఁడు. దానికి శుకయోగి చెప్పిన ప్రత్యుత్తరము నాకు బోధపడలేదు. విశదముగా నాకుఁ దెలియునట్లు చెప్పుము. ఇంతకుముందు నీవు భగవంతుఁ డన్నిటియందు న్నాఁడు గనుక భగవంతుఁడను భక్తితో దేనిని బూజించినను మనకోర్కెలు భగవంతుఁడు దీర్చునని చెప్పితివి. అది న్యాయ్యమే. ఇప్పుడు గోపికలు కృష్ణుని గామముచేఁ గాంతుఁడని తలంచిరిగాని భగవంతుఁడని భక్తి సేయ లేదుగదా? మన మనస్సెమిగాఁ దలఁచునో యాఫలమే కదా రావలయును! అట్లుండ గోపికలకు జారత్వమువలనఁ బాపము వచ్చుటకు మాఱుగా మోక్ష మెట్లువచ్చెను? ముందు శిశుపాలుని గుఱించి చెప్పినపు డీవిషయము తాను జెప్పినట్లు ముని చెప్పెనే యేమి చెప్పెను? ఈసందేహము నన్ను బాధించుచున్నది. తెలియఁజెప్పుము.

తండ్రి—విషయము మీకు సులభముగ బోధపడునది గాదు. అయినను నాకు సాధ్యమైనంతవఱకు మీకుఁ దెలియఁ జెప్పెదను. ఇదివఱకు దీపము వంటిది మనలోని యాత్మయని సెమ్మె వంటిది మనదేహమని చెప్పితినిగదా. అది మఱచితివా?

రుక్మిణి—జ్ఞప్తియందున్నది.

తండ్రి—సంతోషము. ఆత్మయనునది యనాత్మ (దేహము) యనునది రెండును గలసియే లోకములోఁ బ్రాణముగలట్టియుఁ బ్రాణము

లే నట్టియుఁ బ్రతిపదార్థ మేర్పడినదని మఱవక నే నడిగిన దానికిఁ బ్రత్యుత్తరమిమ్ము. నిన్ను నరైనఁ దిట్టిరనుకో నీకు గోపము వచ్చునుగదా? నన్నుఁ దిట్టిరని గ్రహించునది యేది? ఆత్మయా? దేహమా? కోపించునది యెవరు? నీ దేహమా? ఆత్మయా?

రుక్మిణి—ఆత్మకే తిట్టుతగిలెను ఆత్మయే కోపించెను.

తండ్రి—ఆత్మకుఁ గన్నులు ముక్కులు చెవులు లోనైన యింద్రియ యములు లేవు. కామక్రోధము మొదలైన గుణములు లేవు. ఆత్మ కేవల జ్ఞానానంద స్వరూపము. ఇట్లు నీ చెవిని బడకుండిన నీకుఁ గోపమువచ్చునా? అట్టులే కదా నీ యాత్మకును. కాబట్టి తిట్టినను దీవించినను నాత్మకుఁ దగులదు.

రుక్మిణి—అట్లైన దేహమే తిట్టుపడును. అదియే కోపించును.

తండ్రి—దేహము జడపదార్థముకదా. ఒక రాతిని నీవుతిట్టిన నీవు తిట్టితివని రాయి గ్రహించునా? నీ మీఁదఁ గోపించునా? ప్రాణము పోయినతరువాత దేహమును దిట్టిన నది కోపించునా?

రుక్మిణి—కోపింపదు. అట్లైన రెండు చేరినదానికి.

తండ్రి—అదెట్లు? ఆత్మ కోపింపజాలక పోయెను. అనాత్మ కోపింపఁ జాలకపోయెను. ఇఁక నవిరెండు చేరినమాత్ర మెట్లు కోపింపఁ గలవు. ఒక టొకటి కలసిన రెండగును గాని సున్న సున్న గలసిన రెం డగునా?

రుక్మిణి—కాదు.

తండ్రి—నీ యందాత్మ యనాత్మ రెండును గలసి యున్నవని నిశ్చయ జ్ఞానము కుదిరిన దనుకో. అప్పుడు నిన్నెవ్వరైన దూషించిన నీ వేమనుకొందువు.

రుక్మిణి—ఆత్మయగు నేను జ్ఞానానంద స్వరూపమను గనుక నాకుఁ దగులదు. అనాత్మ జడము గనుక నా దేహమునకును దగుల దనుకొందును.

తండ్రి—అప్పుడు నీకుఁ గోపమువచ్చునా?

రుక్మిణి—నన్నుఁ దిట్టినారనుకొనినఁ గదా నాకుఁ గోపము వచ్చును. నన్నుఁ దిట్టలేదనుకొనినఁ గోప మేల వచ్చును? రాదు.

తండ్రి—అప్పుడు నీవు పరులను హింసింతువా?

రుక్మిణి—హింసింపను.

తండ్రి—సత్యము చెప్పితివి. ఆ ప్రకారము తిట్టినను దీవించినను నుబ్బుగాని కోపముగాని లేక కష్టదుఃఖములు వచ్చిన శోక సంతోషములు లేక సర్వకాలములందు మనస్సు ప్రసన్నముగ నుంచుకొనువాఁ డుత్తముఁడా? కాక గాలికి గాలిపటమువలె నిలుకడలేక కష్టమునకు దుఃఖించుచు సుఖమునకు సంతోష పడుచు మనస్సు స్థిమితముగ లేక యల్లాడుచుండువాఁ డుత్తముఁడా?

రుక్మిణి—మనస్సు స్థిమితముగా నుంచుకొనువారే యుత్తములు. అది నిజమేకాని నన్నెవ్వరైనఁ దిట్టిన నాకుఁగోపము వచ్చుచున్నదే. అదెట్లు. ఆత్మకు నా దేహమునకుఁ గూడఁ దిట్లు తగులనప్పుడు నాకుఁ గోప మేల రావలయును?

తండ్రి—నేను, నాది, యను రెండుభావములు దానికిఁ గారణము. ఆత్మస్వభావము జ్ఞానమనుట మఱవక నేను జెప్పునది గ్రహింపుము. నీ వీ దినము వంటచేసితి వనుకొ. ఈ దినము వంట చేసినవా రెవరని యడిగిన నేనని చెప్పుదువు గదా? నే ననఁగా నెవరు? నేను అనుజ్ఞానముగల యాత్మయా? జ్ఞానము లేని దేహమా? వంట చేసినది దేహము. 'నేను' అను జ్ఞానమో యాత్మది. గనుక వాస్తవ మేమనఁగా. ఆత్మ తాను వేఱు దేహము వేఱను సత్యమును మఱచి యజ్ఞానముచే దేహమే తాననుకొని నేను వంటచేసితిని నేను నడచితిని నేను నిద్ర పోయితిని నేను భుజించితిని, నేను హింసించితిని అని తా

నేకార్యమును జేయుచుండినను దానే సర్వకార్యములు చేయు
నట్లు తలఁచుచు దేహమునకు మానమో యవమానమో
కలిగినఁ దనకుఁ గలిగినట్లెంచుచు దేహమునకు గంధము
పూసినఁ దాను బూసికొన్నట్లును దేహము సొమ్ములు పెట్టు
కొనినఁ దాను బెట్టుకొనునట్లు తలఁచుచుండును. ఈ యజ్ఞా
నముచేతనే యీ చీర నాది యీ యిల్లునాది యని తలఁతువు.
చీర నాది యను నపుడు చీర వేఱనియు నీవు వేఱనియు నొక
ప్రయోజనమునకై చీర ధరించితివనియు నట్లు తలంతువో
యట్లే నా దేహ మనునపుడును దలంపవలయును. ఆఁకలి
దప్పులు, కామక్రోధములు, సుఖదుఃఖములు, చలిఁ వేఁడు
ములు లోనైనవన్నియు దేహమునకు సంబంధించినవే. దేహ
మే యాత్మ యనుకొనుట నీకుఁ గోపము కలుగుటకుఁ గార
ణము. ఈ విషయము మఱియొక సారి విపులముఁగ విచారింప
వచ్చునుగాని దేహమే తానని భ్రమించు నజ్ఞాని శ్రేష్ఠుఁడా?
దేహము వేఱు తాను వేఱు దేహగుణము వేఱు తన గుణము
వేఱను వివేకి శ్రేష్ఠుఁడా?

రుక్మిణి—దేహము వేఱు తాను వేఱను కొనువాఁడే శ్రేష్ఠుఁడు.

తండ్రి—నేను బుణ్యముగాని పాపముగాని చేసిన దాని ఫలము నీ
వనుభవింతువా?

రుక్మిణి—సింగి బిడ్డ కనిన సింగఁడు మందు తిన్నట్టా యేమి? నీవు చేసిన
పుణ్యపాపముల ఫలము నే నేల యనుభవింతును?

తండ్రి—అట్టులే దేహము పుణ్యమో పాపమో చేసినయెడల
వానిఫల మాత్మ యనుభవించునా?

రుక్మిణి—అనుభవింపదు.

తండ్రి—దేహమే నేనని తలంచినయెడల?

రుక్మిణి—ఆత్మయనుభవించును.

తండ్రి— దొమ్మరవాఁడు కత్తిమీఁద సాముచేయునని మనము చేయ వచ్చునా?

రుక్మిణి— కూడదు. ఆ విద్యను వాఁడు చక్కఁగ నభ్యసించి తాఁను దప్పులు తెలిసికొనెను. కావున నపాయము కలుగకుండ నట్లు మెలఁకువతో సాము చేయును.

తండ్రి— అట్లులే యాత్మజ్ఞానము కలవాఁడు చేయు సాహసకార్యము లాత్మజ్ఞానము లేనివాఁడు చేయరాదు. ఏలనఁ దాను జేయు కార్యముల ఫలము తనకుఁ దగులకుండఁ దప్పించుకొను మార్గ మతనికిఁ దెలియును. మనకుఁ దెలియదు గనుక వానివలె మనము ప్రవర్తించినఁ జెడుదుము. నీతిమతాచారములు వ్రతములు జపములు తపములు యోగములు మొదలైన వన్నియు నాత్మజ్ఞానము కలుగుటకు సాధనములు. ఆత్మజ్ఞానము దృఢపడిన యోగికి వీని యనుష్ఠానములతోఁ బనిలేదు. పుణ్యపాపములుచేసి వానిఫలము ననుభవించుటకై తగిన శరీర మెత్తిన మనుష్యులకే యాత్మజ్ఞానముకలిగి కోరిక లుడిగిన తరువాత సామాన్య లౌకిక ధర్మము లనుష్ఠింపఁ బనిలేకుండఁగాఁ గర్మబద్ధులవలెఁ బుణ్యపాప ఫలానుభవమునకుఁ గాక స్వేచ్ఛగా లోకవిడంబనార్థము జనించిన పరమాత్మకు భగవంతునకు జగదీశ్వరునకు నవాప్తసర్వకామునకు నపహతపాపునకు మన ధర్మము లనుష్ఠింపక పోయినంత మాత్రమునఁ బాపమువచ్చునా? రోగి తినఁగూడని పదార్థము లారోగ్య వంతుఁడు తినరాదా? అట్లే కర్మబద్ధుల నియమము లకర్మబద్ధులను బాధింపవు.

శిశుపాలుని వృత్తాంతమిప్పుడు చెప్పెద వినుము. ధర్మరాజు రాజసూయము చేయుచుండఁగా నా సభయందు శిశుపాలుఁడను రాజొకఁ డుండెను. పుట్టి బుద్ధియెఱింగినది మొదలు వీనికి సర్వకాల సర్వావస్థలయందు వీనికిఁ గృష్ణునియెడ ద్వేషబుద్ధియే. ఎప్పుడు

కృష్ణుని జంపుదునా యెవ్వఁడు కృష్ణు నవమానపఱుతునా యని యెల్ల వేళ నదే వానికిఁ గలవరింత. రాజులందఱు కూర్చుండియుండ నా సభలో ధర్మరాజు కృష్ణుని మొదట సన్మానించెను. అది చూచి సహింపక శిశుపాలుఁడు కృష్ణుని దననోరికి వచ్చినట్లెల్ల దూషించెను. అప్పుడు కృష్ణుఁడు చక్రధారచే నతని శిరమును ఖండించెను. ఇట్లు మరణించిన వానిశరీరము నందుండి తేజస్సు వెలువడి కృష్ణునియందుఁ బ్రవేశించెను. ఈ విధముగ శిశుపాలునకు ముక్తి రాఁగా ధర్మరాజు నారదుని జూచి మునీంద్రా! శిశుపాలుఁడు సర్వదా కృష్ణుని నిందించుచునే యుండెను గాని భక్తితో ధ్యానించిన వాఁడుగాఁడే వానికెట్లుముక్తి కలిగెను? అని యడిగిన నారదుఁ డిట్లనియె.

రాజా! నిందాస్తుతి తిరస్కార సత్కారములకు దేహము విషయమగుఁ గాని యాత్మగాదు. ఆత్మకు ననాత్మకు భేదమెఱుంగని మూఢులు దేహమే యాత్మయని తలంచి దేహసంబంధమైన వన్నియు నేను నాదియను నభిమానముచే నాత్మయం దారోపించుకొని "నేను గొట్టఁబడితిని నేను దిట్టఁబడితిని. నేను గౌరవింపఁబడితిని గావున నేను బదులు గొట్టుదును, బదులుతిట్టుదును, బదులు గౌరవింతును" అని తలంతురు. అట్టి యభిమాన మఖిలాత్ముఁడై కేవలుఁడైన భగవంతునకు లేవు. కాఁబట్టి తన్ను నిందించిన వారినైన హింసింపఁడు. మఱి సర్వదా తన్నుఁదలంచుచుఁ దనయందే మనసునిల్పిన కారణముచే నట్టివారిని దనలోఁ గలుపు కొనును. సర్వకాల సర్వావస్థల నీ చైద్యుఁడు ద్వేషబుద్ధిచేనైనను గృష్ణునియందే మనస్సునిలిపి తన్మూర్తినే భావించుచుండిన వాఁడగుటచేఁ గృష్ణునియందే లీనమయ్యెను.

ఆ. అలుకనైనఁ జెలిమినైనఁ గామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలితలఁప నఖిలాత్ముఁ డగుహరిఁ
జేరవచ్చు వేఱు సేయఁడతఁడు. భాగ.

కం. వైరాను బంధనంబునఁ
జేరిన చందమున విష్ణుఁ జిరతర భక్తిం
జేరఁగ రాదని తోఁచెను
నారాయణభక్తియుక్తి నా చిత్తమునన్. భాగ.

కం. కీటకముఁదెచ్చి భ్రమరము
పాటవమున బంభ్రమింప భ్రాంతంబైత
త్కీటకము భ్రమరరూపముఁ
బాటించి వహించుఁగాదె భయయోగమునన్. భాగ.

వ. ఇవ్విధంబున

శా. కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్
బ్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రింగంటిమెల్లైనను। ద్ధ్యాను
ధ్యాన గరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా! భాగ.

కామక్రోధాదులు ప్రకృతిబద్ధునిఁ బీడించునుగాని ప్రకృతి కతీతుఁడై ప్రకృతిని స్వవశమందుంచుకొనిన భగవంతుని నేమియుఁ జేయం జాలవు. ఆయన హేయగుణహీనుఁడు కల్యాణగుణ సహితుఁడు కావున నాయనయందుఁ గామక్రోధాది గుణములు లేవు. దూషించి తలఁచినను భూషించి తలఁచినను భగవంతునిఁ జేరఁబోవు నది మనస్సొకటియే కాని దూషణము కాదు భూషణము కాదు. సర్వదయామయుఁడు జగత్పిత జగన్మాత జగద్గురు జగత్సుహృత్తు, జగన్మిత్రుఁడు, జగద్గురువు నగు భగవంతుఁడు తన్నుఁ దలఁచినదానికై సంతోషించును గాని దానికిఁ గారణమేమి? యని యారయుఁడు. తన్ను దూషించినఁవారిని నరకమునఁ దోయుచు భూషించినవారిని స్వర్గమునకుఁ బంపుచునుండిన నాయనకుఁ గామక్రోధ దాసుఁడే కదా యగు. ఆయనకు మనకు భేదమేమి? అట్టివాఁడు ప్రేమస్వరూపుఁడగు భగవంతుఁడగునా? భగవంతుని ప్రబోధించి యాకర్షించునది మనస్సు

గాని కామక్రోధాదులుగావు. కావున నెవ్వ రెట్లుతలంచినను నాయన సంతోషించును. లోకులు తన్నెట్లుతలంచెదరో వారివిషయమునఁ దానట్లే తలంచును. విరోధిగాఁ నెంచువారికి విరోధిగాఁ దోఁచును. పుత్రుఁడని యెంచువారికిఁ బుత్రుండుగను స్వామిగా నెంచువారికి స్వామిగను, భర్తగ నెంచుకొనువారికి భర్తగను, ప్రియుఁడుగ నెంచు వారికి ప్రియుఁడుగను వర్తించును. గోపికలవిషయమున వారిది మన స్సున నుంచుకొనవలయును.

అని నారదుఁడు చెప్పెనని శుకుఁడు పరీక్షిత్తునకుఁ జెప్పెను. ఈశిశుపాలుని వృత్తాంతము ముందుచెప్పెదను. ఇఁక గోపికల గుఱించి చెప్పెదను. పూతనను వధించినది మొదలు గోవర్ధనపర్వత మెత్తు నంతవఱకుఁ గృష్ణలీలల గుఱించి గోపికలు గోపకులు ననుకొన్న మాటలు వింటివి గదా. గోపికలు గృష్ణుఁడు సామాన్యపు గొల్లపిల్లవాడని యభిప్రాయపడిరా భగవంతుఁడని యభిప్రాయపడిరా?

రుక్మిణి—భగవంతుఁడనియే నమ్మిరి.

తండ్రి—కామముచేతనే కృష్ణునిఁ దలఁచినను వారు మనుష్యరూపము ధరించిన భగవంతుని దలఁచుచున్నామని తలంచి యుందురా లేక యెవఁడో యొక గొల్లపిల్లవానిఁ దలఁచుచున్నామని తలంచియుందురా?

రుక్మిణి—భగవంతుఁడే గొల్లపిల్లవాఁ డయినాడని తలంచియుందురు.

తండ్రి—కాఁబట్టి కృష్ణుఁడు భగవంతుఁ డనుజ్ఞానము కలదు గదా.

రుక్మిణి—కలదు గాని వారు కామసుఖముఁ గోరిరి గాని మోక్షముఁ గోరలేదే వారి కెట్లుమోక్షము వచ్చును?

తండ్రి—దానికిఁ గారణము చెప్పెదను విను. నిప్పు కణికను నీవు కెంపను కొని త్రొక్కితివనుకో యేమగును? కాలుచుఱ్ఱు మని కాలును. నీవు కెంపనుకొనినంత వస్తుస్వభావము మాఱలేదు. అట్టులే నీవు నిప్పనుకొని కెంపును చిదుగులోఁ బెట్టి యూదిన

నిప్పుగునా? కాదు గదా! అప్పుడును వస్తుస్వభావము మాఱదు గదా. నీవు వస్తుతత్త్వము తెలియక భోజ్యమనుకొని నేపాళమో విషమో తింటివనుకో. వానిగుణ మవి చూపక మానునా. అట్టులే యమృతమును త్రాపితివనుకో దానిగుణ మది చూపక విడుచునా? కాఁబట్టి వస్తు శక్తి బుద్ధినపేక్షింపదు. నీవే మిగాఁ దలఁచినను వస్తువు తనగుణమును జూపును. ఔషధములే దృష్టాంతము. అట్టులే భగవంతునకుఁ దనయందు నిలుకడగ మనస్సు నిలిపిన వారికి మోక్షమిచ్చుట స్వభావము. కాఁబట్టి గదా కృష్ణుఁడు మనుష్య మాత్రుఁడని తలఁచిన శిశుపాలుఁడు సంతతధ్యానముచే ముక్తి చెందెను. అట్టులే గోపికలును గృష్ణుఁడు మనుష్యమాత్రుడఁని పలచియుండినను వారికి మోక్షమబ్బి యుండును. అటుండ వారికిఁ గృష్ణుఁడు భగవంతుఁడను జ్ఞానము కూడఁగలదు. అట్టి జ్ఞానముకలిగి యాయనను బొందఁ గోరి సర్వము విరక్తిచేఁ ద్యజించి తదేకధ్యాననిష్ఠలైన గోపికలకు మోక్షము నచ్చుటకు సందేహమేమిః? మహాజ్ఞానులు యోగులు నింతకంటె నెక్కువ చేయున దేమైనఁ గలదా? లేదు.

ఆ. తనువుమనువు విడిచి తనయులఁ జుట్టాల
నాలి విడిచి సంపదాళి విడిచి
నన్న కాని యన్య మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్టి వారి నైన. భాగ.

అని భగవద్వాక్యము కలదు గదా.

గోపికలు మోక్షము గోరలేదంటివి. సత్యము. అట్లు గోరకుండుట యుత్తమోత్తను భక్తి లక్షణము. భగవంతుని సర్వదా ధ్యానించుట మనవంతు. మన యోగక్షేమ భారము వహించుటాయన వంతు.

రుక్మిణి—పతిపుత్రాదుల యందును వాస్తవముగ బ్రహ్మత్వము కలదు గదా. వారిని భజించిన మోక్షము లేదు కదా. అట్లులే కృష్ణునియందు బ్రహ్మబుద్ధి లేకుండఁగాఁ దత్సాంగత్యమున నెట్లు మోక్షము రాఁగలదు?

తండ్రి—పతిపుత్రాదులయందలి జీవుని బ్రహ్మత్వము కప్పఁబడి ప్రకాశింపకయున్నది. తాను బ్రహ్మస్వరూపమను జ్ఞానమజ్ఞానము చేఁ గప్పఁబడియుండుటచే నేను మనుష్యుఁడను. నేను బురుషుడనని తలంచుచున్నాఁడు కాని బ్రహ్మస్వరూపమని తలఁచుట లేదు. ఇట్లు సంకుచిత జ్ఞానముగల జీవుఁడు మోక్షదాత యెట్లు కాఁగలఁడు? వాస్తవముగ నొకఁడు లక్షాధికారి యయ్యుఁ దానంటి ధనికుఁడనని తెలియక దరిద్రుఁడనని వగచుచుండు వాఁడు యాచకుల కేమి యియ్యఁగలఁడు? కావున బ్రహ్మభావముతో భజింపఁబడినను బతిసుతాదులు మోక్షదాతలు కాఁజాలరు. ఇఁకఁ గృష్ణుండు హృషీకేశుండు కావున నాయన జ్ఞానము సంకుచితముగాదు. ఆయనయందు నే నే పరమాత్మను సర్వజ్ఞుఁడను సర్వశక్తియుక్తుఁడను స్వతంత్రుఁడను నను జ్ఞానము ప్రస్ఫుటమై యున్నది. కావున మోక్షప్రదాత కాఁగలఁడు. నరులకు మోక్షమిచ్చుటకే భగవంతుఁడు మూర్తి ధరించి వ్యక్తుండయ్యెనని ముందే శుకయోగి చెప్పెనుగదా.

రుక్మిణి—కృష్ణుని యొద్దకుఁ బోవవలనని పడని గోపిక దేహము విడిచెనంటిరి. ప్రారబ్ధము క్షయింపక ముందే యెట్లు మోక్షమబ్బెను?

తండ్రి—భగవంతునియం దత్యంతభక్తిఁ బ్రపన్నులైన వారికిఁ బూర్వాఘ ముత్తరాఘముకూడ నశించు. ప్రారబ్ధ శేషము కించిద్దుఃఖానుభవంబున నశించు. గోపిక దుస్సహతీవ్ర విరహా

తాపతప్తయై ప్రియతముఁ డైనకృష్ణు సాంగత్యాభావమువలన
నత్యంత దుఃఖ మనుభవించెను. కావున దాని పాపము క్షయించెను. శరణాగతుల పాపశేషముపోవ దుష్టభార్యలను దుష్ట
పుత్రులను రోగమును భగవంతుఁ డొసంగునుగదా.

తరువాతి చరిత్రము వినుము.

ఇట్లు తన్నుఁ జేరఁబాఱిన మందమందయానలం గాంచి నుడికారితనంబునఁ బ్రోడ యగు కృష్ణుండు తన వాగ్విలాసంబు మెఱయ వారలు విమోహంబునొందఁ జిత్తంబుఁ బరీక్షింప నిట్లనియె.

*మహాభాగలారా! మీకుఁ గుశలంబకదా? మీకు నేము చేయఁదగిన ప్రియమెద్ది? మందయందు దేవ్వారికి నాధి వ్యాధి బాధలు లేవుకదా? అయిన మీరాకకుఁ గారణమేమి? ఈరజని మహాభయంకరమై మహాభయంకర సత్త్వనిషేవితంబై యున్నది. తనుమధ్యలారా! మీరిందుండరాదు. మందకుఁ బొండు. తల్లులుఁ దండ్రులుఁ గొడుకులు నన్నదమ్ములు భర్తలు మీరెందుఁబోయినది తెలియక మిమ్ము మందయందుఁ గానక యెందేగిరో యని వెదకుచుందురు. కావున మీరు బంధువుల భయపెట్టరాదు. కుసుమవిసర శోభితంబును రాకేందుకర రంజితంబును, కాళిందీమంద మారుత లీలావిహారకంపమాన తరుపల్లవ సల్లలితంబును నగు బృందావనంబును గంటిరి.♦ కావున మందవిడిచి తడవుగ నిందుమసలవలదు. సాధ్వులారా! మీరు మీపతులకు శుశ్రూష గావింపుఁడు బాలురు దూడలింట నాక్రం

---

*ఆఁడువారందఱు గుంపుగూడి వచ్చినందున మందలోని వారికేమో యని భయము నటించుచుఁ జెప్పెడు వాక్యమిది

♦మందకుఁ బొమ్మని చెప్పిన కారణమునఁ దనపైఁ గోపించి యొకతె వనము ప్రక్కను, వేఱొకతె యాకాశము వంకను, నింకొకతె యమున తట్టును, జూచుచుండ మీరీ వినోదములను జూడవచ్చితిరి కాఁబోలు. చూచితిరి కదా యింకఁ బొండని భావము.

దనము గావించెడి. పాలుపిండుఁడు. బిడ్డలఁ ద్రావింపుఁడు. *ఒకవేళ నీయందలి స్నేహాభావముచేఁ బ్రేరితలమై వచ్చితిమందురా యది యుక్తంబ. నాయందు సర్వజంతువులు ప్రీతివహించి యుండును. నిర్వ్యాంచనంబుగ బతులకు శుశ్రూష గావించుటయుఁ దద్బంధువులను బ్రజలను బోషించుటయు స్త్రీలకుఁ బరమధర్మంబు. దురాచారరతుండైనను, కురూపుఁడైనను వృద్ధుఁడైనను, మందబుద్ధియైనను, రోగియైనను, నిఱుపేదయైనను, మగఁడు మహాపాతకిగాఁడేని వతనిని బుణ్యలోకముల కరుగ నిచ్చగించిన స్త్రీ విడువరాదు. స్త్రీ తనపతి జీవించియుండినను వేఱొకపతితోఁ గలియుట స్వర్గహానికరంబు. అకీర్తికరంబు. తుచ్ఛంబు. దుఃఖసంపాదకంబు ఉభయలోకభయకారణంబు. గర్హితంబు. ప్రాకృతపురుషు మేముగోరివచ్చిన వారము కాము అప్రాకృతపురుషుఁడవైన నిన్నుఁ గోరివచ్చిన మాపట్ల నీవాక్యము లెట్లన్వయించునందు రేని శ్రవణదర్శనధ్యానానుకీర్తనంబుల నాపయి మనస్సు నిలిచినట్లు సమీపమందుండుటచే నిలువదు. కావున మీరు గృహంబులకుఁ బొండు.

*పాలుపిండుఁడు బిడ్డలఁ ద్రావింపుఁడు — కృష్ణునిఁ జూడవచ్చిన గోపికలలో బిడ్డలఁ గలది యొకతెయు లేదు. ఇందుఁ జెప్పఁబడిన బిడ్డలు గోడికోడండ్ర బిడ్డలు. బిడ్డలుగలది యధమనాయక. అట్టి యధమనాయికలకుఁ బురుషోత్తముని నాయకునిఁగ నాలంబనభావము వర్ణించుట రసవైరస్యము. వస్త్రాపహరణకాలమునఁ గృష్ణునిచే వరము గొన్న కన్యకలును, వివాహితలైనను భర్తలతో సంభోగింపకుండిన స్త్రీలును గృష్ణుఁ జూడవచ్చిరి 'సహివోస్వామి' అని తాపనీశ్రుతియందును, నిందే కృష్ణవపువులనియు "శ్రియః కాంతాః కాంతః పురుషమపురుష" యని బ్రహ్మసంహితయందును జెప్పఁబడియుండుటచే భగవంతునికిఁ బత్నులుగాఁ జెప్పఁబడిన వారికి రాసక్రీడకు ముందుగాని వెనుకఁగాని యితరపురుషసాంగత్యము చెప్పుటయుచితముగాదు. కావుననే పూర్వము కూడ ''బిడ్డలకుఁ బాలుపోయువా''ని చెప్పఁబడెనుగాని స్తన్యమిచ్చు వారని చెప్పలేదు.

అనిన గోపికలు గోవిందుని యప్రియాలాపంబు లాలించి తమతమాశలు నాశంబగుట విషాదయుక్తలై తరింపరాని చింతకు లోనై శిరంబు లరవ్రాల్చి వేఁడినిట్టూర్పుల బింబాధరంబులు కందఁ నెడమ కాలివ్రేల నేల వ్రాయుచు, దుఃఖాతిశయంబుచే నెడలు కాటుక బెరసిన కన్నీటఁ గుచంబుల నలందిన కుంకుమ పూఁతలు కరఁగిపోవ, నేమియు మాటాడనేరక, కొంతవడి యూరకుండి, మెల్ల మెల్లనఁ గన్నీరు తుడుచుకొని, యాయన నిమిత్తమై యింకొక వాంఛితంబు లెల్ల వదలివచ్చిన యనురక్తలగుటచేఁ బ్రియతముఁడయ్యు నప్రియంబులు పలుకుచున్న కృష్ణు నుపలక్షించి తెగించి యించుక కోపావేశంబునం దొట్రుపడు నుడుల నప్పుడతని కిట్లనిరి.*

విభూ! దయమాలిన యిట్టిక్రూరవాక్యంబు లాడుటకుండ నీకుఁ దగవుగాదు. స్వచ్ఛందుఁడా! పతులను సుతులను సమస్తభోగ్య పదార్థములను‡ నిశ్శేషముగ వదలి నీపాదమూలంబు నాశ్రయించిన భక్తురాండ్రము. మమ్ముఁ జేవిడనాడకుము. మోక్షంబుఁగోరి♦ భజించు భక్తులను భగవంతుఁ డనుగ్రహించునట్లు మాయం దనుగ్రహింపుము.

కృష్ణా! పతులను సుతులను బంధువులను ననుసరించుట స్త్రీలకు స్వధర్మమని ధర్మజ్ఞుఁడవైన§ నీ వుపదేశించితివి. ఉపదేశ పదే

---

* మేము పతులను వదలి నిన్ను భజించుట ధర్మమో యధర్మమో యదెట్టులుండనిమ్ము. నీవు మమ్ము విడనాడుట దోషమని గోపికలు చెప్పుచున్నారు.

‡ భోగ్య పదార్థములను = నీసేవకుఁ బ్రతికూలములగు వాని నెల్ల నదలితిమని భావము. మమ్ము = వేఱుగతిలేని మమ్ము

♦ మోక్షంబుఁ గోరి = మోక్షమును గోరి నిన్ను భజించిన భక్తులకు నీవు ధన్యులఁ జేయుచుండ నిన్నే కోరియుండు మమ్ము ధన్యులను జేయకుండిన నీకు ధర్మహానియు శరణాగత రక్షకుఁడను కీర్తికి లోపము గలుగునని భావము.

§ ధర్మజ్ఞుండవు = ఇది యుపహాస వచనము. నీకు ధర్మము లుచ్చరించుటకు మాత్రమే తెలియును గాని యధికారి లక్షణము తెలియదని భావము.

శుండవైన *నీయందే యిది యుంచుకొమ్ము. నీవు దేహధారులకుఁ బ్రియతముఁడవు. బంధువు, నాత్మవు కదా, దేహధారులకు నాత్మకంటె నిరుపాధికబంధువు వేఱొకండు లేఁడుగదా? ఆత్మయన నీవుగాక మఱి యెవ్వరు?

♦కుశలులైనవారు దుఃఖదాతలైన పతి సుతాదులయందుఁ బ్రీతిసేయక నిత్యప్రియుండవై‡ న్వాత్మవైన నీయందే యనురక్తి కలవారై యుందురు.

కావున సంసారపీడావర్ధకులై దుఃఖకారణులైన పతిసుతాదుల

---

*ఉపదేశపదుఁడు = ఉపదేశింప యోగ్యుఁడు. ఈశుఁడు = సమర్థుడు. నీవు నుతియెవరికైన నుపదేశింపుము మాకుఁబనిలేదు. ఏలయందువేని దేహధారులకు నీవె యాత్మవు. కావుననే యన్నిటికంటె మిక్కిలి ప్రియుఁడవు కావుననే హితకారివి పరమాత్మవు. కావున నీయందే ప్రీతిగలిగి యాత్మనిష్ఠగల మాకు ధర్మాధికారము లేదు కావున మమ్ము స్వధర్మములందు వర్తింపుమని నీవు చెప్పుట సరిగాదని భావము. భగవంతునియం దత్యంతభక్తి సేయుట పరమధర్మము. తక్కిన కులాశ్రమోచిత స్వధర్మము లన్నియు దానికి సోపానములు. అత్యంతభక్తి కుదిరిన పిమ్మటఁ దక్కిన ధర్మము లనుష్ఠించు టనావశ్యకము. కావునఁ బత్యాదుల ననువర్తింపుమని మా కేసోపము లేదని భావము.

ఉపదేశపదే...కొమ్ము = నీయుపదేశమును నెఱవేర్ప నీవె సమర్థుఁడవు. కావున నెపాహినివై నీవుపదేశము మాచరించినట్లు లిప్పుడును మావలనైన మాపతులకు నీవే సేవ చేయుచుండుము.

ఈశుఁడవు. ఆత్మవు = నీవే కదా యాత్మవు. కావుననే యీశ్వరుఁడవు. ఈశ్వరాధిష్ఠానములేక దేనికిని బత్యాదినామము గలుగదు కావునఁబత్యాది పద మధిష్ఠించి యుండు వాఁడవు నీవే. కావుననే వేళ్లకు నీళ్లుపోసిన జెట్టునకంతయు నీరుపోసినట్టు యునట్టు నిన్ను సేవించినఁ బత్యాది బంధువుల నెల్ల సేవించిన వార మగుదుము. ప్రియతముఁడవైన బంధువు నీవే కావున బంధువులకెల్లఁ జేయఁదగు శుశ్రూష నీకే సేవము.

♦తమచర్య సదాచారమని గోపికలు సప్రమాణముగ దృఢపఱుచుచున్నారు. కుశలులు = సారాసారజ్ఞులు_నారదుఁడులోనగు భక్తులు. నిత్యప్రియుఁడు = తనయందు సకలయందు సర్వదా సుఖమయుఁడైనవాఁడు.

వలనఁ గాఁగల ప్రయోజనమేమి? కావున వరద!* యీశ్వర! మా యం దనుగ్రహింపుము. నళిననేత్రా! చిరకాలముగ మాకుఁగల కోరికను వ్యర్థపఱుపకుము.

కృష్ణా! యిమ్ము మందకు మరలి పొమ్మంటివి! ఎంతో సంసార సుఖంబుల మరగియుండిన మా చిత్తంబుల ననాయాసంబుగ నీవు వశపఱచికొంటివి. అట్లు లే గృహకృత్యంబుల నిర్వర్తించుచున్న హస్తంబులను నీ కైంకర్యమునం దాసక్తములుగ నొనర్చితివి. నీ చరణంబుల నుండి మా పాదములు తొలఁగి పోఁజాలకున్నవి. ఇటులు సాధనము లెల్ల హరించి పొమ్మనిన మే మెట్లు మందకుఁ బోఁగలము? పోయిన నేనియు నేమి చేయఁగలవారము?

కృష్ణా నీవు చిఱునగవులతోడి చూపులచేతను మధుర సరళ మురళీ గీతంబులచేతను, మా మనంబుల రగులఁజేసిన తాపంబును నీ యధరామృత ప్రవాహంబునఁ§ జల్లార్పుము. అటు చేయవైతి వేని చెలికాఁడా! నీ యెడబాటువలనఁ గలిగిన విరహాగ్ని చే దగ్ధదేహలమై ధ్యానబలంబున నీపాదపదవినే పొందఁగలవారము. ఈ దేహముతోడఁ గాకున్న దేహము విడిచియైన నిన్నుఁ గలయుట నిశ్చయము.

---

*వరద — వస్త్రాపహరణకాలమందు వరమిచ్చిన వాఁడా! ఈశ్వర — తక్కువారికి దుర్ఘటమైన కోరిక నెఱవేర్చు సామర్థ్యముగల వాఁడా! నళిననేత్ర — కమలములవంటి కన్నులుగల సుందరుఁడా! నళినమనఁగాఁ జంద్రుచే బంధింపఁబడునది యని యర్థము. కమలము రాత్రులయందు ముకుళించును. అట్లే నీ కన్నులను వెన్నెల సోఁకున మూఁతలు పడియుండుటచే మా సౌందర్యమును దీన స్థితిని జూడఁజాలకున్నావు. యథాస్థితిఁ జూచితివేని నమ్ముపేక్షింపవని భావము. స్వాత్మవు = పరమాత్మవు. పరమాత్మవు నీవు సాక్షాత్కరించియుండఁ బతిసుతాదు లేల?

§అధరామృత ప్రవాహము = మంట పెద్దదిగానున్నపుడు నీళ్ళు కొంచెము చల్లిన వేఁడిమి యెక్కువగును. కావునఁ బ్రవాహమని చెప్పిరి. చెలికాఁడా — చిన్నప్పటి నుండియుఁ జెలిమిచేసినవాఁడగుట మా శీలము స్నేహ మట్టిదో నీవే యెఱుఁగుదువు.

అంబుజాక్షా! వనవాసులకుఁ బ్రియుండవై మహాలక్ష్మికిని మహోత్సవకారణంబైన నీపాదతలం బరణ్యంబున నొక్కపరి స్పృశియించితిమి. అది మొదలు కృష్ణా! నీయందే మన స్సానందించుచున్నది. కావునఁ బామరపురుషుల యెదుట నెట్లు నిలువంగలవారము? నీపాదాంబుజంబుల యందుఁ గ్రీడించు చిత్తంబు తుచ్ఛంబులు నశాశ్వతంబులునగు వానిపైఁ బోవునే? నాపాదంబుల నేమి విశేషంబుఁ గంటెరని యడిగెదవేని వినుము.

ఏమో కరుణాకటాక్ష వీక్షణంబుఁ గోరి స్వాతిశయాభిలాష బ్రహ్మాదులును నానాప్రయాసములఁ బడుచుందు రట్టి (శ్రీ)మహాలక్ష్మి నీవక్షస్స్థలావాసంబుఁ గాంచియు భృత్యజన సేవితంబయిన నీచరణకమల రజంబుఁ గోరి సవతియగు తొలసితోడం గూడి సేవించుచుండును. ఆ విధంబున మేమును నీపాదరజంబును సేవింపఁ గోరెదము.

ఓ పాపనివారకా! నిన్నుపాసించు నాశచేత గృహంబులు విడిచి యోగులవలె నీ పాదమూలంబుఁ జేరినవారము. కావున నీదరహాస సుందర కటాక్షములవలనఁ గలిగిన తీవ్ర కామంబునఁ దపించు దేహంబులుగల మమ్మనుగ్రహింపుము. పురుషభూషణా! దాస్యమొసఁగి కాపుము. (మేము కోరినదెల్ల నది యొకటే సుమా) భోగ్యంబులైన గృహాదుల విడిచి నా దాస్యముఁ గోరనేల *యందువేని ముంగురులచే రంగైన ముఖంబును గుండలమండితంబైన గండస్థలంబును, నమృతము లొలుకు నధరంబును, జిఱునవ్వుతోడి చూపులును, నాశ్రితాభయప్రదంబగు భుజదండ యుగంబును, లక్ష్మిముఖ్య కేళీస్థానంబగు వక్షంబును మా వీక్షణంబులఁ †దనివారఁజూచి

---

*దాస్యమునకు మూల్యమే మడుగుదు రేని.

†వీక్షణంబులు — వి + ఈక్షణంబులు = వి అనఁగాఁ బక్షి. ఇచ్చటఁ గాటుకపిట్ట — కాటుకపిట్టలనంటి మా కన్నులు — అని యర్థము. నీ చూపులనెడి పెంపుడు పిట్టలచే మాచూపులనెడి కాటుకపిట్టలనునవి [illegible] సంచారము సేయు

చూచి నీ రూపంబు నిరతిశయ భాగ్యంబగుట నీ పాదసేవ చేయు దాసీజనముగాఁ గోరుచున్నారము.

కృష్ణా! మధురపదాయత మూర్ఛితంబగు వేణునాదంబు వినియు సమ్మోహితయై త్రైలోక్యసుందరమైన నీ యాకారంబుఁ జూచి యార్యచరితంబునుండి చలింపకయుండు స్త్రీ ముల్లోకంబుల నైనఁ గలుగదు. ♦ పశుపక్షి మృగాదులు నీగానంబు మేనఁ బులకలెగయ విని కరఁగుచుండ మాస్థితి యెట్టిదై యుండవలయు.

కృష్ణా! యాదిపురుషుండైన నారాయణుండు సురలోకరక్షణార్థము పేంద్రావతారంబు లెత్తినట్లు నీవు మందయందుఁగల జనబృందంబుల దొందంబులంగల తొందు డిందుపఱుప జనించిన వాఁడవగుట నిజంబు. కావున నో యార్తబాంధవా! చందన తుషార బిందు శీతలంబైన నీ కరకమలంబు తపించుచున్న యీ కింకరీజనంబుల కుచంబులందును శిరస్సులందు నుంచి యార్తి హరింపుము.*

అని యిట్లు గోపిక లోపికలులేక దుఃఖతాప వేగంబునఁ బలికిన యాలాపంబులు విని నవ్వి యోగేశ్వరేశ్వరుండగు శ్రీకృష్ణుడాత్మరాముడయ్యు భక్తజన వాంఛాప్రదాతయు నాశ్రితబాధా హరణుఁడును గావున దయాళుండై ♦గోపికలతోఁ గ్రీడింపఁ జొచ్చెను.

---

సమయంబున మంగురులను పాశంబులఁ బట్టి కట్టి వైచితివి కావున నవి నీ ముఖము నుండి మరలి రాకున్నవి. ఇఁక నీ దాస్యముఁజేసిన నీ దయ సంపాదింపకున్న "మే మెందుఁ బోగల"మని భావము.

♦విన్న సుఖింపఁజేయు శబ్దము విన్నంతన నిజధర్మత్యాగంబు జీవికి యుక్తంబై యుండ విన్నను భవింప వచ్చిన మేము మాహా సాన్య ధర్మను విడుచుట యోవనుట్లగు?

* కామపీడితలమై నిన్ను సేవించు మాకోరికను 'యేయథా మాం ప్రపద్యంతే' యను నీ వచనము జొప్పున నెఱవేర్చి కామవాసన హరింపఁజేయుటకును శుద్ధభక్తి లభింపఁ జేయుటకును నీహస్తంబును మా శిరంబులందును కుచంబులందును నుంపుమని భావము.

♦దయాళుండై = గోపికల ధన్యులఁ జేయు కోరిక చేతనే వారితో రమించెను గాని కాముకుఁడై కాదని తాత్పర్యము. ఆత్మారాముఁడయ్యు = అయ్యు ఆశ్చర్యమును దెలు

మొల్లమొగ్గల మొల్లంబు నుల్లసంబులౌను దంతంబుల దరహాసకాంతు లను నిజావలోకనంబులను వికాసంబునొందిన ముఖాసితారవిందం బులుగల యా మందగమనల తోడంగూడి సుఖావహా విలాసుండైన యచ్యుతుండు* పెక్కుచుక్కలనడుమ నిక్కు నక్కలువ చెలువుని పోలిక నొప్పారె. కలకంఠములు తేనెలు సోనలై కురియు గానంబు సేయఁ దానును బాడుచు వనితాశతంబులతోడఁ గరిణీశత యుతంబైన యూథపంబును బోలి వైజయంతీ కాంతులు దొంతర లగుచుండఁ గాంతారంబు నలంకృతంబుఁ గావించుచు నదీతీరంబునఁ బచ్చకప్పు రపుఁ దివ్వలంబోలి జల్లని తెల్లని యిసుకతెన్నెలపైఁ దరఁగల కదలిక నుయ్యాలలూఁగు కలువలవలపులుగొని మెల్లనవచ్చు మారుతంబు పై వీచుచుండ భుజంబులపైఁ జేతులు సాఁచుచుఁ గౌగిలించుచు ముంగురులు నూరువులు పోకముడులు స్తనంబులు నంటుచుఁ బరి హాసంబులాడుచుఁ గొనగోట నొక్కుచుఁ జూపుల నగవుల గోపాల సుందరీజనంబుల మనంబుల రతిపతిని ద్దీపింపఁ జేయుచుఁ గ్రీడించెను.♦

ఇట్లు లౌకిక స్వభావుఁడును విషయాసక్తి లేనివాఁడు నగుటచే మహాత్ముఁడును భగవంతుఁడునైన శ్రీకృష్ణుని యనుగ్రహంబు నడసి జగంబుల నంబుజాక్షు లందెల్ల నేమే నేటులము. మానలేఁ గృష్ణా

పును. సనకాద్యాత్మారామగణ వశీకరణ గుణుఁడయ్యు గోపికలకు వశుఁడయ్యెఁ గదా యేమి ప్రేమాతిశయిత్వమని శుకమహర్షి యాశ్చర్యపడు చున్నాఁడు. యోగే శ్వరేశ్వరుఁడు = ఒకటే కృష్ణమూర్తి యందరు గోపికలతో నెట్లు క్రీడించెననఁ గందే హము పోవ యోగేశ్వరేశ్వరుఁడగుట యోగమాయ నాశ్రయించి బహు రూపియై యని భావము.

*అచ్యుతుండు = అందఱు సుందరులు చుట్టుకొనియున్నను చ్యుతిరహితుఁడై యని భావము.

♦శ్లో॥ బాహుప్రసార పరిరంభ కరాలకోరు, నీవీ స్తనాలభన నర్మ నఖాగ్ర పాతైః । క్ష్వేల్యావలోక హసితై ర్వ్రజ సుందరీణా ముత్తంభయన్ రతిపతిం రమయాంచకార॥

నుగ్రహంబునకుఁ బాత్రురా లెవ్వతె కాఁగలదని గోపికలు మనంబుల గర్వించిరి. వారి సౌందర్య గర్వంబును, జిత్తోద్రేకంబు నెఱిఁగి కేశవుండు సర్వస్వతంత్రుఁడగుట నభ్యుదయవినాశకం బగు మదమానంబులణంచి యనుగ్రహింపనెంచి యా యిసుకతిన్నెయందె మాయమైపోయెను.

ఇట్లు తటాలున భగవంతుఁ డంతర్హితుఁడైన వ్రజాంగనలు యూథనాథుఁ గోల్పోయిన యాఁడేనుఁగులవలెఁ దపించిరి. ఇట్లాఁపరాని తాపంబున గోపికలు రమానాధుని యానడబెడంగును, మురులు గొలుపు వలపు పొలుపును, జిఱునవ్వు సొంపుఁ బెంపుచేయు తీపు చూపులును, మనోహరాలాపములును, లీలాకేళీ విలాసంబులును, సౌయ్యారంబును, మనంబున నాటిన నతని చేష్టలఁ దలఁచి తలఁచి ప్రియుని నడలు నగవులు చూపులు పలుకులు లోనగు వానిని దా ననుకరించుచుఁ దన్మయత్వంబునొంది తామేకృష్ణుఁడని తలంచుచు నా ప్రియురాండ్రు శ్రీకృష్ణుని లీలావిహార విలాసంబులు తామాచరింపఁ జొచ్చి యెలుంగెత్తి పాడుచు సందఱు గుములై యొకవనంబు నుండి మఱియొకవనంబునకుఁ బోవుచు నాకాశంబును బోలి సర్వభూతంబుల లోపలను వెలుపలను నిండియుండు పరమపురుషు వేఁడు రెత్త నవారించిబోలె వృక్షంబుల నడుగుచు *

సీ. పున్నాగ! కానవే పున్నాగ నందితుఁ
దిలకంబ! కానవే తిలకనిటలు
ఘనసార! కానవే ఘనసార శోభితు
బంధూక! కానవే బంధుమిత్రు
మన్మథ! కానవే మన్మథాకారుని
వంశంబ! కానవే వంశధరుని

*ఇది మనయుతమందలి వాస్తవజ్ఞానము నెఱుంగి లేక వృత్రప్రాయులైన పరమహర్షులఁ జేరి యడుగుట సూచించుచున్నది.

చందన! కానవే చందనశీతలుఁ
గుందంబ! కానవే కుందరదను
తే. నింద్రభూజము! కానవే యింద్రవిభవుఁ
గువలవృక్షమ! కానవే కువలయేశుఁ
బ్రియకపాదప! కానవే ప్రియవిహారు
ననుచుఁ గృష్ణుని వెదకి ర య్యబ్జముఖులు.

ఉ. నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబుఁ బై
జల్లెడువాఁడు మౌళిపరిసర్పితపింఛమువాఁడు నవ్వురా
జిల్లెడుమోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చెనో
మల్లియలార! మీపొదల మాటున లేఁడు గదమ్మ చెప్పరే.

ఉ. అంగజునైనఁ జూడ హృదయంగముఁడై కరఁగించువాఁడు శ్రీ
రంగదురంబువాఁడు మధురంబగు వేణురవంబువాఁడు మ
మ్మంగజు పువ్వుదూపులకు నగ్గము సేసె లవంగ లుంగ నా
రంగములార! మీకడకు రాఁడుగదా కృపయుంచి చూపరే.

సీ. మానినీ మన్మథు మాధవుఁ గానరే
సలలితోదార వత్సకములార
సలలితోదార వత్సకవైరిఁ గానరే
సుందరోన్నత లతార్జునములార
సుందరోన్నత లతార్జునభంజిఁ గానరే
ఘనతర లసదశోకంబులార
ఘనతర లసదశోకస్ఫూర్తిఁ గానరే
నవ్యరుచిర కాంచనంబులార
ఆ. నవ్యరుచిర కాంచన కిరీటుఁ గానరే
గహన పదవి కురవకంబు లార
గహనపదవి కురవక నివాసిఁ గానరే
గణికలార! వారు గణికలార!

సీ. ఆడె నందనందనుం డంతర్హితుం డయ్యెఁ
బాటలీతరులారా! పట్టరమ్మ
హేలావతులఁ గృష్ణ! హేల పాసితి వని
హైమశేయలతలారా! యడుగరమ్మ
వనజాక్షుఁ డిచటికి వచ్చి డాఁగఁడు గదా
చూత మంజరులార; చూడరమ్మ
మానినీ మదనుతో మారాక యెడఁగించి
మాధవీలతికలార! మనుపరమ్మ
ఆ. జాతిసతుల, బాయ నీతియే హరి కని
జాతులార! దిశలఁ జాటరమ్మ
కదళులార! పోయి కదలించి శిఖిపింఛ
జూటుఁ దెచ్చి కరుణఁ జూపరమ్మ.
కం. హరిచరణములకుఁ బ్రియవై
హరి నిను మన్నింప భద్ర మందెదు తులసీ!
హరి నీ దెస రాఁడు గదా?
హరి చొప్పెఱిఁగించి శుభము లందింపఁ గదే. భాగ.

భూదేవీ! కేశవచరణ కమలస్పర్శంబున రోమాంచిత గాత్ర వైతివి, మున్ను నీ వేమి తపంబు చేసితివో ఈ చిహ్నములకు నిప్పటి పదస్పర్శము కారణమా? కాదేని విక్రమావతారంబునఁ బదములఁ బోఁకుటనా? కాదేని వరాహరూపుండైన వేళఁ బరిరంభించిన హేతువు చేతనా?

హరిణపత్నీ! నిజసుందరావయవంబులచే నీ కన్నులకు నానందాతిశయంబు నాపాదించుచుఁ గృష్ణుండు ప్రియా సహితుండై యిం దరుదెంచెనా? సఖీ! కృష్ణపక్షపాతంబున రా లేదని యసత్యమాడకుము. అంగనాంగాలింగన సంగకుచ కుంకుమ రంజితంబయిన గోపాలనాయక కుందదామంబు పరిమళం బిందుఁ గ్రందుగ బుగులు కొనుచున్నది.

ఫలభారానత తరులారా! గృహీతకమలంబై నదక్షిణకర కనలంబును బ్రియురాలి వామబాహువుపై నుంచి తులసికామోద మదాంధంబులైన పుష్పంధయంబులు వెంటనంట నిందుఁ జరించుచుఁ గృష్ణుండు మీ ప్రణామముల నభినందించెనా వచింపుఁడు.

చెలువలారా! యీ లతను దిలకింపుఁడు. తన బాహువులచే నిజపతియగు వనస్పతిని గౌఁగిలించి యుండియుఁ గృష్ణనఖ స్పర్శంబునఁ గోరకమిష నుత్పులకంబుల నందగించెడి. స్వపతి సంగతల కిట్టి పులకలెట్లు లౌదవు.

## —: శ్రీకృష్ణలీలల గోపికల నుకరించుట :—

అని యిట్లు గోపిక లున్మత్తవాక్యంబులు పలుకుచుఁ గృష్ణాన్వేషణ కాతరలై తదాత్మికలై లీలాభగవంతు లీలల ననుకరించిరి. అందొక్కసుందరి నేను బూతన నని చరింప నేను గృష్ణుండనని చరించు నింతి దాని స్తనంబుఁ జుంబించెను. శిశువువలె నేడ్చు నొకతె శకటంబను నింతిని బదంబునఁ దన్నెను. ఇంకొక్కతె నేను తృణావర్తుండ నని కృష్ణుఁడనను చెలిని నెత్తికొనిపోయెను. ఇద్దఱు ముద్దియలు రామకృష్ణులమని చరింప నితరస్త్రీలును గోపవత్సములైరి. వత్సంబయిన నొకతెను వేఱొకతె త్రిప్పి నేలఁ ద్రోచెను. కృష్ణుఁడనను నొకతె బకుఁడ నను దానిని గొట్టెను. కృష్ణుండ నను తలోదరి గోవులమని యున్న యన్నుల నాహ్వానించెను. ఒకతె వేణువూఁద నొకతె సంగీతము పాడ వేఱొకతె మేలుమే లని ప్రశంసించెను. ఒకతె వేఱొకతె భుజముపై చేయి యుంచి సొయ్యారంబుగ నడువ నిదియేమి యిట్లు నడచెదవని వేఱొకతె యడుగ నేను గృష్ణుఁడను నా గమన సౌందర్యమును జూడమని ప్రత్యుత్తర మిచ్చెను. ఓ గోపికలారా! గోపాలులారా! మీరు గాలివానకు భయపడవలదు. నేను గొండనెత్తెదనని పైఁటకొంగు నొకకేల నెత్తి పట్టెను. ఒకతె వేఱొకస్త్రీపై నెక్క

దాని తలను గాలఁదన్నుచు దుష్టసర్పమా పొమ్ము. ఖలుల నణంప నే నవతరించితి ననెను. ఒకతె గోపాలకులారా! చూడుఁడు దావాగ్ని విజృంభించుచున్నది. మీరందఱుఁ గన్నులు మూసికొనుఁడు మీకు క్షేమముఁ గలిగించెద ననెను. ఒకతె వేఱొకతెను బట్టుకొని కృష్ణా వెన్నదొంగా! యింక నెక్కడఁ బోయెదవు నిన్ను ఱోటికిఁ గట్టెదనని పూలదండచేఁ గట్టెను. మఱియొక వామలోచన కన్నులు మూసికొని భయము నటించెను.

ఇట్లు గోపస్త్రీలు కృష్ణు వెదకుచు బృందావన లతాతరువుల బ్రశ్నించుచు వనంబునఁ బోవునెడ నొకచోఁ బరమాత్ముని పాదచిహ్నంబులం గని యిట్లనిరి.

చెలులారా! యివి నిక్కముగ మహాత్ముండైన నందనందను చరణ చిహ్నములు. కంటిరిగదా ధ్వజాంకుశ పద్మలతాదులఁ జిహ్నితంబులై యున్నవి. అని యిటు లాయడుగుల జాడఁ బోయి యక్కె యొండొకచో వధూపద సక్తంబులగుటఁ గాంచి యార్తలై యిట్లనిరి.

ఆఁడేనుఁగు మగయేనుఁగుతోడఁ జనినట్టు లిక్కడఁ కృష్ణుని భుజంబున ముంజేయి యుంచి యొక తలోదరి పోయెను. ఇది దాని యడుగులు. ఆహా యీ యింతి యెవ్వతయో పూర్వజన్మంబున నీశ్వరుఁడు భగవంతుఁడునగు హరిని జక్కఁగ నారాధించెను. కావుననే మనల నందఱవిడిచి యీపడఁతి నొక్కదానిని గూడి కృష్ణుండు క్రీడించుచున్నాఁడు.

ఆహా యంగనలారా! యీ గోవింద చరణారవింద పరాగములెంత ధన్యంబులో కదా. ముకుందప్రాప్తి ప్రతిబంధక పాపంబుల హరించు వీనిని బ్రహ్మేశ్వరాది దేవతలు శిరంబున ధరించుచుందురు. ఈ నీరజాక్షి మన కెల్ల మిగుల మనఃక్షోభంబుఁ గలిగించుచున్నది. గోపికల కెల్ల నుమ్మడి సొమ్మగు మాధవాధరామృతంబును దానొక్కతెయే పానంబు సేయుచున్నది. అక్కటా యిది సహింపరా

చున్నది. దాని పాదచిహ్నంబు లిందుఁగాన రాకున్నవి. తృణాంకుర పీడితంబు లయిన చరణంబులు గల యా తరుణిని గృష్ణుం డెత్తికొని పోయెను నిజము. అనిన వేఱొక్కతె యది సత్యము, ఆ కామి భారాక్రాంత గామి యగుటచేతనే యిందతని పదంబులు మిగుల దిగఁబడి యున్నవి. కాంతలారా! కంటిరే యిచ్చట నమ్మహాత్ముండు ప్రియురాలికిఁ బూవులు గోసియిచ్చెను. కావుననే చూడఁడి పాదచిహ్నములు పూర్ణంబుగ లేక మునివ్రేళ్లుమాత్రము తెలియుచున్నవి. ఆ కాముకుఁ డిందుఁ గామినికిఁ గూర్చుండి కురులు దువ్వి యలంకరించెను. అని యా గోపికలు ప్రలపించుచు విచేతసలై చరించిరి. రాజా! కృష్ణుండు గోపికతో రమించెననుట మతిచెడిన గోపికల యూహామాత్రము గాదు. ఆత్మరతుండు నాత్మారాముండ వాప్తసమస్తకాముఁడౌట స్త్రీవిభ్రమముచే నఖండితచిత్తుఁడనయ్యుఁ గాముకుల దైన్యంబును స్త్రీల దౌర్జన్యంబును బ్రకటింప దానితో రమించెను. ఇట్లు కృష్ణుండు తక్కిన గోపికలనెల్ల వదలి యొక్క మచ్చకంటిని మాత్రము వెంటఁగొని వనవిహారంబు గావించుచుండఁ దక్కినవారి నెల్ల వీడి విభుండు నన్నొక్కతెను గామించె నా కితఁడు వశవడియె నేనే స్త్రీలలో శ్రేష్ఠ నను గర్వంబున నచ్చంద్రానన ♦ యా కాననంబున నొక్కయెడఁ గేశవునితో నిట్లనియె.

కృష్ణా! యిఁక నేను నడవజాల. నన్నెత్తికొని నీ యిచ్చవచ్చిన చోటికిఁ గొనిపొమ్మనఁ గృష్ణుండును బ్రియురాలిం జూచి యట్లైన నా భుజంబుపై నెక్కుమని యది యెక్క యత్నించునెడ దాని నక్కడనే దిగవిడచి యంతర్ధానుండయ్యెను. అదియును మక్కువకాఁడు చేసిన టక్కునఁ బట్టరాని వగలపాలై నాథా! రమణా! ప్రియతమా! మహాభుజా! యెందుఁ బోయితివి నీ దాసురాలను దీనురాలను నగు

---

♦ భాగవతంబున రాధ పేరు లేకున్నను నీగోపికయే రాధయని కొందఱ మతము.

నాకుఁ జెలికాఁడా! గోచరింపుము. అని విలపించుచుండ గోపిక లా ప్రియవిరహంబునఁ గపించు చంచలాక్షింజూచి దాని వృత్తాంతం బది చెప్ప విని కృష్ణ ప్రీతిచేఁ గలిగిన గారవంబును దుర్బుద్ధి వలని గర్వంబునఁ బ్రాప్తించిన మానహానియుఁ దలంచి తమ కథయు నట్టిదకా స్మరించి విస్మయపడిరి.

అంతట గోపికలు వెన్నెల ప్రకాశించువఱకు సంచరించు చుండి చంద్రుఁడుగ్రుంకి చీఁకటు లావరించిన మరలి వచ్చుచుఁ గృష్ణునియందే మనస్సు నిలిపి యా ముచ్చటలే యిచ్చవోయి ముచ్చ టించుచు నతనిచేష్టలే చేయుచు దదాత్మికలై యాతని గుణంబులఁ బాడుచు నాత్మగృహంబుల * స్మరింపరైరి. ఇట్లు మరలి యమునాతీరం బునఁ దొలుతటి పులిన ప్రదేశంబుఁ జేరి కృష్ణుని ధ్యానించుచు నాయనరాకఁ గోరుచు నిట్లు కృష్ణగీతంబులఁ బాడిరి.

—: గోపికా గీతలు :—

ప. నీవు పుట్టుటన్ నిల్చె నిత్యమై
శ్రీ వ్రజంబునన్ గృష్ణ! నీపయిన్
దావకానఖిల్ నాటి ప్రాణముల్
దేవ! రోసెదర్ దిక్కుదిక్కులన్.

ప్రియా! నీవు జన్మించుటఁ జేసి వ్రజంబు సర్వోత్కృష్టమై వర్ధిల్లుచున్నది. ఇందిరాసుందరి కిది నిత్యమందిరమైనది. నీ యందుఁ బ్రాణంబు లుంచి ‡ నీ వారు నిన్ను దిక్కుదిక్కుల వెదకుచున్నారు. వారికి నీవు ప్రత్యక్ష మగుము. వెదకిన వెదకనిమ్ము నాకేమి యనకుము.

*ఆత్మగృహంబులను — తమ్మును దమ యిండ్లను. తమ్ముఁ దామే మఱచియుండ నిఁక నిండ్లను మఱచుటేమి వింత యని భావము,

‡ ఈగీతలకుఁ గామపర్యాయంబున నర్థము స్పష్టము గనుక భక్తిపర్యాయంబున నర్థము సంగ్రహముగ వ్రాయఁబడును. వ్రజము = (1) మంద. (2) దేహము. వ్రజ మనఁగాఁ బోవునది. నిలుకడలేనిది యని యర్థము. కావున వ్రజ మనఁగా దేహము.

* సురతనాథా! శరత్కాలమందు సరోవరంబున జక్కగ జనించిన మేలితామర దిమ్మె యొమ్మెను ముచ్చిలించు చూపులచే వరదా! జీతము బత్తెములేని దాసికల నొప్పించుట వధించుటయే కదా?

‡ ఓ పురుష పుంగవా! విషజలంబువలనను, సర్పాసురు వలనను, గాలివానవలనను, చిచ్చుపిడుగులవలనను, వృషభరాక్షసు వలనను, వ్యోమకాసురువలనను, గారుచిచ్చువలనను, మమ్ముఁ బలుమాఱు రక్షించిన నీవే యిప్పు డిట్లు వధించుట పాడిగాదు.

నీవు జన్మించుటఁజేసి — నీ విషయమైనభక్తితాత్పర్యములు పుట్టుటచేత "భక్తిలేని మనుజుండు మనుజుఁడే పాదయుగముతోడి పశువుగాక" యున్నట్లు భక్తిలేనిదేహము నికృష్టము. భక్తి కలుగుటచే నుత్కృష్టమైనది. ఇందిర = పరమైశ్వర్య యుక్తురాలు. పరమభక్తి పెరపడిన వానికి లక్ష్మియు కానిది లేదను, భగవద్వాక్యము చెప్పన వీనికి సమస్తైశ్వర్యములు కరతలామలకములు. భగవంతుఁ డొక్కఁ డున్నాఁడు అతనయే మనకు రక్షకుఁడను నిశ్చయజ్ఞానము కుదిరిన పిమ్మట నట్టి భగవంతుఁ డెచ్చ టున్నాఁడో యని భక్తుఁడు వెదక నారంభించును తీర్థక్షేత్రాంతరాదులందును. వెదకును తనయందు వెదకును. అట్లులే గోపికలును. ప్రాణములన్నియు నీయం దుండుటచే నిచ్చట నిర్జీవ దేహంబులు మాత్రమే యున్నవని భావము.

* ఇట్టి మేము నీవలన జీతము బత్తెముఁ గోరక నీకు దాసికలమై సేవసేయఁ గోరుచుండ మ్రొక్కెడి వారి ముంజేతులు గోసినట్లు మమ్ముఁ జూపులచేతనే యేల నొప్పింపఁ జూచెదవు. ఇట్టి బాధాకరమైన నెత్తి నిక్కోఁతలేల? శస్త్రముచేతనే యొక్క పారిగ వధింపవచ్చును గదా. నిర్జీవములైన యీదేహములకు మరలఁ బ్రాణము లిచ్చినఁ గీర్తిప్రతిష్ఠలు కలవుగాని చచ్చినవారి వధించిన నేమి కలుగును? ఎంతో రహస్యముగ దాఁచిన సొత్తును హరించు దొంగవలె నీవు చూపులచేత నూఱురేకులనెడి కోట నడుమ దాఁచియున్న కమలగర్భ సంపత్తిని హరించితివి. అట్టి దొంగ వాఁడిచూపుల చేతనే మమ్ముఁ జంపఁదలంచితివి. మమ్ముఁ జంపి మావలన గ్రహింపఁదలఁచిన దానిని మేము బ్రతికి యుండఁగానే గ్రహింపుము

‡ అట్లు వధించుట నీ యభీష్టమేని విషజలాదులవలన నేల రక్షించితివి? నీవై స్వయముగఁ జంపుటకా? అప్పుడే మమ్ముఁ బారవిడిచిన మా కీతాపము నీ కీ యా స్త్రీవధకలని యపకీర్తి లేకుండునుగదా.

* కృష్ణా! నీవు గొల్లెత పిల్లవాఁడవు గావు. సకల దేహుల యంతరాత్మవై సాక్షివై యుండువాఁడవు విశ్వపాలనార్థంబు పరమేష్ఠి ప్రార్థింప భక్తులయిన యాదవుల కులంబున జన్మించితివి.

♦ వృష్ణికులోత్తమా! సంసారమునకు వెఱచి పఱచి నీశరణు చొచ్చినవారి కభయప్రదాన మొసఁగునదియు, నాశ్రితులకుఁ గామదంబును, లక్ష్మీకరంబుఁ బరిగ్రహించినదియు, శ్రీకరంబును, నైన నీ కరంబు కాంతా! మాశిరంబుల నుంపుము.

* కాదు కాదు. నీ వొకరిని హింసింప జనించిన వాఁడవు కావు. ప్రపంచ రక్షణార్థమై జనించితివి. కావున నెల్లవారల రక్షించుటే నీకుఁ గర్తవ్యము. నీవు గోపికా నందనుండవు. మేము గోపికలము. ఒకచోటఁ బుట్టిపెరిఁగి యొక యింటియందువలె నుండువారము. కావున నీవు మాకు సఖుఁడవైతివి. ఇంటగెల్చి రచ్చగెలువ వలయు నన్నట్లు ముందు నీవారమగు మమ్ము రక్షింపలేనివాఁడవు ప్రపంచమంతయు నేమి రక్షించెదవు? మేము చెప్పినది సత్యమనియు మాపరితాప మెట్టిదనదియు నిఖిలాంతరాత్మవైన నీవే యెఱుంగుదువు.

♦ కామదము — (1) కామమును ఛేదించునది. (2) కోరికలనిచ్చునది. నావలన మీకుఁ గావలసిన క్షేమ మంతయు వేని దిహము. సంసారమునకు భయపడి నీ శరణు చొచ్చిన వారిని రక్షించునది నీహస్తము. మేము నట్టివారమే కావున నీయభయ హస్తము మాశిరంబులనుంచి మాసంసార తాపము హరింపుము. తలమీఁదఁ జేయిపెట్టి మాట చెప్పుట ప్రమాణము చేయుట కావున నిప్పటినుండి నీకు ముందు మమ్ము విడిచిపోనని ప్రమాణము చేయుమని భావము. అత్యంత ప్రీతిగలవారు తలమీఁదఁ జేయియుంచి యాశీర్వదింతురు దానివలనఁ జేయి యుంచిన వారి దేహములోని ప్రాణమును నాకర్షణ శక్తి చేయి యుంచఁబడిన వారి దేహమునఁ బ్రసరించి వారికిఁ దేజస్సు గలిగించి తాపము తొలఁగించి యాభ్యుదయము గూర్చును. అట్టులే నీవు తాఁకినంత మాత్రమున లక్ష్మి నీ కరమునకై సర్వదా నిన్ను విడువని దయ్యెను. అట్టి శ్రీకరమై కామధ్వంసకమై కోరికల నిచ్చునీకరమును మా శిరస్సులం దుంచి మా తాపంబు లడఁచి మమ్ము వశపఱచికొని విడనాడక యుండుమని భావము. చరణములంటి నమస్కరించినపుడును నిట్టులే ప్రాణశక్తి నమస్కరించు వారి దేహములోనికిఁ బ్రవేశించును.

*వ్రజ జనార్తిహరణా! వీరా! స్వజన గర్వనిర్వాపక దరహాసా! సఖా! యోషలమై నీ కింకరులమైన మమ్ముద్ధరించి నీ సుందర వదనారవిందంబు మాకుఁ గనఁ బడఁజేయుము.

♦నమస్కరించు వారి పాపంబులఁ బాపుదువనియు, గసవు మేపసులవెంట నంటుదువనియు, లోకమాతయగు శ్రీకి నికేతనంబు

*వ్రజ జనార్తి హరణా = దేహిదుఃఖములను తొలఁగించువాఁడా! వీరా = నీవు మమ్ముద్దేశించి పదచలనము చేసినంతమాత్రమున మా దుఃఖములు తొలఁగును. వీరుఁడవఁగాఁ బాదవిన్యాసముచేత నితరుల నాక్రమించువాఁడు, వీరుఁడవగుట నీవే మా దుఃఖములఁ బోఁగొట్ట సమర్థుఁడవు. స్వజన...దరహాసా = తనవారి గర్వమును బోఁగొట్టు చిఱునవ్వు గలవాఁడా = తన్నాశ్రయించినవారే స్వజనులు. శ్రీరాములు కోఁతులను స్వజనులని చెప్పియుండ నొక కులంబున నొకచోటఁ బుట్టి పెరిఁగి కూడ నుండి సమానవృత్తిగల మేము నీకు స్వజనులమే కదా. కావుననే మా దుఃఖమును బోఁగొట్టవలసిన బదనాయము నీయందున్నది. కొంచెము నీవు మాతో నుండఁగనే మీరు గర్వించితిరే. ఇట్టి గర్వగర్భితుల సహవాస మెవఁడు చేయునందువేని నీవు చిఱునవ్వు చేతనే మా గర్వము నణఁపఁగల వీరుఁడవయ్యు గోరఁ బోవు దానికి గొడ్డలి వెదకిన ట్లింత ఘోరకార్యమున కొడిగట్టి ముఖము తప్పింపవలయునా? సఖా = సమానముగాఁ బలుకఁబడువాఁడు సఖుఁడు. (ముక్తదశయందు శుద్ధాత్మ భగవత్కల్పుఁడని భావము.) నీవు మేము సమానులమని గర్వించితిమి గాని స్వామి భృత్యన్యాయము ననుసరింపక పోయితిమి. దానికిఁ దగిన శిక్ష గావించితివి. మేము యోషలము = పురుషసాంగత్యము గలది యోష. కావున మేము నీ సాంగత్యములేక నిలువఁజాలము. అనఁగా జీవులకు భగవంతుఁడే ధారకుఁడు పోషకుఁడు కావున నే నీ కింకరులము = ఏపని చెప్పిన నాపని చేయువారము. స్వతంత్రాభిమాన శూన్యులము. భగవంతుఁ డొకఁడే పురుషుఁడు తక్కిన జగత్తంతయు స్త్రీప్రాయమను నూక్తి యీ గీతలయందు సర్వత్ర యన్వయింపవలయును.

♦ స్వతంత్రాభిమానముచే నింతవఱకుఁ జెడుట నిశ్చయము. అట్టి యభిమానము పాపహేతువు గావున మేము పాపాత్మకుల మగుట నిజము. అయినను నంజలి యొగ్గి వేడుచున్నారము. నీవో నమస్కరించు వారి పాపములఁ బోఁగొట్టువాఁడవు.

లగునవియు, ఫణిఫణార్పితంబైనవియు, నగు నీ పదాంబుజంబులను మా కుచంబుల మోపి మా హృదయతాపం బార్పుము.

♦కమలాక్షా! వీనులకు విందై, బుధుల డెందంబున కానంద సంధాయకమైన నీ తియ్యని పలుకులచే మోహితలమైన యీకింకరీ జనంబులకు వీరా! నీ యధరామృతంబునఁ దృప్తిఁ గూర్పుము.

కావున మా పాపములను బోఁగొట్టును. నక్రతోయ మంజలి యున్నట్టు లంజలి యందు విశేషప్రభావము కలదు. ఎట్లు బోఁగొట్టు ననెద వనఁగా నీ శ్రీపాదములు మా హృదయమున నిలుపుటచేత, కుచములనఁగా హృదయములని భావము. హృదయ స్థానమందుండు కుచములను హృదయ పర్యాయముగఁ జెప్పుట సంప్రదాయము. "మధు తిష్ఠతి వాచి యోషితాం హృది హాలాహలమేవ కేవలమ్। అత ఏవ నిపీయతే ఽధరో హృదయం ముష్టిభిరేవ తాడ్యతే" అని భర్తృహరిచే హృదయకుచము లభేదములుగాఁ జెప్పఁబడెను. నీపాదము లెట్టివనఁగాఁ బాపములను నశింపఁ జేయునవి మాత్రమే కావు. కసవుతిను పశువుల వెంటఁబోవునవి — ఆవుల మేపునప్పుడని. కసవు తినునవి గనుకనే పశువులు జ్ఞానహీనమైనవి. అట్టివి యెచ్చటికిఁ బోయిన నచ్చటికి నీ పాదములు పోయి రక్షించుచున్నవి గాని నీవుండు చోటికి నవి వచ్చుటలేదు గదా. మేము నట్టి జ్ఞానహీనలమే. (జీవులకుఁ బశుసంజ్ఞ కలదు. పశుపతిత్యాదులు) కావున మా వెంట నీ వేల రావు? పశువులవెంట నవి నిన్నుఁ బ్రార్థింపకుండినను బోవుచుఁ బ్రార్థించు మాకు గోచరింప వేల? మీ హృదయములు చాలఁ గఠినములు. వానిపై నా మృదుపదములుంచిన నొచ్చు నందువా? పాములు క్రూరజంతువులు. అట్టి పామైన కాళీయుని శిరమ్మునందలి ఱాలగు రత్నములను ద్రొక్కిత్రొక్కి తాండవము నటించితివే. కోమలుల మగు మా హృదయపద్మంబు లంతకంటెఁ గఠినములా. నీ పాదములు శ్రీనికేతనంబులు. లక్ష్మీదేవి కమలవాసిని కావున నీ పాదములు పద్మములే కావునఁ దాపశాంతి గలిగించునవి యై యున్నవి. అట్టివాని మా హృదయముల నిలిపి వాని తాపం బార్పుము.

♦ విరహాగ్నిచేఁ గలిగిన హృదయతాపము నీ పాదములుంచుటయను లేపనౌషధముచేఁ జల్లారునో లేదో, కావున లోపలికి నీ యధరామృతమను మందిమ్మని కోరుచున్నారు. మోహితలము — మరణమునకుఁ బూర్వావస్థయగు మూర్ఛయందున్నవారము. చుంబనముచేతను నొకరి దేహములోని ప్రాణశక్తి మఱియొకరి దేహములోనికిఁ బ్రవేశించుట శాస్త్రీయము. అనుభవ విదితము.

*తప్తులైన వారికి జీవనమై, కవుల స్తుతికిఁ బాత్రమై, కల్మష హారమై, శ్రీమదాతతము శ్రవణమంగళమునైన నీ కథామృతంబుఁ దనివిదీరఁ గ్రోలువారెపో భూరిదులు. అయిన మత్కథామృత శ్రవణంబునం దృప్తివహించి యుండుఁడని వచించెదవేమో వినుము.

వల్లభా! తలఁచు కొలఁది సుఖమొదవించు నీ నవ్వులు ననురాగ దృష్టులు సంచారంబులు రహస్యచేష్టలు హృదయంబున నాటి

---

ఈయరాని దాని నెట్లు సూచించెద రందువేని వీరాభిదానధర్మ వీరా! నీ శయ్యారాబిది యొకటి గలదా. భక్తులకు నిన్ను నీ విచ్చుకొనుమండ్ర మా కథామృత మిచ్చి కొంతయని తాత్పర్యము.

*మార్యాదశయందుండు మీ రిప్పుడు నే నకథామృత మీయకుండిన నెట్లు బ్రతికెదరందువేని నీ పేరు కథలు చెప్పుకొని బ్రతికెద మనుచున్నారు. నీ కథామృతమునకు స్వర్గలోకమునందు నమృతమునకు వాసినెందు. నీ కథామృతము(1) తాపత్రయ తప్తులైనవారికి జీవనౌషధము కావుననే స్వతఃఫలరూపము. ఫలాంతర సాధనము (2) తప్తులు = జ్ఞానులు (తప ఆలోచనే) వారికి జీవనరూపము. కవులు = జ్ఞానులు సనకసనందనాదులు. కల్మషహారము = వినువారి, వినుపించువారి, స్మరించువారి పాపములఁ బోఁగొట్టునది, కథాసేవనము చేయువారికిఁ గలుగు విఘ్నరూప పాపముల నణచునది. నీ కథ విన్నంతమాత్రమున మోక్షము కలుగుమండ్ర నిఁక వర్ధవిచారము సేయువారి కెట్టి మేలుకలుగునో కదా. శ్రీమదాతతము = శ్రీమంతము. శాంతాదిగుణ సంపత్కరము. ఆతతము = సర్వత్రవ్యాపించినది. ఇట్టిది నీ కథామృతము. స్వర్గామృత మిట్టిగుణములు లేనిదై కొన్ని విరుద్ధగుణము లహంకార మదాదులు కలిగించునదియై యున్నది. భూరిదాతలు. (1) పూర్వజన్మమున విశేషముగ దానము చేసినవారు. అంతేకాదు సర్వార్థముల నొసఁగువారు. ఇట్టివారు మాకుమాత్రము జీవనదాతలు గాకుందురా. నీ కథామృతమంతే యింతటి మహాత్మ్యముండఁగా నిఁక నీ దర్శనాదులం దెట్టి మహిమయుండ నలయును? కావున నీ దర్శన స్పర్శన సంభాషణాదులఁ గోరెదము. అయిన నా కథామృతమును సేవించి యుండుమనెదవేమో యని దాని నుపాలంభించుచున్నారు.

కథామృతము = కథా+మృతము = మృతమే మృతిగావున నుద్దీపన విధమున మమ్ముం జంపునది. తప్తజీవనము = తప్తము గాఁగిన చమురువలె, జీవనము = నీటివంటిది. కవులస్తుతికిఁ బాత్రము = కవులు స్వప్రయోజనమైన దానినిగూడ విశేషముగ ననత్య

యో వంచకుఁడా! మా మనంబును గలవర పెట్టుచున్నవి. ధైర్య మవలంబించి సర్వంబును మఱచి యూరకుండు మనెద వేమో.

*అది యెట్లు శక్యంబగు? నాథా! మందనుండి యడవికిఁ బసులను తోలుకొని పోవునెడ నరవింద సుందరంబులగు నీచరణంబులు కసవుగంటులు పచ్చిక మొక్కలు దాఁకి నొచ్చునోయని కాంతా! చింతాకులిత స్వాంతంబుల మెంతయు సంతపించుచుందుము.

‡ దినాంతంబున నీలకుంతలంబులచే నాక్రాంతమై గోధూళి-

మునకు వెఱవక వర్ణింతురు కావున నట్టివారు నిన్ను నోటికి వచ్చినట్లు స్తుతింతురుగాని నిక్కముగ నిన్నుఁ దెలిసిన తత్త్వజ్ఞులు వర్ణింపఁ జాలరు.

శ్రవణమంగళము = వినికికి బాగుండుటే కాని యనుభవమునకు బాగుండదు. శ్రీమదాతతము = ఐశ్వర్య సౌందర్యగర్వముచే నంతట వ్యాపించినది. కావున నిట్టి నీకథను నెవరు మాకుఁ జెప్పుదురో వారు భూరిదులు = ఘాతుకులు (భూరి + ద (ద = అవఖండనే) కావున నీ కథాశ్రవణము చాలుఁ జాలునని భావము.

*నీవు మా కెదురుగా నుండినను మఱుఁగున నుండినను సంతాపమే కలిగించుచున్నాఁడవు. నాథా = గోకులరాజా! ఇది నీకుఁ దగదు. కాంతా = నీవు మాకుఁ గాంతుఁడవు కావున నరణ్యసంచారము చేయుటచే నొచ్చిన నీపదములకు సేవ సేయుట మాకుఁ దగును కావున వనసంచారము మాని మాకుఁ బ్రత్యక్షమగుము.

‡దినాంతము = అంతశబ్దము ద్వేషమును సూచించుచున్నది. పగలు కృష్ణసాంగత్యమునకు ననుకూలము కాదు కావున నది వేగిరము నాశము కానిమ్మని భావము. సాయంకాల ముద్దీపకము. మఱిమఱి = పసులమరలించు నెపంబునఁ జీటికి మాటికి నీ మోముఁ జూపి. గోపికలకు గోపవేషమునందు సుందరుని ముఖ ముద్దీపక మగును. మా మనంబుల = మన్మథుఁడు మనస్సున బుట్టువాఁడు గదా వాని చేష్టలకు మే మెట్లు ప్రతీకారము చేయఁగలము? స్మరుని = స్మరించుటచేతనే మనఃక్షోభము కలిగించువాని వీరా! = నీవు వీరుండవై యుండియు కుసుమ బాణునికి మమ్మప్పగించుట సరి గాదు. ఇట్టి పరాభవము నీకుఁ దగదు. సంయోగమునకు యోగ్యమైన రాత్రులందును నీవు మమ్ము మన్మథున కర్పించెదవే కాని నీయంగసౌఖ్యము నర్పింపవు. మేము నీయం దెంత యనురాగము కలవారమై యున్నారమో మాపట్ల నీ వంత వంచన గలవాఁడవై యున్నాఁడవని తాత్పర్యము.

*తప్తులైన వారికి జీవనమై, కవుల స్తుతికిఁ బాత్రమై, కల్మష హారమై, శ్రీమదాతతము శ్రవణమంగళమునైన నీ కథామృతంబుఁ దనివిదీరఁ గ్రోలువారెపో భూరిదులు. అట్లైన మత్కథామృత శ్రవణాంబునం దృప్తి వహించి యుండుఁడని వచించెదవేమో వినుము.

వల్లభా! తలఁచు కొలది సుఖమొదవించు నీ నవ్వులు నను రాగ దృష్టులు సంచారంబులు రహస్య చేష్టలు హృదయంబున నాటి

ఈయరాని దాని నెట్లు సూచించెద రందువేని వీరా—దానధర్మ వీరా! నీ కియ్యరానిది యొకటి గలదా. భక్తులకు నిన్ను నీ విచ్చికొనుచుండ మా కథామృత మిచ్చు టెంతయని తాత్పర్యము.

*మాహాభాగ్యదశయందుండు మీ రిప్పుడు నే నధరామృత మీయకుండిన నెట్లు బ్రతికెదరందువేని నీ పేరు కథలు చెప్పుకొని బ్రతికెద మనుచున్నారు. నీ కథామృతమునకు స్వర్గలోకమునందు నమృతమునకు వాసికెందు. నీ కథామృతము(1) తాపత్రయ తప్తులైనవారికి జీవనౌషధము కావుననే స్వతఃఫలరూపము. ఫలాంతర సాధనము (2) తప్తులు — జ్ఞానులు (తప ఆలోచనే) వారికి జీవనరూపము. కవులు— జ్ఞానులు సనకసనందనాదులు. కల్మషహారము — వినువారి, వినుపించువారి, స్మరించువారి పాపములఁ బోఁగొట్టునది, కథాసేవనము చేయువారికిఁ గలుగు విఘ్నరూప పాపముల నణచునది. నీ కథ విన్నంతమాత్రమున మోక్షము కలుగుచుండ నిఁక వర్ధ విచారము సేయువారి కెట్టి మేలుకలుగునో కదా. శ్రీమదాతతము — శ్రీమంతము. శాంతాదిగుణ సంపత్కారము. ఆతతము — సర్వత్రవ్యాపించినది. ఇట్టిది నీ కథామృతము. స్వర్గామృత మిట్టిగుణములు లేనిదై కొన్ని దుర్గుణము లహంకార మదాదులు కలిగించునదియై యున్నది. భూరిదాతలు. (1) పూర్వజన్మమున విశేషముగ దానము చేసినవారు. అందఱకు సర్వార్థముల నొసఁగువారు. ఇట్టివారు మాకుమాత్రము జీవనదాతలు గాకుందురా. నీ కథామృతమంటే యింతటి మహాత్మ్యముండఁగా నిఁక నీ దర్శనాదులం దెట్టి మహిమయుండవలయును? కావున నీ దర్శన స్పర్శన సంభాషణాదులఁ గోరెదము. అట్లైన నా కథామృతమును సేవించి యుండుమనెదవేమో యని దాని నుపాలంభించుచున్నారు.

కథామృతము — కథా+మృతము — మృతమే మృతిగావున సందీపన విధమున మమ్ము జంపునది. తప్తజీవనము — తప్త=కాఁగిన చమురువలె, జీవనము=నీటివంటిది. కవులస్తుతికిఁ బాత్రము— కవులు బ్రహ్మయోజనమైన దానినిగూడ విశేషముగ ననత్య

యో వంచకుఁడా! మా మనంబును గలవరపెట్టుచున్నవి. ధైర్యమవలంబించి సర్వంబును మఱచి యూరకుండు మనెదవేమో.

*అది యెట్లు శక్యంబగు? నాథా! మందనుండి యడవికిఁ బసులను తోలుకొని పోవునెడ నరవింద సుందరంబులగు నీచరణంబులు కసవుగంటులు పచ్చికమొక్కలు దాఁకి నొచ్చునోయని కాంతా! చింతాకులిత స్వాంతంబుల నెంతయు సంతపించుచుందుము.

‡ దినాంతంబున నీలకుంతలంబులచే నాక్రాంతమై గోధూళి-

మునకు వెఱవక వర్ణింతురు కావున నట్టివారు నిన్ను నోటికి వచ్చినట్లు స్తుతింతురుగాని నిక్కముగ నిన్నుఁ దెలిసిన తత్త్వజ్ఞులు వర్ణింపఁ జాలరు.

శ్రవణ మంగళము = వినికికి బాగుండునే కాని యనుభవమునకు బాగుండదు. (శ్రీమదాతతము = ఐశ్వర్య సౌందర్యగర్వముచే నంతట వ్యాపించినది. కావున నిట్టి నీకథను నెవరు మాటిమాటికిఁ జెప్పుదురో వారు భూరిదులు = మహాఘాతుకులు భూరి + ద్రద = అవఖండనే) కావున నీకథాశ్రవణము చాలుఁ జాలునని భావము.

*నీవు మాకెదురుగా నుండినను మఱుఁగున నుండినను సంతాపమే కలిగించుచున్నాఁడవు. నాథా = గోకులరాజా! యిది నీకుఁ దగదు. కాంతా = నీవు మాకుఁ గాంతుఁడవు కావున నరణ్యసంచారము చేయుటచే నొచ్చిన నీపదములకు సేవ సేయుట మాకుఁ దగును కావున వనసంచారము మాని మాకుఁ బ్రత్యక్షమగుము.

‡దినాంతము = అంతశబ్దము ద్వేషమును సూచించుచున్నది. పగలు కృష్ణ సాంగత్యమునకు ననుకూలము కాదు కావున నది వేగిరము నాశము గానిమ్మని భావము. సాయంకాల ముద్దీపకము. మఱిమఱి = పసులమరలించు నెపంబునఁ బూటికి పూటికి నీ మోముఁ జూపి. గోపికలకు గోపవేషముననుండు సుందరుని ముఖ ముద్దీపక మగును. మా మనంబుల = మన్మథుఁడు మనస్సున బుట్టువాఁడు గదా వాని చేష్టలకు మేమెట్లు ప్రతీకారము చేయఁగలము? స్మరుని = స్మరించుటచేతనే మనఃక్షోభము కలిగించు వానిని వీరా! = నీవు వీరుండవై యుండియు కుసుమ బాణునికి మమ్మప్పగించుట సరి గాదు. ఇట్టి పరాభవము నీకుఁ దగదు. సంయోగమునకు యోగ్యమైన రాత్రులందును నీవు మమ్ము మన్మథున కర్పించెదవే కాని నీయంగసౌఖ్యము నర్పింపవు. మేము నీయందెంత యనురాగము కలవారమై యున్నారమో మాపట్ల నీవంత వంచన గలవాఁడవై యున్నాఁడవని తాత్పర్యము.

పుష్పాదులు గ్రమ్మిన తుమ్మెదల యెమ్మెగల పద్మమ్మును బోలిన నీవద నమ్ము మఱిమఱి చూపి వీరా! మామనంబుల స్మరు సుద్దీపింపఁ జేయుదువు.

*భక్త కామదంబును, బ్రహ్మపూజితంబును, భూమికి నలంకారంబును, నాపదలందు ధ్యేయంబును, సేవాసమయంబున సుఖదంబునునగు నీపాద పంకజంబు నాధి హారా! మాస్తనంబులపై నుంపుము.

♦ సురత వర్ధనంబును, సర్వదుఃఖ నాశకంబును, సుస్వరయుక్తంబైన వేణువుచే లెస్స చుంబితంబును, నరులను నన్యరాగముల మఱపించునదియు నగు నీ యధరామృతంబును వీరా! మాకొసంగుము.

‡ కృష్ణా! నీవు పగటి నడవిఁ జరించుచుండఁగా నిన్నుఁ జూడని వారికిఁ గ్రుటి యొకయుగంబుగ నుండును. సాయంకాలమున నీవు మరలి వచ్చునెడ నుంగరములనంటి ముంగురులచేఁ జెలంగు నీ శ్రీముఖము దర్శించు మాకు మఱిమాలిన బ్రహ్మదేవుఁడు కనుఱెప్పలేల యడ్డపడఁ గల్పించెనో.

*ఆధిహారా! = మనోవేదన నణఁచు వాడా!

♦ అన్యరాగములను = సార్వభౌమత్వము మొదలు బ్రహ్మత్వము వఱకుఁ గల యానందములను; నరులను = మగవారికతి యిట్టిదైయుండ స్త్రీలగతి యేమి? అందు మాగతియెట్టిదై యుండకలదు?

‡నిన్నుఁ జూచినంతమాత్రమునఁ గలుగు సంతోషము, చూడకుండినఁ గలుగు దుఃఖము చెప్పశక్యము గలవారము కాము. నిన్నుఁ జూడనివారికి = మందలోనుండు నెల్ల వారికి క్షణమొక యుగముగ నుండును. ఇఁక మా కెట్లుండునో నీవె యూహింపుము. మరలి నీవు వచ్చినపుడు నిన్నుఁ జూచు సమయంబున ఱెప్పలు పలుమాఱు వ్రాలి మాదృష్టికి విఘ్నము గలిగించుటచే మాకు నెంత దుఃఖము కలుగునో యదియు మేము చెప్పఁజాలము. నిన్నుఁ జూచు కార్యమునకు విఘ్నముగఁ గను ఱెప్పలు కల్పించిన బ్రహ్మదేవుఁడు నిశ్చయముగ మూఢుఁడే. కనుఱెప్పవెట్టక నిన్నుఁ జూచువారే ధన్యులని తాత్పర్యము. సీతాదేవియు రాముని విషయమై యిట్లే చెప్పెను.

* పతులు సుతులు బంధుతతులు భ్రాతృవరులు వలదు వలదు పోవలదని వారించినను నిలువక యచ్యుతా! నీ గీతము విని మోహిత లమై నీ సమీపంబునకు వచ్చితిమి. గతి యెఱింగియు నో ధూర్తుఁడా నీవు తప్ప మఱి యెవ్వ రీ రాత్రికాలమున యోషలమగు మమ్ము నట్టడవి దిగవిడిచి పోదురు!

‡ సంకేతముల తోడి నీ సర్మాలాపంబులును, గామోదయం

* మగలు లోనగు వారి నతిక్రమించి నీ దిక్కుగాని విన్నుఁ జేరితిమి. అచ్యుతా — స్వభావగుణము వదలనివాఁడా! ధూర్తుఁడా! నీవు మమ్ము రాత్రికాలమున విడిచి పోయితివి. నీవు చేవిడిచిన మాగతి యేమగునో నీ వెఱుఁగుదువు. గీతమువిని మోహితలమై — వేఁటుగాని పాట విని వచ్చు నాఁడుజింకలవలె వచ్చితిమి. నీ గీతము మోహన మంత్ర ప్రాయమగుటచే మోహితల మైతిమి. మా పేరుపెట్టి వశ్యమంత్రము పాడి మమ్ము రప్పించుకొని చేరవచ్చిన పిమ్మట మాగతి యెఱింగి కను మొఱఁగితివి. పురుషాశ్రయముఁ గోరిన యబలలను నర్ధరాత్ర వేళ నడవిలో నీవంటి ధూర్తుఁడు తప్ప మఱెవ్వఁడు విడుచును? ఎట్టి ధూర్తుఁడైనను వంచనచే లభించిన దానిని గ్రహించునుగాని విడువఁడు. కావున నీవు ధూర్తులలో ధూర్తుఁడవు. అంతియ కాదు.

‡ గీ "తనువు మనువు విడిచి తనయులఁ జుట్టాల. నాలి విడచి సంపదాల విడిచి; నన్నెకాని యన్య మెన్నదు నెఱుఁగని, వారి విడువనెట్టి వారినైన." అనియు "మిత్రభావముచేఁ జేరవచ్చిన వానిని నెట్టియినను వదలను" అనియు "ఒకటసారి నీ వాఁడను నేనని యన్నంతమాత్రమున వానికి భయ మిచ్చెదను" అనియుఁ జెప్పిన నీవు సర్వము వదలి నీకై వచ్చిన మమ్ము విడనాడుట ధూర్తత్వము కాదా.

"సకలభూత శరణ్యుని విన్నుఁ జేరితి, నిను శరణంబుఁ జొచ్చితిని నెయ్యుర లంక సిరిం ద్యజించితి। మనుజవరా! భవదీయము మత్సుఖ జీవిత రాజ్యభోగముల్" అను విభీషణ శరణాగతి వాక్యమునకు గోపికల వాక్యములకు భేదము లేదు. సర్వధర్మములను బరిత్యజించిన నన్నొకనినే శరణంబు నొందుమని భగవద్వాక్యము కలదు గదా. కావున నిది యత్యంత భక్తియుక్తుల శరణాగతి వాక్యము. ఇందు రాత్రి యనఁగా నజ్ఞాన బంధురమైన లోకవ్యాపారము "సర్వభూతముల కేది రాత్రియో యందు సంయమి మేలుకొని యుండును' అనుచోట నేరాత్రి చెప్పఁబడెనో యిందదే రాత్రి యని భక్తిపర్యాయమున గ్రహింపవలయు. అచ్యుతా — శరణాగత రక్షణధర్మమును వదలనివాఁడవని నమ్మితిమి.

బును, ప్రహాసనమున భాసిల్లు ముఖంబును, ప్రేమదృష్టులును, శ్రీనివాసంబైన విశాల వక్షస్థలంబును జూచిచూచి కోరికలు కొలఁదులు మీఱ మనం బవశ మగుచున్నది.

*కృష్ణా! విశ్వమంగళమైన నీ యవతారంబు వనౌకసులకును, వ్రజమునకును పాపము నాఁపనే కదా! కావున నీవయి మనంబు నిలిపి నిన్నే కోరు నీవారి మనోరోగమును హరించు నౌషధంబును గొంచె మిమ్ము.

♦ ఓ కృష్ణా! యతిసుకుమారంబులైన నీ పదాంబుజంబులు మా కఠిన కుచతటంబులు దాఁకి నొచ్చునోయని భయపడుచు భయ

---

*విశ్వమంగళము = సమస్తశుభముల నిచ్చునది. వనౌకసులకు=ఋషులకు, వ్రజమునకు = మందయందలి మాకు. పాపము = దుఃఖము. భక్తపక్షమున వ్రజమునకు= దేహములకు. వనౌకసులకు = కపులకు వలెఁగాఁ గ్రోఁతులవలె నిలుకడలేని మనస్సులకు, పాపము నణఁచుటచే మనోవాక్కాయ కృతపాపములను నాధి వ్యాధులును జెప్పఁబడెను. ఇట్టివానినెల్ల నణఁచుటకే కదా నీ వవతరించితివి. ఇంతవఱకుఁ దమకోరిక యిట్టిదనియైనఁ జెప్పుకొనమైరి. పరమభక్తులు మోక్షముఁ గూడ నపేక్షింపరు గావున నట్టి కోరికయు వదలి యోగక్షేమభారము భగవంతునియందే వైచి స్వతంత్రాభిమానము మాని మాకేది శ్రేయస్కరమో యని సర్వజ్ఞుఁడవగు నీకుఁ దెలియును గాని సంకుచిత జ్ఞానులమైన మే మెఱుఁగమని రక్షణభారము భగవంతునియందే వైచుచున్నారు.

♦గోపికలు ప్రేమాతిశయముచే విరహము సహింపఁజాలక విస్ఫుటిత హృదయలై యేడ్చుచున్నారు. భగవంతునిఁ దలఁచినపుడు కన్నీరు గాఱువఱకు భక్తి కుదిరినదని చెప్పవలనుపడదు కావున భక్తియందుఁ గన్నీరు కార్చుట పరకాష్ఠ. తమకష్టమును దాము సహింతురు గాని లోకులు తమకుఁ బ్రాణపదంబైన ప్రియులకుఁ గలుగు కష్టమును గొంచెమైనను సహింపఁజాలరు. అట్లే గోపికలును కృష్ణా! యింతవఱకు మాకుచము లతికఠినములని నీపాదములు కోమలములని మాకుచస్పర్శవలన నీపాదము నొచ్చునోయని భయపడుచుండువారము. ఇప్పుడు నీపాదములు ముండ్లలోఁ ఱాలలోఁ దిరుగుటచే నవశ్యము నొచ్చి యుండును. గాయములను వేఁడి పదార్థములతో గాచుట చికిత్సాలక్షణము కావున నిప్పుడు నీవు వచ్చితివేని వేఁడిమి గల మా స్తన

పడుచు మెల్లమెల్లగ నెద ధరించు వారము. అట్టి నీవు ముండ్లకంపలు, తీఁగలు గల ఘోరకాంతారంబులఁ గాలినడఁ దిరుగుట జేసి మం తయు నీయందు నిలుపుకొనియుండు మాకు నెంత తాపము కలిగిం చునో నీవెఱుఁగ వైతివి కదా.

అని యిట్లు గోపికలు కృష్ణవియోగంబు సహింపఁజాలక తద్దర్శనంబు గోరుచుఁ బాడుచు ననేకవిధంబులఁ బ్రలపించుచు నెలుంగెత్తి సుస్వరంబున నేడువం దొడంగిరి. అప్పు డప్పురుషోత్తముండు కరుణాళుండై వికసితవదనారవిందుండును, పీతాంబరధరుండును, హారవిహారమనోహరవక్షుండును, సాక్షాన్మన్మథ మన్మథుండునై వారిప్రోలఁ బొడసూపె.

ఇట్లు వచ్చిన ప్రియతముం జూచి ప్రీతిచే వికసించిన కన్ను దమ్ములు గల యా యబలలు ప్రాణములు వచ్చిన యవయవముల

ములచే నీ పాదముల నొప్పిపోవఁ గాఁచెదము. మా స్తనములు కఠినములని మీరే యంగీకరించితిరే. ఇప్పుడు నేను పడుబాధ చాలక కఠినపదార్థములతో నొత్తి మఱింత బాధ కలిగించెదరా యనకుము. మా కన్నీటిధారలు కఠినశిలల నైనఁ గరఁగించును. కావున దైన్యముచే గన్నీటిధారలచే మా యంగసంఘములన్నియు శిథిలములైనవి. కాఁచి నిటునద్దిన లోహములు మెత్తఁబడినట్లు తాపాతిశయముచేఁ గాఁగి కన్నీటిధారలచేఁ దడిసిన కారణమున మా యంగములు మృదువులైనవి. కావున నీ విప్పుడు వచ్చితివేని మేము మునుపటి భయము విడిచి నీపాదములను మాస్తనములందు యథేష్టముగా వహింతుము. శ్రీరాముని దేహము ఖరుని బాణములచే గాయపడినపుడు సీతాదేవి యాయనను గౌఁగిలించుకొని తన స్తనములచేఁ గాఁచెనని శ్రీమద్రామాయణంబునఁ గలదు. భక్తిపక్షమునఁ గఠిన కుచములనఁగా భక్తిదయాశూన్యములయిన హృదయములు. తొలుత భక్తి యుదయించునపుడు తాము చేసిన పాపములను దలఁచి యజామిళునివలె "దారుణ మోహాంధకార పూరితుఁడను హరివిస్మయ స్మరణార్హమతినె" యని తలంచుట స్వభావము. అట్టి కల్మషహృదయములోఁ బరమపవిత్రమైన హరిచరణము లెట్లు నిలుపుటయని యూఁదోఁచును. కావునఁ గొంచెము కొంచెముగా భయముతోనే భగవంతుని ధ్యానించును. క్రమక్రమముగాఁ బ్రీతి యతిశయించు కొలఁది నది తొలఁగి పోవును.

వలె నిండ నొక్కసారి చివాలున లేచి యాయన ముఖలావణ్యామృతంబును నయన పాత్రంబులఁ గొని త్రావి త్రావి తచ్చరణధ్యానంబున సాధువులవలె సంతృప్తిలేని వారైరి.* ఒకతె యంజలిచేఁ గృష్ణుని కరాంబుజంబు గ్రహించె. ఒకతె చందన భూషితంబైన యతని బాహువును దన భుజంబులపై నుంచుకొనియె. ఒకతె యాయన చర్విత తాంబూలంబు కరంబులఁ గొనియె. ఒకతె యాయన పాదకమలంబు స్తనంబుల ధరించె. ఒకతె ప్రేమాతిశయముచే వివశయై దంతములు గొఱుకుచు బొమ ముడి వైచి కటాక్షబాణములచేఁ గొట్టు నట్లు చూచె. హరిచరణసేవ యెంతచేసియుఁ దృప్తి నొందని భక్తుల విధంబున ఒకతె తన్ముఖారవిందమరందపానంబున దనివి గొనదయ్యె. ఒకతె నేత్రరంధ్రమార్గంబునఁ గృష్ణుని లోఁగొని హృదయంబునఁ బదిల పఱచి మరలి పోకుండనో యనఁ గన్నులు మూసికొని దేహమంతయుఁ బులకరింప యోగివలె నానందంబున మునిఁగి యుండె.

ఆ కోమలాంగు లందఱుఁ గేశవాలోకనంబునఁ గలిగిన పరమోత్సవంబున నత్యంత సుఖ మనుభవించుచు భగవత్సాక్షాత్కారంబు గాంచి తాపత్రయ ముక్తులైన మహాత్ములవలెఁ దాపంబుఁ బాసిరి. శోకంబులు వాసి వాసిమీఱు నా భాసురాంగులచే వాసుదేవుఁడు శక్తులచేఁ జుట్టఁబడిన పరమపురుషు వలె విరాజిల్లెను. అంత నక్కాంతలనెల్లఁ దోడుకొని యాగమలాకాంతుండు విరిసిన మొల్లల పారిజాతంబుల కమ్మని వలపులు వెదజల్లుచు, మెల్లన మెల్లంపుఁ బిల్లవీవలులు వీవ, వానిచే నాకర్షింపఁబడిన తుమ్మెదలు జుమ్మని రాఁగ, శరత్కాలపు వెన్నెలలు చీఁకటుల జోపుచుండ, శివకరంబై, యమునా

*చంద్రావళి, శ్యామల, శైల్యా, పద్మ, రాధ, విశాఖ, భద్ర యను నెనమండ్రు గోపికలు ముఖ్యలు. ప్రహ్లాద సంహితయందుఁ జంద్రావళికి మాఱు ధన్యయను పేరు కానవచ్చెడి.

నది యలలను హస్తములచే సమంబుగ నెఱపినట్లుండు సన్నని మెత్తని యిసుక పోసఁగిన తలంబునకుఁ బోయెను.

అచ్చట గోపికలు భగవంతుని బ్రతిపాదించుటచేఁ బూర్ణకాము లైన శ్రుతులవలె భగవద్దర్శనంబునఁ గలిగిన యానందంబున హృదయ తాపంబుఁ బాసి కోరికలు నిండార ఫలింపఁ గుచకుంకుమ పంకంబున సంకలితంబైన తమ పయ్యెదల నేలఁ బఱచి యాత్మబాధు వైన గోవిందున కాసనంబుఁ గల్పించిరి. యోగీశ్వరుల హృదయం బుల నాసనంబుఁ గల్పించుకొని యుండు నమ్మకుందుం డందు గోపీ జన మధ్యంబునఁ ద్రైలోక్యలక్ష్మి కేకస్థానమైన రూపంబు ధరించి కూర్చుండి యుండె. అంత నయ్యంగనలు కంతుజనకునిఁ దమ చిఱు నగవులతోడి చూడ్కులచేతను, గనుబొమ్మల కదలికల చేతను సం తోష పఱచి యతని పదంబులు తమ తొడలపై నిడుకొని హస్తంబుల నొత్తుచుఁ జనవు మెఱసి యించుక కోపంబున నిట్లనిరి.

కొందఱు తమ్ము ననుసరించి కొలుచువారిని బదపడి కొలు తురు. కొందఱు పరులు తమ్ముఁ గొలువకున్నను వారిని దాము గొలు తురు. మఱికొందఱు తమ్ముఁ గొలిచినవారిని గొలువనివారిని గూడఁ దాము గొలువరు. కృష్ణా! వీరిలో నెవ్వరు మేలు చెప్పుమా చూత మనిన భగవంతుఁ డిట్లనియె.

ఓ సఖులారా! యొకరికొక రుపకార ప్రత్యుపకారము లొనర్చు వారు కేవలము స్వప్రయోజన ముద్దేశించి యట్లు చేయువారు గదా. అట్లగుటఁ దమ మేలునకై పరుల కుపకరించు వారియందుఁ బ్రీతి ధర్మంబు లనునవి కల్ల.

ఇఁకఁ దమ్ముఁ గొలువని వారిని గొలుచు వారు తల్లిదండ్రుల వలె దయావంతులు. వీరియందుఁ బ్రీతియు ధర్మంబును నిరప వాదంబై యుండు.

ఇఁకఁ గొందఱు తమ్ముఁ గొలిచినను మరలఁ దాము గొలు

వరు. అట్టివారు తమ్ముఁ గొలువనివారిని గొలువరని చెప్పనేల? ఇట్టి వా రాత్మారాములు ఆప్తకాములు. అకృతజ్ఞులు గురుద్రోహులు *

ఓ చెలులారా! నేనును నన్ను భజించువారికి వెంటనే గోచరించు వాఁడనుగాను. దానికిఁ గారణము వారికి నిరంతర మెడఁదెగని మచ్చింత సమకూర్చుటకే యని తెలియుఁడు. ఎట్లన:నిర్ధనుండగు వానికి ధనమబ్బి యది నష్టమైన నతఁడు తచ్చింతాపూర్ణుఁడై యితర కార్య మొకటియు నెఱుఁగకుండుఁ గదా? ఇట్లు నిరంతరధ్యాన మొనగూర్చుట కృతఘ్నత యగునా? ఇది యుక్తమిది యయుక్తమను విచారము వదలుటచే లోకంబును, నిది ధర్మ మిది యధర్మ మను విచారము వదలుటచే వేదంబును, స్నేహంబును వదలుటచే బంధువులను, విడచి నన్ననువర్తింప మీరు వచ్చితిరి. అట్టి మీకు నిరంతరధ్యానంబున నాయందు మనస్సు స్థిరపడుటకు మఱుఁగుపడియు మీ సమీపమునందే యుంటిని. ఇది దయ లేమి యగునా? కావునఁ బ్రియులారా! మీ ప్రియుఁడనగు నాపై మీకు కోపింపఁ దగదు. వదలుటకు సాధ్యముకాని గృహము లనుసంకెలలను పీడఁ దన్నుకొని నన్ను మీరు నిష్కపటముగఁ గొలిచిన యుపకారమునకు బదులు బ్రహ్మాయువు పర్యంతము ప్రయత్నించినను బ్రత్యుపకారము చేయ నాకు సాధ్యము గాదు. కావున మీ సాధుత్వంబే మీకుఁ బ్రతిఫలంబై మీ సంసార శృంఖలములను మూలముట్టుగ వదలించును గాక.

—: శ్రీకృష్ణుండు గోపికలతో రాసక్రీడ గావించుట :—

ఈ ప్రకారము భగవంతుఁ డాడిన మృదు మధురంబులగు వాక్యంబుల విని తదంగసంగంబున నా యంగనలు పూర్ణకాములై యాయన యెడఁ బాటువలనఁ గలిగిన తాపంబు వదలిరి. అంతఁ

*ఆత్మారాములు = (1) కేవలము స్వదేహమును మాత్రము పోషించుటయం దాసక్తిగలవారు (2) పరాక్ దృష్టిగల వారు. ఆప్తకాములు = కోరిన భోగ్యవస్తువు లెల్ల దండిగనుండుటచే విషయములు కనఁబడినను వానియందుఁ గోరిక లేనివారు

కృష్ణుండా పులినతలంబునఁ బ్రీతులై యొకరి బాహువు లొకరు పట్టుకొనిన స్త్రీరత్నంబులచేఁ జుట్టఁబడినవాఁడై రాసక్రీడ నాడ నారంభించెను. * అప్పుడు గోపికామండల మండితంబై రాసోత్సవంబు ప్రవర్తిల్లెను. యోగీశ్వరుండైన కృష్ణుండు బహురూపంబులు ధరించి యిరువురు గోపికలనడుమఁ దానును, దన రెండురూపంబుల నడుమ గోపికయు నుండునట్లును, ప్రతిగోపికయుఁ గృష్ణుఁడు తన సమీపంబుననే యున్నవాఁడని తలఁచునట్లు‡ వలయాకారంబుగ నిలిచి మెడలపైఁ జేతులువైచి క్రీడింప నౌత్సుక్యాతిశయంబులగు మనంబుల దేవతలు సభార్యులై మింట నిలువ వారి విమానంబుల కాకాశంబున నెడము లేకుండెను. అంతట మింట దుందుభులు మొరసెను. పుష్పవృష్టి కురిసెను. వినువారి వినుపించువారి పాపములఁ బాపు గోపాలదేవుని కీర్తిని జేడియలతోడి గంధర్వపతులు పాడిరి. రాసమండల

* స్త్రీలొకరి చేతు లొకరు పట్టుకొనిరి. కాని కృష్ణుఁ డెవ్వరిచేతులు పట్టుకొనలేదు. కృష్ణుఁడు గోపికల మెడలపైఁ జేతులు వైచెను. ఇట్లుండుట రాసక్రీడ లక్షణము.

యోగేశ్వరుఁడు = అచింత్యాద్భుత శక్తికి యోగమని పేరు దానికి నీశ్వరుఁడు ప్రభువు

‡ కృష్ణుఁడు తన సమీపంబుననే యున్నవాఁడని తలఁచునట్లు = ప్రతిగోపికకుఁ బ్రక్కఁ గృష్ణుఁడుండునట్లును అని స్పష్టముగఁ జెప్పక 'వారు తలఁచునట్లని చెప్పుటచేఁ గృష్ణమూర్తి యొకఁడే యనియుఁ దక్కిన కృష్ణరూపంబులు యోగమాయా కల్పితంబులనియు నెఱుంగవలయు. గోపికలు తన యొద్దకు వచ్చినపుడు వారి ప్రతిబింబములను వారిపతులకుఁ గనఁబడఁజేసి తృప్తులఁ గావించినట్లు పెక్కు కృష్ణరూపంబులతో గోపికలకుఁ గాన వచ్చెనని తలంపవలయును. గాదేని మూలబల సంహారకాలమున (శ్రీ)రాముఁడు గమనవేగముచేఁ బ్రతిరాక్షసునకు నొక్కొక్క రామమూర్తిని గనిపింపఁజేసిన ట్లిచ్చటను గృష్ణుఁడును గావించెనని యెఱుంగవలయును. కృష్ణుని చేతు లెవ్వరు పట్టుకొనకయుండుటచే స్వతంత్రించి యిష్టము వచ్చినట్లు తిరుగ వీలుండెను. గోపిక లిట్లు భ్రాంతలగుటకు వారి యానందమోహమే కారణము. కొఱవిని ద్రిప్పినప్పుడు నిండు నగ్నిచక్రము తెలియునట్లు కృష్ణుఁ డొక్కఁడే సర్వత్ర యున్నట్లుఁ గోచరించెను.

యందలి నందనందనుతోడి యిందుముఖుల కంకణములయు నందెలయు మొలనూలి చిరుగజ్జెల రవళి క్రందుకొని సందడించె. ఆ బంగరు బొమ్మలవంటి కొమ్మలనడుమ, ♦దేవకీసుతరత్నమ్ము హేమరత్నహారమ్మునందలి మరకతనాయక మణివలెఁ బ్రకాశించెను. తాలలయంబులకుఁ సరిగ నడుగు లిడుచు, నర్థావబోధకంబుగఁ జేతులు త్రిప్పుచు చిరునవ్వులు నవ్వుచుఁ, గనుబొమ లల్లార్చుచుఁ, గుచభారంబుల గ్రుంగిన నడుములు, సడలిన కుచపటంబులు, చెక్కుల నర్తించు కమ్మలు, చెమ్మటలు గ్రమ్ము మోములు, జారుక్రొమ్ముడులు నౌడ్డాణంబులునై కృష్ణవధువులు పాడుచు మేఘచక్రమందలి మెఱపు తీఁగలవలె బ్రకాశించిరి.*

ఆ మధురకంఠులు గుణరతిప్రియలు కృష్ణస్పర్శనంబున ముదితలై యాడుచు నెలుంగెత్తి జగంబును సంగీతరవంబున నించిరి.

ఒకతె కృష్ణునితో సమంబుగ స్వరజాతులు మిశ్రంబులు గా

---

♦నడుమ — స్త్రీలందరు చక్రమువలె నిలబడియుండ నా చక్రము నడుమ కంఠస్థానంబున రాధాసహితుఁడై కృష్ణుఁడు చుట్టిచుట్టి తిరుగుచుండెనని యూహింపవలయును. 'ఇత్థమాకల్పితే మండలే మధ్యగః సంజగౌ వేణునా దేవకీ నందన" యని కృష్ణకర్ణామృతము. ఇది బిల్వమంగళోక్తి యని తోమణిసారంబున గలదు.

*మేఘచక్రంబునందలి మెఱుపుఁ దీఁగలవలెనని యుపమానము చెప్పుటచే మేఘమునకు మెఱుపుఁ దీఁగలకట్లు స్వభావ సంబంధము గలదో యట్లే కృష్ణునకు గోపికలకు స్వభావసంబంధము గలదని యెఱుంగవలయును. కావుననే గోపికలు కృష్ణవధువులని చెప్పఁబడిరి. వధూశబ్దమునకు భార్యయని యర్థమును గలదు. వధూనరులనుట కలదు కదా. "వధూ ర్నవోఢా, స్నుషయో, ర్భార్యా, స్త్రీశారిబాసుచ" అని నిఘంటువు. కృష్ణభార్యలని చెప్పుటచే రాసమండలమందలి స్త్రీ లందఱు భార్యాపదయోగ్యలని యెఱుంగవలయు. వీరిలోఁ గొందఱుఁ బతులున్నట్లు ముందు చెప్పఁబడెను గదా వారు జారిణులు గారాయని సందేహము తోఁచవచ్చునుగాని గోపికలు కృష్ణుని బలుమాఱు 'వరద' యని సంబోధించుటచేఁ దత్త్వము విచారించిన నట్టి సందేహము తొలఁగుచున్నది.

కుండఁ బాడి సంతోషించిన కృష్ణునిచే మెప్పు వడసెను. ఆ మెప్పువడల పలుకునే యా కులుకులాఁడి ధ్రువతాలంబునఁ బాడి కృష్ణునిచే బహూకరింపఁబడెను. ఒక్కరామ రాసకేళి మలసియలసి సొలసి చేతి కంకణంబులు మల్లియలు రాలఁ జెంతనున్న శ్రీకాంతుపైఁ జేయి వైచి నిలఁబడెను. ఒక చందనగంధి తన భుజంబుపైనున్న గంధపుఁ బూఁత గల శ్రీకృష్ణ హస్తంబును మూర్కొని దాని కలువల వలపులకు మేను పులకరింప దాని ముద్దిడికొనియె.

ఒక చంద్రవదన నటన కారణంబునఁ జలించు కుండలంబుల కాంతుల నలంకృతంబయిన చెక్కిలిఁ గృష్ణుని చెక్కిటం జేర్చి తాంబూలపుఁదమ్మ నతని నోర నుంచెను. ఒకతె యాడుచుఁ బాడుచు నందెలు మొలనూలు మొరయ నలసి పార్శ్వంబుననున్న శ్రీకృష్ణు శివకరంబైన కరంబును దన పయోధరంబుల నుంచుకొనియె. శ్రీకాంత కేకాంతవల్లభుఁ దమ కాంతుఁగాఁ బడసి గోపకాంత లమ్మానసా మానవుండు తన కరంబులఁ దమ కంఠంబులఁ గౌఁగిలింపఁ బాడుచు విహరించిరి. వీనుల యందలి కలువలయు ముంగురులయుఁ గైసేఁత గల కపోలంబులందలి చెమటబొట్లచే నందమైన ముఖబింబముల డంబును, కంకణనూపుర ఘోషవాద్యంబును, కురులనుండి యురలు విరుల సరులును రాణింప భ్రమరగాయకులు గల రాసగోష్ఠి యందు నందవ్రజ సుందరులు నందనందనుతో నర్తించిరి ఇట్లు కవుంగిలింతలు, తాఁకుడులు, నెయ్యపుఁ జూపులు, చిట్టంటుచేఁతలు, నవ్వులు వీనిచే లక్ష్మీవల్లభుండు *బాలుండు తన ప్రతిబింబముతో నాడుకొను నట్లు గోపికలతోఁ గ్రీడించెను.

---

*లక్ష్మీవల్లభుఁడైనను లక్ష్మితోఁ గ్రీడింపక= గోపికలతోఁ గ్రీడించుటచే నామె కంటె వీరి నధికురాండ్రఁగ భగవంతుఁడు సమ్మానించెనని భావము.

బాలుండు...క్రీడించెను=సర్వోత్కృష్ట గుణలావణ్యవంతుఁడగు భగవంతుఁ డెక్కడ లక్ష్మీదేవివలె నాయనతో సమముగఁ గ్రీడింప నడవులఁ బుట్టిపెరిఁగి పశువుల

అనంగజనకు నంగసంగంబునఁ బొంగిపోరలు ముదంబునఁ బరవశలైన ముదితలు చెదరిన కురులు, జారు చీరలు, సడలిన కుచపట్టికలు, త్రేలు మాల్యాభరణములు, మరల సవరించుకొననైన శక్తులు గారైరి.

---

మేపుకొనుచుఁ బశుప్రాయులై యుండు గొల్లెత లెక్కడ? ఇట్టి యనాగరికలు కృష్ణుని భార్యలుగా నుండఁదగుదురా యను సంశయమును బోఁగొట్టుటకై యీయుపమానము చెప్పబడెను. దీనివలన గోపస్త్రీలు సర్వకళా లావణ్యసౌశీల్యమాధుర్యాది గుణంబులఁ గృష్ణునకు సరియైనవారని బింబప్రతిబింబ భావంబున నేర్పడుచున్నది. చూచుటకు బింబప్రతిబింబము లేకాకృతిగాఁ గదా యుండును. కావున వీరు కృష్ణభార్యలుగా నుండఁదగుదురని యేర్పడెను. గనుకనే పూర్వము గోపవధువులని చెప్పక కృష్ణవధువులని శుకుఁడు చెప్పెను. ఉపమానసారస్యంబున గ్రహింపవలసిన విషయములు కొన్ని గలవు. 1) ప్రతిబింబమునఁ గానవచ్చు సౌందర్యాదులన్నియు బింబసంబంధమే యైనట్లు గోపికలయందలి సౌందర్యాది విలాసములన్నియుఁ గృష్ణునివే యనియు, నాయనయే వారిని వారియందుఁ బ్రవర్తింపఁజేసెననియుఁ దెలియఁదగు. (2) తన సౌందర్యాది మాధుర్యమును నద్దమునఁ జూచి పురుషుఁ డానందించునట్లు లీలావిభూతి నాయకుండైన కృష్ణుం డానందించెనని. (3) ప్రతిబింబములు చేతనారహితములై యుండును. వానియందుఁ గానవచ్చు చైతన్య చిహ్నములు బింబమునందలివే. ప్రతిబింబము కదలవలయునన్న బింబము కదలవలయును. కావునఁ బ్రతిబింబమునకుఁ బ్రాణభూతము బింబమే. ఇంతకుఁ జిదచిత్తులకు ధారకుఁడు పోషకుఁడు ప్రేరకుఁడు నీశుఁడు నీశ్వరుఁడే కదా. కావున రాసలీల భగవంతుని చిద్విలాసము. (4) బాలుఁ డాడుకొనునట్లని చెప్పుటచే బాలునియందుఁ గామాదిగుణము లేనట్లు కృష్ణునియందుఁ గామాదిగుణములు లేవనియు నీలీల పల్లెటూళ్ళ స్త్రీపురుషుల కోలాటమువంటి వినోదక్రీడయనియుఁ గామప్రేరితుఁడై కృష్ణుఁడిది కావింపలేదనియు నెఱుఁగ వచ్చును.

అడవిలోఁ బుట్టి పెరిఁగి పశువుల మేపుచుఁ బశుప్రాయులైన గొల్లస్త్రీలకు నభినయగాంధర్వ నృత్యాదిశాస్త్రంబులందు నిరుపమమైన పాండిత్య మెట్లు లభించెనని సందేహము కలుగును. కృష్ణ కరస్పర్శమాత్రముననే కుబ్జ ప్రమదోత్తమ యయ్యెనని యిందు చెప్పఁబడును. అట్లే యిచ్చటను శ్రీకృష్ణహస్త స్పర్శమున గోపికలకు భగవంతుని సంతోషింపఁజేయు నంతటి విద్యాబుద్ధికౌశలము లభించుటేగాక విణ్మూత్రమల పూరితములై యపవిత్రములైన వారి దేహములు దివ్యములు పవిత్రములునై భగవంతుఁడు భోగించుటకుఁ బాత్రము లయ్యెనని యెఱుంగవలయు.

కృష్ణలీలావిలాసంబు నాలోకించుచున్న సురతరుణులు కామపీడితలై మూర్ఛిల్లిరి. చంద్రుఁడు తారాగణవృతుండై విస్మితుండయ్యె. గోపిక లెందఱో యన్ని రూపములు దానుధరించి భగవంతుఁ డాత్మారాముఁడయ్యు లీలఁగా వారితోఁ గ్రీడించెను. ఇట్లు విలాసకేళీవిహారంబున గాసిపడిన యా యిందువదనల ముఖారవిందంబులను దయాళుండైన కృష్ణుండు ప్రేమచే సుఖావహమైన తన కరతలంబునఁ దుడిచెను. ఆ దర్శనీయ విగ్రహు నఖ స్పర్శములచే సంతోషయుక్తలైన గోపికలు చలత్కుండల కుంతల రుచులచేఁ బ్రకాశించు కపోలకాంతులచేతను, నమృతంబు గురియు చిఱునగవు సోయగపుఁ జూపుల చేతను, హృదయేశ్వరు సమ్మానించి యతని లీలల గాన మొనర్చిరి. రాసకేళిం గాసిపడిన యా సరోజాక్షుల యాయాసంబుఁ బాప నెంచి, వారి యంగంబుల రాపిడి నలంగి కుచకుంకుమ పంక సంకలితంబైన తన వనమాలిక వాసనలకు మూఁగి మింట నెంటనంటి వచ్చు గంధర్వపతులంబోలి దుమ్మెదలు గాన మొనర్ప, భిన్న మర్యాదుండై *నొడ్డులురలంద్రోచి యాఁ డేనుఁగుల పిండుతో సరోవరంబుఁ జొచ్చు మదపు టేనుఁగువలె, నా గోపకాంతలతోడ లక్ష్మీకాంతుండు యమునా హ్రదంబుఁ జొచ్చె.

ఇట్లు జలంబులఁ జొచ్చి యచ్యుతుండు యువతి జనులు చుట్టుముట్టి ప్రేమరసంబునఁ దడుపుచుఁ జల్లుచల్లిన వారి నుల్లసంబాడుచుఁ జల్లుపోరాడుచు, వైమానికులు కుసుమవర్షంబుఁ గురియించుచుఁ బొగడుచుండ నాత్మారాముఁడైన భగవంతుండు గజేంద్రలీల జలక్రీడ సలిపెను. ఇట్లు జల కేళి సలిపి వన కేళి కుత్సహించి యమునాతీరారామంబులలో జలస్థలప్రసూనంబుల పరిమళంబుల గొని మలయానిలుండు మందయానంబులు గావించు తలంబున

---

*భిన్నమర్యాదుండై=భిన్నరతి మర్యాదుఁడై యనఁగా లీలార్థత్వము గావించినవాడై.

భ్రమరాంగనలు ముసురుచుండఁ గరేణుపరివృతంబైన మత్తమాతం
గంబు నంగున సంచరించెను. ఇట్లు సత్యకాముఁడైన భగవంతుఁ
డనురక్తలైన గోపికలం* గూడుకొని కావ్యకథారసాశ్రయంబులైన
శరత్కాలమందలి వెన్నెలరేల† నూర్ధ్వరేతస్కుండై‡ క్రీడించె.
అనినఁ బరీక్షిన్నరేంద్రుండిట్లనియె.

మునీంద్రా! ధర్మసంస్థాపనము నధర్మక్షయంబును గావింప జగ
దీశ్వరుండు భగవంతుఁడు నిజాంశంబున నవతరించెఁ గదా? ధర్మ
మర్యాద వచించువాఁడును దత్కర్తయు రక్షకుండును నగు నప్పరమ
పురుషుఁడే పరదారలతోఁ గ్రీడించుట యను నధర్మం బెట్లు గావించె?
అవాప్తకాముఁడు యదుపతి యిట్టి నింద్యకర్మముఁ గావించు నభిప్రాయ
మేదియో సర్వజ్ఞా! నా సందియంబుఁ దీర్పుమనిన§ శుకయోగీంద్రుం
డిట్లనియె.

---

*అనురక్తలైనగోపికలు — ప్రీతిగల గోపస్త్రీలనుటచే నీక్రీడకుఁ బ్రీతి కారణ
మనియు దుష్కామము కాదనియు నేర్పడుచున్నది.

†కావ్యకథారసాశ్రయంబు లనుటచే నిందుఁ గావ్యరసమునకు విరుద్ధమైన
దేదియుఁ జెప్పఁబడలేదని తాత్పర్యము. శరత్కాలమందలి వెన్నెలరేల ననుటచే
వెన్నెలయున్న సమయంబునందే బహిరంగముగ నీక్రీడ జరిగెననియుఁ జీకటులందు
జరుగు జారిణీ జారవృత్తంబిది గాదనియు నేర్పడుచున్నది.

‡ఊర్ధ్వరేతస్కుండై — ఇంద్రియస్ఖలనములేక యనుటచేఁ గృష్ణుఁడు జితేంద్రి
యుఁడనియుఁ గావుననే కామరహితుఁడనియు దృఢపడుచున్నది. దీనివలన మీఁదఁ
జెప్పంబడిన దంతయు స్పర్శన చుంబనాలింగనాది బాహ్యరతిమాత్రమేయని గ్రహింప
వలయు.

§పరస్త్రీలను దాఁకుట దోషముగదా. భగవంతుఁడై ధర్మసంస్థాపనమునకైయవ
తరించినవాఁడై జితేంద్రియుఁడై యవాప్తకాముఁడై ధర్మనిరతులయిన యాదవులకుఁ
బతియైయుండు వాఁడు ధర్మవిరుద్ధముగఁ దోఁచు కార్యము చేయునా? చేసియుండఁడు.
కాని యాయనచేసినది స్థూలదృష్టికిఁ బాపకార్యమని యజ్ఞులకుఁ దోఁచును. కావునఁ
గృష్ణుఁ డేయుద్దేశముతో నా కార్యము చేసెను. దాని తత్త్వము సర్వజ్ఞుఁడవైన నీ
వెఱుంగుదువుకాని మాబోఁటి వారెఱుఁగఁ జాలరు కావున నెఱింగింపుమని ప్రశ్న.

ఈశ్వరునివంటి మహా తేజస్వులయందు ధర్మమునకు వ్యతిరిక్తమైన చర్యయు సాహసంబును గాన వచ్చుచుండును. అయినను నగ్నికి సర్వభక్షకత్వంబు దోషంబుగాని పగిది తేజోవంతుల* కవి దోషావహములు గావు. ఈశ్వరుండుగాని వాఁడట్టికార్యంబు లోనర్ప మనస్సునస్సైనఁ దలఁప రాదు. అటుగాక మూఢత్వంబున నటు లాచరించెనేని యవశ్యము నశించు. రుద్రుండు సముద్రంబున జనించిన విషంబు పానంబు చేసెఁగదా. నేనును జేసెదనని యెవ్వఁడేని యటుగావించి బ్రతుకఁ గలఁడా? ఈశ్వరులవాక్యమే ప్రమాణము గాని వారి నడవడి యంతటి ప్రమాణము గాదు. వారి వాక్యముల కనుకూలించెనేని వారిచర్య యవశ్యగ్రాహ్యము. వారి వాక్యములకు విరోధించెనేని వారిచర్య బుద్ధిమంతులకు గ్రాహ్యంబు గాదు. బంధహేతుభూతమైన యహంకారమును నిర్మూలించిన మహాత్ములు పుణ్యకార్యము చేయుటవలన నొక లాభముగాని దానికి విరోధమైన కార్యము చేయుటవలనఁ గీడుగాని నొందరు. మహాత్ములైన తేజస్వులకే పుణ్యాపుణ్యములు గలుగవని సిద్ధాంతమయి యుండ నిఁక నీశితవ్యంబులైన పశుపక్షి మనుష్యదేవతాది సకల జీవులకు నియామకుండైన భగవంతునకు సుకృత దుష్కృతఫలము లనునవి యన్వయింపవని వేఱ చెప్పవలయునే? కర్మవశమున దేహమొందియు నెవ్వని చరణకమలరజంబు సేవనంబునఁ దృప్తులైన మునులు యోగప్రభావంబున నఖిల కర్మబంధంబుల నెల్లఁ బొల్లువడఁజేసి శాస్త్రాచార బద్ధులు గాక యిచ్చవచ్చినట్లు చరించుచుండ నిజసంకల్పంబునఁ దనువు ధరించిన భగవంతునకు బంధ మెక్కడిది? గోపికలకు వారిపతులకు సమస్త దేహులకు సంతరాత్మయై చరించువాఁడును, వారివారికిఁ గర్మాను

---

* తేజోవంతులు = కర్మపరతంత్రులు గానివారు. బ్రహ్మేంద్రబృహస్పతి విశ్వామిత్రాదులవంటివారు. ఈశ్వరుండు కానివాఁడు = దేహాది పరతంత్రుఁడు. కర్మఫలములఁ దప్పించుకొను శక్తిలేని వాఁడని భావము.

గుణములైన సుఖదుఃఖఫలంబుల నిచ్చువాఁడును, భగవంతుఁడు నగు కృష్ణుండు క్రీడార్థంబు మనుష్యదేహంబు ధరించుచుండు. ప్రాణికోటుల * ననుగ్రహింపఁగోరి మానుష దేహంబును బరమాత్ముండు ధరించిన వాఁడయ్యె. అట్టి యమ్మహాత్ముని క్రీడల వినుచు ధ్యానించుచు సేవించుచు నాయనయందే మనస్సు నాసక్తితో నిల్పిన వారగుదురు. మనుష్య దేహధారణం బనుగ్రహం బెట్లంటివేని యని ర్వాచ్యుండును ననిర్దేశ్యుండును నగు తాను జనులకు నగోచరుండై సర్వదా యుండెనేని సంసారతారణకారణంబైన తననామ సంస్మరణాదులు వారికి దుర్లభం బగుట యోజించి పరమ కృపాతిరేకంబున వారియందు దయించి మెలఁగుచు వారికి నింద్రియగోచరంబై ప్రియంబైన చేష్టలు చేసినచో వారు ప్రీతిమెయి వానిని స్మరించి తరింపఁగల వారని సంకుచితాత్మ ప్రభావుండై యు పామరులలోఁ గలసిమెలసి తిరుగుచు వారిచేష్టలంబోలు చేష్టలుచేసి వారికిఁ దనయం దనురాగంబు కల్పించుట యనుగ్రహంబు గాక వేఱది యగునే? ‡ కృష్ణ మాయా మోహితులైన గోపకులు తమతమ భార్యలు తమపజ్జలఁ బరుండినట్లు తోఁచుటచేఁ గృష్ణుని గోపింపరైరి. బ్రాహ్మముహూర్తంబు ప్రాప్తింప ననుమోదన పూర్వకంబుగఁ గృష్ణుండనుప నిష్టము లేకయు భగవత్ప్రియలైన ♦ గోపికలు వారివారి యిండ్లకుఁ బోయిరి. విష్ణుండు గోపి

---

* ప్రాణికోటులు — కాములు మొదలు ముక్తులవఱకు.

‡ దీనివలన గోపికా కృష్ణులయందుఁ గులటా జారాదిశబ్దము లన్వయింపవనియు దోషరహితులయందు దోషారోపణము చేయుట పాపావహమనియు శుకుల యభిప్రాయము.

♦ భగవత్ప్రియులు — ఏస్త్రీలకు భగవంతుఁడు ప్రియుఁడో వారు భగవత్ప్రియులు. భగవంతునికి ప్రియులగు వారును భగవత్ప్రియులే యగు. మోదనము — మగల మిమ్ముఁ గూడెదనని ప్రతిజ్ఞ పలుకుట వాని స్తుతించుట సమాధాన పఱచుట లోనైనవి. కృష్ణుఁడు చెప్పుటచే వారు గృహంబులకుఁ బోయిరిగాని మున్ను కలిగిన గృహాదులందు మరల నాసక్తి జనించి కాదు. భగవత్సంగమసుఖమును రుచిగలుగునే?

కలతోఁ గ్రీడించిన కామవిజయరూప రాసక్రీడను శ్రద్ధతో విను వాఁడును వినుపించువాఁడును భగవంతునందుఁ గామంబు జయింప గల పరభక్తిఁ బొంది శీఘ్రకాలంబునఁ బూర్ణంబుగ హృదయతాపంబు లెల్లఁ బాయు.

—: వేణుగీతలు :—

ఆవులమేప గోపాల చూడామణి యైన కృష్ణుండు వనంబుల కేగినతఱి నతని వెంటన చనిన మనములు గల గోపికలు వియోగ తాపంబునఁ గృష్ణలీలలు పాడుచు వారిలో వారిట్లు ముచ్చటించుచు నెల్లెల్లో పగళ్లుపుచ్చుచుండిరి. గోపికలారా! యెడమమూఁపుసోఁక నెడమచెక్కిలి వంచి కనుబొమ్మ లాడించుచుఁ గెమ్మోవిపై వేణువుల మోపి దాని రంధ్రమార్గంబులను గోమలాంగుళుల మూయుచుఁ దెఱచుచు స్వరంబులఁ బుట్టించుచు గాంధర్వం బెసఁగించుట మఱవరుగదా? ఆట్టియెడ నాకాశమార్గంబున విమానంబులపైఁ జను వనితలు తమపతులైన సిద్ధుల సన్నిధినుండియుఁ దద్గానంబు విని దేహంబుల మఱచి లజ్జతోడ మదనశరంబులకు గుఱియైన చిత్తంబులతోఁ దత్తఱపడుచు బోకముడులు సడల మోహాపరవశలైరి. ఇట్టి కృష్ణుని వియోగంబు మన మెట్లు సహింపఁ గలము. అనిన మఱియొక గోపిక యిట్లనియె.

అబలలారా! యింతకంటెను జిత్రము వినుఁడు. ఔరా! చిఱునవ్వు వెన్నెల యురంబునందలి ముత్తెపు సరులతో నెత్తమ్ములాడ మేఘంబు నడిమి క్రొమ్మెఱుఁగన లక్ష్మీదేవి విరాజిల్ల, నార్తజన సుఖదుండయ్యు మనకు విశేషదుఃఖకారణుండై నందనందనుండు మురళీరవంబు వఱప మందయందలి గోవృషభ బృందంబు లడవుల హరిణంబులు దూరంబునంద యా నాదంబు విని యొడ లెఱుఁగక కొఱికిన పూరి నోటియందె యుండ వీనులు నిక్కించి కదలక మెదలక నిద్ర

పోవువానివలెఁ జిత్తరువులోని ప్రతిమలవలెఁ జేసియుంచిన బొమ్మల వలె నుండెనుగదా?

సఖులారా! వింటిరా యంతకంటెఁ జిత్రంబు. నెమలి పురులను, గావిజాలరంగులను, జిగుళ్లను ధరించి పరిక రయుక్తుఁడైన నల్లఁ బోలి బలరామునితోఁ గూడి వేణునాదంబున గోగోపాలకుల గోవిందుండు పిలువ గంధవహుండు గొనివచ్చు తత్పాదపరాగంబు లభిలషించి నదులు గమనంబు చాలించి పుణ్యహీనలమైన మనవలెఁ గేవల ప్రేమచేఁ గంపించు తరంగహస్తంబుఁ జాచి నివ్వెరపడి నట్లు కదలని నీటితో నుండుఁగదా! కాంతలారా! యీ చిత్రము మీరు కంటిరిగాదే.

అనుచరులు గన్నుగింప నాది పురుషునివలె శాశ్వత విభూతి యుక్తుండై వనసంచారంబు సేయుచుఁ గృష్ణుండు వేణునాదంబునఁ బేరులుపెట్టి యావులఁబిలువ వనలతలు తరువులు తమయందు విష్ణుం డుంట తెలుపనో నా భక్తులవలెఁ బుష్పఫలభారముల నేలకు వ్రాలి ప్రేమహృష్టశరీరంబుల మధుధారలు వర్షించెను! కోరా చిత్రము.

సుందరులారా! సుందరచూడామణి యైన నందనందనుండు మిళిందంబులు క్రందుకొని వనమాలయందలి దివ్యసౌరభ భరితతులసీ దళంబుల మరందంబు గ్రోలి మత్తిలి యానందంబున గీతగానంబు నెఱప ముదంబంది వేణునాదంబు గావింపఁ గనులాకరంబులు నాడు సారస హంసాది విహంగంబులు తన్మధుర రవంబున నాకృష్ణ చిత్తంబులై వచ్చి హరికథలు వినుభక్తులవలె నేకాగ్రమనంబునఁ గన్నులు మోడ్చి సద్దుచేయక యారా హరిని సేవించుచుండు. అహో యా? యంతమా త్రము చేయని మన మెంత హీనభాగ్యలమో కదా?

వ్రజాంగనాముఖులారా! యురమున విరులసరులు వ్రేల పీనుల సందున నలరులగుత్తు లలర సవిలాసంబుగ బలరామునితోడఁ గూడి గిరులచఱుల విహరించుచు ముదితుండై లోకంబును వేణుగానంబున

ముదంబున ముంచుచుండ మింటనరుగు జలధరంబులు పెద్దల దాటి పోరాదను శంకచేఁ దాము గొడుగులవలెనై యాయనకు నీడలు కల్పించుచు గొప్పవారియెదుట నఱచరాదను మర్యాదఁబట్టి మెల్ల మెల్లనఁ గర్జించుచు జగదార్తిహారుండగు మిత్రునిపైఁ బువ్వువర్షంబు గురియించుచుండు.

యశోదా! నీ సుతుని మహిమ నేమని వర్ణింతుము. నానా గోపక్రీడా విశారదుండైన నీ తనయుఁడు తన యధరబింబంబున వేణువు మోపి స్వకపోలకల్పితంబులైన స్వరంబులఁ బెక్కువిధంబుల స్వరజాతులు సృష్టింప నానిని బలుమారు వినియు నింద్ర శంకర పరమేష్ఠు లేక చిత్తంబున మెడలు వాల్చి వీనులొగ్గి యాలకించి కోవిదు లయ్యుఁ దత్త్వ మిది యిట్టిదని నిశ్చయింపజాలక మోహితులై విభ్రాంతిఁ గొనిరి, ఇఁక మా బోంట్లఁ జెప్పనేల.

ధ్వజవజ్ర పద్మాంకుశ చిత్ర చిహ్నంబులచే భూషితంబులైన నిజపాద కమలంబులచే గోఖురాఘాతంబుల గాసిపడిన వ్రేపల్లె భూమికిఁ దాపంబు నణఁచుచు గజరాజగమన లీలావిలాసంబునఁ బాదన్యాసంబు గావించుచుఁ బోవుచుండు శ్రీకృష్ణుని సవిలాస విలోకనంబులచే మన్మథవశలమై మోహంబున నొడలెఱుఁగమిఁ జీరలు క్రొమ్ముడులు జారుట తెలియక వృక్షంబులవలె నిశ్చేష్టలమై నిలబడి యుండుదుము.

గోగణంబుల లెక్కింప ననువగునట్లు గూర్చిన మణులదండలు ధరించి యొకచో నావులనెల్ల నెన్ని యిష్టగంధమైన తులసీదామం బురంబునఁ గ్రాల సఖుని మూఁపుపైఁ జేయి వైచి వేణువు వాయింప నారవంబుచే వంచితచిత్తలైన కృష్ణగృహిణులు * గుణగణార్ణవుండగు

---

*కృష్ణ గృహిణులు– (1) ఆడులేళ్ళు. (2) కృష్ణు భార్యలు– ఇందుఁ జమత్కారముగ గోపికలు తమ కథ నన్యాపదేశముగఁ జెప్పు చున్నారు.

శ్రీకృష్ణునిఁ జేరి యింటియాశల విడిచివచ్చిన గోపికలవలెఁ గృష్ణు నెడఁ బాసి పోఁజాలక యనుసరించి యుండెడిని.

పుణ్యాత్మురాలా! నీబిడ్డఁడు మొల్లపూలసరంబుల నొయ్యారంబుగఁ గైసేసికొని గోగోపపరివృతుండై నెయ్యురకు హాస్యప్రదుండై యమునాజలంబుల విహారింప మలయమారుత స్పర్శచే మాననీయంబైన మందవాయువు లనుకూలంబులై వీచుచుఁ గృష్ణు సమ్మానించుచుండె. సిద్ధ విద్యాధరాదులు వాద్యగీత పుష్పవర్షాదుల నాయనను సేవించి స్తుతించుచుంటారు. వ్రజగోవత్సలుఁడై గిరిధరుండైన శ్రీవత్సలాంఛనుండు మార్గంబున వృద్ధుల యభివాదనంబు లంగీకరించుచు సాయం సమయంబున గోవులనెల్ల వేణునాదంబునఁ గలియఁ దోలుకొని యనుచరులు పొగడ మదన జ్వరంబున నష్టంబైన దృష్టిగల మా నయనంబులకు నుత్సవం బాపాదించుచు గోధూళి గలయనిండిన పూలదండలు వ్రేల సుహృన్మోదకరుండై దేవకీగర్భ కలశవారాశి చంద్రచంద్రుండు పొడతెంచెడు.

కాంతలారా! కించిన్మద ఘూర్ణితనేత్రుండై వన్యమాలధరుండై స్వసుహృజ్జనంబులకు మానదుండై కనకకుండల కాంతులచే దోర రేగుపండువంటి పాండువర్ణంబు గల చెక్కుళ్ల నలంకరించుచు యదుపతి గజరాజ గమనంబున దినాంతవేళ వ్రజగోధనంబునకు దురంత దిన తాపంబు హరించుచుఁ బ్రసన్న వదనారవిందుండై యిందునివలె వచ్చుచున్నవాఁడు.

అని యిట్లు గోపికలు తద్విరహ దశయందును గృష్ణలీలల ధ్యానించుచుఁ దదేక చిత్తలై కాయనయందే మనస్సంతయు నిలిపి తదేకాసక్తలైరి.

రుక్మిణి—అప్పా! కన్నులు తెఱచి తెఱవని చిన్ననాఁడే పూతనాశకటా
సురార్జున యుగ్మంబులను హింసించిన శ్రీకృష్ణుఁడు కంసుని
మాత్రముఁ జంపఁ జాలక వెఱచి నందుని మందకు వచ్చినాఁ

దనుట సరికాదు. యశోదా నందగోపికలు భక్తులౌట వారి
కానందముఁ గూర్చి వారిజన్మము సఫలముఁ జేయ వారియొద్దఁ
జేరెనని తలఁచెదను. సత్యమా?

తండ్రి—సత్యము – సాధుపరిత్రాణమునకు దుష్టశిక్షణమునకునై తా నవతరింతునని భగవంతుఁడు చెప్పెను గదా. ఆయనకు దుష్టుల శిక్షించుటకంటె శిష్టుల రక్షించుట ముఖ్యము గావున దానినే ప్రథమమునఁ జెప్పెను. కావుననే ముందఁ జేరెను.

గోపకుల రక్షించెను, చెట్టుకొట్టువాఁడు మొదటఁ గొమ్మలను నఱకి యావలఁ గదా బోదెను నఱకును. అట్లులే కంసుని సహాయుల నెల్ల ముందు ముందయం దుండియే వధించి యావలఁ గంసుని హింసించెను. ఒకే కార్యముఁ జేసిన రెండు ఫలములు గలుగవలఁ యునను న్యాయంబున గోకులమందుండి భక్తరక్షణము దుష్టశిక్షణము గావించెను.

ఇట్లుండ నొక్కనాఁడు దుర్వాసుండు యమునా తీరంబున నుండి యావలి యొడ్డున వసించు గోపికలను నే నాఁకట నలంగుచున్నాఁడను. పుణ్యసతులారా! నా కాహారంబుఁ బంపుఁడని వార్త బంపెను. అప్పుడు భక్తియుక్తలై యా గోపికలు వలసిన భోజ్యపదార్థములెల్ల సంతరించుకొని యవియుంచిన గంపల శిరంబుల నిడుకొని యమున యొడ్డులురల నిండి ప్రవహించుటచే దాఁటు వెఱవు గానక కృష్ణుం డాసి యిట్లనిరి. నందనందనా! యావలి తీరంబున దుర్వాసో మహాముని యాకలిఁగొని యన్నమునకై వార్తఁ బంపిన సర్వము సిద్ధముచేసి తెచ్చితిమి. నదిదాఁటు టెట్లు చెప్పుము. అనిన గృష్ణుం డిట్లనియె. తొయ్యలులారా! మీరు నదీతీరంబుఁ జేరి "దేవి కాళిందీ! శ్రీకృష్ణుం డస్ఖలితేంద్రియుండగు నేని మాకుఁ దెరు విమ్ము. అని ప్రార్థింపుఁ డనెను. వారట్లు గావించి దుర్వాసునకు భోజనంబిడి. మునీంద్రా మేము మా యిండ్లకుఁ బోవలయును. నది తరింపరాకున్నది.

ఏమి చేయుదుమనిన మీ రెట్లు దాఁటి వచ్చితిరని యాయన ప్రశ్నించెను. వారును శ్రీకృష్ణ వాక్యంబులు చెప్పిరి. అట్లైన దుర్వాసుఁడు నిత్యోపవాసియగు నేని యమునాదేవి మార్గమిమ్మని యడుగుఁడనిన వారట్ల కావించి మందపట్టు చేరి కృష్ణున కావార్త యెఱింగించి యీ రెండు చిత్రంబుల కబ్బుర పోయిరి.

— :కంసుండు రామకృష్ణుల వధింప నాలోచించుట: —

అరిష్టుండు గోష్ఠంబునఁ గృష్ణునిచే హతుండైన నక్కడ మధురాపురంబునఁ గంసునొద్దకు నారదుం డరిగి యిట్లనియె.

భోజరాజేంద్రా! యొక్క రహస్యంబు చెప్పెద వినుము. ఆ నాఁడు దేవకి యష్టమగర్భంబని నీ చేపసి చావకతప్పించుకొనిన కన్య యశోదపుత్రికయేకాని దేవకీ తనయ గాదు. కృష్ణుండు దేవకీనందనుండు. బలరాముండు రోహిణీపుత్రుండు. వీరిని వసుదేవుండు తన మిత్రుండైన నందునికడ నుంచిన వాఁడు. వారిరువురే సుమీ నీవారి నెల్ల వధించిరి. అనినఁ గంసుం డదరిపడి కోపంబున నింద్రియంబులు చలింపఁ గరవాఁడి కరవాలంబు గొని వసుదేవుం జంప లేచుటయు నతని నివారించి విరించి నందనుం డిట్లనియె.

రాజా! మతిమాలిన కార్య మేలచేసెదవు. ఆత్రగానికి బుద్ధి మట్టనుట నీయందు సార్థకమగు చున్నది. నిన్నుఁ జంపఁగలవాఁడు వసుదేవుఁ సుతుఁడుగాని వసుదేవుఁడు గాఁడు. కావున దుర్బలుండును నాశ్రితుండును నగు వసుదేవుఁ జంపిన నీకు నపకీర్తి తక్క రాఁగల లాభ మేమి? అంతియకాదు. తమతండ్రిమరణంబువిని రామకృష్ణులు మందవిడిచి యెందేని పరువెత్తుదురు. అప్పుడు వారిని గనుఁగొనుట దుష్కరము. వారు మఱియుఁ బెఱుఁగుకొలఁది దుస్సాధులగుదురు. కావున వారెట్టివారని నీకుఁ దెలియనట్లు నటించి నీకార్యంబు సాధించుకొనుము. వసుదేవు వధించి చెలియలి కేల వృథాదుఃఖంబుఁ

గల్పించెదవనిన నతండును సమ్మతించి వసుదేవు వధింపక భార్యతోడ నతనిఁ గారాగృహంబునఁ ద్రోచి యినుప గొలుసుల బంధించె.

అంత నారదుండు చనిన పదపడి కంసుఁడు కేశియను రాక్షసునిం బిలిచి రామకృష్ణులఁ జంపఁ బొమ్మని నియమించి ముష్టికచాణూరశల తోసలకాదుల మంత్రుల సామంతుల రయంబున నయంబునఁ బిలిపించి యిట్లనియె.

చాణూర ముష్టికులారా! వినుండు. వసుదేవు నందనులైన రామకృష్ణులు నందునిమందయందున్నవారు. వారినిటకు రప్పించెద. మీరు మల్లయుద్ధంబున వారిని వధింపవలయు. ఆ వేడుకచూడఁ బౌరజానపదుల నెల్ల రప్పింపవలయు. వారందఱుఁ గూర్చుండ మంచములమర్పవలయు. ఈవిధముగ మల్లరంగంబు సిద్ధపఱుప వలయు.

ఓయి మావటీ! యీ మల్లరంగ ద్వారంబున మద్దరకరంబైన కువలయాపీడ గజంబును నిలుపవలయును. రామకేశవులు డాసినంత నీవా యేనుఁగుచే వారి నిరువురఁ జంపింపవలయును. వింటివి గదా నావాక్యంబు లనిన భద్రుం డను నమ్మావటి యిట్లనియె.

రాజేంద్రా! నాయేలినవారు చెలియలి బిడ్డల నెట్లు వధింతురో నా మనస్సు పరీక్షింప నిట్టి కార్యంబునకు నియమించెదరో యనిన నెల్లరు వినఁ గంసుం డిట్లనియె.

—: కంసుండు తన జన్మవృత్తాంతంబుఁ దెలుపుట :—

సభ్యులారా! బంధువులందును నేను విరోధమూని చరింపఁ గారణంబు గలదు. మహాభాగయైన నాతల్లి యొక్కనాఁడు మంద మారుతంబు చల్లగ వీచుచుండ గృహోద్యానంబున విహరించుచుండెను. అది వసంత సమయమగుట నశోకవకుళ పూగపున్నాగంబులు వికసించి కన్నులకు విందు గొలుపుచుండెను. కోకిలల కుహూధ్వనులును దుమ్మెదల ఝంకారంబును నిండియుండెను. నెమళ్లాడు

చుండెను. మర్కటంబులు కిచకిచయనుచుఁ గొమ్మల దాఁటులు పెట్టు చుండెను. అట్టి మనోహర సమయంబున సుందరియు స్వలంకృతయు ఋతుస్నాతయు నగు నా జనని కామతప్తయై భర్తృం దలంచె. అట్టి సమయంబునందు భ్రమిలుండను గంధర్వుఁ డొక్కరుండు దంతి బ్రాతుండై చరించుచు నొంటిచరించు నా యమఁజూచి యామె కోరిక నెఱిఁగి యుగ్రసేను రూపంబుధరించి డాసిన నా పతివ్రతయు నది మాయ యగుట యెఱుఁగ నిజవల్లభుఁడని భ్రమించి యతనితో నస్వానంబున రమించె. అట్లు రమించు సమయంబున నామె యతఁడు తనమగఁడు గామియెఱిఁగి నితాంత ఖేదంబున నతనింజూచి యోరి వంచకుఁడా నీవెవ్వడవు, దురాత్ముఁడా! యిట్టి నీచకార్యమునకు నేల సాహసించితివి? ఏల పాపమున కొడిగట్టితివి? అనిన నతండు సమాధాన పఱచుచు నిట్లనియె.

అబలా రత్నమా! నేను గంధర్వుడను. దేవతాసముఁడను. ఇంద్రుని సహచరుఁడను. మనుష్యభోగ్యలైన నీ యట్టి స్త్రీలకు మేము సులభులము గాము. మనుష్యులు జనన జరామరణాది సకలాధి వ్యాధులకుఁ బాలుపడు వారు. మాకును మీకును దారతమ్యము మెండు. అనిన నాసాధ్వి కోపంబునఁ గన్ను లెఱ్ఱచేసి యోరి నీచుఁడా! చేయరాని చెడుపని చేసియు నూఱట మాటలాడెదవా? పుణ్యపాప సాక్షులైన భూమి జలము అగ్ని వాయువు ఆకాశము సూర్య చంద్రులు దిక్కు కాలము ధర్మము ఉభయ సంధ్యలను వీనిఁ దిరస్కరించి నన్ను మైలపరచితివి. నన మధ్యంబున విమలమైన పద్మినిని మదగజంబువలె నన్ను చెఱిచితివి. ఇట్లు చేసియు సురాధమా! స న్నేమని సమాధానపఱచెదవు! అనిన నతండు శాప భయంబున నిట్లనియె. కంజాక్షి! దేవతలు మహామహిములు. అట్టి వారు కొలందులైన మనుష్యులతో సంగమించుట యనులోమసంకరంబగు. అది దోషంబుగాదు. మనుష్యులు దేవతా స్త్రీలతో సంగ

మించుట ప్రతిలోమ సంకరంబు. అది దోషావహంబు. కావునన్ పంకజగంధీ! నేను నిరపరాధిని నమ్ముము. నా వీర్యంబు వృథపోదు. నీకు శ్రీమంతుఁడు ధీమంతుఁడు మహోత్సాహుండును నగు పుత్రుండు పుట్టు. నా మాట కల్లగాదనిన సుదుర్లభం బైన పాతివ్రత్యంబు చెడినని తపించు మాతల్లి నిర్మర్యాదుండును వృత్తహీనుండును బాపియు నున్మార్గవర్తియు నగునతనింజూచి యిట్లనియె.

క్రూరుఁడా! నీ వీర్యంబున జనించు కొడుకు గుణహీనుండై దేవద్విజ తపస్వులకు ననుగ్రాహ్యుండు కాకుండెడుఁ గాక యనినఁ గ్రుద్ధయైన యామె యెదుటనుండ భయపడి యతండట్లని నతండు నీ వారికి శత్రువగుఁ గాకయని యంతర్హితుం డయ్యె. నాతల్లియు గృహంబు ప్రవేశించి యావృత్తాంత మెవరికిఁ జెప్పక దాఁచె. ఆ యమ పిదప గర్భిణియై కాలాంతరంబున నన్నుఁ గనియెనని నారద మహర్షి యొకానొకప్పుడు నా కెఱింగించె. ఆ కారణంబున నేను బంధుల ద్వేషింపుచుండు. నే నిప్పుడు మాత్రమేగాక సదా బంధువిరోధి నగుటకు మీరే సాక్షులు. దుర్బుద్ధి యగు నుగ్రసేనుని దురాశయుండగు దేవకునిఁ గితవుండగు వసుదేవుని వారి యాశ్రితులను జంపుటవలన గంధర్వజాతుండనైన నాకు దోషంబు కలుగదు. అన్యరేతస్సునకు జనించినవాఁడు తండ్రిపై ద్వేషించునని శాస్త్రప్రమాణంబు గలదుగదా. కావున రామకృష్ణుల వధింపుఁడని పరుషంబుగ నాజ్ఞాపించితి. బాలురను మీరు గజంబుచేఁ ద్రొక్కించి వధించితిరేని వారివారు వారికిఁ బరలోకపూజలు గావించి వారిమార్గంబునఁ బోవుదురు. వసుదేవోగ్రసేన నంద దేవకులును, గోపాలయాదవులును, తనుబిడ్డల నేనుఁగు తనపాదంబుల నలిగులిగఁగలయ నలియఁ ద్రొక్కుచుండ నీరుగారు కన్నులఁ జూతురుగాక. నేను జెప్పినపద్ధతి మల్లరంగ మేర్పఱిచి పౌర జానపదుల నెల్ల రప్పించి పట్టపుటేనుఁగు వాకిట నిలిపి భద్రా! బాలుర వధింపుము. చతుర్దశినాఁడు యథావిధి

ధనుర్యాగం బుపక్రమింపుఁడు. ఇష్టప్రదుండగు భూతరాజునకుఁ బశువుల బలి యొసంగుఁడు.

{ —: కంసుం డక్రూరుని రామకృష్ణులఁ దేర :— నియోగించుట. }

అని యాజ్ఞాపించి యర్థతంత్రజ్ఞుఁడైన కంసుండు యదుపుంగవుఁడైన యక్రూరుం బిలిచి కేలు కేలఁగదించి యిట్లనియె. ఓహో దానపతీ! నీవు నాకు మిత్రుఁడవు కదా నీమైత్రి నెఱపు సమయంబు లభించె. ఆశక్తుఁ గాదుకొనువారే కదా మిత్రులనఁబడుదురు. వృష్ణి భోజులందు నీకంటె హితతముండు లేఁడు. ఇంద్రుండు తన కార్యంబు సాధింప విష్ణువు నాశ్రయించునట్లు సౌమ్యా నేను నిన్నొక గొప్ప కార్యంబు సాధింప నాశ్రయించితి. నీవు నందవ్రజంబునకుఁ బొమ్ము. అందున్న వసుదేవ నందనుల నిరువుర రథంబులపై నిడికొని తోడి తెమ్ము. ఆలసింపకుము. దేవతలచే వారు నాకు మృత్యువులుగఁ గల్పింపఁబడిరి. కావున వారిని నేనుఁగుకాళ్లఁ ద్రొక్కించి వధించెద. అది దప్పునేని జెట్టులతోఁ బోరించి చంపించెద. కావున నీవు బాలురను గోపులను నందునితోఁడఁ దగు నుపాయనంబులతోఁడను దోడ్కొని రమ్ము. వారినివధించిన యనంతరము వసుదేవాదులను వారి బంధువులను వృష్ణిభోజ దశార్హకులను వృద్ధుండయ్యు రాజ్యకాంక్ష సేయు నాతండ్రి నుగ్రసేనుని నతని తమ్ముని దేవకుని దక్కిన నా యహితుల నెల్ల హతులఁ జేసి మిత్రుఁడా! నిష్కంటకంబైన రాజ్యంబు సేనయేలెద. జరాసంధుఁడు నామామ. ద్వివిదుండు నాప్రియమిత్రుండు. శంబరనరక బాణాసురులు నాయందు స్నేహంబు పాటించియుందురు. వారి నెల్లరఁ గొని సురపక్షియులైన రాజుల నెల్ల వధింతు. ఇది నాయభిప్రాయంబు. కావున మధురయందలి ధనుర్యాగంబు నెపంబుగ రామకృష్ణులఁ దోడ్కొని రమ్మనిన నక్రూరుం డిట్లనియె.

రాజా! నీవు మృత్యువుఁ దప్పించుకొను మంచియుపాయంబు వెదకితివి గాని ఫలము దైవాధీనమగుట కార్యఫల లాభాలాభము లందు సముఁడ వగుము. అతి విశేషంబు వలదు. జనులు దైవోపహతంబులైన గొప్ప కోరికలు కోరుదురు. స్వసుఖార్థంబని కర్మంబు లొనర్చిన వానివలన దుఃఖమొందుటయుఁ గలదు. పరదుఃఖార్థముని కార్యంబు లొనర్చి తాము దుఃఖపడుటయుఁ దటస్థించు. ఏది యెట్లైనను నీయాజ్ఞ నెఱవేర్పఁ బోయెదనని నతని వీడుకొలిపి కంసుండు తక్కిన మంత్రులకెల్ల సెలవిచ్చి తన గృహంబున కరిగె. అక్రూరుండును దన యింటికిఁ బోయె.

—: కేశి సంహారము :—

అంతఁ గంస ప్రేరితుండైన కేశియను రాక్షసుండు గాఱు మబ్బువంటి నీల దేహంబును విశాల నేత్రంబులును భయంకరంబైన యాస్యరంధ్రంబును బెను మెడయునుగల గుఱ్ఱమై మనోవేగంబున ధరాతలంబు రేణుభూతంబుఁ గావించుచు సటాపటల విధూనవంబుల నభ్రవిమానంబులు పాటితంబులుగా హేషారవంబున నభంబు పగిలించుచు నదృష్టాత్ముండు కంసహితం బాచరింపఁగోరి నందవ్రజం బునకుఁ బఱచి గోకులం బాకులంబు గావించి తెఱవల వెఱపెట్టి కంచెలఁ ద్రుంచి సింహంబువలె ధ్వనించి యెదు రేగుదెంచిన కృష్ణు వెనుకటి పాదంబుల నెగసి తన్నిన నాతాఁకు తప్పించుకొని వాసుదేవుండు రోషించి నంచిరాడి యొడికంబున నాలుగు కాళ్ల నొడిసి పట్టుకొని గరుడుండు పామును జిమ్మువగిది దానాపగతుని నూఱువిండ్ల పెట్టు దవ్వు విసరివైచిన వాఁడును శోషిల్లిపడి తెప్పఱిల్లి తెప్పున లేచి కఱవ వచ్చెను. కృష్ణుండును దెఱచినోర బిలంబులోనికిఁ బాము చొరఁబాఱు తీరునఁ దన కరంబుఁ జొనుపుటయు నెఱ్ఱగఁ గాలిన యినుపసలాక తాఁకినట్లై యతని దంతంబులు దుల్లిపడియె. అంతియు

గాక యుపేక్షితంబైన రోగంబు వృద్ధిచెందునట్లు కేశినోరఁ గృష్ణ కరంబు వృద్ధియయి కంఠబిలంబును మూటిన నమ్మేటి యసుర యూపిరి తిరుగక తికమికలాఁ చెమ్మటమేను తడియ గ్రుడ్లు గిరగిరఁ ద్రిప్పుచు లద్దెపెట్టి నేలఁబడి ప్రాణంబులు విడిచె. పండిన దోసపండువలె బ్రద్దలు వారినయతని దేహంబునుండి కృష్ణుం డవలీలఁ దన భుజంబు వెలుపలికిం దీసె ఆ యద్భుతకర్మంబునకు సురలు విరులు గురియించిరి.

## —: నారదుడు శ్రీకృష్ణు దర్శింపవచ్చుట :—

అంత నారదుండు శ్రీకృష్ణుదర్శింపఁ జనుదెంచి యేకాంతంబున నిట్లనియె. కృష్ణా! అప్రమేయాత్మా! యోగీశ్వరా! జగదీశ్వరా! వాసుదేవా! అఖిలాధారా! సాత్వతప్రవరా! ప్రభూ! సమిధలయందగ్నియుండియు వానిగుణంబులకు లోబడనట్లు సర్వభూతంబులందు నీ వొకఁడవె లోనఁ బ్రవేశించి తద్వస్తువికారముల నొందకుందువు. గూఢంబైన యాయగ్ని మథనాద్యుపాయంబుల వెలికిఁ దోఁచురీతి యోగాద్యుపాయంబుల నీవును గోచరింతువు. హృదయకమలమందుండి సర్వసాక్షివై బ్రహ్మాది జీవవిలక్షణుండవై వారికెల్ల నీశ్వరుండవై యుందువు. నీవు స్వతంత్రుండవై నిజమాయచే మొదట గుణంబుల సృజించి వానిచే జగత్సృష్టి స్థితిలయంబుల సత్యసంకల్పుండవై కావింతువు. అట్టి నీవు భూమికి భారంబుగనుండు పాపజీవులైన దైత్యప్రముఖుల వధించి సాధులరక్షింప నవతరించితివి. ఎవని కంఠధ్వని విన్నమాత్రమున దేవతలు దివంబువిడిచి పారుదురట్టి కేశిని హయాకారంబు వహించిన యీరాక్షసు నవలీల వధించుట లోకభాగ్యంబు కాదె. రేపటికి మఱునాఁడు చాణూర ముష్టికులను మఱి కొందఱనెల్లను గజంబును గంసుని వధింప నేను వీక్షించువాఁడ. అవల శంఖయవన మురనరకాదుల వధింతువు. ఇంద్రుని బరిభవించి

పారిజాతంబు హరింతువు. వీర్యశుల్కలైన కన్యల వివాహమగుదువు. ద్వారకయందు నృగునకు శాపముక్తి గావింతువు. శ్యమంతకంబుతో భార్యను గ్రహింతువు. మరణించిన విప్రబాలకుల మరలఁ దెత్తువు. రాజసూయంబున శిశుపాలుని సంహరింతువు. దంతవక్త్రుని దుంత కాతుపాలి కనుతువు. మఱియు ద్వారకావాసుండవై నీ వనేకకార్యంబులాచరింతు వట్టి కీర్తియమానంబులైన వాని నెల్ల నేను గనులారఁ జూడఁగలవాఁడ. కాలస్వరూపుఁడవైన నీవు భూభారము నణంపఁ బార్థసారథివై యక్షౌహిణులఁ బొలియింతువు. కేవలజ్ఞానైకస్వరూపుఁడవును, నిరతిశయానంద స్వాత్మానుభవనిష్ఠచే నవాప్త సమస్తకాముఁడవును, నమోఘవాంఛితుఁడవును, నాత్మతేజంబున మాయాగుణప్రవాహంబును నిత్యంబు నివర్తించువాఁడవును భగవంతుఁడవగు నిన్ను భజించెదను. ఇతరాధారములు లేక నీకు నీవే యాశ్రయుండవై యుండువాఁడవును, నాత్మసంకల్పంబున సమస్త చిత్రవిచిత్రకల్పనంబు లొనర్చువాఁడవును విలాసార్థం బిప్పుడు యదువృష్ణిసాత్వతులందు మనుష్యవిగ్రహంబు గ్రహించినవాఁడవును నీశ్వరుఁడవు నగు నీకు నమస్కారంబు. అని యిట్లు భాగవతోత్తముఁడైన మునీంద్రుండు కృష్ణునకు నమస్కరించి యనుజ్ఞవడసి తద్దర్శనంబున కలరుచుని జెచ్చఁ జనియె. కేశవుండును గేశి నివధించి బాలురతోడఁ బసువులఁ బాలించుచు వానిని దోలుకొని మందకరిగె.

## —వ్యోమాసురవధ:—

అంతఁ గృష్ణుండు గిరులచఱుల గోపాలురతోడఁ బసువులఁ బాలించుచుండ సందుఁ గొందరు దొంగలై మేఁకగానుండు వానిని దాఁచుటయు పాలకులగు గొల్లలు దొంగలను బట్టుకొని మేఁకను గ్రహించుటయు నగు డాఁగురుమూఁతలాటల నాడఁ జొచ్చిరి. అప్పుడు మయపుత్రుండు మహామాయుఁడైన వ్యోమాసురుఁడు

గోపాల వేషంబు ధరించి మేకలుగానుండు వారి నెల్ల నపహరించి కొండగుహలయందుఁ దాఁచి యాబిలద్వారంబును బెద్దగుండుచే మూసివచ్చుచుండెఁ. ఇట్లు నలువు రేవురు తప్పఁ దక్కిన గోపాలు రందఱు కానరాకుండుటయుఁ గృష్ణుం డాలోచించి తత్త్వంబెఱింగి గోవుల హరించికొని పోవువాని సింహంబు తోడేలిఁ బట్టినట్లు పట్టిన వాఁడును నిజరూపంబు ధరించి కొండంత మేను పెంచి తప్పించుకొని పోవ యత్నించియు సామర్థ్యంబు చాలక చిక్కువడుటయు రెండు చేతుల వానినేలఁ ద్రోచి మింట వేల్పులు చూచుచుండఁ బశువును వధించినట్లు వధించి గుహలోనున్న గోపాలుర నెల్ల వెలికిఁ దోడ్కొని వచ్చి మేలుమేలని గోపకులు దేవతలు మెచ్చుచుండ గోకులంబునకుఁ జనియె.

## { రామకృష్ణులఁ దోడ్కొనిపోవ నక్రూరుండు గోకులంబునకు వచ్చుట }

అక్రూరుండు నారాత్రి మధురయందు గడపి వేకువ నాహ్నికంబులఁ దీర్చుకొని రథంబునెక్కి నందగోకులంబునకుం బయనించె. ఇట్లు పోవుచు మార్గమధ్యంబున నమ్మహాభాగుండు తన మనంబునఁ బరమభక్తి కెళ్లువాఱ నిట్లని తలపోయఁ దొడంగె.

ఔరా! భాగ్యమనిన నాదే భాగ్యము. అదృష్టమనిన నాదే యదృష్టము. నేనేమి పుణ్యము చేసితినో యేమి పరమతపం బాచరించితినో సత్పాత్రంబుల కేదానంబు లొసర్చితినో కదా యిప్పుడు కేశవు దర్శించు మహాభాగ్యంబు సమకూడుచున్నది. అయోగ్యశుభకార్యంబునకు విఘ్నములు మెండు కదా. నాయడియాసనే గాక విషయాసక్తచిత్తుఁడనైన నాకుత్తమశ్లోక దర్శనంబు శూద్రజాతికి వేదోచ్చారణంబుఁ బోలె దుర్లభంబు గాక యెట్లు లభించుఁ? నేను నీచుఁడనే యగుదును గాక. అయినను భగవద్దర్శనంబు లభింపక యేల పోవు? ఎట్లన నదీజలంబులం బడి వేగంబునఁ బోవు తృణాదులం

దొక్కటి యాదృచ్ఛికంబుగ నొడ్డు చేరుం గదా. అట్లే కర్మవశమునం గాలముచేం బట్టువడి సంసార ప్రవాహంబునం బోవు జీవకోటియుం దేదే నొక్కటి భగవత్కటాక్షంబునం దరించుటయుం గలదు కదా. భగవంతుండును యోగీశ్వరాంఘ్రి పంకజుండును నగు శ్రీకృష్ణు నమస్కరించు భాగ్యం బానర్చుటచే నా యమంగళంబు లన్నియు నేటితో నష్టములయ్యె. నా జన్మంబు ఫలవంత మయ్యె. ఆహా! కంసుండు నాకెంత యుపకారంబు గావించె. అతని పనుపునం గదా యిగ ప్రత్యక్షార్థ మవతరించిన వాసుదేవు సందర్శింప నరిగెద. ప్రహ్లాదాంబరీషాది పూర్వు లమ్మహాత్ము పాదనఖచంద్రబింబకాంతులచేం గదా సంసారతమంబును దరింపంగలిగిరి. బ్రహ్మరుద్రాది సురులును లక్ష్మీదేవియు మునులును భక్తులును వేనిని సేవింతురో గోపికాకుచ కుంకుమాంకితంబులై యెవ్వి రంజిల్లునో యట్టి గోపాలకానుచర శ్రీకృష్ణ పాదపద్మంబులు నేను నేడు సేవింపం గలవాండ. సుకపోల నాసికంబును, మందహాస సుందరలోచనంబును, కుటిల కుంతలంబును, నగు ముకుందవదనారవిందంబు దర్శించు భాగ్యంబు తప్పక కలుగంగలదు. ఈ జింకలు నాకుం బ్రదక్షిణించి పోవుచున్నవి. భూభార మణంపం గోరి నిజసంకల్పమున భూమిపై మనుష్యరూపంబు వహించిన లావణ్యధాము విష్ణుదర్శనంబు నాకు శీఘ్రంబుగం గలుగక తప్పదు. ఇది సత్యము.

సదసత్తులను కారణ కార్యంబులను జూచుచు నహంకారము లేని సాక్షి నిత్యశుద్ధ స్వజ్ఞానముచేతను, పరాభిభవ సామర్థ్యము చేతను, నజ్ఞానంబును దానికి మూలకంబైన భేదభ్రమయును విడిచి స్వసంకల్పముచేతను స్వశక్తి చేతను దానే ప్రాణేంద్రియములచే భోగ విశేషంబులం గల్పించుటచే నెవ్వండు గోచరించు, అను విను నఖిల జనుల పాపంబుల హరించునవియు సుమంగళకరములైన యెవ్వాని గుణకర్మజన్మాదులచేం గలసి జగంబును బ్రాణవంతంబును శోభనవంతంబును బవిత్రంబును గావించునట్టి వాక్కులయందు విరక్తుండగు

వాని శృంగారంబులు పినుగువఁ జేసిన శృంగారంబు లట్టివి. ఇట్టి యీశ్వరుఁడు తాను జేసిన ధర్మమర్యాదను బరిపాలించు దేవతలకు మేలుచేయఁగోరి యాదవకులంబున శ్రీకృష్ణరూపంబున జనించి తన దివ్యమంగళ కీర్తి దేవతలు గానంబు సేయ నుందయుం డున్నవాఁడు గదా. అట్టివానిని సాధువులకు గతియును బ్రాపకంబును హిత ముపదేశించువాఁడును నై త్రిలోకసుందరంబును గన్నులుగలవారికిఁ బెను పండుగును లక్ష్మీదేవికాస్పదంబును నగు రూపంబు ధరించిన వానిని నే నిప్పుడే కన్నులార నిజంబుగఁ దిలకింతును. ఉదయమువనే నాకు శుభశకునము లగుచున్నవి. దర్శించుట మాత్రము గాదు. తత్క్షణంబ రథంబునుండి నేలదుమికి యాత్మలాభంబు గోరి యోగు లెవ్వని దర్శింపనేరక మనస్సున ధ్యానించుచుందు రట్టి పురుషోత్తముల చరణంబులపై వ్రాలి నమస్కరింతును. వారికి మాత్రము కాదు. వారి యనుచరులైన వనచారులకును నమస్కరించెద. ఇట్లు తన పాదంబులపై వ్రాలిన నా శిరంబుపైఁ గాలభుజంగ వేగమునకుఁ దత్తరలాడి శరణువేఁడిన జనులకు నభయప్రదంబైన తన హస్త కమలంబును నుంచునా! అంతటి భాగ్యమా! ఆ పాణిపద్మంబున నర్ఘ్యజలంబుం జేకొనియే గదా యింద్రుఁ డింద్రపదవిఁ బొందె, అట్లు చేసియే కదా బలి యింద్రపదవిని బొందఁగలవాఁడు. సౌగంధికమువలెఁ బరిమళించు నయ్యదియె కదా విహారంబున నలసి సొలసిన గొల్ల చెలువల యలపును స్పర్శమాత్రంబున హరించెడి. అక్కటా! కంసుఁడు పంపిన మాతనగుట నన్ను శత్రువుగాఁ జూచునేమో? అటుల చూచు. సర్వసాక్షియై దేహుల బహిరంత ర్వ్యాపారంబుల నియంతయై నిర్మలదృష్టిఁ జూచు నీశ్వరుండు వెలుపలి కీదేహంబు కంసువశంబై వర్తించుచున్నను లోపలి మనంబు తన వశంబై వర్తించుచుండుట యెఱుఁగకుండునా? ఎఱిఁగి తనయొద్దకుఁ దోసిలి యొగ్గి నిలిచిన నన్ను దరహాస భాసురంబును గరుణామృతార్ద్రంబును నైన చూడ్కులఁ

చూచునో? చూచి నా సమస్తకలుషంబులు తత్క్షణంబున హరించి కళంకా కళంకితంబుగాని నిరంతరానందంబును నాకు గలిగించునో. కలి- గించి సుహృత్తముఁడును బంధువును దన్నుఁ దప్ప వేఱు దైవంబు వేఱుంగనివాఁడును నగు నన్ను నిడుదలగు తన బాహువుల గౌఁగి- లించునో? కౌఁగిలించి యీ దేహంబును బవిత్రంబును గావించునో? గావించి సకలకర్మబంధంబుల నెల్ల విధ్వంసంబు చేయునో? చరణంబులఁ బ్రణమిల్లిన వానిని, చేమోడ్పున నిలఁబడినవానిని, తన కౌఁగిటఁ గలవారువానిని నన్ను శ్రీకృష్ణుండు తండ్రీ! యక్రూరా యని పిలు- చునో? అట్లు పిలిచినప్పుడు గదా యీజన్మమెత్తిన ఫలంబు సమకూరు. ఇట్లాదరింపబడని వానిజన్మంబేల? ఛీ కాల్పనో? బంధువని హితుఁ- డని యాదరింపకున్న నుండనీ. అమ్మహాత్మున కొకఁడు ప్రియుఁడని వేఱొకఁ డప్రియుఁడని యొకఁడు మిత్రుఁడని వేఱొకఁడు శత్రుఁడని మఱియొకఁ డుపేక్షింపఁ దగినవాఁడని లేదుకదా. అట్లుండియుఁ గల్పవృక్షంబు తన్ను నెవరెట్లు కోరిన వారి కట్లు కోరికలఁ దీర్చునట్లు భగవంతుఁడును దన్ను భజించు భక్తులకుఁ గామితార్థంబు లొసఁ గూర్చుఁ గదా. నమస్కరించు వాఁడను నంజలి మోడ్చిన వాఁడను నగు నన్ను బలరాముఁడు చూచి చిఱునవ్వునఁ గౌఁగిలించి యింటికిఁ దోడ్కొనిపోయి సత్కారంబు లాచరించి బంధువులకుఁ గంసుండు చేసిన ద్రోహంబు ప్రశ్నింపకుండునో?

అని యిట్లక్రూరుండు మార్గంబునఁ దలపోయుచు సాయం- కాలమునకు గోకులంబుఁ జేరె. గోకులంబు ప్రవేశించి యందు పాపహరణంబులై, లోకపాల కిరీట సంధృతపరాగంబులై, భూదేవి- కాభరణంబులై, పద్మాంకుశ యవాదిలక్షణ లక్షితంబులైన యడు- గుల జూచి సంతోష సంభ్రమంబులు పెనఁగొనఁ బ్రేమాతిరేకం- బున మేన గగుర్పాటొదవ నానంద బాష్పంబులచే దృష్టులాకులంబు గాఁగ రథంబు దిగి యిది నా స్వామి యంఘ్రిపరాగరేణువులు కదా

యని పలుమాఱులు తిలకించి వానిపై పడి యక్రూరుఁడు పొరలిపొరలి మేనెల్లఁ దద్ధూళి ధూసరితంబుఁ గావించె. అక్రూరుండును దన్నుఁ గంసుం డక్రూరా! రామకృష్ణులఁ దోడ్కొని రమ్మనియె నని చెవిని బడినదిమొదలు కంసుని పరిజనంబులఁ జేరినవాఁడయ్యుఁ దేశిలో నగు వారివలెఁ గపటంబును, దనదూత తన విరోధులయందు భక్తి గలవాఁడని యెంచెనేఁ గంసుండు వధించునో యనుభయంబును, నేను మరణించిన నావారిగతి యేమగునో యను శోకంబును విడిచి శ్రీకృష్ణపాద చిహ్నదర్శన లాలసుండై మార్గమధ్యంబునఁ గృష్ణుని చరిత్రంబును బాటసారులు చెప్ప వినుచు శుభశకునంబుల గలుగుచు భగవంతుని ధ్యానించుచుండె. ఇది కదా దేహధారులకుఁ బరమ పురుషార్థంబు.

ఇట్లు పొగలిపొరలి లేచి మరల రథమెక్కి యక్రూరుఁడు రామకృష్ణు లెచ్చటనున్నవారని కనఁబడిన వారినెల్ల నడుగుచు వేవేగ చని పాలు పిదుకుపట్టునందుఁ బీతనీలాంబర ధరులును, శరత్కాల కమలలోచనులును, బాలురును, నీలశ్వేతవర్ణులును, శ్రీనివాసులును, దీర్ఘభుజులును, సుముఖులును, సుందరాకారులును, బాలదంతావళ గమనులును, ధ్వజవజ్రాంకుశ పద్మలక్షణంబుల గోవ్రజం బుద్దీపింపఁ జేయువారును, మహాత్ములును, [illegible]యూరసము తొలఁకు చిఱునవ్వు చూపులవారును, నుదార రుచిర క్రీడులును, హారాలంకృతులును, వనమాలాధరులును, బుణ్యగంధపు మైపూతలవారును, స్నానము చేసి నిర్మలవస్త్రముల ధరించినవారును, ప్రధానపురుషులును, జగంబులకు [illegible], జగంబులకుఁ గారణమైనవారును, జగత్స్వాములును, [illegible] స్వాంశంబున నవతరించినవారును, [illegible] దెసల వెలిఁగించువారును, [illegible] గల మరకత [illegible] కృష్ణు[illegible]ంచి రథంబు డిగ్గ

నంతటికి స్నేహవ్యాకులుండై వారల పాదంబుల కడ దండంబువలె సాఁగిలంబడియె. భగవద్దర్శనానందంబునఁ గన్నుల నీరు గ్రమ్మఁ బులకలెగయఁ దొందరపాటునఁ దన గోత్రము నామము చెప్ప శక్తుఁడు గాఁడయ్యె.

—: అక్రూరుండు రామకృష్ణుల దర్శించుట :—

ప్రణతపాలుండును సర్వజ్ఞుండును నైన కృష్ణుం డాతనిని, నతని రాకకుఁ గారణంబును, నతని భక్త్యతిశయంబును నెఱింగి ప్రీతుండై చక్రాంకితంబైన కరతలంబున నతనిఁ జేరదీసి యాలింగనంబు గావించె. బలరాముండును సంతోషాతిశయంబున నతనిఁ గౌఁగిలించి కేలు కేలం బట్టుకొని తమ్మునితోడఁ దమ గృహంబునకుఁ దోడ్కొనిపోయి కుశలం బడిగి యర్హాసనం బిడి పాద్యంబు మధుపర్కంబు సమర్పించి గోవు నొసంగి బడలిన యతని పాదంబు లొత్తి దప్పిదేర్చి శ్రద్ధాపేతంబగు పరిశుద్ధాన్నంబు నారగింపఁ జేసి భుజించిన పదపడి పరమ ధర్మవిదుం డాయనకు గంధమాల్యంబులను గర్పూరాది సువాసితంబైన తాంబూలంబును నొసంగి సంతుష్టచిత్తుం గావించె. ఇట్లు సత్కృతుండై సుఖాసీనుండైన యక్రూరుం జూచి నందుం డిట్లనియె.

యదువరా! చెలియలు మొఱ్ఱో యనుచుండఁ దన ప్రాణంబుల మీఁది కాంక్షచే నామెబిడ్డల కుత్తుకలు కత్తిరించిన దయాహీనుండు కంసుండు జీవించియుండఁ గటికవాఁడు పాలించు మేకలవంటి మిమ్ముఁ గుశలంబేమని యడుగుదుము. అని నందుం [illegible] కుశలప్రశ్నంబు గావింప నక్రూరుండును మార్గాయాసంబు వాసె. ఇట్లు రామకృష్ణులచే బహుమానితుండై వసించి పర్యంకమున సుఖోపవిష్టుండై తాను మార్గంబునఁ దలఁచిన కోరికలెల్లఁ బడసినవాఁడయ్యె. శ్రీనికేతనుండైన భగవంతుఁడు ప్రసన్నుఁడైనఁ బడయరాని కోరికలెవ్వి! అటయ్యు భగవద్భక్తులు భక్తిజ్ఞానంబులం దప్ప మఱి దేనిని గోరరు.

## అక్రూరుండు తన రాకకుఁ గారణంబు కృష్ణునితోఁ జెప్పుట

కృష్ణుండును రాత్రిభోజనంబు గావించి యక్రూరుఁ జేరి కంసుండు తమ బంధువులపట్ల నెట్లు వర్తింపఁగోరెను మఱి యే యే కార్యంబు లొనర్పఁదలఁచినవాఁడని తెలియఁగోరి యిట్లనియె.

తండ్రీ! సౌమ్యా! నిర్విఘ్నంబుగ సుఖంబుగఁ బ్రయాణంబు సాగెఁగదా? మీకుఁ గుశలంబె కదా! మీకు భద్రమగుఁగాక. మన బంధువులు జ్ఞాతులు నితర సంబంధులు లెస్సయున్నవారు కదా? అయ్యా! మాకు మేనమామ యను పేరఁ గులమునకుఁ దెగులైన కంసుఁ డొకండుండ మావారి కుశలం బేమని ప్రశ్నింతు? ఆర్యా! మానిమిత్తంబుగఁ బూజ్యులును నిరపరాధులునైన మాతల్లిదండ్రులకుఁ బుత్రశోకంబును గారాగృహబంధనంబును బ్రాప్తించెఁగదా? మాయదృష్టంబునఁ జిరకాలకాంక్షితంబైన బంధుదర్శనంబు నేఁడు లభించె. తండ్రీ! నీ రాకకుఁ గారణం బేమి కలిగెఁ జెప్పుమా యనిన నక్రూరుం డిట్లనియె.

ఆర్యా! కంసునకు యాదవులందుఁ గల ద్వేషబుద్ధి నీకు దెలియును గదా? నీవు వసుదేవ సుతుండవని నారదుండు చెప్ప విని కంసుఁడు మీతండ్రిని జంప యత్నించి నారదునిచే వారింపఁబడి మిమ్ముఁ గో[illegible] రమ్మని నన్ను దూతగఁ బంచెనని సర్వవృత్తాంతంబుఁ జెప్ప విని రామకృష్ణులు నవ్వి రాజాజ్ఞ నందునికిఁ దెలిపిరి

నందుండును గోపకుల నెల్లఁ బిలిచి రాజశాసనం బెఱింగించి గోరసంబు లెల్ల నేకరింపుఁడు. కానుక లెల్లఁ గొనుఁడు. శకటంబులు సిద్ధపఱుపుఁడు. రేపు మధురకుఁ బోవలయు రాజునకు నర్పింపవలయు. అందు ధనుర్యాగంబు సాగెడి నఁట. అన్నియూరులనుండి పల్లెలనుండి ప్రజలు చూడవత్తురఁట యని చాటింపఁ బనిచె.

## కృష్ణుండు మథురకుఁ బోవునని విని గోపికలు తపించుట

రామకృష్ణులను మథురకుఁ దోడ్కొనిపోవ నక్రూరుండు వచ్చె నని గోపికలు విని యావత్రాఁగినట్లు రాఁగల వేఱుపాటునకలని దుఃఖం బున వాడినమోముఁదమ్ములఁజిగులవారును, జాఱిన కట్టువలువల కంకణంబుల క్రొమ్ముడుల నిగులవారును, ఉద్రేకధ్యాననిష్ఠచే సర్వ చేష్టలుడిగి యాత్మసాక్షాత్కారంబు నొందిన యోగులవలె దేహం బులు సంసారంబులు మఱచినవారును, కృష్ణుం డనురాగస్మితంబున మనంబున నాటనాడిన చిత్రపద మనోహరాలాపంబుల స్మరించువా రును, హరిలలితగతులును జేష్టలును స్నేహపూరితంబులైన దరహాసావ లోకనంబులును శోకనాశకంబులైన నర్మాలాపంబులును నమ్మహాను భావునుద్దామచరితంబులును దలఁచి తలఁచి విరహతాపంబునకు భయ పడి గుంపులుగూడి కన్నుఁగవల వేఁడినీరు జాలువాఱ నిట్లాడఁజొచ్చిరి.

అయ్యో బ్రహ్మదేవుఁడా! నీకు దయ యనునది లేదుగదా? ప్రీతివిశ్వాసంబులచే దేహులను గలియఁజేసి వారి కోరికలు కొన సాగకముందే మరల వేఱుపఱిచెదవు. పరులకు దుఃఖసహితం బును నీకు లాభరహితంబును నగు పిల్లచేష్టలు నేల చేసెదవు? నీల కుంతలావృతంబును సుకపోల నాసికా మనోహరంబును శోకహర దరహాసభాసురంబును నగు కృష్ణసుందరవదనారవిందంబు తిలకింపఁ జేసి యింతలో మఱుఁగు పఱిచెదవు. సజ్జనులు చేయుకార్యమా యిది! ఓరి క్రూరుఁడా! నీకు సృష్టికార్యమందుఁ గల చమత్కార మంతయుఁ గృష్ణువదనంబు నొందు నామాట చేతనే గ్రహించితిమి. ఇట్టి నీ రహస్యం బెఱింగిన మాపైఁ గోపించి మూఢుఁడా! మాకు నేత్రములవలెనున్న కృష్ణుని నక్రూరుం డని పేరుపెట్టుకొని వచ్చి యెత్తుకొనిపోయి మమ్ము గ్రుడ్డివారలఁగ జేసితివి. ఇఁక మేము జీవించియు నేమి ప్రయోజనము. క్షణభంగుర సౌహృదుం డగు కృష్ణుండు స్నేహ

ములను బంధువులను సుతులను బాలలను విడిచి తనకూడిగంబు సేయువారమును దనచేష్టలచేత జనించిన హృదయతాపంబున వేగు చారము నగు మనల నింకఁ గన్నెత్తియైనఁ జూడఁడు. మధురాపుర మధురాధరల కీర్తి సుఖప్రాప్తంబగు. వారి కోరికలును పండును సత్యము. తమ పురప్రవేశంబుఁ గావించు కృష్ణుని గనుఁదమ్ముల తోలు నుల్లఁ గళకళలాడు దరహాసాననంబుఁ గ్రోలి వారానందపరవశలుగా కెట్లుండఁ గలరు?

కృష్ణుండు ధీరుం డగుఁ గాక పితృసేవాగతుం డగుఁ గాక. ఇతండు హావభావవిలాస చాతురీధురీణలగు నగరవాసినుల కులుకులకుఁ జిక్కు బెళుకులకు దాసుండై యుండుఁగాని పల్లెలవారమై టెక్కులు నిక్కులు తెలియని మనలఁ దలఁచి యేల మరలి వచ్చునే. నిజము నిజము. గుణాఢ్యుండును శ్రీరమణుండు నైన కృష్ణుని మార్గ మధ్యమునను గాటపాగులను బురంబున యమునావృష్ణి భోజాంధక ములను నానందంబునఁ దిలకించి కన్నులకు విందు గావించువారు.

శా. అక్రూరుం డని పేరు పెట్టుకొని ప్రాగల్భ్యుండు నేఁ డెవ్వఁడో
వక్రప్రజ్ఞుఁడు వచ్చెఁ దోడుకొనిపోవం గృష్ణునిం, గోపికా
చక్రప్రాణము దుఃఖతాత్మికల నాశ్వాసింప నే దవ్వుగా;
నక్రూరాఖ్య సమర్థమేని నిటు సేయం బాడియే పనికిన్.

కం. మా గోవిందుని మథురాపురి
కేఁ గొనిపోయెద క్షమింపు డీ సఖులారా!
వేగమ కొనివచ్చెద నని
యాగడుపరి యొక్కమాట యాడఁడు కంటే.

ఔరా! కృష్ణుఁ డెంతనిర్దయుఁడో పిలిచినఁ జాలునని రథం బారోహించె. దుర్మదులైన గోపకులును నతనిఁ ద్వరపెట్టుచున్న వారు. ఎడ్లను గట్టి బండ్లఁ దోలుచున్నవారు. ముసలివాండ్రైనను వల దనక యుపేక్షించి యున్నవారు.

అమ్మో! తల్లులు పేరిని విడిచి యెట్లుండలకుందురో. ఇందాకనైనఁ గృష్ణుని పయనంబు నిలుపఁ బల పెట్టినవారు లేరు. దైవమా నీవుకూడ మాకుఁ బగవాఁడ వైతివా? కాదేని యేదైన నవకాశంబుచే నైన పేరి పయనము మాన్పరాదా? మీరా రెండుఁ బోయెదరని యడుగుదమా? మేమును వెంట వచ్చెద మందమా? భోజనముచేసి పొమ్మందమా? పోవలదని చెప్పుదమా? మందయం దేదైన నుత్పాతము పుట్టరాదా?

ఇటు దూరంబునుండి వగచిన నేమి కార్యము. మగువలారా! తెగువచేసి మన మందఱము గుమిగూడి మా శ్రీకృష్ణుని మేము వంపమని రథంబున కడ్డముగఁ బోయి దానిఁ గదలనీక నిలుపుదము. అరనిముసమైన విడిచి బ్రతుకఁజాలని కృష్ణసాంగత్యము నాశముచేసి దైవంబు మన ప్రాణంబుల మీఁదికిఁ దెచ్చె నాశకుతలఁ జేయుచుండ నీకులవృద్ధులు బంధువులు మన మేమిచేసిన మనల నేమి చేయఁగలరు? అనురాగకలితంబైన మందహాసంబులచేతను సుందరతరంబులైన సల్లాపంబులచేతను లీలావిలోకనంబులచేతను, నాలింగనంబులచేతను రాసగోష్ఠియందు రేయి యొక్క నిమిషంబుగఁ గడపఁజేసిన శ్రీకృష్ణుని విడిచి యపారశోకపారావారంబు నెట్లు తరింపఁగలము? సాయంతనసమయంబులందు గోపాలకులు తన్నుఁ జుట్టి కొలువ నావుల గిట్టలచే రేఁగిన ధూళిచే నలంకరింపఁబడిన ముంగురులతో విరుల సరులతో మురళీ రావంబు నెసఁగించుచుఁ జిఱునవ్వు మోములచే మన మనస్సులను గొల్లలుకొను శ్రీకృష్ణు నెడఁబాసి యెట్లు జీవింపఁగలవారమో? అని యిట్లు విరహాతురలై కాతరలోచనలు సిగ్గులు విడిచి కృష్ణాయత్తచిత్తంబుల నాసుజాతలు సుజాతంబులైన గీతంబులఁ గోవిందా దామోదరా మాధవా యని యేడ్చిరి.

వారిట్లు లేడ్చుచుండఁగనే సూర్యోదయంబయ్యె. అక్రూరుండును సంధ్యాదికకృత్యంబు లఁదీర్చి రామకృష్ణులఁ దనరథంబుపై నిడి

కొని తాన రథచోదకుండై సారథ్యంబుఁ జేయఁ జొచ్చె. నందాదిగోపకులును వలసిన కానుకలు పాలకడవలు పెరుఁగు బానలు వెన్నకుండలు లోనైనవి కొని శకటంబుల నారోహించిరథంబు వెంటఁదరలిరి.

గోపికలును కృష్ణవిరహంబు సహింపనోపక తెరువెంటఁ బోయిరి. ఇట్లు తన వెంటవచ్చు గోపికలఁ గొందఱఁ గనుబొమ్మల చేతను గొందఱఁ జిఱునవ్వుల చేతను గొందఱఁ జిన్నిచూపుల చేతను నూఱడించి పోసన్న యొనర్చినను పోకున్న వాసుదేవుండు నొక యాప్తునిం బిలిచి మరలి వేగమ వచ్చెద నిండ్లకుం బొండని సాంత్వన వాక్యంబులు చెప్పి పుచ్చె. ఆవల్లవపల్లవపాణులును నూఱడిల్లి మెల్లని యడుగుల నడచుచు నీ గుఱ్ఱములకేమి పోఁగాలమే గాలివలె నెగసి పోవుచున్నవి. వాసి వననేల యా క్రూరుం డేదియో మునిఁగి పోయినట్లులు చటుకున నదలించుచున్నవాఁడు. అదోనే రామకృష్ణు లొండరులఁ జూచి యేమియో ముచ్చట లాడుచున్నవారు. అదిగో కృష్ణుఁడు మనవంక మరలి చూచెను. అయ్యో యీ నందనందను సుందరవదనారవిందంబు నన్నాళ్ళకుఁ జూడఁ గందుమో. ఇఁక సంకేత భాగ్యమేయున్న నీ బియోగ మేల వచ్చునే! కటకటా! రామకృష్ణులఁ గానరారైరి. ఆదిగో నదే కృష్ణుని మేరుధ్వజ [illegible] కృష్ణునిగోన పోవు [illegible] తెలుసు ఇదో చూడవే. ఆ ధ్వజ [illegible] నూరి వ కృష్ణాని [illegible] [illegible] గానరాకపోఁగా [illegible] కృష్ణుఁ డేనిమునై [illegible] మని యాశ [illegible] కృష్ణుఁడు మనయట్టి [illegible] భాగ్యల కని యాశలు చాలించి చిత్రరువులట్లు నిలిచి స్మృతితెచ్చుకొని కృష్ణుని వెంట బరువుపారు మనంబు నెట్టకేలకుఁ ద్రిప్పికొని

సీ. కందుమా కన్నులకఱవు దీఱఁగ నింక
మన్మథ మన్మథు మగువలార
విందుమా యొకమాటు వీనులవిందుగా
మధుమధు రాలాపు మధురవాణి
యుందుమా డెందంబునందు నో మందార
చందనశీతలు సరసఁగూడి
మందుమా మహిమీఁద మందభాగ్యలమయి
ప్రాణేశవిరహాగ్ని ప్రుందిపోక

గీ. కలవు కన్నులు వీనులు గలవు మేను
గలవు కరములు పదములు కలవుగాని
ప్రాణ మొక్కటి లేనట్లు గానవచ్చెఁ
బ్రాణనాథుండు కృష్ణుండు పాయుకతన.

కం. ఆ నగవులు నాచూపులు
నా సల్లాపములును నా శృంగారం
బా నడకలు నా చేఁతలు
మానిని యేలాగు మఱచి మనియుండ నగున్.

మ. తరమా నిల్వఁగ నింక మీఁదఁ దరుణి దామోదరా మోదకృ
త్పరసాలాపవిలాసహాసశుభదృక్ష్వేణురావామృతో
త్కరమాయూరసుపింఛవన్యసుమనోదామప్రపలుబ్ధాత్మలం
దరమా సైఁపఁగఁ జందనానిలశుకీనాదస్మరజ్యోత్స్నలన్.

అని కన్నులనీరు కాండలఁ గురియించుచు వివశలై యెట్లో దేహంబులఁ దెచ్చి యింట వైచి సర్వకాలసర్వావస్థల గోవిందుని డెందంబున స్మరించుచు నతని ముచ్చటలే చెప్పికొనుచుఁ గాలము ద్రోచుచుండిరి.

కం. సతతము హరిపై ధ్యానము
మతినిలుచును గాన భక్తిమంతుల కెందుఁ
హిత మగుఁ జూఁడ విశ్లేషము
యతి సంశ్లేషంబు కంటె నారసి చూడన్.

అటఁ గృష్ణుండును రామాక్రూరసహితుండై వాయువేగం
బైన రథంబునఁ జని పాపనాశిని యైనయమునానదిం జేరి రథం బుడిగి
రాముఁడు దానును నేటికిం జని పాదప్రక్షాళ నాచమనంబులఁ గావించి
జలంబులఁ గ్రోలి యక్రూరుండు చెట్లనీడ నిలిపిన తేరిపై నెక్కి కూ
ర్చుండె. అక్రూరుండును వారిని రథంబున నునిచి యమునమడుఁగు
నకుఁ బోయి స్నానమొనర్ప నీట మునిఁగె. అటు మునిఁగిన నతనికి
జలంబుల రామకృష్ణులు కాన నచ్చిరి. రథంబున నున్న వసుదేవ
నందను లంతలో నీటిలోని కెట్లు వచ్చిరని యాశ్చర్యపడి లేచినాఁడు
రథంబునందు వారిరువురు నుండిరి. ఇది యేమిచిత్ర మిప్పుడు నీటనున్న
వారు తెరిమీఁది కెట్లు వచ్చిరి. నేను భ్రాంతిపడితి నేమో యనుచు మఱి
మరల నీటిలో మునింగి యందు సిద్ధులు భుజంగపతులు నసురులు
శిరంబులు వంచి స్తుతింప వేయుపడగలపై మణిగణ ప్రభాచితంబులైన
కిరీటంబులు మెఱయ బంగరుశిఖరంబులతోడి వెండికొండవోలె యున
నుండువాఁడును, ధవళకాంతిగలవాఁడును, నీలవస్త్రధరుండును నగు
నాదిశేషుం గాంచె. మఱియు నాయనమేను పానుపుగాఁ గొని నీల
మేఘశ్యాముఁడును, పీతాంబరుండును, చతుర్భుజుండును, శాంతుం
డును, కమలదళనయనుండును, మనోహర ప్రసన్నవదనుండును, చారు
దరహాసావలోకనుండును, విండ్లను బోలుకనుబొమ్మలును, నూవుఁ
బూవుంబోలు నాసికయు శ్రీకారముంబోలు వీనులును, మినుకుటద్ద
ములన మెఱయుచెక్కిళ్లును, దొండపండునంటి యెఱ్ఱని మోవియు,
నాజానువులైన బాహువులును, నున్నతంబులైన మూఁపురంబులును,

లక్ష్మీనిలయం బైన వక్షస్థలంబును, శంఖంబువంటి కంఠంబును, లోతైన నాభియు, వళులు నెఱసి రావియాకు బోలు నుదరంబును, బలిసినకటి శ్రోణులును, కరభంబులవంటి తొడలును, నందంబులైన మోకాళ్లును, నిడుపులైన పిక్కలును, గించి దున్నతంబులైన గుల్ఫంబులును, కెంగుఱుల నెనయు గోళ్ల కాంతులచే దీపించు వేళ్లును, విలువగల రతనంబులు దాపినకిరీటాదులును, మొగ నూలును, జన్నిదవును హారములు లందెలు లోనగు నాభరణంబులు గలిగి ప్రకాశించువాండును, శంఖచక్రగదాపద్మకరుండును, శ్రీవత్సలాంఛనుండును, కౌస్తుభవనమాలాశోభితుండును, నందసునందాది పార్షదులును, సనకాది యోగులును, బ్రహ్మరుద్రాది సురలును, కశ్యపాది ప్రజాపతులును, భాగవతోత్తములైన ప్రహ్లాద నారద వసుప్రముఖులును లోనగు వారిచే సేవ్యమానుండును శ్రీ, పుష్టి, వాణి, కాంతి, కీర్తి, తుష్టి, యిల, యూర్జ, విద్య, యవిద్య, శక్తి, మాయ యను కాంతామణులచే సేవింపబడును నైన సనాతనపురుషుం గాంచి మిక్కిలి ప్రేమం జెంది పరభక్తియుతుండై రోమాంచితగాత్రుండై ప్రీత్యతిశయంబున నార్ద్రంబైన మనోలోచనంబులం గూడి కరపుటంబు శిరస్థలంబునం జేర్చి గద్గదకంఠంబున నిట్లని ప్రస్తుతించె.

—: అక్రూరుండు శ్రీ కృష్ణు స్తుతించుట :—

ప్రపంచసృష్టికిం గారణంబు లని చెప్పంబడువాని కెల్లం గారణుండవును, నారాయణుండవును, బరమపురుషుండవును, నవ్యయుండవు నైననీకు నమస్కారంబు. ప్రపంచమునకు నేను గారణం బెట్లైతి నంటివేని నీనాభికమలకోశంబునం బుట్టిన బ్రహ్మ గదా యాలోచించి ప్రపంచంబెల్ల సృజించె. అంతకుం బూర్వము గర్భంబున శిశువునట్లె నీ యందె కదా యణంగియుండె. భూమి జలాగ్ని వాయు గగనంబులనెడి పంచభూతంబులు వీనికిం గారణమైన యహంకారంబు దానికిం

కారణమైన మహత్తు దాని కారణంబగు మూలప్రకృతియు జ్ఞానకర్మేంద్రియములును, మనస్సును వీని కధిష్ఠానదేవతలును, విషయంబులైన శబ్దాదులును, ప్రపంచమునకుం గారణములైన యివన్నియు నీకు శరీరభూతంబులై యున్నవి. ఇవి యన్నియు జడంబులౌట నంతరాత్మవైన నిన్నెఱుంగవు. జీవుండును దనకంటె భిన్నమైన దేహమునందలి యాత్మాభిమానంబు చేతను, స్వాతంత్ర్యాభిమానము చేతను దాను దేహమునకంటె విలక్షణుండనియు నీశ్వరపరతంత్రుండనియుం దెలియకున్నవాఁడు. బ్రహ్మదేవు నంతటివాఁడును స్వశరీరారంభకంబులైన త్రిగుణంబులచే బద్ధుండై ప్రకృతి గుణంబులకంటెం బరంబగు దాని నెఱుంగఁ డన నేక నీస్వరూపం బెఱుంగమిఁ జెప్పనేల? కొందఱు యోగులుపాసనామార్గంబుల మహాపురుషుండవైన యీశ్వరుఁడని నిన్నె యారాధింతురు. కొందఱు [illegible] లాదిత్యాంతర్గతుండును నింద్రాది దేవతాంతర్యామియు నింద్రాది శరీరకుండవగు నిన్ను నుపాసింతురు. కొందఱు వేదావయవంబులైన యక్షిహృదాకాశాది వాసునిగ సేవింతురు. కొందఱు సర్వభూతాత్మకుండవును సర్వశరీరకుండవని పూజింతురు. కొందఱు కర్మఠులు వేదవిద్యాగ్రహంబు యజ్ఞంబు లొనర్చి యింద్రాది దేవతాంతరాత్ముండవై తచ్ఛరీరకుండవైన నిన్ను నారాధింతురు. కొందఱు జ్ఞానులు సర్వకర్మంబులు నీకు సమర్పించి విషయంబులు భోగ్యంబులను బుద్ధిమాని జ్ఞానయజ్ఞంబుచే జ్ఞానస్వరూపుండవైన నిన్ను యజింతురు. కొందఱు నీవుపదేశించిన శాస్త్రవిధి ననుసరించి చక్రలాంఛనాది పంచకంబుచే సంస్కరణంబు నొందిన దేహంబులు గలవారై త్వన్మయులై నీవొక్కరుండవే ప్రధానప్రాప్యుండ వని నిన్నుఁ బ్రాపించు కొఱకు నిన్నొకనినే భరన్యాసంబు గావించి యర్చింతురు. మఱి కొందఱు భగవచ్ఛాస్త్రనిష్ఠులు నీవొక్కరుండవే వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధభేదంబుల వ్యూహచతుష్టయరూపంబులం దాల్చిన పరవాసుదేవుండవని సమర్చింతురు. అన్యులు కొందఱు కాపాలిక

కాలాముఖ శైవపాశుపతాది మతప్రవర్తకుల యుపదేశంబున నీకోర్కెఁ
బయిన శైవాగమ మార్గంబున శివరూపుఁడ వగు నిన్నుఁ గొలుతురు.
నానాదేవతాభక్తులును, వేఱుబుద్ధి కలవారయ్యును సర్వదేవమయే
శ్వరుండవైన నిన్నే భజింతురు. దాడివర్షంబులు గురిసిన వేఱువేఱు
కొండలనుండి వెల్లువలై నీళ్లు నానాముఖంబులఁ బాఱి తుదకు సముద్ర
మునే చొచ్చునట్లు లెవ్వరే దేవతకుఁ జేయుపూజలైన నన్నియు నిన్నే
చెందుచుండు. సత్త్వము రజస్సు తమస్సును మూఁడును నీప్రకృతి
గుణంబులు. వీనివశగులచే నస్త్రమునల బ్రహ్మాదులు స్థావరం
బులవఱకు సమస్తప్రపంచం బీమూఁటి గలయికచేఁ గల్పితం బయ్యె.
సర్వాత్ముఁడవును, దేహాభిమానరహితుండవును, సర్వబుద్ధిసాక్షివియు
నగు నీకు నమస్కారంబులు [illegible] ప్రవాహంబు సంసా
రంబు మాయచేత దేహమనుష్యబద్ధిగ్రాహంబుల [illegible] ప్రవర్తించుఁ
గాని మాయాతీతుండవైన నిన్నుఁ జేరంగలేదు. నీకు నగ్ని
ముఖంబు, భూమి పాదంబులు, కన్నులు సూర్యచంద్రులు, నభంబు నాభి,
దిక్కులు శ్రోత్రంబులు, దివి శిరస్సు. ఇంద్రాదులు బాహువులు, సము
ద్రంబులు కుక్షి. వాయువు ప్రాణ[illegible], [illegible]మంబులు వృక్షౌష
ధు[illegible] రోమ[illegible] [illegible] [illegible] ఖంబులు [illegible],
[illegible] రే[illegible] [illegible], ప్రజాపతి మేఢ్రం[illegible], సృష్టి
[illegible], నిత్యకార్యరూపా! జలంబులందు సూక్ష్మప్రాణిరాసులును
[illegible] [illegible] [illegible] విశిష్టవనోగ్రహ్యాం
డవును, బరమపురుషుండవు నగు నీయందు బహుజీవసంకులంబైన
లోకంబు లనేకంబు లుపాలకసహితంబులై వర్తనస్థితి యెఱుంగ
నేరక చరించుచుండు. ఇట్లు వాఙ్మనసగోచరంబైన నీమహిమంబు వితరు
లెఱుంగ సాధ్యంబు గామి నీవ కరుణించి క్రీడార్థంబుగ దుష్టశిక్షణ
శిష్టరక్షణములకై యేయేరూపంబు లెత్తుదువో వానిచేఁ దమ కోర్కెఁ

బులు వాసి లోకులు సంతోషంబున నీకీర్తిని గానంబుచేయుచుందురు. కారణమత్స్యంబవై ప్రలయవేళ సముద్రమునఁ జరించి వేదంబు లుద్ధరించితివి. హయగ్రీవుండవై మధుకైటభులఁ ద్రుంచితివి. కూర్మంబవై మందరంబు మోచి దేవతల కమృతం బొసఁగితివి. వరాహంబవై హిరణ్యాక్షు వధించి ధరణి ధరించితివి. నరసింహుండవై సాధులోకంబున కభయం బొసంగితివి. వామనుండవై మూఁడడుగులఁ ద్రిలోకంబు లాక్రమించితివి. పరశురాముండవై మదించిన క్షత్రియులఁ బొలియఁజూర్చితివి. దశరథరాముండవై! దశకంఠుఁ బొరిమార్చితివి. వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నా నిరుద్ధనామంబుల వ్యూహస్వరూపుఁడవు, యదువరుండవునైన నీకుఁ బునఃపున ర్నమస్కారంబులు. శుద్ధబుద్ధుండవై దైత్యదానవ మోహకుండ వగు నీకు నమోవాకంబులు. మ్లేచ్ఛప్రాయులైన క్షత్రియుల నెల్ల రూపుమాపు కల్కిస్వరూపుఁడవు నీకుఁ బ్రణామంబులు. దేవా! యీజీవలోకంబు నీ మాయచే మోహితమై నేను నాది యను దురభిమానంబు వహించి భ్రమఁగొని కర్మము లాచరించు చున్నది. దేవా! నేనును గలలోఁ గన్నపదార్థంబులవలె నసత్యంబులైన ధనము, దేహము, గేహము, పెండ్లాము, బిడ్డలు చుట్టాలు మొదలగు వానిని మూఢుఁడనై సత్యములని భ్రమించుచున్నాఁడను. అసత్యంబులను నిత్యంబులనియు, దేహం బాత్మయనియు. దుఃఖాత్మకంబులైన శబ్దాది విషయంబులను సుఖాత్మకము లనియు, దుఃఖం లదు విపర్యాసబుద్ధి కలిగి వర్తించుచు ద్వంద్వంబులఁ బీడించుచు వైషయిక సుఖానుబంధంబునఁ బ్రాప్తించిన దుఃఖంబును సుఖంబుగాఁ దలంచుచుఁ దమోవిష్టుండనై నిత్యము నిరతిశయము నిరుపాధికం బగుప్రీతికి విషయంబైన నిన్ను నాకుఁ బ్రియమని యెఱుంగకున్నవాఁడ. నాఁచు కప్పటచే మఱుఁగుపడిన జలంబుల విడిచి మూఢుం డెండమావుల వెంటఁ బరువువాఱునట్లు నేనును నీయెడఁ బరాఙ్ముఖుండనై దేహాదుల కభిముఖుండనై సంసార

సుఖంబుల వెంటఁ బోవుచున్నవాఁడ. నన్నుం గూర్చి యింత యెఱింగిన నీకు విషయాభిలాష యేల యందువేని దేవా! విషయవాసనాయుక్తంబైన బుద్ధిగల నేను గామకర్మంబులచే హతంబై బలవంతంబులైన యింద్రియములచే నిటునటు లీడ్వఁబడు మనస్సును నడ్డగింపశక్తి లేక యున్నవాఁడ, అట్టి నేను దుర్మతులకుఁ బొందరాని నీచరణంబుల శరణంబు చొచ్చితి. విషయపరవశుఁడ నంటివిగదా యిటు సేయ నీకు నెట్లు శక్యమయ్యె నంటివేని యిదియు నీ యనుగ్రహంబ కాని నాశక్తివలన నైనది కాదు. ఏలనఁ బద్మనాభా! సంసారమువలన విడివడఁ జేయ నీ వనుగ్రహించునపుడే సంసారులకు సజ్జన సహవాసాది సాధనంబులు లభ్యపడి యామూలంబున నీయందు మనస్సు పోవుచుండు. కావున జ్ఞానస్వరూపుఁడవును, సర్వజ్ఞానప్రదానకారణుండవును, ప్రకృతిపురుషుల కీశుండవును, సుఖదుఃఖాదిప్రాపకంబులైన కాలకర్మస్వభావాదులకు నియామకుఁడవును, స్వరూపంబుచేతను గుణంబులచేతను బరిపూర్ణుండవును, ననంతశక్తియుక్తుండవును, వాసుదేవుండవును, సమస్తభూతనిలయుండవును, హృషీకేశుండవును నగు నీకు నమస్కారంబులు. దేవా! యీ ప్రపన్నుని బ్రసన్నుండవై రక్షింపుము.

అని యిట్లక్రూరుండు స్తుతించుచుండ భగవంతుఁడు తన స్వరూపంబుఁ గనఁబరిచి నాట్యాంతమున నటుండు వేషంబు వదలిన రీతిఁ దిరోహితుం డయ్యె. అక్రూరుండును సత్వరుండై స్నానంబు గావించి మధ్యాహ్నంబునఁ జేయఁదగు సంధ్యాది కృత్యంబు లెల్లఁదీర్చి విస్మయపడుచుఁ గ్రమ్మరి రథంబుఁ జేరె. ఆయనను జూచి కృష్ణుండు నయ్యా నీముఖము తీరు చూడ నేదో యాశ్చర్యంబును జూచినవాని వలె నున్నది. భూమియందో యాకాశమందో జలంబులందో యేమి విచిత్రంబుఁ గంటివనిన నక్రూరుం డిట్లనియె.

భూమిజలాకాశంబులఁ గల యద్భుతంబు లన్నియు విశ్వాత్మకుండవైన నీయందు కలవు. నిన్నుఁ జూచుచున్న నాకుఁ జూడఁదగు వేరుచిత్ర మేమున్నది? అని చెప్పి గాందినీనందనుండు స్యందనంబు గడపె. మార్గమధ్యంబున గ్రామజనులు తెప్పార్పక రామకృష్ణుల జూచుచుండ నపరాహ్ణవేళకు వారు మువ్వురు మధురాపురోపవనంబు జేరిరి. అంతకుమున్న నందాది గోపకులావాసంబుఁ జేరి రామకృష్ణుల రాకకై యెదురుచూచు చుండిరి. కృష్ణుండును వారలఁ గూడుకొని యక్రూరు చేతిని దనచేతఁ బట్టుకొని నవ్వుచు నయ్యా నీ వీ రథంబు తోడఁ బురంబుసందలి మీగృహంబునకుఁ బొమ్ము. మేమీరాత్రి యిందయుండి వేకువయైనఁ బురిం జొచ్చెద మనిన నక్రూరుం డిట్లనియె

మీరు రాక నేను మధురాపురంబుఁ జొచ్చువాఁడఁ గాను. భక్తవత్సలా! నీభక్తుఁడనైన నన్ను నీవు విడనాడఁదగదు. రండు మా యింటికిఁ బోదము. కృష్ణా! యన్నయు నీవును గోడి గోపాలురును మాయిండ్లకు వచ్చి వానిని నాథుఁడు గలవిగఁ గావింపుఁడు. మీ రతిథులై వచ్చి గృహస్థులమైన మాయిండ్లను మీపాదధూళిచే బావనంబులఁ గావింపుఁడు. మీయట్టి యతిథుల పాదప్రక్షాళనజలంబు గోరిలుటచే నగ్నిప్రముఖులైన సురలును బితరులును దృప్తి వహింతురు. కృష్ణా! మీపాదంబులం గడిగి కాదే బలి మహాకీర్తిమంతుఁడై యేకాంతికులకు నొందఁదగిన గతియు మహైశ్వర్యంబును నొందఁ గలిగె. మీపాదజలంబులయి గంగచేతనే కదా లోకంబులు పవిత్రంబు లగుచున్నవి. మీపాదజలంబులనే కదా శివుండు శిరంబున ధరించె. మీపాదజలంబులచేతనే కదా సగరకుమారులు స్వర్గంబు నొందఁ గలిగిరి. కావున దేవాదిదేవా! జగన్నాథా! పుణ్యశ్రవణకీర్తనా! నారాయణమూర్తీ! నానమస్కారంబు గ్రహించి నాయింటికి విచ్చేయుము. అనినఁ గృష్ణుం డిట్లనియె.

అయ్యా! యాదవద్రోహియైన కంసుని వధించి పదపడి మా యన్నతోడ మీ యింటికి వచ్చెద. బంధువులకెల్లఁ బ్రియంబును గావించెద. అనిన నక్రూరుండు సంతుష్టచిత్తుండై పురంబుఁ బ్రవేశించి కంసునితోఁ దాను జేసినపని తెలిపి తన యింటికిఁ బోయెను.

గద్యము. శ్రీరామచంద్రచరణారవింద మిళిందాయమానమాన సత్య మహావైభవ వావిలికొలను రామచంద్రరాయ తనూభవ సుజనవిధేయ

సుబ్బరాయనామధేయ ప్రణీతంబైన శ్రీకృష్ణ లీలామృతంబను

మహావచనప్రబంధమున మధురలీలయను ప్రథమచుళుకము.

శ్రీరామార్పణమస్తు.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 914 · 5924-1 Acc. No. 9831

3145 DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

INDIRA GANDHI MEMORIAL LIBRARY
UNIVERSITY OF HYDERABAD

Acc. No. 2831

Call No. T 294.59241

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**